
శమంతకమణి

యక్ష ప్రశ్నలు



శ్రీ రామా
బుక్ షాప్

శమంతక మణి

యక్షప్రశ్నలు

సనాతన సంస్కృతి

సందేహాలు - సమాధానాలు

శ్రీరామా బుక్ షాప్

ఎ-6, మయూర్ కుషాల్ కాంప్లెక్స్,

అబిడ్ రోడ్, హైద్రాబాద్ - 500 001.

ఫోన్: 6667786

విషయ సూచిక

జనరల్ ప్రశ్నల విభాగం

1. విఘ్నేశ్వరునికే మొదటి పూజ ఎందుకు చెయ్యాలి?

పూర్వము ఒకప్పుడు శివగణాలపై అధిపత్యాన్ని, విఘ్నాధిపత్యాన్నీ కోరి గౌరీ శంకరుల పుత్రులైన గజాననుడూ, కుమారస్వామీ పోటీపడ్డారు.

భూమండలంలోగల సకల పుణ్యక్షేత్రాలను దర్శించి, అక్కడి సర్వ పుణ్య తీర్థాలలోనూ స్నానంచేసి, భూప్రదక్షిణం చేసి ముందుగా ఎవరు వస్తారో వారికే శివగణాధిపత్యాన్ని, విఘ్నాధిపత్యాన్నీ ఇస్తానని శివుడు ప్రకటించాడు.

ఆ మాట వినీ వినగానే కుమారస్వామి తన నెమలి వాహనంపైన బయల్దేరి రివ్వున వెళ్ళిపోయాడు.

కుమారస్వామివలె శరీర లాఘవమూ, వేగంగా ఎగిరిపోగల వాహనమూ లేని గజాననుడు ఈపందెంలో తానేవిధంగా జయించగలనని చింతిస్తూ తన మాతాపితరులైన పార్వతీ పరమేశ్వరుల నాశ్రయించాడు. తన అశక్తతను తెలియజేసుకున్నాడు.

గజాననుని అశక్తతను గ్రహించి గౌరి శంకరులు అతడికి ఒక ఉపాయాన్ని ఉపదేశించారు. సకల మంత్ర స్వరూపమైన శ్రీమన్నారాయణ మంత్రాన్ని విధి విధానంగా జపం చేసినట్లయితే సర్వ తీర్థస్నాన ఫలం కలుగుతుందని తెలిపి ఆ మంత్రాన్ని గజాననునికి ఉపదేశించారు.

శ్రీమన్నారాయణ మంత్రాన్ని జపిస్తూ గజాననుడు కైలాసంలోనే ఉన్నాడు. కుమారస్వామి వెళ్ళిన ప్రతి పుణ్య తీర్థంలోనూ అతిడికంటేముందే గజాననుడు ఆ తీర్థంలో స్నాన దానాదులు చేసి ఎదురుగా వస్తున్నట్లుగా కనిపించాడు. గజాననుడు జపించిన నారాయణమంత్ర ప్రభావంచేత కుమారస్వామికి ఆ విధంగా కనిపించింది.

మొదటి ముద్రణ 2002

కాపీల కొరకు :

1) శ్రీరామా పబ్లిషర్స్
15-1-513, సిద్దంబర్ బజార్,
హైదరాబాద్.
ఫోన్: 4743514.

2) శ్రీరామా బుక్ సెంటర్
మార్కెట్ వీధి, సికింద్రాబాద్ - 500 003.
ఫోన్: 7702778.

ముందు మాట

ఈ హై'టెక్కు' సమాజంలో పూర్వపు సంస్కృతికి సంప్రదాయాలకు విలువ లేకుండా పోతోంది. సైబర్ కేఫేల్లో ఫైబర్ గ్లాసుల మధ్యలో కూర్చొని అండపిండ బ్రహ్మాండాలకై పరిశోధనలు జేస్తున్నారు. మన సంస్కృతిని గూర్చి పూర్తిగా మర్చిపోయే స్థితిలో వుంటున్నారు.

మ ; యొక్క సంస్కృతిని సంప్రదాయాలనీ మనముందు తరాలవారికి అందించాలని ఎందరో మహానుభావులు తమ తమ శక్తికి తగిన రీతిలో ప్రయత్నం జేసారు. చేస్తున్నారు.

ఈ 'యక్షప్రశ్నలు' శీర్షిక ఆంధ్రభూమిలో ప్రచురిస్తున్నారు. ఈశీర్షికలో పురాణ ఇతిహాసాలకు మాత్రమే పరిమితముగాకుండా సాధారణంగా మనకు స్ఫురణలో కొచ్చే చిన్న చిన్న సందేహాలకు సైతం వాటిలోని నిగూఢతను అర్థంజేసుకుని వాటికి తగిన సమాధానాలను మనకు అర్థమగునట్లు అందిస్తున్నారు.

ఇప్పటి వరకు 'సంస్కృతి –సంప్రదాయాలు' పేరు మీద దీనిని రెండు భాగములుగా జేసి మార్కెట్టులోకి తెచ్చినాము. వీటిని ఆదరించిన పాఠకులలో జిజ్ఞాస పెరిగి మరింత ఉత్సాహముగా ప్రశ్నలను అందిస్తున్నారు. ఇది మాకు కొండంత బలము. పాఠకులు తమ యొక్క ప్రశ్నలను పంపవచ్చును. రాబోవు భాగములలో వాటికి స్థానమును కలుగజేయగలము.

ఈ పుస్తకములో జనరల్ ప్రశ్నల విభాగం, జ్యోతిశ్శాస్త్ర విభాగం, రామాయణ, మహాభారత విభాగాల్లోని ప్రశ్నలకు వారిచే ఇవ్వబడిన సమాధానాలను క్రోడీకరించినాము. మన సంస్కృతిని – సంప్రదాయాలను మరి కొన్నాళ్ళు కాపాడుకోవాలనే ఆశతో.....

ప్రకాశకులు.

విషయ సూచిక

జనరల్ ప్రశ్నల విభాగం

1. విఘ్నేశ్వరునికే మొదటి పూజ ఎందుకు చెయ్యాలి?

పూర్వము ఒకప్పుడు శివగణాలపై అధిపత్యాన్ని, విఘ్నాధిపత్యాన్నీ కోరి గౌరీ శంకరుల పుత్రులైన గజాననుడూ, కుమారస్వామీ పోటీపడ్డారు.

భూమండలంలోగల సకల పుణ్యక్షేత్రాలను దర్శించి, అక్కడి సర్వ పుణ్య తీర్థాలలోనూ స్నానంచేసి, భూప్రదక్షిణం చేసి ముందుగా ఎవరు వస్తారో వారికే శివగణాధిపత్యాన్ని, విఘ్నాధిపత్యాన్నీ ఇస్తానని శివుడు ప్రకటించాడు.

ఆ మాట వినీ వినగానే కుమారస్వామి తన నెమలి వాహనంపైన బయల్దేరి రివ్వున వెళ్లిపోయాడు.

కుమారస్వామివలె శరీర లాఘవమూ, వేగంగా ఎగిరిపోగల వాహనమూ లేని గజాననుడు ఈపందెంలో తానేవిధంగా జయించగలనని చింతిస్తూ తన మాతాపితరులైన పార్వతీ పరమేశ్వరుల నాశ్రయించాడు. తన అశక్తతను తెలియజేసుకున్నాడు.

గజాననుని అశక్తతను గ్రహించి గౌరీ శంకరులు అతడికి ఒక ఉపాయాన్ని ఉపదేశించారు. సకల మంత్ర స్వరూపమైన శ్రీమన్నారాయణ మంత్రాన్ని విధి విధానంగా జపం చేసినట్లయితే సర్వ తీర్థస్నాన ఫలం కలుగుతుందని తెలిపి ఆ మంత్రాన్ని గజాననునికి ఉపదేశించారు.

శ్రీమన్నారాయణ మంత్రాన్ని జపిస్తూ గజాననుడు కైలాసంలోనే ఉన్నాడు. కుమారస్వామి వెళ్లిన ప్రతి పుణ్య తీర్థంలోనూ అతిడికంటేముందే గజాననుడు ఆ తీర్థంలో స్నాన దానాదులు చేసి ఎదురుగా వస్తున్నట్లుగా కనిపించాడు. గజాననుడు జపించిన నారాయణమంత్ర ప్రభావంచేత కుమారస్వామికి ఆ విధంగా కనిపించింది.

కుమారస్వామి తిరిగి వచ్చి గౌరి శంకరులకు నమస్కరించి విఘ్నాధిపత్యాన్నీ శివగణాధిపత్యాన్నీ గజాననునికే ఇవ్వవలసిందిగా అంగీకరించాడు.

విఘ్నాధిపత్యాన్నీ శివ గణాధిపత్యాన్నీ ఇచ్చి గజాననునికి పట్టాభిషేకం చేశారు.- శివ, కేశవ, బ్రహ్మేంద్రాది దేవతలందరూ. ఆ విధంగా గజాననుడు విఘ్నాధిపతీ, గణాధిపతీ అయ్యాడు. విఘ్నాధిపతి కావడంవల్ల వినాయకునికి ప్రథమ పూజ చేయాలనివారంతా నిర్ణయించారు.

2. పూజకాని, ధ్యానం కాని చేసేటప్పుడు ఏయే దిక్కులకు తిరిగి చేయువలసి ఉంటుంది?

★పూజ, ధ్యానం ఇత్యాదులు చేసేటప్పుడు తూర్పు దిక్కుకు, లేదా ఉత్తర దిక్కుకు అభిముఖంగా కూర్చునిచేయాలి.

3. భార్య గర్భిణిగా ఉన్నప్పుడు భర్త దేవాలయానికి వెళ్ళకూడదని కొందరు అంటున్నారు. నిజమేనా?

అలాంటిదేమీ లేదు. తప్పక వెళ్ళవచ్చును.

4. శ్రీవాతాపి గణపతిం భజేహం – అన్నకీర్తనలో గణపతికి, వాతాపికి ఏమి సంబంధం?

శ్రీవాతాపిగణపతి అనగా వాతాపి అనే నగరంలో వెలసియున్న గణపతి అని అర్థం. ఇక్కడ వాతాపి అనే పదం స్థల నిర్దేశకం. ''భద్రాద్రిరామా'' శ్రీశైల మల్లీశ్వరా అని సంబోధించినట్లుగానే వాతాపి గణపతిం భజేహం అనిహంసధ్వని రాగంలో ముత్తుస్వామి దీక్షితులు కీర్తించారు.

అగస్త్య మహర్షి – వాతాపి అనే రాక్షసుని సంహరించిన ప్రదేశం ఇదేనని ఐతిహ్యం. వాతాపి రాక్షసుడు పరిపాలించిన ప్రాంతం కావడం వల్లనే ఈ పట్టణానికి వాతాపి అనే పేరు స్థిరపడింది. మహిషాసురుని పేరిట అతని

పట్టణానికి మైసూరు (మహిషపురం) అనే పేరు కలిగింది. అదేవిధంగా వాతాపి ఏలిన ప్రదేశానికి వానిపేరు ఏర్పడిందని పురాణకథనం.

వాతాపి ఇల్వలుల గాథ విష్ణుపురాణంలోను, వ్యాసభారతంలోను, వాల్మీకి రామాయణంలోను చెప్పబడింది. హిరణ్యకశిపునికుమారుడూ, ప్రహ్లాదుని సోదరుడూ ఐన హ్లాదునికి – దమని అనే భార్య యందు జన్మించిన కుమారులే వాతాపి, ఇల్వలుడు. ఈ విషయాన్ని భాగవత పురాణం స్పష్టం చేస్తున్నది.

ఐతే – విష్ణుపురాణంలోను, స్కాందపురాణంలోను, వ్యాస భారతంలోను ఈ వాతాపీ ఇల్వలులు– విప్రచిత్తి. సింహిక – అనే రాక్షస దంపతుల సంతానమనీ, దుర్వాస మహర్షికి అజముఖి అనే రాక్షసి యందు కలిగిన సంతానమనీ వాతాపీ ఇల్వలుల జన్మక్రమాన్ని గురించి పాఠభేదాలున్నాయి. ఈ వాతాపీ ఇల్వలుల తల్లియైన సింహిక – హిరణ్యకశిపుని సోదరి.

ఈవాతాపీ ఇల్వలులు మణిమతీపురానికి పాలకులని విష్ణుపురాణం, వ్యాసభారతం తెలుపుతున్నాయి. వీరు రాక్షస ప్రవృత్తితో వర్తించేవారు. సర్వార్థసిద్ధికరమైన ఒకమంత్రాన్ని ఉపదేశించమని ఇల్వలుడొకనాడు ఒకవిప్రునికోరాడు. కానీ రాక్షస స్వభావులైన వీరికి– ప్రభావ సంపన్నమైన మంత్రాలను ఉపదేశించడానికి ఆ విప్రుడు అంగీకరించలేదు. అంతేగాక ఇంద్రునికి సాటికాగల ఒక కుమారుడు కలిగేటట్లు వరాన్ని యమనికూడా ఇల్వలుడు–తపస్సంపన్నుడైన ఆ విప్రుని ప్రార్థించాడు. ఈక్రూరాత్ముల కిచ్చిన వరాలు లోకపీడనకే కారణం కాగలవని ఆలోచించి ఆ విప్రుడు–ఇల్వల కోరిన వాటినన్నింటినీ తిరస్కరించాడు. ఆనాటి నుండి వాతాపీ ఇల విప్రులపైన పగపట్టి ఉన్నారు. ఇల్వలుడు విప్రవేషాన్ని ధరి ప్రదేశాలలోనూ, అరణ్య మార్గాలలోనూ దారికాచి ఉండేవాడు పితృకార్యమనీ, భోజనానికి రావలసిందనీ చెప్పి– ఆదార తెచ్చేవాడు ఇల్వలుడు. వాతాపికి కామరూపమూ, ఎన్ని తిరిగి అతుక్కునే వరమూ ఉన్నాయి. అందువల్ల

ధరించగా ఇల్వలుడు వానినికోసి పితృకార్యం నిమిత్తం అన్నట్లుగా విప్రులకు వండి పెట్టేవాడు. వారు భుజించాక ఇల్వలుడు వాతాపిని పిలిచేవాడు. వాతాపి వారి పొట్ట చీల్చుకొని బయటకు వచ్చేవాడు.

ఈసందర్భంగా ఒక వివరణ :

పూర్వయుగాలలో పితృకార్యాలలో విప్రులకు పితరుల ప్రీత్యర్థంగా మాంసభోజనం పెట్టడం ధర్మశాస్త్రవిధి. దీనితో పాటు మరికొన్ని విషయాలు ఈకలియుగంలో నిషేధించబడినాయి. అట్టి కలివర్జ్యాలలో ఇది ఒకటి.

అశ్వాలంభం గవాలంభం సన్యాసం పలపైతృకం!
దేవరాచ్చసుతోత్పత్తిఃకలౌపంచ వివర్జయేత్!!
– అని స్మృతి వాక్యం.

అనగా అశ్వమేధము, గోమేధము ఇత్యాది హింసతో కూడిన యజ్ఞాలూ, పితృకార్యాలలో మాంసభోజనమూ, దేవరన్యాయం వల్ల ...తోత్పత్తి ఈ విషయాలన్నీ కలియుగంలో పనికిరావని ధర్మశాస్త్రం ...ంది. యజ్ఞయాగాదులలో పశువధను మాని పిష్టపశువుతో యజ్ఞం ...ప్పబడింది. విప్రులకు మాంసభోజనం పూర్తిగా ... అంతకు పూర్వం యజ్ఞయాగాలలోనూ, పితృ ...త్యేకసందర్భాలలో విధించబడిన మాంసభోజనం ...దేవరన్యాయం వల్ల పుత్రోత్పత్తి కూడా ...అంతకు పూర్వయుగాలలో ఉన్నవైనా ...కలాయనే అభిప్రాయంతో

...మైన లోపాముద్ర
...వస్త్రాభరణాల నిమిత్తం
...ంచాడు. ఓ రాజా! నీ

రాజ్యవ్యయానికి సరిపోగా ధనం మిగిలితే దానిని మాత్రమే ఇమ్మని అగస్త్యుడు శ్రుతపర్వుని కోరాడు. శ్రుతపర్వుడు తన వద్ద ధనం మిగలడం లేదనిచెప్పగా అగస్త్య, శ్రుతపర్వులిద్దరూ ప్రద్యుమ్నుడనే రాజు వద్దకు వెళ్లారు. అతడిని కూడా అగస్త్యుడు ఆవిధంగానే అడుగగా అతడుకూడా తన వద్ద ధనం మిగలడం లేదని చెప్పాడు. అగస్త్య , శ్రుతపర్వ, ప్రద్యుమ్నులు ముగ్గురూ త్రసదస్యుడనే రాజు వద్దకు వెళ్లారు. అతడు కూడా అదే సమాధానం చెప్పగా నలుగురూ కలిసి–ఇల్వలునిదగ్గర అపారమైన ధనరాశులున్నాయని అతడిని అర్థించే.నిమిత్తం ఇల్వలునివద్దకు వెళ్లారు. ఇల్వలుడు మేకరూపంలోని వాతాపిని ఖండించి వండి, అగస్త్యాదులకు భోజనం పెట్టాడు. ఇల్వలుడు ఈ ప్రకారంగా విప్రులను హతమారుస్తున్న విషయాన్ని అగస్త్యుడు విని ఉన్నాడు. అందువల్ల మహాతపస్వియైన అగస్త్యుడు– ఈ రాక్షసపీడనుతొలగించదలచి–తన ప్రభావంతో వాతాపి జీర్ణమైపోయేటట్లు చేశాడు.

ఇల్వలుడుతమ అలవాటు ప్రకారం– 'వాతాపీ వెలుపలికి రా!' అని పిలిచాడు. కానీ వాతాపి జీర్ణమైపోయాడు. ఇది అగస్త్యుని ప్రభావం అని గ్రహించుకొన్న ఇల్వలుడు తనకు కూడా ఆగస్త్యునివల్ల చావు మూడుతుందనే భయంతో– ఏమీ మాట్లాడలేకపోయాడు. తానేమీ తెలియనట్లుగానే ఉండి, అగస్త్యాదులు తన వద్దకు వచ్చిన కారణాన్ని ప్రశ్నించి తెలుసుకొని, వారు కోరిన ధనాన్ని ఇచ్చి పంపించాడు ఇల్వలుడు. ఇది వ్యాస భారతంలో ఉన్న గాథ కాగా,రామాయణంలో మరొక విధంగా ఉన్నది.

అదేమంటే–వాతాపిని జీర్ణం చేసుకొన్న అగస్త్యునిపైకి ఇల్వలుడు ఆగ్రహంతో దుమికాడు. అప్పుడు అగస్త్యుడు ఒక్కసారి హుంకరించి, తన తీక్ష్ణదృక్కులతో ఇల్వలుని కూడా సంహరించాడు. రాక్షస పీడను తొలగించినందుకు తపస్వులంతా అగస్త్యుని కీర్తించారు.

ఆ విధంగా అగస్త్యుడు వాతాపిని సంహరించిన ప్రదేశం, వాతాపి ఏలిన ప్రదేశం వాతాపి పట్టణంగా ప్రసిద్ధమైంది. ఇది వాతాపి పట్టణ చరిత్ర.

ఈ వాతాపి పట్టణంలో ప్రతిష్ఠితుడైన గణపతియే వాతాపి గణపతి. తిరుపతి శ్రీవేంకటేశ్వరుడు, కాశీ విశ్వేశ్వరుడు, బదరీ నారాయణుడు, పూరీ జగన్నాథుడు - ఈ విధంగా ఆయా దైవాల నామాలను క్షేత్రం పేరుతో కలిపి చెప్పడం మనకు క్రొత్తకాదు. వాతాపి గణపతి కూడా అదే పద్ధతిలో స్థలనామంతో కలిపి పేర్కొనబడ్డాడు.

ఒకనాటి దక్షిణ, భారతదేశంలో, వాతాపి పట్టణం ఎన్నో ఏండ్ల తరబడి చాలా వైభవాన్ని పొందిన నగరం. చోళుల, చాళుక్యుల, పల్లవులపరిపాలనాకాలంలో ఈ పట్టణం ఎంతో ప్రాచుర్యాన్ని కలిగి ఉండేది. ఇదే నగరం - అనంతరకాలంలో బాదామిగా వ్యవహరించబడింది. చాళుక్య ప్రభువులలో ఒక శాఖవారు ఈ నగరాన్ని తమ ముఖ్యపట్టణంగా చేసుకొని పరిపాలించి - ఈ పట్టణం పేరిటనే (వాతాపి) బాదామి చాళుక్యులుగా ప్రసిద్ధులైనారు.

(వేంగీ చాళుక్యులు, కల్యాణి చాళుక్యులు, వాతాపి చాళుక్యులుగా వారు 3 శాఖలవారు)

చారిత్రక వైభవం కలిగిన వాతాపి నగరంలో నిర్మితమైన గణపతి దేవాలయంలోని ప్రధాన దైవమే వాతాపి గణపతి. శిల్పకళా పోషకులైన దక్షిణ భారత ప్రభువులు నిర్మించిన వివిధ సుప్రసిద్ధ దేవాలయాలలోఇది కూడా ఒకటి. పల్లవులు, చోళులు, చాళుక్యులు - ఇత్యాది ప్రభువులు ఈ వాతాపి గణపతిని పూజించినట్లుగా చారిత్రక నిదర్శనాలున్నాయి.

5. పొట్టివానికి పుట్టెడు బుద్ధులు అంటారు. అంటే ఏమిటి ?

పుట్టెడు బుద్ధులు - అనగా అపారమైన తెలివితేటలు కలిగిన జగత్ప్రసిద్ధులైన పొట్టివారు ముగ్గురున్నారు. వారు విఘ్నేశ్వరుడు, అగస్త్యుడు, వామనుడు.

వీరు ముగ్గురూ - పొట్టివారే అయినా - తాము సాధించిన ఘన విజయాలతో లోక ప్రసిద్ధులు కాగలిగారు.

గౌరీశంకరుల ముద్దుల బిడ్డ అయిన గజాననుడు కుమారుడు ఒకప్పుడు విఘ్నాధిపత్యం కొరకు, ప్రమధగణాధిపత్యంకొరకు-పోటీపడ్డారు. వారి తగవును పరిష్కరించడం కొరకు ఆదిదంపతులు - ఇరువురిలో ఎవరు ముందుగా ప్రపంచ ప్రదక్షిణమూ, అందుగలసర్వతీర్థాలలోనూ స్నానముచేసి వస్తారో వారే విఘ్నాధిపత్యానికీ ప్రమధగణాధిపత్యానికీ అర్హులని ప్రకటించారు. ఆ మాట వినడంతోనే మయూర వాహనుడైన కుమారస్వామి తన నెమలిపై రివ్వున ఎగిరిపోయాడు. లంబోదరుడు, స్థూలాతి స్థూలకాయుడూ అయిన గజాననుడు - తన శరీరంతో, ఎలుకవాహనంతో- శీఘ్రగమనం ఎలా సాధ్యమని త్రుటికాలం చింతించాడు. అతని సూక్ష్మబుద్ధికి ఉపాయం స్ఫురించింది. జగత్పితరులైన తన మాతాపితరులకు ముమ్మారు భక్తితో ప్రదక్షిణంచేసి- ప్రపంచ ప్రదక్షిణమూ, సర్వతీర్థస్నామూచేసిన ఫలాన్ని పొందగలిగాడు. ప్రతి తీర్థము వద్దనూ కుమారస్వామికి తాను స్నానమాడబోయిన చోటున గజాననుడు ముందుగా స్నానంచేసి ఎదురు వస్తున్నట్లు తోచిందట - పార్వతీపరమేశ్వరులకు ప్రదక్షిణం చేసి గజాననుడు పొందిన పుణ్యఫలం వలన గజవదనుడు ఆ విధంగా తన కుశాగ్ర బుద్ధితో తాననుకున్న కార్యాన్ని సాధించి కోరిన ఫలాన్ని పదవులను పొందగలిగాడు. తల్లిదండ్రులు, సోదరుడైన కుమారస్వామి కూడా అతనికి ఆమోదముద్ర వేశారు. గజాననుడు - విఘ్నేశ్వరుడుగా, గణాధిపతిగా ప్రసిద్ధుడయ్యాడు.

అగస్త్యుడుసాధించిన ఘనకార్యాలు అనేకం. పూర్వం కాలకేయులనే రాక్షసులు దేవతలనుఅనేక విధాలుగా బాధించగా - దేవతలప్రార్థనపై విష్ణుమూర్తి వారిని చంపబోయాడు. అప్పుడా రాక్షసులు సముద్రగర్భంలో దాగారు. సురలు గత్యంతరం లేనివారై అగస్త్యమహర్షినివేడగా - అగస్త్యుడు సముద్రాన్ని పుడిసిట పట్టిపానంచేసి - రాక్షసులను బయల్పరచాడు. తమకు రాక్షస బాధ తొలగడానికి కారణమైన అగస్త్యుని దేవతలు కీర్తించారు.

ఒకప్పుడు వింధ్యపర్వతం అమితమైన ఎత్తుకు పెరిగిపోయి - సూర్యాదిగ్రహగతులకుఅవరోధంగా నిలిచింది. మేరు పర్వతానికి నిత్య

ప్రదక్షిణం చేసే సూర్యుడు తనచుట్టూ మాత్రం ఎందుకు తిరగరాదనే ఉద్దేశంతో దానివల్ల-ప్రపంచంలోని సగభాగం చీకటిలో, సగభాగం సూర్యకాంతితో ఉండిపోవలసి వచ్చింది. దేవ, ఋషిగణాల అభ్యర్థనపై అగస్త్యుడు భార్యా సహితుడై వింధ్య పర్వతాన్ని సమీపించాడు. వింధ్యుడు-అగస్త్యునిచూచి నేలకు వాలి నమస్కరించాడు. తనను చూచి అవనతుడైన వింధ్యుని-తాను తిరిగి వచ్చేవరకు అలాగే ఉండమని ఆనతిచ్చిఅగస్త్యుడు దక్షిణ దిక్కుకుతరలిపోయి- మరలి రాకుండా అక్కడే ఉండిపోయాడు. ఫలితంగా వింధ్యం అలాగే ఉండిపోయింది.

వాతాపి-ఇల్వలుడు - అనే రాక్షస సోదరులు- శ్రోత్రియరూపంలో ఉంటూ బ్రాహ్మణులను మోసగించి చంపి తింటుండేవారు. వాతాపికి - ఎన్ని ముక్కలుగా ఖండించబడినా తిరిగి జీవించే వరం ఉన్నది. పితృకర్మలలో మేకమాంసాన్ని పెట్టడం ఆ రోజులలో ఆచారంగా ఉండేది. పితృకర్మకై బ్రాహ్మణులను ఆమంత్రణం చేసి - మేక రూపంలోని వాతాపిని వండి పెట్టేవాడు - బ్రాహ్మణ రూపధారియైన ఇల్వలుడు. వారు భుజించాక-ఇల్వలుడు పిలువగా వారిని పొట్ట చీల్చుకొని వాతాపి బయటకు రాగా - రాక్షసులిద్దరూ ఈ విప్రులను భుజించేవారు.

అట్టి స్థితిలో ఋషులు,సురలు ప్రార్థించగా అగస్త్యుడు-యథాప్రకారంగా ఇల్వలుని ఆహ్వానంపై వెళ్లి-వాతాపిని వండి పెట్టగా వానిని బయటకు రానీయక తన గర్భకుహరంలోనే జీర్ణం చేసుకున్నాడు. వాతాపినిపిలిచినా బయటకురాక-అతనిని అగస్త్యుడు జీర్ణం చేసుకొన్నాడని తెలిసి-అగస్త్యునిపై దూకిన ఇల్వలుడు - అగస్త్యుని క్రోధదృష్టితో భస్మం అయాడు.

అగస్త్యుని ప్రభావం వల్ల దక్షిణదిక్కు అంటే రాక్షసులకు భయం ఏర్పడడమే గాక- ఆ దిక్కుకు అగస్త్యదిక్కు అని పేరు వచ్చింది.

ముల్లోకాలనూఅక్రమించి – అనంతర కల్పంలో తానుపొందదగిన ఇంద్రత్వాన్నిఅప్పుడే పొందాలని ప్రయత్నించిన బలిచక్రవర్తిని –పాతాళానికి అణచివేశాడు వామనుడు. వామనుడుగా యజ్ఞస్థలంలో ప్రవేశించి, నేర్పుతో తానుసంకల్పించిన మూడడుగుల దానాన్ని పొంది త్రివిక్రముడై విక్రమించాడు– పుట్టువెన్నడు నెఱుగని పొట్టివడుగు. ఆ వటువు బలి చక్రవర్తి యజ్ఞవాటికలో ఘటించిన నటనాచాతుర్యం అతనికే చెల్లు.

ఈ విధంగా పొట్టివారై ఉండి – నాన్యతో దర్శనీయమైన చాతుర్యంతో, నైపుణ్యంతో, బుద్ధిబలంతో, ప్రజ్ఞతో అసాధ్యకార్యాలను చక్కబెట్టినఈ ముగ్గురు నేర్పరుల వల్లనూ లోకంలో ఈ సామెత స్థిరపడింది.

మరొక అంశం – పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ సమయంలో జగత్తులోని సర్వులూ ఉత్తరదిక్కుకుపోగా –అగస్త్యుడొక్కడూ దక్షిణాన ఉండి భూమియొక్క సమతూకాన్ని నిలిపాడు. అంతటి ప్రభావశాలి అగస్త్యుడు.

జ్యోతిశాస్త్రపరంగా కూడా – పొట్టిదనానికి కారణమయే బుధగ్రహమే బుద్ధి సూక్ష్మతకూ కారణం.

6. వినాయకునికి తొండం ఎలా వచ్చింది? పుట్టుకతోనే ఉందా? దానికి సంబంధించిన పురాణకథ ఏదైనా ఉందా?

పూర్వం గజాసురుడు అనే రాక్షసుడు శివుని గురించి తపస్సుచేసి, శివుడు తన గర్భంలో నివసించేలా వరంపొందాడు. శివుడు కనపడడం లేదని పార్వతీదేవి – విష్ణుమూర్తికి విన్నవించింది. విష్ణుమూర్తి ఉపాయంతో గజాసురుని వధింపజేసి శివుని బయటకు తెచ్చాడు. విష్ణుమూర్తి,దేవతలు – ఎవరి నివాసాలకు వాళ్లు వెళ్లారు. గజాసుర గర్భం నుంచివిముక్తుడై శివుడు తిరిగి కైలాసానికి వస్తున్నాడనే వార్త పార్వతీ దేవికి చేరింది. గౌరీదేవి ఆనందంతో, భర్తకు స్వాగతం చెప్పదలచి, తలంటుపోసుకునే ప్రయత్నం చేసింది. నలుగుపిండితో ఒక బాలుడి బొమ్మచేసి, దానికి ప్రాణం పోసింది.

ఆ బాలుడిని ద్వారంలో కాపలా ఉంచి, ఎవరినీ లోపలకు రానీయవద్దని చెప్పి, గౌరీదేవి తలంటు స్నానం చేస్తూ ఉంది.

ఇంతలో శివుడు కైలాసానికి వచ్చిలోపలకు రాబోయాడు. గుమ్మంలో కావలి ఉన్న బాలుడు, శివుని లోపలకు వెళ్లనీయలేదు. తన ఇంట్లోనే తనను శాసించిన ఆ బాలుడిని చూచి శివునికి చాలా కోపం వచ్చింది. ఆ బాలుని పక్కకు తొలగించి లోపలకు రాబోయాడు. కానీ ఆ బాలుడు శివుని ఎదిరించి యుద్ధానికి దిగాడు. శివుడు కోపంతో ఆ బాలుని కంఠాన్ని తెగవేసి లోపలకు వెళ్లాడు.

శివుడు ఆ బాలుని చంపిన విషయం తెలిసి పార్వతీదేవి ఆగ్రహించింది. తాను ముచ్చటపడి సృష్టించుకొన్న బిడ్డను తిరిగి బతికించకపోతే లోకాలన్నిటినీ దగ్ధం చేస్తానంది. శివుడు కూడా ఆ బాలుని చంపినందుకు విచారించి, ఆ బాలుని శిరస్సుకోసం వెతికించగా అది దొరకలేదు.

శివుని ఆజ్ఞాప్రకారం ప్రమధులు వెళ్లి - ఉత్తర దిక్కుకు తలపెట్టి నిద్రిస్తున్న ప్రాణి శిరస్సును తెమ్మనగా, ఒక ఏనుగు తలను తెచ్చారు. ఆ ఏనుగుతలను బాలునికి అతికించి శివుడు బ్రహ్మాదిదేవతలూ అతడిని బతికించారు. అది గజాసురుని శిరస్సేననీ, తనశిరస్సు త్రిలోక పూజ్యం కావాలని గజాసరుడు శివుని కోరడంవల్ల సిద్ధించిందనీ పాఠాంతరం. తన శిరస్సు త్రిలోక పూజ్యం కావాలని, గజాసురుడు శివుని కోరాడు. వినాయకునికి ఏనుగుతల, తొండమూ ఏర్పడిన కారణం ఇది.

7. కలియుగ యక్షప్రశ్నలంటే ఏమిటి? ఆపేరు ఎలా వచ్చింది?

యక్షప్రశ్నలప్రసక్తి మహాభారతంలో ఉంది. అవి తప్ప - కలియుగ యక్ష ప్రశ్నలంటూ వేరే ఏవీ లేవు. మీ ఉద్దేశం - యక్షప్రశ్నలనే పేరు ఎలా వచ్చింది - అని అనుకుంటున్నాను. ఆ వృత్తాంతం ఇది.

పాండవులు అరణ్యవాసం చేస్తూ ఉన్న కాలంలో ఒకనాడు ధర్మరాజు దగ్గరకు ఒక విప్రుడు పరుగుపరుగున వచ్చాడు. ఆ విప్రుడు తన అరణిని–తానుండే కుటీరంవద్ద ఒకచెట్టు కొమ్మకు తగిలించి ఉంచాడట. ఒక లేడి వచ్చి ఆ చెట్టుకు తన దేహాన్ని ఒరిపిడి పెట్టుకుంటూ ఉన్న సమయంలో ఆ అరణి–ఆ లేడి యొక్క కొమ్ములకు తగులు కొంది. ఆ లేడి దాని కొమ్ములకు తగులు కొన్న అరణితో సహా అరణ్యంలోకి పారిపోయింది. అరణి అంటే – అగ్నిని తయారు చేసుకొనే సాధనం. ఆ బ్రాహ్మణునికి నిత్యాగ్ని హోత్రం నిమిత్తం అది అత్యవసరం. కనుక ఎలాగైనా తన అరణిని తిరిగి తెచ్చిపెట్టమని ఆ విప్రుడు ధర్మరాజును కోరాడు.

ఆ విప్రునికి అరణిని తప్పక తిరిగి తెచ్చి ఇస్తామని మాటఇచ్చి – ధర్మరాజుతో సహా పాండవులైదుగురూ ఆ లేడి వెళ్లిన దిశగా దాన్నితరుముకొంటూ వెళ్లారు. అది పాండవులను చాలా దూరం పరుగెత్తించిందేకాని అందలేదు. వారి బాణాలు కూడా దానికి తగలలేదు. అల్లంతదూరంలో కనపడుతూ ఆయాసపెట్టి – చివరకు అరణ్యమధ్యానికి వెళ్లాక ఆ లేడి అంతర్ధానమైపోయింది.

అప్పటికే చాలా దూరం పరుగెత్తి అలసి ఉండడం వల్ల – ఆ పరిసరాలో ఎక్కడైనా జలాశయం ఉన్నదేమో చూచిరమ్మని, నీరుంటే త్రాగి, తమకోసం కూడా తూణీరంలో నీరు నింపి తీసుకొనిరమ్మనీ ధర్మరాజు నకులుని పంపాడు.

నీటి పక్షుల సంచారాన్ని బట్టి నకులుడు ఆ సమీపంలో ఉన్న ఒక జలాశయాన్ని చేరాడు. ఆ సరస్సులోని నీటిని తాగబోయాడు నకులుడు. అప్పుడు ఒక అదృశ్యశక్తి ఏదో – ఆ సరస్సు తనదనీ, తానడిగే ప్రశ్నలకు తగిన సమాధానాలు చెప్పగలిగితేనే ఆ నీరు త్రాగవచ్చుననీ, తన మాటకాదని ఆ నీరు తాగితే ఆపద కలుగుతుందనీ నకులుని హెచ్చరించింది.

కానీ నకులుడు ఆ అదృశ్యవాక్కును లెక్కచెయ్యలేదు. సరస్సులోకి దిగి నీరు త్రాగాడు. అలా ఆ నీటిని తాగినవెంటనే నకులుడు స్పృహకోల్పోయి పడిపోయాడు.

చాలాసేపైనా నకులుడు తిరిగి రాకపోవడంవల్ల – ధర్మరాజు వరుసగా తన మిగిలిన సోదరులను ఒక్కొక్కరినే పంపించాడు. నకులుడు ఎందుకని ఇంకా తిరిగి రాలేదోనని చూడడం కోసమూ, నీటి కోసమూ వెళ్లిన ధర్మరాజు తమ్ములంతా కూడా నకులుని వలెనే అయ్యారు. వారంతా కూడా ఒక్కొక్కరే ఆ సరోవర తీరానికి వెళ్లి – తమ సోదరులపాటును చూసి – ఎవరో రాక్షసులచర్యగా భావించారు. ముందుగా నీరు తాగి దాహం తీర్చుకొని ఆ అసురులతో యుద్ధం చేయడానికి నిశ్చయించుకొని, ఆ అశరీరశక్తి చేసిన హెచ్చరికను లెక్కచేయకుండా సరోవర జలాన్ని తాగారు. నకులుని వలెనే చైతన్యం కోల్పోయి పడిపోయారు.

వెళ్లిన సోదరులెవరూ తిరిగి రాకపోవడంతో ధర్మరాజు కలవరపడ్డాడు. ఇక తానే వెళ్లి చూడడానికి నిశ్చయించుకొని ఆ జలాశయ తీరానికి చేరాడు. అక్కడ నిశ్చేతనులై పడి ఉన్న సోదరులను చూచి ఆశ్చర్యాన్నీ అపరిమితమైన దుఃఖాన్నీ పొందాడు. మహా వీరులూ, దుర్నిరీక్ష్యప్రతాపులూ అయిన తన సోదరులకు ఆ గతి పట్టడానికి కారణమేమిటని ఆలోచించాడు. ముందుగా దాహం తీర్చుకొని తన సోదరుల స్థితికి కారణాన్నీ నివారణ మార్గాన్నీ కనిపెట్టాలనుకొన్నాడు.

అతడి సోదరులను హెచ్చరించిన ఆ అశరీరశక్తి – ధర్మరాజును కూడా నిలువరించింది. ధర్మరాజు ప్రశ్నించినమీదట– తానొక యక్షరాజునని చెప్పింది. ఆ అశరీర శక్తి. అంతవరకూ అదృశ్యంగా ఉండిన ఆ యక్షుడు – ఆకాశాన్నంటే దేహంతో ధర్మరాజు ముందు ప్రత్యక్షమయ్యాడు.

అప్పుడు ఆ యక్షుడు ధర్మరాజును ఎన్నోక్లిష్టమైన ప్రశ్నలు అడిగాడు.

ధర్మరాజు వాటన్నిటికీ తగిన సమాధానాలిచ్చి ఆయక్షుని మెప్పించాడు.

ఆ విధంగా ఆ సందర్భంలో ఆ యక్షుడు ధర్మరాజును అడిగిన ప్రశ్నలే యక్షప్రశ్నలు.

8. ఆంధ్రులది చంద్రసిద్ధాంతం అని, తమిళులది సూర్యసిద్ధాంతం అనీ అంటారు. ఆంధ్రులకు కొత్త నెల అమావాస్య నుంచి మొదలైతే తమిళులకు పౌర్ణమి నుంచి మొదలౌతుంది. నా సందేహం ఏమంటే-

1. తమిళులకు కొత్త సంవత్సరం ఎప్పుడూ ఏప్రిల్ 14ననే ఎలా వస్తుంది? ఆ రోజు తిథి ఏదైనప్పటికీ.

2. ఏప్రిల్‌లో కొత్త సంవత్సరం మొదలయ్యే పక్షంలో - మొదటి నెల చైత్రం (చిత్తిరై) అప్పుడేకదా ఆరంభం కావడం? కాని చైత్రంలో వచ్చే శ్రీరామనవమిని అందరితోపాటూ మార్చిలోనే కదా చేసుకుటారు (తమిళులు) ఎలాగ? ఇది ఎలా సాధ్యం? మేము తమిళులమే. నా సందేహనివృత్తి చేయ ప్రార్థన.

వేదం చేత విధించబడిన సర్వకర్మలకూ చాంద్రమానాన్నే ఉపయోగించాలని నిర్దేశించారు- మహర్షులు. చాంద్రమానం, సౌరమానం, నాక్షత్రమానం, బార్హస్పత్యమానం, గురూదయాబ్దమానం, సావనమానం- ఇవి కాలాన్ని కొలిచేందుకుగాను మహర్షులు ఏర్పరచిన పద్ధతులు. వీటిని గతంలో వివరించాను.

1. సూర్యుడు ఒక్కొక్క రాశిలో ఒక్కొక్క నెల వంతున 12 నెలలలోనూ 12 రాసులలో ఉండడం జరుగుతుంది. సూర్యుడు ఒక రాశి నుంచి మరొకరాశిలో ప్రవేశించడమే సంక్రమణం. సౌరమానం ప్రకారం కాలగణనం చేసుకొనే వారికి సూర్యుని మేష సంక్రమణమే సంవత్సరాది అవుతుంది. అందుకే సౌరమానాన్ని పాటించే తమిళులకు ఏప్రిల్ 14వ తేదీన సంవత్సరాది. ఇది సౌరసంవత్సరాది. ఆ రోజుతో సౌరసంవత్సరం ప్రారంభం అవుతుంది.

ఏయే ప్రజలు ఏయే విధానాలను పాటించినప్పటికీ – శ్రీరామనవమి తిథి మారదు. కనుకనే దేశమందరితోపాటుగా తమిళులు శ్రీరామనవమిని ఆనాడే చేసుకుంటారు.

ఏ పర్వదినాలను వ్రతాలను ఏయే తిథులలో పాటించాలన్న విషయాన్ని మహర్షులు నిర్దేశించి ఉంచారు. ఒకే తిథి రెండు, లేదా మూడు రోజులకు వ్యాప్తమైనప్పుడు సైతం శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి వంటి వ్రతవిధులను ఏ రోజున పాటించవలసిందీ మహర్షులు నిర్ణయించారు. వారినిర్ణయమే మన కందరికి శిరోధార్యం. అంటే తమిళులు కాలగణనానికి సౌరమానాన్ని పాటించినప్పటికీ –శ్రీరామనవమి మొదలైన పర్వాలను అందరితోపాటుగా చాంద్రమానం ప్రకారమే చేసుకుంటున్నారన్నమాట. ఆ యా పర్వాలను చాంద్రమానం ప్రకారమే పాటించడం అనేది మహర్షుల నిర్ణయం.

9. త్రిమూర్తులెవరు ? వారుండే లోకాలేవి?

త్రిమూర్తులు – బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, వారుండే లోకాలు : సత్యలోకం బ్రహ్మదేవుని నివాసం. వైకుంఠం శ్రీమహావిష్ణువునివాసం. కైలాసం రుద్రుని నివాసం.

10. గోదాదేవి కథ తెలుపగలరు ?

శ్రీమహావిష్ణువుకు పరమభక్తుడైన విష్ణుచిత్తుల వారికి తులసీవనంలో ఒక పసి బిడ్డ లభించింది. ఆమెయే భూదేవీ అవతారమైన గోదాదేవి. విష్ణుచిత్తులవారు ఆ బిడ్డకు గోదాదేవి అని పేరు పెట్టి ఆప్యాయంగా పెంచారు. గోదాదేవి యుక్తవయస్కురాలైంది.

విష్ణుచిత్తులవారు శ్రీరంగనాధునికి నిత్యమూ పుష్పమాలలుకట్టి ఆలయానికి తీసుకువెళ్లి అర్పించేవారు. గోదాదేవి పెరిగి పెద్దదైనప్పటి నుంచీ ఆ పుష్పమాలలను గోదాదేవే కట్టి ఇచ్చేది తండ్రికి తాను కట్టి ఇచ్చేపుష్పమాలలను గోదాదేవి ముందుగా తాను మెడలో వేసుకుని తన

ప్రతిబింబాన్ని చూసుకుని మురిసిపోయేది. ఆ తర్వాతనే ఆ మాలలను శ్రీరంగనాథునికి అర్పించే నిమిత్తం బుట్టలో ఉంచి తండ్రికి ఇచ్చేది. కానీ ఈ విషయం విష్ణుచిత్తుల వారికి తెలియదు.

ఒకనాడు శ్రీరంగనాథునికి అర్పించవలసిన పుష్పమాలలో తల వెంట్రుక ఉండడం చూశారు విష్ణుచిత్తులవారు. గోదాదేవిని ప్రశ్నించారు శ్రీరంగనాథునికిచ్చే పుష్పమాలను తాను ముందుగా ధరించి ఇస్తున్నట్టుగా నిజం చెప్పింది గోదాదేవి. అది విని విష్ణుచిత్తులవారు ఖిన్నులయ్యారు. భగవద పచారం జరిగిపోయిందని పరితపించారు.ఎన్నో విధాలుగా శ్రీ రంగనాథునికి తన అపరాధాన్ని మన్నించమని విన్నవించుకున్నారు. ఆ రాత్రి విష్ణుచిత్తులవారికి కలలో శ్రీరంగనాథుడు కనిపించాడు. గోదాదేవి ధరించి ఇచ్చిన మాలలే తనకు ప్రియమైనవనీ,గోదాదేవిని నిందించవద్దనీ, ఆమె ముందుగా ధరించి ఇచ్చిన పుష్పమాలలనే తనకు సమర్పిస్తూ ఉండవలసిందనీ విష్ణుచిత్తులవారిని ఆదేశించాడు. గోదాదేవి అదృష్టానికీ, ఆమెయందు శ్రీరంగనాథునికీ గల అనుగ్రహానికీ విష్ణుచిత్తులవారు బ్రహ్మానంద భరితులయ్యారు.

విష్ణుప్రీతికరమైన ధనుర్మాసమంతా గోదాదేవి- శ్రీమహావిష్ణువును వివాహమాడగోరి నిష్ఠతో వ్రతాన్ని ఆచరించింది. ఆసమయంలోనే గోదాదేవి పాశురాలను రచించింది.

గోదాదేవి వ్రతనిష్ఠకు శ్రీరంగనాథుడు ప్రసన్నుడయ్యాడు. గోదాదేవిని తనకిచ్చి వివాహం చేయమని విష్ణుచిత్తుని ఆదేశించాడు. నిర్ణీత దినాన శ్రీరంగనాథాలయం నుంచి గోదాదేవిని తీసుకువెళ్లడానికి పల్లకీ వచ్చింది. శ్రీరంగనాథుని ఆదేశంతో.

మహావైభవంగా గోదాదేవీ శ్రీరంగనాథుల కల్యాణాన్ని జరిపించి విష్ణుచిత్తులవారు ధన్యులయ్యారు. గోదాదేవి శ్రీరంగనాథునిలో లీనమయింది.

ఇదీ గోదాదేవి కథ. చూడికుడుత్త నాచ్చియార్ అన్నా, అండాళ్ అన్నా కూడా గోదాదేవే.

11. పత్తి, బూరుగు పెరట్లో వేయరాదనడానికి కారణం ఏమిటి ?

వాస్తుశాస్త్రం మానవుల జీవితాభ్యుదయాన్ని దృష్టిలో ఉంచుకొని, కొన్ని విధి నిషేధాలను విధించింది. వానిలో పత్తి, బూరుగు వంటి చెట్లను, పాలుకారే చెట్లను, ముళ్ళుకల చెట్లను - ఇంటి ఆవరణలో వేయరాదనేది ఒకటి. ఈ అంశం చాలా విస్తృతమైన పరిధి కలది. కొన్ని కొన్ని వస్తువుల సామీప్యం వల్ల కొన్నివిధాల వ్యాధులు, లేదా ఇబ్బందులు కలుగుతాయి. తులసీవనంలో నివసించడం వల్ల కుష్ఠు, క్షయ, కాస, శ్వాస-ఇత్యాది వ్యాధులు ఉపశమిస్తాయని శాస్త్రవాక్యం. ములగచెట్టు కూడా ఇంటి పెరట్లో వేయరానిదిగా చెప్పబడింది. ములగచెట్టును ఆశ్రయించి గొంగళి పురుగులు అత్యధిక సంఖ్యలో ఉంటాయని అందరికీ తెలుసు. ప్రత్తి, బూరుగు చెట్లు శనిగ్రహ కారకత్వంలోనివిగా చెప్పబడ్డాయి. ఈ చెట్లకాయలుపగిలి వానిలోని దూదిపింజలు గాలిలో కలిసి, ఆ సమీపంలో ఉన్న వారికి శ్వాసకోశ వ్యాధులను కలుగజేస్తాయి. కొన్ని కొన్ని కామ్యఫలాల కొరకు (ఉదా: సంతాన ప్రాప్తిమొదలగు) కొన్ని కొన్ని నిర్దిష్టవృక్షాల సమిధలను మాత్రమే హోమం చేస్తారు. అట్టి వస్తుగుణ వివేకానికిసంబంధించిన నిషేధమిది.

12. కొత్తకోడలు అత్తింట కుడి కాలు మోపాలంటారు? దేనికి?

శరీరంలోని భాగాలన్నిటికీ గ్రహాలు కారకత్వం వహిస్తాయి. శిరస్సుకు సూర్యుడు, ముఖానికి చంద్రుడు, కంఠానికి కుజుడు, వామభాగానికి బుధుడు, దక్షిణ భాగానికి బృహస్పతి, హృదయానికి శుక్రుడు, జానువులకు శని, పాదములకు రాహు, కేతువులు ఆధిపత్యం వహించి ఉన్నారు. ఈ విధంగా బాహ్యభాగాలకే కాక, శరీరాంతర్భాగాలకు సంబంధించి కూడా గ్రహకారకత్వ విషయకమైన విభాగం ఉన్నది. కాని ప్రస్తుత ప్రశ్నకు సంబంధించినదికాక పోవడం వల్ల విడిచిపెట్టడమైనది.

బృహస్పతి సర్వశుభ కారకుడు కావడం వలన, ఆయన కారకత్వం కలిగిన కుడి పాదాన్ని ముందుగా ఉంచమన్నారు. ఆ విధంగా చేయడంవల్ల - శుభ గ్రహ సంబంధం శుభావహం కనుక, అంతేగాక, వివాహం, దాంపత్యం సంతానం వంటి అంశాలన్నిటికీ బృహస్పతియే కారకుడు కాబట్టి ఆయా విషయాలన్నిటిలో ఆ దంపతులకు శుభం కలగాలనే ఉద్దేశంతో ఆ విధంగా చెప్పడం జరిగింది. క్రొత్తగా అత్తింట ప్రవేశిస్తున్న ఆ వధువుకు ఆ గృహప్రవేశం; ఆ గృహంలో జీవితమూ సుఖదాయకం కావాలని, శుభ ప్రారంభం నిమిత్తమై, ఆమె భావి జీవితం ఆ గృహంలో సవ్యంగా సాగాలన్న ఆకాంక్షతోనూ ఏర్పరచబడిన ఆచారం ఇది.

ఇతరుల పట్ల మంచి హృదయము, మంచి వాక్కు, మంచి నడవడిని ఇచ్చే బృహస్పతి యొక్క కారకత్వం వల్ల - దాంపత్యాలకు ఏ విధమైన ఇబ్బందులు, కలహాలు, అశాంతులు, ఎదురు కాకుండా ఉంటాయనే సదాశయంతో ఈ ఆచారం ఏర్పరచబడింది.

13. దక్షిణ దిక్కుగా తలపెట్టి నిద్రపోరాదు అంటారు. ఎందుచేత?

నిద్రపోవాలిది ఉత్తర దిక్కుగా తలపెట్టి మాత్రమే. కాని, దక్షిణ దిక్కుగాకాదు. ఎందువల్లనంటే ఉత్తర దిక్కుగా తలపెట్టి పరుండినవారు నిద్రలేవగానే దక్షిణ దిక్కును చూస్తారు. దక్షిణం యముని దిక్కు. నిద్ర మేల్కొన్న వెంటనే దానిని చూడరాదనే భావంతో ఏర్పరచిన నియమం ఇది. గణేశునికి ఉత్తర దిక్కుగా తలపెట్టి ఉన్న ఏనుగు తలనే తెచ్చి అతికించారు. అప్పటి నుంచీ ఇది సంప్రదాయమైంది.

14. హిందూమతంలో ఇది ఇలా చెయ్యాలి, అది అలా చెయ్యకూడదు - అని చెప్పే ప్రామాణిక గ్రంథాలేవి?

చతుర్వేదాలు, ధర్మశాస్త్రాలు, అష్టాదశ స్మృతులు - ఇవన్నీ మానవుల ప్రవర్తనను నిర్దేశించేవే. అవికాక అష్టాదశ (18) మహాపురాణాలలో, అష్టాదశ ఉపపురాణాలలో, అసంఖ్యాకమైన సంహితలలో - ఎన్నో విధులనూ, నిషేధాలనూ మహర్షులు చెప్పారు. మనం ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు - అనడానికి అవే ప్రామాణికాలు.

15. శనివారానికీ వెంకటేశ్వరునికీ ఉన్న సంబంధమేమిటి? శనివారంనాడు వేంకటేశ్వర ప్రీతిగా వార నియమం చేస్తారు. దీనికి శాస్త్ర ప్రమాణం ఉందా?

వేంకటేశ్వర ప్రీతికై శనివార నియమం చేయడానికి కూడ పురాణాలలో ఆధారాలున్నాయి. మార్కండేయ పురాణంలో ఈ విషయమై ఈ విధంగా ప్రస్తావన వుంది.

''కలౌ కుమార రూపేణ షణ్ముఖో భగవాన్ హరిః!
దృశ్యత్రైక ముఖే నైవ వేంకటాచల నాయకః'' అనిన్నీ
''సౌభాగ్యదాయకం విష్ణుం వెంకటేశం సమర్చయ శనివారే''
సుబ్రహ్మణ్య కుమారాఖ్యా విష్ణ్వాఖ్యా వేంకటాచలే!
శేషశ్శేషి కలా బ్రాహ్మీ సర్వచైతన్య రూపిణీ!
శ్రీ వేంకటేశ్వర రూపేణ కలౌ ప్రత్యేక్ష దర్శనం!
సర్వదాపి శనేర్వారే భక్తేష్టార్థ ప్రదాయినీ
ఇదం కలియుగే ముఖ్యం సత్యం సత్యం
న సంశయః!

భావం:- ఆరు ముఖాలు కలిగిన కుమారస్వామి, కలియుగంలో ఏకముఖుడై వేంకటాచల నాయకుడుగా దర్శనం అనుగ్రహిస్తూ వున్నాడు. సౌభాగ్యదాయకుడున్నూ, విష్ణు స్వరూపుడన్నూ అయిన శ్రీ వేంకటేశ్వరుని శనివారంనాడు తప్పక అర్చించవలసినది.

సుబ్రహ్మణ్యేశ్వరుడే వేంకటేశ్వరుడుగా వెంకటాచలమునందు వెలసి ఉన్నాడు. సర్వచైతన్య రూపిణియైన, బ్రాహ్మీశక్తియైన సరస్వతి - శ్రీవేంకటేశ్వర రూపంతో కలియుగంలో ప్రత్యక్ష దర్శనం ఇస్తూ ఉంది. శనివారంనాడు అట్టి సుబ్రహ్మణ్య, సరస్వతీ, మహావిష్ణు కళలు కలిగి వున్న శ్రీవేంకటేశ్వరుని అర్చన భక్తులకు సర్వదా అభీష్టార్థాలను ప్రసాదిస్తుంది ఈవ్రతం కలియుగంలో ముఖ్యమైనది.

16. దేవుడు ఉన్నాడా లేడా? ఆస్తికుడు, నాస్తికుడు - ఈ పేర్లు ఎలా వచ్చాయి? ఎవరు పెట్టారు? దేవుడు స్త్రీయా, పురుషుడా?

ఈ చరాచర సృష్టిని నడిపించేదీ, మానవులు తాము చేసిన పాపపుణ్యాలకు ఫలితాలుగా కష్టసుఖాలను పొందడానికి కారణమైనదీ అయిన మానవాతీతశక్తినే ఎవరికి తోచిన రూపంలో వారు పూజిస్తున్నారు. ఆ శక్తే దేవుడు. ఆ దేవుడు ఉన్నాడా లేడా అంటే ఏమి చెబులాము? నన్ను అడిగితే నా నమ్మకాన్ని బట్టి, అలాగే ఎవరిని అడిగితే వారి వారి నమ్మకాన్ని బట్టి ఉన్నాడనో, లేడనో చెబుతారు. నేను చెప్పినది నా నమ్మకం. దానిపైన మీకు విశ్వాసం కలగకపోతే మీరు స్వయంగా శోధించి తెలుసుకోవడమే మార్గం. శోధించకుండా, తరచి చూడకుండా - దేన్నీ కూడా తృణీకరించడం న్యాయం కాదు. దేవుడు స్త్రీ రూపమా, పురుషరూపమా - అన్నదానికి కూడా అదే సమాధానం. మనం ఎలా దర్శిస్తే అలాగే దర్శనమిస్తుంది ఆ దైవశక్తి. నిర్వికార నిర్గుణ పరబ్రహ్మమైన పరమాత్మ స్వరూపానికి స్త్రీ పురుష భేదాలుండవు. చూసే వారి దృష్టిని బట్టి దర్శనమిస్తుంది. 'చేరి యశోదకు శిశువితడు, ధారుణి బ్రహ్మకు తండ్రియునితడు..' అన్నా, 'అణోరణీయాన్ మహతోమహీయాన్' అన్నా అదే. ఆ మహత్తమశక్తిని పుత్రభావంతో దర్శించిన దేవకికీ యశోదకూ అతడు శిశువయ్యాడు. ఆ శక్తి సూక్ష్మాతిసూక్ష్మమూ, మహాపర్వతాకారమూ కూడా. 'యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ' ఆ శక్తిని వర్ణించడానికి, అర్థం చేసుకోవడానికి సామర్థ్యం చాలక వాక్కులూ, మనస్సూ కూడా తిరోహితాలవుతాయని దానిని వర్ణించడానికి వేదాలకూ ఉపనిషత్తులకూ కూడా శక్తి చాలలేదు. అటువంటి పరబ్రహ్మ స్వరూపాన్ని గురించి ఏమి చెప్పగలం? ఆ దైవశక్తి ఉన్నదనే వాళ్లు ఆస్తికులు, లేదనే వాళ్లు నాస్తికులు. ఆస్తిక, నాస్తిక శబ్దాలకున్న అర్థమే అది. అంతేకాని అవి ఎవరూ పెట్టిన పేర్లుకావు.

17. పెద్దవాళ్లు పిన్నలను మన్నిస్తే ఆయుక్షీణం అంటారు. మరి అల్లుడి కాళ్లు కడిగి మామగారు నెత్తిన జల్లుకునే ఆచారంలోని ఔచిత్యం ఏమిటి? కన్యాదానం చేసేటప్పుడు చెప్పే మంత్రాల అర్థాన్ని వివరించండి. పెళ్లి మంత్రాలు ఒక్కొక్కదాని అర్థం తెలుపగలరు.

ఏదైనా ఒక దానం చేస్తున్నప్పుడు, ఆ గ్రహీతను సాక్షాత్ దైవస్వరూపుడగా భావించి సమర్పించడం వైదికమైన శిష్టాచారం.

వివాహమనేది లౌకికమైన క్రియాకలాపం కాదు. అది వైదికమైన సంస్కారం.

ధార్మికమైన గృహస్థ జీవనాన్ని నడపడం కోసం ధర్మప్రజా సంపత్యర్థం, పితృఋణ విమోచనం కోసం చేసే అర్థక్రియ.

వరుని సాక్షాద్విష్ణు స్వరూపునిగా భావించి, కన్యాదాత అతనికి అర్ఘ్యపాద్యాది ఉపచారములు సమర్పించి, అతనిపాదాలను కడిగి, తన కుమార్తెను అతనికి సమర్పిస్తారు. వివాహ కల్పమును పరిశీలించితే ఈ విషయం విశదం కాగలదు.

మహత్తరమైన పుణ్యం లభించడం కొరకు అలంకృతయైన ఈ నా కుమార్తెను దానం చేస్తున్నాని చెబుతాడు కన్యాదాత.

వివాహ ప్రకరణంలోని ఈ మంత్రాలను పరిశీలిస్తే వరుని పాదాలను కన్యాదాత కడగడంలోని అంతరార్థం బోధపడుతుంది.

"త్రిగుణీకృత అగ్నిష్టోమ, అతిరాత్ర, ఆప్తోర్యామ, సాంతపన, వాజపేయ, పౌండరీక, అశ్వమేధాది శతక్రతు పుణ్యఫలావ్యాప్త్యర్థం."

అనగా, అగ్నిష్టోమాది నూరు విధాలైన యజ్ఞాలను ఒక్కొక్కటి ముమ్మారు ఆచరించిన పుణ్యఫలాన్ని పొందుట కొరకు -

" మయా సహ దశపూర్వేషాం, దశ అపరేషాం మద్వంశ్యానాం
పితౄణాం నరకాదుత్తీర్య శాశ్వత బ్రహ్మలోక నివాస సిద్ధ్యర్థం"

'' స్వగృహ్యోక్తప్రకారేణ సాలంకృత సహిరణ్యోదక కన్యాదాన మహంకరిష్యే''

అనగా, అలంకృతయైనదియూ, బంగారవముతోను, నీటితో కూడనది అయిన కన్యను దానము చేయుదునుగాక.

'' శ్రీలక్ష్మీనారాయణ స్వరూపస్య వరస్యఇదిమాసనం''

'' ఇదం పాద్యం అమీ గంథాః ఇద మర్ఘ్యం ఇమే అక్షతాః''

అనగా, లక్ష్మీనారాయణ స్వరూపుడగు వరునకు ఆసనము, అర్ఘ్యపాద్యాది ఉపచారాలు సమర్పించి, భగవత్స్వరూపుడుగా భావించిన ఆ బ్రహ్మచారియొక్క పాదాలు కడిగి, కన్యాదానం చేయడం జరుగుతుంది.

18. వివాహ సమయంలో వధువు నడుముకు ఒక తాడును కట్టడం చూశాము. అది ఏమిటి? ఆ కార్యక్రమం ఏమిటో దాన్ని ఎందుకు కడతారో వివరించకోరుతున్నాము.

యోక్త్రము - అంటే దర్భలతో రూపొందించబ [illegible] వివాహసమయంలో వరుడు ఈ త్రాడును వధువు నడుముకు చుట్టి ముడివేయడం జరుగుతుంది.

ఈ వైదికమైన ఈ కర్మకు ''పత్నీవ్రతోపనయనం'' అనిపేరు. దంపతులు ఉభయులూ ఏకమై ఈ జీవిత యజ్ఞకార్యనిర్వహణం చేయడానికై - భర్త ఈ విధానంగా భార్యకు అధికారాన్ని కలిగిస్తాడు.

గృహస్థ జీవనంలో గృహిణిగా, కర్మిష్ఠియైన భర్తకు సహధర్మచారిణిగా ఆమెకు కర్మార్హతను సర్వకర్మల యందునూ కలిగించడానికి చేసే క్రియా కలాపమిది.

ఈ సన్నివేశంలో వరుడు ఈ క్రింది మంత్రాన్ని ఉచ్చరిస్తాడు.

70,500

" ఆశాసానా సౌమనసం ప్రజాం సౌభాగ్యం తనుమగ్నే!
రనూరతా భూత్వా సన్నహ్యే సుకృతాయకమ్!!"

" ఉత్తమమైన మనస్సును, యోగ్యమైన సంతానాన్ని అధికమైన సౌభాగ్యాన్ని, శుద్ధమైన-సుందరమైన తనువును ధరించి, అగ్నిహోత్రమున నాకు సహచారిణివై సుకృతములకు, సత్కార్మలకు సంసిద్ధురాలవు కాలసింది.

ఈ జీవిత యజ్ఞమనే మంగళ కార్యాచరణం నిమిత్తమై ఈ వధువు నడుముకు దర్భలతో తయారుచేసిన ఈ త్రాటినికడుతున్నాను.

ఉపనయనంతో వటువుకు కర్మార్హతను కలిగించినట్లే ఈ పత్నీవ్రతోపనయనం వధువుకు కర్మార్హతను కలిగించడానికై ఉద్దేశించబడింది. ఉపనయన సమయంలో వటువుకూడా- మౌంజీబంధనమూ, కృష్ణాజినయజ్ఞోపవీత ధారణములతో బాటుగా ఈ యోక్త్ర ధారణం జరుపబడుతుంది. ఆ విధమైనదే వివాహంలో వధువుకు చేసే యోక్త్రధారణం కూడా.

19. అష్టవిధ వివాహాలేవి? వివరించగలరు.

అష్టవిధ వివాహాలంటే ఎనిమిది రకాలైన వివాహ పద్ధతులు. అవి ఈ క్రిందివి.

1. బ్రాహ్మవివాహం: సదాచారం కలిగిన ఉత్తముడైన వరుని వస్త్రభూషణాదుల చేత అలంకరించి, పూజించి తమకన్యనిచ్చిచేసే వివాహం.

2. దైవ వివాహం : జ్యోతిష్టోమాదియజ్ఞాలను చేసే సందర్భంలో, ఆ క్రతు విధానాన్ని చేయించిన ఋత్విజుని అలంకరించి తమ కన్యనిచ్చి చేసే వివాహం.

3. ఆర్ష వివాహం : ధర్మాన్ని ఆచరించే నిమిత్తంగా వరుని నుంచి రెండు గోవులను తీసుకొని అతడికి పిల్లనిచ్చి శాస్త్రసమ్మతంగా చేసే వివాహం.

4. ప్రాజాపత్య వివాహం: గృహస్థాశ్రమాన్ని విడవననీ, సంతానాన్ని పొందుతాననీ వరునిచేత ప్రమాణం చేయించి అతడికి కన్యాదానం చేయడం.

5. రాక్షస వివాహం: కన్యకు సంబంధించిన బంధువులతో యుద్ధంచేసి – వారి అంగీకారం లేకుండా బలప్రయోగంతో కన్యనుతీసుకుని వచ్చి చేసుకునే వివాహం.

6. ఆసుర వివాహం : కన్యకు సంబంధించిన పెద్దలకూ, ఆమె తల్లిదండ్రులకూ, వారితో పాటు కన్యకూ సమృద్ధిగాధనాన్ని ఇచ్చితృప్తిపరచి చేసుకొనే వివాహం.

7. గాంధర్వవివాహం : వధూవరులు ఒకరియందు మరొకరికి ఉన్న ప్రీతివల్ల స్వాతంత్ర్యాన్ని వహించి తమంతట తాముగా, పెద్దల ప్రమేయం లేకుండా చేసుకొనే వివాహం.

8. పైశాచిక వివాహం : నిద్రవల్ల కాని, మత్తుపదార్థాలను ప్రయోగించడం వల్ల కాని మరే కారణంవల్ల కాని ఒంటిమీద స్పృహలేకుండా ఆత్మరక్షణ చేసుకోలేని పరిస్థితిలో ఉన్న స్త్రీని – ఆమెకు కానీ, ఆమె తల్లిదండ్రులకు కానీ తెలియకుండా, వారి అనుమతి లేకుండా, రహస్యంగా తెచ్చి చేసుకునే వివాహం.

ఇవీ అష్టవిధ వివాహాలు. వీటిలో పైశాచిక వివాహం మాత్రం ఎవ్వరూ, ఎన్నడూ ఆచరించరానిదని ధర్మశాస్త్రకర్తలు శాసించారు.

20. కన్యావరణం అంటే ఏమిటి ?

కన్యావరణం అంటే – వరుడు కన్యను వరించడం.

గురుకులంలో విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని స్నాతక వ్రతాన్ని నెరవేర్చిన స్నాతకుడు (వరుడు) కాశీయాత్రకు బయల్దేరతాడు. సర్వవిధాలా యోగ్యుడు, విద్యావంతుడు అయిన ఆ వరుడిని ఆపి – కన్యయొక్క

తండ్రికాని, సోదరుడుగాని - ''అలంకృతయైన నా పుత్రికను ద్విజుడవైన నీకు ఇచ్చి వివాహం చేస్తాను. అగ్ని సాక్షిగా ఆమెను స్వీకరించవలసినది. నా ఇంటికి రావలసినది'' అని కోరుతారు. వరుడు అందుకు అంగీకరించి గృహస్థాశ్రమ దీక్షను స్వీకరిస్తాడు.

అప్పుడు వరుడు - ఇద్దరు కాని, నలుగురు కాని, లేదా ఎనిమిది మంది యోగ్యులు, ప్రశస్తాచారం కలవారు, తనకు ఆప్తులైన వ్యక్తులను కన్యావరణానికి పంపుతాడు. అంటే - తన నిమిత్తం లక్షణవతియైన కన్యను ఎన్నిక చేసి నిర్ణయించమని కోరుతాడు.

''మదర్థం కన్యావరణం కారయిష్యే'' అని వరుడు పలుకుతాడు.

''మదర్థం కన్యాం వృణీధ్వం ఇతిప్రేషయతి'' అనగా నా నిమిత్తమై మీరు కన్యను నిశ్చయించవలసినది అని చెప్పి పెద్దలను పంపుతాడు వరుడు.

కన్యను ఎన్నిక చేయడానికి మృగశీర్షా నక్షత్రంలో పెద్దలను పంపినట్లయితే కార్యసిద్ధి కలుగుతుందని ఆపస్తంబ గృహ్యాసూత్రాలలో చెప్పబడింది.

వరుడు ఆ విధంగా పెద్దలను పూజించిపంపిన తర్వాత, ఆ పెద్దలు కన్యాదాత వద్దకు వెడతారు.

వరునికోసం లక్షణవతియైన కన్యను విచారించి నిశ్చయించడం వాళ్ళపని. అందువల్ల వాళ్ళు కన్యాదాత వద్దకు వెళ్ళి, వరుని గోత్రనామాలను, వంశాన్ని గురించి వివరించి చెప్పడం జరుగుతుంది. వరుని ముత్తాత, తాత, తండ్రి ఎవరైనదీ కన్యయొక్క పక్షాన నిలబడిన పెద్దలతో కూడి ఉన్నకన్యాదాతకు తెలియజేస్తారు. కన్య యొక్క ముత్తాత, తాత, తండ్రి ఎవరైనదీ తెలుసుకుని ''మీ కన్యను మాకుమ్రవానికి ధర్మసంతాన సంపదను పొందే నిమిత్తం ఎన్నుకొన్నాము. ఇవ్వవలసినది'' అని వరుని పక్షపు పెద్దలు కోరుతారు.

''తేన కన్యాదాతారం గత్వా బ్రువతే గోత్రనా మోచ్చారణం

... ఆర్షేయ ప్రవరాన్విత... గోత్రస్య... శర్మణోనప్త్రే,

... అర్షేయ ప్రవరాన్విత... గోత్రస్య.. శర్మణః పౌత్రాయ,

... ఆర్షేయ ప్రవరాన్విత.. గోత్రస్య... శర్మణః పుత్రాయ,

... అర్షేయ ప్రవరాన్విత... గోత్రాయ...శర్మణేవరాయ,

... ఆర్షేయ ప్రవరాన్విత...గోత్రస్య... శర్మణోనప్త్రీం,

... ఆర్షేయ ప్రవరాన్విత.. గోత్రస్య .. శర్మణః పౌత్రీం,

... ఆర్షేయ ప్రవరాన్విత... గోత్రస్య... శర్మణః పుత్రీం,

... ఆర్షేయ ప్రవరాన్విత ... గోత్రోద్భవాం... నామ్నీం కన్యాం

ధర్మప్రజా సంపత్యర్థం వృణీమహే''

అప్పుడు కన్యాదాత తన బంధువులైన పెద్దలతో కలిసి నిలబడి ఈ విధంగా చెబుతాడు.

''వృణీధ్వందాస్యామి'' అంటే ఎన్నుకొందురుగాక! ఇచ్చుచున్నాను''

ఈ విధంగా గోత్రప్రవరలు చెప్పి వరుని పక్షపుపెద్దలు మూడుసార్లు అడుగుతారు. వధువు పక్షంవారు సమ్మతించామనీ, కన్యను ఇస్తున్నామనీ మూడుసార్లు పలుకుతారు. అప్పుడు వరుని పక్షపు పెద్దలు ఈ విధంగా చెబుతారు.

'' కృతార్థావయం''- ''మేము కృతార్థులమైనాము''

అప్పుడు వరుని పక్షపు పెద్దలు మరలి వచ్చి వరునికి చెబుతారు. వరుడు ప్రాణాయామంచేసి, సంకల్పంచేసి, చివరకు-

'' శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం ధర్మప్రజా సంపత్యర్థం స్త్రియం ఉద్వహే '' అని పలుకుతాడు.

అంటే ''(శ్రీ పరమేశ్వర్మ ప్రీత్యర్థం ధర్మ సంతాన సంపద నిమిత్తం ఈమెను వివాహంచేసుకొంటున్నాను'' అని అర్థం.

అప్పుడు కన్యాదాత ప్రాణాయామం చేసి, సంకల్పంచేసి, చివరకు-

''సాలంకృత కన్యాదానం కరిష్యే'' అని పలుకుతాడు.

అంటే ''అలంకరించబడిన కన్యను దానంచేస్తాను'' అని అర్థం.

పైన చెప్పిన క్రియాకలాపమంతా - వివాహసంబంధ నిశ్చయానికి ముందుగా ప్రారంభంలో జరిగే సంప్రదింపుల కార్యక్రమం. దీనిలోని ప్రధానమైన ఉద్దేశం - వరుడు కోరగా అతడి నిమిత్తం పెద్దలు కన్యను ఎన్నిక చేయడం. అయితే - ప్రస్తుత కాలంలో ఈ కార్యక్రమాన్నివివాహకాండలో భాగంగానే జరిపిస్తూ ఉన్నారు.

21. వివాహోల్లో ఎదురుకోలు సమయంలో వరుని తరపువారికి వధువు తరపువారు పానకం బిందెలు ఇచ్చే ఆచారం ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. వివాహతతంగంలో పానకం బిందెల ప్రాముఖ్యం ఏమిటి?

స్నాతకుడైన బ్రహ్మచారి - సమావర్తన వ్రతాన్ని పూర్తి చేసుకొని వచ్చిన తర్వాత - అతని అభ్యర్థనపై అతని తరపున యోగ్యులైన వారు ఒక ఉత్తమ కన్యకను ఎన్నిక చేస్తారు. ఆమెకై కన్యాపితను అర్థిస్తారు. కన్యాపిత అంగీకరించిన తర్వాత, వరుడు, అతనికి పూజ్యులైన బ్రాహ్మణులు, సువాసినులు, జ్ఞాతులు, బంధువులతో కన్యాదాత గృహానికి వెడతారు. కన్యాదాత తనకుటుంబంతో, పూజ్యులతో , బంధువులతో కూడి మంగళవాద్య సహితంగా ఎదురువచ్చి, పుష్పమాలికాదులు, చందనాది పరిమళ ద్రవ్యాలు, పూజాయోగ్య వస్తువులతో, అనులేపనాదికాలతో వరపూజ చేస్తాడు.

''నమోస్త్వనంతాయ సహస్రమూర్తయే
సహస్రపాదాక్షి శిరోరుబాహవే!
సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే

సహస్రకోటీ యుగధారిణే నమః!

అని శ్రీమహావిష్ణు స్వరూపుడుగా వరుని సంభావించి పూజిస్తాడు.

నూతన వస్త్రాభరణాలను, సుగంధ ద్రవ్యాలను సమర్పించి వరునికి, అతని బంధుపరివారానికి మధురమైన, రుచ్యమైన పానీయాలను ఇచ్చి వారందరినీ గౌరవించి వివాహవేదిక వద్దకు ఆహ్వానిస్తాడు కన్యాదాత.

ఆ సందర్భంగా ఇచ్చేదే ఈ ఎదుర్కోలు లేదా ఎదురు సన్నాహమని వ్యవహరించే సన్నివేశంలో ఇచ్చే పానకం. ఈ సన్నివేశంలో వరునికి, అతనితో వచ్చిన బంధువులకు పానీయమిచ్చి గౌరవ స్వాగతం నెరవడమే ప్రధానం. అది మాత్రమే ఇక్కడ ఉద్దిష్టకార్యం. అంతేగాని బిందెలు ఇవ్వడం కాదు.

వచ్చినవారికి పానీయం ఇచ్చి గౌరవ పురస్సరంగా వారిని వివాహానికి దయచేయుమని ఆహ్వానించడం సంప్రదాయం. ఇచ్చిపుచ్చుకోవడాలు పెరిగిపోయిన నేటి వివాహాలలో బిందెలే ప్రముఖంగా కనబడుతున్నాయి. అక్కడ ఉద్దేశించిన సన్నివేశం కంటే.

బ్రాహ్మ, దైవ, ఆర్ష, ప్రాజపత్య వివాహాలలో (అష్టవిధ వివాహాలలోనివి) వరుని పూజించి - కన్యకను అలంకరించి దానం చేసే విధానానికి సంబంధించివరునికి, అతని బంధువులకు స్వాగతం చెప్పే సన్నివేశంలో ఇచ్చే పానీయమే ఈ పానకమిచ్చే ఆచారంగా వస్తున్నది.

22. ఆషాడంలో అత్తా-కోడళ్లు/ అత్త-అల్లుళ్లు ఒకే గడప దాటరాద నడానికి కారణం ఏమిటి? ఇది పెళ్లయిన మొదటి సంవత్సరంలోనే ఎందుకు? తర్వాతి సంవత్సరాలలో ఎందుకు లేదు?

ధర్మశాస్త్ర గ్రంథాలలో - దాంపత్య జీవితాన్ని ప్రారంభించిన ప్రథమ సంవత్సరంలో ఆషాఢంలో దంపతులు వేరుగా ఉండవలెనని మహర్షులు చెప్పారు. దాని వలన ఉత్తమ సంతానం కలుగుతుందని చెప్పారు. తొలి సంవత్సరపు ఆషాఢ మాసంలో గర్భం కలిగితే ఆ జన్మించే సంతానం వలన

ఆ జన్మ నిచ్చిన గృహయజమానికి మరణం కలుగుతుందని శాస్త్ర వచనం. ఇది ప్రత్యక్ష సంఘటనలలో ఋజువైంది కూడా.

ఆషాఢ మాసానికి సంబంధించిన ఈ నిషేధం మాత్రమే అధిక ప్రచారంలో ఉంది. కాని, అంతగా ప్రాచుర్యం పొందని మరొక నిబంధన కూడా ఉంది. తొలి సంవత్సరపు చైత్ర మాసంలో వధువు తప్పక భర్తతో కలిసియే ఉండాలని కూడా చెప్పబడింది.

కొత్త దంపతులు తొలి ఆషాఢంలో కలుసుకోరాదనే ఉద్దేశ్యంతోనే అత్తాకోడళ్ళు, అత్తా అల్లుళ్ళు ఒక గడప దాటరాన్నారు. తర్వాతి సంవత్సరాలలో ఈ నియమాన్ని ధర్మశాస్త్రం విధించలేదు. ఈ నిషేదం భార్యాభర్తలకే ఉద్దేశించినదికాని, అత్తాకోడళ్లకూ, అత్తా అల్లుళ్లకూ కాదు.

23. వరలక్ష్మీవ్రతం చేసుకున్నాక తోరబంధన మంత్రంలో 'దక్షిణ హస్తే' అని ఉంటుంది కదా. మరి దక్షిణ హస్తం అంటే ఎడమచేయిఅని అర్థం కదా. మరి తోరం కుడిచేతికి కట్టుకోవాలని అంటారు. మాకు ప్రతిసారీకన్‌ఫ్యూజన్‌గా ఉంటుంది. దయచేసి వివరించండి.

దక్షిణ హస్తమంటే ఎడమచేయికాదు. కుడిచేయి అనే దాని అర్థం వరలక్ష్మి వ్రతకల్పంలో చెప్పినది – తోరాన్ని కుడిచేతికి కట్టుకోవాలనే. దీనిలో కన్‌ఫ్యూజన్ ఏమిలేదు.

24. ఆర్షధర్మం అంటే?

ఋషుల చేత ఉపదేశింపబడిన ధర్మమే ఆర్షధర్మం.

25. శ్రీశంకర భగవానుని – నందీశ్వరుని శృంగముల మధ్యభాగం నుంచి దర్శనం చేయాలంటారు. ఎందుకు? ఆ విధంగా నందీశ్వరునితలమీద చేతివేళ్లుంచి, ఆ వేళ్లమధ్య నుంచి శివుని దర్శించడం చేస్తుంటాము. ఇలా ఎందుకు చేస్తాము? ఆలయాలలో లోపల ఉన్న శివునికెదురుగా బయట నందీశ్వరుడు ఉంటాడు కదా, ఎందుకని?

శివునికి ఎదురుగా నందీశ్వరుడు ఉండడానికి కారణం ఏమంటే- నందీశ్వరుడు శివుని అంతరంగికుడు. ఆప్తసేవకుడు. ఆత్మీయ పరిచారకుడు. అంతేగాక నందీశ్వరుడు శివుని వాహనం. అందుకే శివుని కెదురుగా, అనుక్షణమూ శివుని ఆజ్ఞానువర్తియై, ఆయనఆనతికోసం నిరీక్షిస్తూ కనిపెట్టుకొని ఉంటాడు.

అంతేకాక, రుద్రుడు లయకారకుడు. మూడవ నేత్రమందు అగ్నిని ధరించినవాడు. అటువంటి ముక్కంటి కంటికెదురుగా వెళ్లడం, తీక్షణమైన శివతేజస్సుకు ఎదురుగా నిలవడం, ఉచితంకాదు. అందునా అగ్నికీ విప్రునికీ, గురువుకూ శిష్యునికీ, భార్యకూ భర్తకూ, ఆత్మీయులకూ మధ్యనుంచి వెళ్లడం పనికిరాదు. భక్తునికీ అతని ఆరాధ్య దైవానికీ మధ్యనుంచిసైతం వెళ్లడం తప్పు. అదే ధర్మం ప్రకారం శివునికీ నందీశ్వరునికీ మధ్యనుంచి వెళ్లరాదని నిషేధించారు- మహర్షులు. శివునికి అత్యంత ప్రీతిపాత్రుడవా అంతరంగికుడవా ఆయన నందీశ్వరుని దర్శించి, సేవించి, ఆయన అనుమతితో శివుని అనుగ్రహాన్ని పొందవలసిందని ఆదేశించారు.

శ్లో. ''వృషస్య.. స్పృష్ట్వా శంకరస్యావలోకనమ్!
శృంగమధ్యే శివం దృష్ట్వా కైలాసం భవతి ధ్రువమ్॥''

భావం : నందీశ్వరుని యొక్క పృష్ఠభాగాన్ని స్పృశిస్తూ శంకరుని దర్శించడం విధివిహితం. నందీశ్వరుని కొమ్ములమధ్య నుంచి శివుని చూచినవారికి నిశ్చయంగా కైలాసప్రాప్తి కలుగుతుంది అని చెప్పబడింది. అందువల్లనే-

శ్లో. 'నందీశ్వర నమస్తుభ్యం సాంబానంద ప్రదాయక!
(సాంద్రానంద ప్రదాయక' - అని పాఠాంతరం)
మహాదేవస్యసేవార్థం అనుజ్ఞాందాతుమర్హసి!

భావం: సాంబశివునికి ఆనందప్రదుడవైన లేదా అమితమైన అపారమైన ఆనందాన్ని ప్రసాదించేవాడవైన ఓ నందీశ్వరా! నీకు నమస్కారం. మహాదేవుని సేవించడానికై నాకు అనుజ్ఞను ప్రసాదించు అని నందీశ్వరుని ప్రార్థించి, ఆయన పాదాలకు మొక్కిన అనంతరమే పార్వతీ పరమేశ్వరులను సేవించవలసి ఉంది. ఇది శాస్త్ర సమ్మతం. విధి విహితం.

రాశి చక్రంలోని మిథునరాశి – గౌరీశంకర స్వరూపం. వృషభరాశి నందీశ్వరునికి ప్రతీక. రాశిచక్రం ఉదయించే సమయంలో వృషభరాశి – మిథునరాశికి కిందుగాను, అస్తమించే సమయంలో మిథునరాశి – వృషభరాశికి కిందుగాను ఉంటాయి. ఆ కారణం వల్లనే శివుడు వృషభ వాహనుడూ, వృషభధ్వజుడూ అయ్యాడు. నందీశ్వరుని కొమ్ముల మీది నుంచి శివదర్శనం చేయడంలోని అంతరార్థమదే. మిథున రాశిలోని ఆర్ద్రానక్షత్రం రుద్రునికి సంకేతం.

26. ఇంద్రుడు, దేవేంద్రుడు, మహేంద్రుడు, వీరు వేరు వేరు వ్యక్తులా, లేక ఒకరేనా? దేవేంద్రుని భార్య పేరేమిటో తెలియచేయగలరు.

ఇంద్రుడన్నా, దేవేంద్రుడు, మహేంద్రుడూ అన్నా ఒకరే. వేరు కాదు. ఇంద్రుని భార్యపేరు శచీదేవి.

27. బ్రహ్మరథం అంటే ఏమిటి? ఈ పదాన్ని ఏ సందర్భంలో వాడుతారు?

బ్రహ్మరథం ప్రస్తావన నహుషుని చరిత్రలో ఉన్నది. ఒకప్పుడు బృహస్పతిని ఇంద్రుడు అలక్ష్యం చేయగా, అతడు ఇంద్రునిపై ఆగ్రహించి వెళ్లిపోయాడు. అనంతరం ఇంద్రుడు మరొక పురోహితుని ఏర్పరచుకున్నాడు. ఆపురోహితుడైన విశ్వరూపుడు, రాక్షసులతో తనకుగలబాంధవ్యం కారణంగా వారికి హవిర్భాగాలు ఇవ్వడంతో, ఇంద్రుడు అతనిని సంహరించాడు. ఇంద్రునిపై బ్రహ్మహత్యాపాతకం ఆవహించింది. దోషదూషితుడైన ఇంద్రుడు స్వర్గాన్ని విడిచి వెళ్లిపోయాడు.

అప్పుడు దేవతలు తాత్కాలికంగా నహుషుని ఇంద్రునిగా చేశారు. ఇంద్రపదవిని పొందగానే నహుషుడు శచీదేవిని కోరాడు. శచీదేవి ఆపదను తప్పించుకొనడానికి, నహుషుని 'బ్రహ్మరథం'పై అధిష్ఠించి రమ్మని కోరింది.

అందుకు నహుషుడు అంగీకరించి,అగస్త్యాది మహర్షులచేత తన పల్లకీని మోయించుకొంటూ బయలుదేరాడు. ఆ మహర్షులు అందరిలో పొట్టివాడైన అగస్త్యుని వల్ల పల్లకీ ఒకవైపు క్రుంగిపోతున్నది. ఆ ఎగుడు దిగుడులను సరిచేసుకొంటూ మహర్షులు నడుస్తూన్నందువల్ల నడక ఆలస్యం అవుతున్నది.

ఆ బ్రహ్మరథంలో కూర్చున్న నహుషునికి ఈ ఆలస్యం దుర్భరంగా ఉన్నది.త్వరగా శచీదేవిని చేరాలనే ఆత్రంతో అతడు ''సర్ప, సర్ప'' అని అదలిస్తూ అగస్త్యుని కాలితో తన్నాడు. వెంటనే అగస్త్యుడు ''సర్పోభవ!'' అన్నాడు. తక్షణం నహుషుడు పెద్ద కొండచిలువగా మారి భూలోకంలో పడ్డాడు.అతని అహంకారం అణగారింది. ధర్మరాజు తన అరణ్యవాస సమయంలో ఆ మహా సర్పరూపుడైన నహుషుని కలుసుకొనడం, నహుషునికి యధారూపం సిద్ధించడం జరిగాయి. బ్రహ్మరధమంటే బ్రహ్మవంశీయులచేత, లేదా బ్రహ్మవేత్తలచేత మోయబడిన వాహనాన్ని అధిరోహించడం, అతీవ సత్కారానికి చిహ్నంగా ఈ పదాన్ని వాడతారు.

28. 'ఘంటాకర్ణునికి అష్టాక్షరి ఉపదేశించబోయినట్లు' అనే సామెతకు అర్థం ఏమిటి?

ఘంటాకర్ణుడు విష్ణుద్వేషియైన ఒక రాక్షసుడు. అతడు తనకు గల మితిమీరిన హరిద్వేషం కారణంగా,తన చెవులలో పొరబాటున కూడా హరి నామం పడరాదని, చెవులకు పెద్ద గంటలను వ్రేలాడదీసుకొన్నాడట. ఆ కారణంగానే అతడు ఘంటాకర్ణుడైనాడు. ఘంటాకర్ణుని యొక్క ఈ చర్య, అభేదాధ్యవసాయులైన శివకేశవుల మధ్య భేదభావాన్ని కల్పించుకొన్న అతడి యొక్క పరమ మౌర్ఖ్యానికి పరాకాష్ఠ.

''శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే
శివస్య హృదయం విష్ణు ర్విష్ణోశ్చ హృదయం శివః!'

అనిన్నీ, శివకేశవుల మధ్య భేదం చూచినవారు నరకానికి పోతారనిన్నీనిర్ద్వంద్వంగా చెప్పబడింది.

అట్టియెడ, శివభక్తుడై విష్ణునామాన్ని వినడాన్ని సహితం సహించలేని ఘంటాకర్ణుని కరుడుకట్టిన మూర్ఖత్వానికి మితి కలదా?

అట్టి మూర్ఖునికి - విష్ణు పారమ్యం కలిగిన అష్టాక్షరీ మహా మంత్రాన్ని ఉపదేశించడం ఎంత అవివేకమైన పని కాగలదో ఊహించవచ్చు.

మూర్ఖులకు, వివేక హీనులకు - వారికి సరిపడని హితోక్తులను ఉపదేశించబూనిన పట్టులలో ఉదాహరణ ప్రాయంగా వాడబడే నానుడి - 'ఘంటాకర్ణునికి అష్టాక్షరి ఉపదేశించినట్లు' అనే ఈ పలుకుబడి వాడు కలోకి వచ్చింది.

29. దశరథుని వంశానికి సంబంధించినవారు, మహాభారతంలో కౌరవ పాండవుల వంశానికి సంబంధించిన వారు - నేటికీ సమాజంలో వున్నారా?

ఇక్ష్వాకు వంశానికి చెందిన మరుత్తు (శ్రీరామునికి పూర్వుడు), కురు వంశానికి చెందిన దేవాపి (కౌరవ పాండవులకు పూర్వుడు) - వీరిద్దరూ శంబళ గ్రామంలో నేటికీ తపస్సు చేస్తూ ఉన్నారని పురాణ వచనం. కలియుగాంతంలో శ్రీమహావిష్ణువు కల్కిగా అవతరించి, అధర్మ పరులను సంహరించి తిరిగి ధర్మసంస్థాపనం చేసి దేవాపి, మరుత్తులచేత రాజ్యాలను ఏలిస్తాడని కూడా చెప్పబడింది.

30. ఐదవ మొగలాయి చక్రవర్తి ఎవరు ? అతని తండ్రి, తాతల పేర్లు ఏమిటి?

ఐదవ మొగలాయి చక్రవర్తి షాజహాన్. అతని తండ్రి జహంగీర్. తాత పేరు అక్బర్.

31. యుద్ధంలో మరణించినవారికి వీరస్వర్గం లభిస్తుందని అంటారు. అలా వీర స్వర్గాన్నిపొందినవారు పురాణాలలో ఎవరైనా ఉన్నారా?

దీనికి తార్కాణంగా ఒక వృత్తాంతం ఉంది. పూర్వం అంబరీషుడనే రాజు మరణించి ఇంద్రలోకానికి చేరుకున్నాడు. అక్కడ అంబరీషుని సేనానియైన సుదేవుడనే వాడు దివ్యవిమానంలో ఉండడాన్ని అంబరీషుడు చూచాడు.

అప్పుడు అంబరీషుడు –''ఇతడు నా సేనాని. నేను ఎన్నో యజ్ఞయాగాలు చేసి స్వర్గానికి వచ్చాను. ఈ సుదేవుడు ఒక్కయాగం కూడా చేయనే లేదు. అటువంటి పరిస్థితిలో ఈ సుదేవుడు ఏ విధంగా స్వర్గానికి రాగలిగాడు ?'' అని ప్రశ్నించాడు.

అప్పుడు ఇంద్రుడు అంబరీషునికి ఇలా చెప్పాడు.

''ఓ అంబరీష రాజేంద్రా! పూర్వం ఒకప్పుడు దముడు, సదముడు, విదముడు – అనే రాక్షసులు నీ రాజ్యంపైకి దండెత్తి వచ్చారు. అప్పుడు నీవు ఈ సుదేవుని పిలిచి ఆ రాక్షసులను వధించి రమ్మన్నావు. ఆ రాక్షసులను వధించేటంత శక్తి తనకు లేదని గ్రహించిన సుదేవుడు శివుని ప్రార్థించాడు. శివుని కటాక్షం చేత సుదేవుడు శస్త్రాలను పొంది ఆ రాక్షసులను సంహరించాడు. నీవు చేసిన యజ్ఞాలతో తుల్యమైన ఫలం కలిగినదే ఈ సుదేవుడు చేసిన రణయజ్ఞం. అందుకే యుద్ధంలో మరణించిన సుదేవుడు స్వర్గాన్ని చేరుకోగలిగాడు'' అని అంబరీషునికి ఈ విధంగా ఇంద్రుడు చెప్పాడు.

32. మన పురాణాల ప్రకారం భూలోకంలో ఎన్ని ద్వీపాలున్నాయి. వాటి పేర్లు వివరించండి.

పురాణాల ప్రకారం భూమండలం అనేక ద్వీపాలుగా ఏర్పడి వుంది. ఆద్వీపాల పేర్లు ఇవి.

1. రమ్యక ద్వీపం, 2. రమణక ద్వీపం, 3. ద్వారకాద్వీపం, 4. సింహళద్వీపం,5. కైవల్య ద్వీపం, 6. మలయద్వీపం, 7. అశ్వభద్ర ద్వీపం, 8. కేతు ద్వీపం, 9. మాల్యవంత ద్వీపం, 10. పుష్కర ద్వీపం, 11. ఋషభద్వీపం, 12. రైవతద్వీపం, 13. నిమోచన ద్వీపం, 14. నియామ్యద్వీపం, 15. పారావార ద్వీపం, 16. చౌరకృత ద్వీపం, 17. మాల్యద్వీపం, 18. జంబూద్వీపం, 19. ప్లక్షద్వీపం, 20. కుశ ద్వీపం, 21.శాల్మలీద్వీపం.

33. మారీచుడి తల్లి ఎవరు? సైంధవుడు దుర్యోధనుడికి ఏమవుతాడు? కర్ణాటక రాష్ట్రం పూర్వ నామమేమిటి?

మారీచునితల్లి తాటకి. దుర్యోధుని చెల్లెలైన దుస్సల భర్త సైంధవుడు. కర్ణాటక రాష్ట్రానికి ఇంతకుముందు 'మైసూరు' అనే పేరు ఉండేది.

34. పార్వతి నలుపు అనీ, శివుడు తెలుపు అనీ అంటారుకదా,నేడు చిత్రపటాల్లో ఈశ్వరుని నల్లగానూ, పార్వతిని తెల్లగానూచిత్రిస్తున్నారు. ఏది యథార్థం?

పార్వతీదేవి ఆదిశక్తి. జగత్కారిణి. అన్ని వర్ణాలూ ఆమెవే. ఆమె గౌరిగా పసుపు పచ్చనిది. కాళిగా నల్లనిది. లలితగా, దుర్గగా అరుణ వర్ణాన్విత. లలితా సహస్రనామాలలోని 'విద్రుమాభాయైనమః' 'బంధూకకుసుమ ప్రభాయై నమః' - అనే వర్ణనలు అరుణవర్ణ శోభితయైన దేవి స్వరూపాన్ని తెలియజేస్తున్నాయి. ఆ విధంగానే 'లసన్మరకత స్వచ్ఛ విగ్రహాయే నమో నమః' - అని అమ్మవారిని మరకత (పచ్చ) వర్ణ స్వరూపిణిగానూ వర్ణించారు. కాళిదాసకృత శ్యామలా దండకంలో దేవిని 'సర్వవర్ణాత్మికే' అని సంబోధించడం జరిగింది. త్రిమాతలలో సత్త్వగుణ స్వరూపిణియైన సరస్వతి తెల్లనిదిగాను, రజోగుణరూపిణియైన లక్ష్మి ఎర్రనిరంగు కలదిగాను,తమోగుణాత్మికయైన పార్వతి నల్లనిదిగాను చెప్పబడింది. తొలుత

నల్లగా ఉన్న పార్వతి, తపస్సుచేసి గౌరవర్ణాన్ని పొందిన ఉదంతం దేవీభాగవత గాథలలో ఉన్నది.

పై ఆధారాలను బట్టి పార్వతిని ఏ వర్ణంలోచిత్రించినా అది సమంజసమే అవుతుంది – ఆమె సర్వవర్ణాత్మిక కాబట్టి.

త్రిమూర్తులలో సత్త్వగుణాకారుడైన శ్రీమన్నారాయణుడు సృష్ట్యాదియందు ధవళవర్ణంతో ఉన్నాడని భాగవతం తెలుపుతుంది. రజోగుణరూపియైన బ్రహ్మ ఎరుపు రంగులోను,తమోగుణుడైన రుద్రుడు నల్లగాను ఉన్నట్లు చెప్పబడింది. శ్రీమన్నారాయణుడు కల్పాంతరంలో ఆకుపచ్చరంగును, అనంతరం నీలమేఘచ్ఛాయను,పొందిన గాథ భాగవతంలో ఉన్నది.సదాశివుడు జ్ఞాన స్వరూపుడు, జ్ఞానానికీ, తన్మూలకమైన సత్త్వగుణానికి ప్రతీక తెలుపురంగు ఆవిధంగా శివుడు తెల్లని వాడు. సమస్త సృష్టికీ లయకారకునిగా, తమోగుణ రూపునిగా రుద్రుడు నల్లనివాడు. తెలుపురంగు సత్త్వగుణానికి, ఎరుపు రంగు రజోగుణానికి, నలుపురంగు తమోగుణానికి ప్రతీకలు. ఆ విధంగానే శాంత స్వభావం,జ్ఞానం, తేజస్సు,మొదలైన ఉత్తమగుణాలకు తెలుపురంగు ప్రతీక, అహంకారానికి, రాగభావానికి,ఎరుపురంగు, అజ్ఞానానికీ, అవివేకానికి దుఃఖానికి నలుపు రంగు చిహ్నాలు.

ఆ యా గుణాలకు, సందర్భాలకు అనుగుణంగాను, భక్తులుతాము భావించే విషయాలకు,వాంఛితార్థాలకు అనుగుణంగాను దేవతలకుఅయా వర్ణస్వరూపాదులను అపాదించడం జరుగుతుంది. సృష్టికారకుడు బ్రహ్మ – ఎఱ్ఱనివాడు. రజోగుణస్వరూపుడు,స్థితి కారకుడు విష్ణువు. వృద్ధికి సంకేతం తెలుపు.లయకారకుడు రుద్రుడు.నలుపు వినాశానికి గుర్తు. ఇవన్నీ ప్రతీకాత్మకాలుగా గ్రహించాలి.

35. మునులు తాము శపించిన వారి మీద తమ కమండలంలోని నీరెందుకు చల్లుతారు ?

జలం సర్వప్రపంచానికీ ఆధారం జలం నుండి సర్వలోకమూ, సమస్త భూతజాలమూ జన్మించాయి. విశ్వమంతా జలంలో నుండి పుట్టి చివరకు జలంలోనే లయిస్తుంది. కాబట్టి జలం సర్వ విశ్వాత్మకం.

లోకంలో మంత్రశక్తిని తమయందు నిలుపుకోగల వస్తువులు మూడే ఉన్నాయి.

అవి 1. జలం, 2. విభూతి, 3. రుద్రాక్ష.

జలకలశంలో ఏ దేవతామూర్తినైనా ఆవాహనచేసి పూజింపవచ్చును. జలం సర్వదేవతాత్మకం. ఏ సంకల్పాన్నైనా, జలాన్ని స్పృశించి చేయడం విధి విహితం.

అందుకే శాపవాక్కులతో జలాన్ని అభిమంత్రించి ప్రయోగించితే- ఆశాపాన్ని ఇచ్చిన వాని శక్తి ఆ జలంలో నిక్షిప్తమై పనిచేస్తుంది. అయితే అమోఘ వచస్కులైన తపోధనులకు మాటే మంత్రం . వారి అనుగ్రహమే వరం. దీవెనే వరప్రదానం. ఆగ్రహరూపమైన నిందావాక్యమే శాపమూ అవుతాయి. ఒక్కొక్కసారి అట్టి సిద్ధవాక్ సంపన్నులైన మహాపురుషుల నోట అప్రయత్నంగా జారిన పలుకులు కూడా వరాలూ, శాపాలూ అయిన సంఘటనలు అసంఖ్యాకంగా ఉన్నాయి. అందువల్ల శాపాన్ని ఉద్దేశించకపోయినా అప్రయత్న వాక్పతితాలైన శబ్దాలూ శాపంగా పరిణమించినవి ఉన్నాయి.

" మానిషాద ప్రతిష్ఠాం త్వ మగమశ్శా శ్వతీ స్సమా!
యత్క్రౌంచ మిధునా దేక మవధీః కామ మోహితమ్" వంటివి.

కాబట్టి శాపాన్ని ఉద్దేశించి జలాన్ని విడిచిపెట్టకపోయినా అమోఘవచస్కుని వాక్కు శాపంగా రూపొందవచ్చును. యక్షప్రశ్నలలో ధర్మరాజు చెప్పినట్లు - వాక్కు కూడా అవసరంలేదు. కేవలం నిష్కారణంగా

క్షోభించబడిన ధర్మాత్ముని హృదయం - త్రుటిలో ముల్లోకాలను భస్మం చేయగలదు.

36. యుగాలెన్ని ? అవి ఏవి? ఒక్కొక్క యుగానికి ఎన్నెన్ని సంవత్సరాలు? తెలపండి.

యుగాలు నాలుగు. అవి - కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం. వాటిలో కృతయుగం - **17** లక్షల **20**వేల సంవత్సరాలు. త్రేతాయుగం - **12** లక్షల **96** వేల సంవత్సరాలు. ద్వాపరయుగం - **8** లక్షల **64** వేల సంవత్సరాలు. కలియుగం **4** లక్షల **32** వేల సంవత్సరాలు.

37. వివిధ దేవతలను పూజిస్తాము. ఆ పూజల్లో భక్తిస్థాయి ఒకేలా ఉండదు కదా? ఆ కారణంగా దేవతల్లో కూడా అలక, ఈర్ష్య - ఉంటాయా?

దేవతలు తేజోరూపులు. పిశాచాలు ఛాయారూపులు. ఒక దేవతను పూజించడమంటే - ఆయా ప్రత్యేక నామరూపాలతో ఆ దేవతా సంబంధమైన తేజస్సును ఆవాహనచేసి అర్చించడమూ, ఆ దేవతాశక్తిని ఉపాసించడమే. ఒక్కొక్క కోరిక సిద్ధించే నిమిత్తం ఒక్కొక్క దైవాన్ని నిర్దిష్టమైన అలంకారాలు, ఆయుధాలతో సహా పూజించాలి. ఇది ఉపాసనావిధానంలోని రహస్యం. ఆ కారణం చేతనే ఇంతమంది దేవతలు. అంతేగాక జాతక లక్షణాన్ని బట్టి ఒక్కొక్క వ్యక్తి ఒక్కొక్క దేవతను పూజించాలి. అంత మాత్రం చేత దేవతలలో అలక, ఈర్ష్య ఉండడం జరగదు.

38. ఆరు సంవత్సరాల క్రితం మా తల్లిగారు పరమపదించారు. మా అన్నగారు వారి గ్రామంలో ఆబ్దీకం నిర్వహిస్తారు. నేను, నా భార్య, పిల్లలు ప్రతి ఏటా అక్కడకు వెళ్లటం ఇబ్బందిగా ఉంటున్నది. నేను కూడా ఇక్కడ ప్రత్యేకంగా మా తల్లిగారి ఆబ్దీకం పెట్టుకోవచ్చునా? చిన్నవాడికి అర్హత లేదంటున్నారు. కొందరు. తగిన సలహా ఇవ్వండి.

మీ నివాసంలో మీ తల్లిగారి ఆబ్దీకం ప్రత్యేకంగా పెట్టుకోవచ్చును. మీరుండేది స్వంత ఇల్లు అయినా అద్దె ఇల్లు అయినా కూడా మీరు ఆ కార్యక్రమం నిర్వహించుకోవచ్చును. ఇందుకు సందేహం లేదు. ఇది ధర్మశాస్త్ర విహితమే.

39. భగవంతునికి పూజ చేసే విధానాన్ని తెలియజేయండి. ఏ దేవతలకైనా సరే పూజ ఏ విధంగా చేయాలి? దేవుడికి కుంకుమ ఏ వేళ్ళతో పెట్టాలి? పువ్వులు ఎప్పుడు పెట్టాలి? దీపం ఎప్పుడు వెలిగించాలి? హారతి ఎప్పుడు ఇవ్వాలి? పూజ చేసేటప్పుడు క్రింద నేలమీద కూర్చోవద్దంటారు. చాపమీద కాని పీటమీద కాని కూర్చోమంటారు. ఎందుచేత?

ఏ దేవతలకైనా చేయవలసిన నిత్య పూజా విధానం ఇది : ముందుగా దీపం వెలిగించి ఉంచాలి. ధ్యానం, ఆవాహనం, ఆసన సమర్పణం, అర్ఘ్యం, పాద్యం, పంచామృత స్నానం, శుద్ధోదకస్నానం, స్నానానంతరం ఆచమనీయం, వస్త్రం, యజ్ఞోపవీతం, ఆభరణ సమర్పణం, శ్రీ చందనం, అక్షతలు, పుష్ప సమర్పణం, అష్టోత్తర శతనామార్చన, దీపదర్శనం, ధూపసమర్పణం, నైవేద్యం తాంబూల సమర్పణం, నీరాజనం, మంత్రపుష్పం, ప్రదక్షిణం, సాష్టాంగ నమస్కారం, ఛత్రధారణం, చామరవీజనం, నృత్యదర్శనం, గీతశ్రవణం, అశ్వారోహణం, గజారోహణం, ఆందోళికారోహణం, అపరాధ నమస్కారం, ఉద్వాసన, సర్వపూజాఫలాన్ని భగవదర్పితం చేయడం. ఈక్రమంలో పైన చెప్పిన ఉపచారాలన్నిటితో నిత్యపూజ నిర్వర్తించాలి.

పైన పేర్కొన్న ప్రతి ఉపచారానికి నిర్దిష్టమైన మంత్రం ఉంటుంది. ఆయా మంత్రాలతో ఆయా ఉపచారాలను సమర్పించాలి. పైన చెప్పిన ఉపఛారాలలో కొన్నిటికి ప్రత్యామ్నాయ పూజ చేయవచ్చును. ఉదాహరణగా వస్త్రాలను సమర్పించవలసి వచ్చినపుడు : ఛత్రధారణం, చామరవీజనం, అశ్వారోహణం, గజారోహణం, ఆందోళికారోహణం, నృత్యదర్శనం ఇటువంటి వాటికి ప్రత్యామ్నాయంగా అక్షతలను సమర్పించవచ్చును.

పైన చెప్పినది నిత్య పూజా విధానానికి సంబంధించి మాత్రమే. ప్రత్యేకమైన వ్రతాలను నిర్వర్తించవలసి వచ్చినపుడు ఆయా వ్రతకల్పాలలో చెప్పిన విధంగా వ్రతాన్ని నిర్వర్తించాలి. ఉదాహరణకు వరలక్ష్మీవ్రతం, మంగళగౌరీ వ్రతం, సిద్ధివినాయక వ్రతం, అనంతపద్మ నాభవ్రతం – ఇత్యాది వ్రతాలను చేసే సమయంలో ఆ వ్రతానికి సంబంధించిన కల్పంలో చెప్పబడిన విధానంగా ఆ వ్రతాలను ఆచరించాలి. పూజకాని, జపం కాని చేసే సమయంలో నేలమీద కూర్చోరాదు. పీటమీద కాని దర్భాసనం మీద కాని కూర్చోవాలి. కుంకుమను ఉంగరం వేలితో పెట్టాలి.

40. పూజా సమయంలో ఆడవారు దేవునికి అన్నం నైవేద్యం పెట్టకూడదా? ఎందువల్ల?

స్త్రీలైనా, పురుషులైనా, ఎవప్పటికీ పూజా సమయంలో అన్నాన్ని దేవునికి నైవేద్యంగా పెట్టవచ్చును. అందుకు ఎలాంటి అభ్యంతరాలు ఉండవు.

41. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మా ఆవిడ ఇంట్లో నువ్వుల నూనెతో దీపాలు వెలిగించి పూజ చేస్తుంది. అలా నువ్వుల నూనెతో ప్రతిరోజు దీపాలు వెలగించవచ్చునా? లేక శనివారం మాత్రమే శని దేవునికి నువ్వుల నూనెతో దీపం వెలిగించాలా?

నువ్వులనూనెతో భగవంతుని సమక్షంలో దీపాలు వెలిగించడం ప్రశస్తమైన విషయమే. ఆ విధంగా ప్రతిరోజూ చెయ్యవచ్చును. దానిలో సందేహం ఏమీలేదు. ఆవునెయ్యి కొబ్బరినూనె, నువ్వులనూనె, ఆముదంతో కాని దేవతార్చనా విధిలో దీపాలు వెలిగించవచ్చును.

42. ఉదయం లేవగానే ముఖం కడుక్కొని పని అయ్యేంత వరకు గణేశస్తుతి, శివస్తుతి మొదలైన భక్తి కేసెట్లు వినవచ్చునా? ఎంతో మంది స్త్రీలకు ఉదయం లేవగానే స్నానం, పూజ కుదరదు. అటువంటి వారు కేసెట్లు వింటూ పనిచేసు కోవచ్చునా ? ప్రతిరోజూ స్తోత్రములు, భక్తి పుస్తకములు చదవాలంటే ప్రతిరోజూ తల స్నానం తప్పనిసరా?

ప్రాతఃకాలంలో స్నానం చేయకపూర్వం కూడా దైవస్తోత్రాల కేసెట్స్ వింటూ పనిచేసుకోవచ్చును. కానీ వాటిని స్నానం చేశాక విన్నట్లయితే మరింత ప్రశస్తం. ప్రతిరోజూ శిరఃస్నానం చేయకపోయిన కంఠస్నానం చేసి భవగత్ స్తోత్రాలు, భక్తి పుస్తకాలూ చదువుకోవచ్చును. ఏదైనా అశుచి కలిగితే మాత్రం శిరఃస్నానం చేయాలి. ఎంగిలి, అంటు బహిష్ఠ, జాతాశౌచం, మృతాశౌచం వీటిని కలుపుకోకూడదు. వీటిని కలుపుకుంటే ఎన్నో అనర్ధాలు కలుగతాయని గ్రహించాలి.

43. బృహస్పతి అంగిరసుని పుత్రుడని ఒక చోట చదివాము. బృహస్పతి కాక అంగిరసునికి ఇంకా ఎంతమంది సంతానం ఉన్నారు? అంగిరసుని భార్య పేరు, వారి సంతానం పేరు తెలుపగోరుతున్నాము.

అంగిరసుని భార్య పేరు శివ. ఆమెకేశ్రద్ధ అనే మరొక పేరు కూడా వుంది.

అంగిరసుని కుమారుల పేర్లు : బృహత్కీర్తి, బృహజ్యోతి, బృహద్బ్రహ్మ, బృహన్మనసుడు, బృహస్పతి, సంవర్తనుడు, ఉతధ్యుడు, అంగిరసుడు, బృహన్మంతుడు, బృహద్భానుడు.

అంగిరసుని పుత్రికలపేర్లు : భానుమతి, రాక, సినీవాలి, కుహువు, అర్చిష్మతి, మహిష్మతి, మహామతి, యోగసిద్ధి.

44. అగ్నిపీఠశక్తుల పేర్లు అనీ, అగ్నిహోత్రుని జిహ్వల పేర్లు అనీ ఈమధ్య ఒక పుస్తకంలో చదివాను. వాటి పేర్లు విశదంగా చెప్పండి.

అగ్నిపీఠ శక్తులు తొమ్మిది.వాటికి పీతా, శ్వేతా, అరుణా, కృష్ణా, ధూమ్రా, తీవ్రా, స్ఫులింగినీ, రుచిరా, జ్వాలినీ శక్తులనిపేర్లు.

అగ్నిహోత్రుని జిహ్వలు – అనగా నాలుకలు ఏడు. వాటికి – కరాళి, ధూమిని, శ్వేత, లోహిత, నీలలోహిత,సువర్ణ, పద్మరాగ అని పేర్లు.

45. కుబేరుని తండ్రి పేరేమిటి ? కుబేరునికి భార్యాబిడ్డలు ఉన్నారా? తెలియజేయండి.

కుబేరుని తండ్రి పేరు విశ్రవసుడు. కుబేరుని భార్య పేరు చిత్రరేఖాదేవి. కుబేరుని కుమారుల పేర్లు నలకూబరుడు, మణిగ్రీవుడు.

46. అష్టకష్టములు అంటారు. అవి ఏమిటో వివరించగలరు.

1. భార్యలేకపోవడం, 2. పరుల వద్ద దాస్యవృత్తి చేయవలసిరావడం, 3. దారిద్ర్యంతో బాధపడవలసి రావడం, 4. భుక్తికి కూడా లోటు ఏర్పడి స్వయంకృషితో ఆహార సంపాదనం చేయాల్సి రావడం, 5. ఇతరులవద్ద యాచన చేయడం, 6. తనను యాచించినవారికి లేదనవలసి రావడం, 7. ఋణగ్రస్తుడు కావడం, 8. ప్రయాణంచేయడం.

ఈపైన చెప్పినవి అష్టకష్టాలు. అంటే ఎనిమిది విధాలైన కష్టాలు. వీటిలో ప్రయాణాన్ని కూడా ఎందుకు చేర్చారంటే ఏ వ్యక్తికైనా స్వగృహంలో ఉండే సౌఖ్యం పరాయిచోటున ఉండదు. స్వస్థానాన్నీ, స్వగృహాన్నీ విడిచి ఇతర ప్రదేశానికి వెళ్లినట్లయితే అక్కడ వసతి, భోజనాదులకు సమస్య కలుగుతుంది. నా అన్నవారు లేని దూరదేశంలో జబ్బు పడితే కనిపెట్టుకుని చూసేవారు ఉండరు. పైగా పూర్వకాలంలో రహదారులు సక్రమంగా ఉండక, అడవులు ఎక్కువగా ఉండేవి. ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి వెళ్లాలంటే అడవి మార్గాల వెంబడి వెళ్లవలసి ఉండేది. ఆ అడవిదారుల్లో క్రూరమృగాల భయం, దారి దొంగల భయం ఎక్కువగా ఉండేవి. ప్రయాణ సాధనాలు- రథాలు, ఎద్దుల బళ్ళు, పల్లకీలు, మేనాలు, పడవలు ఇలా పరిమితంగా ఉండేవి. ఈ కాలంలో ఉన్నన్ని ప్రయాణ సాధనాలు పూర్వం లేవు. సామాన్యులు చాలా వరకూ నడిచే వెళ్లవలసి వచ్చేది. పైగా పూర్వం దగ్గర ఊళ్ళలోని సంబంధాలే చేసుకునేవారు. అందువల్ల బంధువులంతా దగ్గర ఊళ్లలోనే ఉండేవారు. స్వస్థానాన్ని విడిచి వెళ్లడం అవయోగంగా భావించేవారు.

47. అష్ట యాత్రాస్థలాలు, అష్ట గంగలు అని విన్నాం. అవి ఏమిటి?

అష్ట యాత్రాస్థలాలు 1. హరిద్వారం, 2. ద్వారక, 3. మధుర 4. బృందావనం, 5. గోకులం, 6. జగన్నాథ క్షేత్రం (పూరి), 7. తిరుపతి, 8. ఉడిపి.

అష్టవిధ గంగలు ఇవి : 1. భాగీరథి, 2. యమున, 3. గోదావరి, 4. కృష్ణవేణి, 5. సరస్వతి, 6. నర్మద, 7. సింధు, 8. కావేరి.

పాఠాంతరం : 1. భాగీరథి, 2. అలక, 3. ధవళి, 4. మందాకిని, 5. కాళి, 6. జాహ్నవి, 7. నందాకిని, 8. పిండారి.

48. అష్ట మదములని అంటారు. మానవులకు అష్టమదములు అంటాయంటారు. అవి ఏమిటో తెలుపగలరు.

1. అన్నమదము, 2. అర్థమదము, 3. స్త్రీ మదము, 4. విద్యామదము, 5. కులమదము, 6. రూపమదము, 7. ఉద్యోగమదము, 8. యవ్వన మదము. ఇవి మానవులకుండే 8 విధాలైన మదములు. వీటికే అష్టమదములని పేరు.

49. బ్రహ్మను చతుర్ముఖుడు అంటారు కదా ? మరి మనకు మూడు ముఖాలతోనే బ్రహ్మ చిత్రాలు కనిపిస్తూ ఉంటాయి. మిగిలిన ముఖం ఏమైనట్లు?

బ్రహ్మ నాలుగు ముఖాలూ నాలుగు దిక్కులకూ ఫేస్ చేసి వుంటాయి. అందువల్ల ఒక ముఖం వెనక వైపునకు ఉంటుంది. ఆ కారణంగా ఆ ముఖం చిత్రంలో కనిపించదు. రావణాసురుని ముఖాలవలే బ్రహ్మ ముఖాలు వరుసగా ఉండవు. అంటే - రావణాసురుని వలె బ్రహ్మ పంక్తిముఖుడు కాడు.

50. యుగాలెన్ని? అవి ఏవి? ఒక్కొక్క యుగానికి ఎన్నెన్ని సంవత్సరాలు తెలపండి.

యుగాలు నాలుగు. అవి - కృత యుగం , త్రేతయుగం, ద్వాపరయుగం, కలియుగుం. వాటిలో కృతయుగం-17 లక్షల 20వేల సంవత్సరాలు. త్రేతాయుగం-12 లక్షల 96వేల సంవత్సరాలు. ద్వాపరయుగం - 8 లక్షల 64వేల సంవత్సరాలు. కలియుగం 4 లక్షల 32వేల సంవత్సరాలు.

51. మహాభారత యుద్ధం, శ్రీరాముని జీవితకాలం -ఏ యే యుగాలలో గడిచాయి?

శ్రీరామావతారం త్రేతాయుగంలోను, మహాభారత యుద్ధం ద్వాపర యుగంలోనూ జరిగాయి.

52. కర్మ సిద్దాతం అంటే ఏమిటో తెల్పగలరు?

మానవులు తాము చేసిన పుణ్యపాపాలకు ఫలితంగానే సుఖదుఃఖాలను అనుభవిస్తారన్నదే కర్మసిద్ధాంత సారాంశం. మానవులు చేసిన మంచి పనులుకాని,చెడుపనులుగాని ఏవీ ఊరికే పోవనీ, ఎవరు చేసిన పనులకు వాళ్లు ఫలితాన్ని అనుభవించి తీరుతారనీ, ఇదే కర్మ సిద్ధాంతం మానవులు చేసుకున్న పుణ్యాపాపాలు, ఎక్కడికీ పోవనీ,జీవుల వెంట జన్మ జన్మలకూ వచ్చి తీరుతాయని ఈ కర్మసిద్ధాంతం.

53. ఈశ్వరుని జ్యోతిర్లింగములు ఎన్ని? అవి ఏవి? వాటి పేర్లు అవి ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియచేయవలసిందిగా కోరుతున్నాము.

సాంబశివుని జ్యోతిర్లింగాలు పన్నెండు. వాటికే ద్వాదశ జ్యోతిర్లంగాలనిపేరు. అవి ఇవి సౌరాష్ట్రం (గుజరాత్) లో సోమనాథుడు, శ్రీశైలంలో మల్లికార్జునుడు, ఉజ్జయినిలో మహాకాళేశ్వరుడు, అమరేశ్వరంలో ఓంకారేశ్వరుడు, వైద్యనాథేశ్వరుడు (ప్రజ్వలీక్షేత్రంలో), డాకినీ క్షేత్రంలో భీమశంకరుడు, హిమాలయాలలో కేదారేశ్వరుడు, విశాలక క్షేత్రంలో ఘుశ్మేశ్వరుడు (ఘృష్ణేశ్వరుడని పాఠాంతరం), వారాణాశిలో విశ్వేశ్వరుడు, గౌతమీనదీ తీరంలో త్ర్యంబకేశ్వరుడు, సేతువు సమీపంలో

రామేశ్వరుడు, దారుకావనంలో నాగేశ్వరుడు. పూర్వపు స్థలనామాలు ప్రస్తుతం మారిఉండవచ్చు.

54. వివిధ దేవతలకు ప్రదక్షిణము ఎన్నిమార్లు చేయాలి?

పాంచరాత్ర ఆగమంలోని పుష్కర సంహితలో ప్రదక్షిణ విధిని గూర్చి, ఈక్రింది విధంగా చెప్పబడింది.

''ఏకం గణాధిపే కుర్యాత్ ద్వేసూర్యే త్రీణి శంకరే
చత్వాం కేశవే దేవే సప్తాశ్వత్థే ప్రదక్షిణమ్..

గణాధిపతికి ఒక మారు, సూర్యునికి రెండుమార్లు శివునికి మూడుమార్లు విష్ణువుకు నాలుగుమార్లు, అశ్వత్థవృక్షానికి ఏడుమార్లు ప్రదక్షిణం చేయవలసినదని భావం. ఇదిగాక-శివ ప్రదక్షిణ విశేష విధానం వేరుగా చెప్పబడి ఉన్నది. అది ఏమంటే-శివాలయంలో వాయువ్య దిగ్భాగమందు చండీశ్వర స్థానం. అక్కడ చండీశ్వరుని ప్రతిష్టించినా, లేకున్నా - అది చండీశ్వర నివాసంగానే భావించవలసి ఉన్నది. ఇక-శివాభిషేకం చేసిన జలం ప్రవహించి బయటకు వచ్చే జలమార్గాన్ని సోమసూత్రమని వ్యవహరిస్తారు. శివాలయం ఏ దిక్కుకు అభిముఖంగా ఉన్నప్పటికీ - సోమసూత్రం ఉత్తర దిశలోనే ఉంటుంది. చండీశ్వరుడు వాయువ్యమందే ఉంటాడు. శివలింగానికి ఎదురుగా నంది, అతని వెనుక ధ్వజస్తంభం ఉంటాయి.

ఇతర దేవాలయాలలో వలె శివాలయం చుట్టూ మామూలుగా ఒక ప్రదక్షిణం చేసినట్లయితే- ఒక్క ప్రదక్షిణ ఫలం మాత్రమే లభిస్తుంది. కాని ప్రత్యేకంగా శివాలయంలో చేయవలసిన విశేష విధి ప్రకారం ఒక్కమారు చేసినంతనే అనేక ప్రదక్షిణ ఫలం లభిస్తుందని శివ పురాణమందు చెప్పబడి ఉన్నది. ఆ విశేష విధి విధానం ఇది.

''వృషం చండం వృషం చైవ సోమ సూత్రం పునర్వృషం!
చండంచ సోమసూత్రంచ పునశ్చండం పునర్వృషం!! ''

వృషభవము అనగా నందీశ్వరుని వద్ద నుండి ప్రదక్షిణముగా చండీశ్వరుని వద్దకు వచ్చి - అక్కడి నుండి అప్రదక్షిణముగా తిరిగి నందీశ్వరుని వద్దకు వెళ్లి - అక్కడ నుంచి సోమసూత్రము మీదుగా వృషబవమును చుట్టి ప్రదక్షిణముగా చండీశ్వరుని వద్దకు వెళ్లి, సోమ సూత్రమునుకూడా దర్శించి మరల అప్రదక్షిణముగా వెనుకకు చండీశ్వరుని మీదుగా వృషభము వద్దకు తిరిగి రావలెను. ఇది ఒక విశేష ప్రదక్షిణము. విధి విహితము. అనేక సామాన్య ప్రదక్షిణముల ఫలాన్ని ఒక విశేష ప్రదక్షిణం ఇవ్వగలదు.

గృహస్థులు సవ్యాపసవ్యమైన ఈ ప్రదక్షిణమును, చేయుట వలన విశేష ఫలమును పొందగలరు. బ్రహ్మచారులు సవ్య ప్రదక్షిణమును, సన్యాసులు అప్రదక్షిణమును చేయవలయునన్ని చెప్పబడి ఉంది.

'సోమసూత్రం న లంఘయేత్' అను సూత్రము ప్రకారము శివ ప్రదక్షిణములో సోమ సూత్రమును దాటరాదు.

55. శ్రీవాల్మీకి రామాయణంలోని కాండలెన్ని ? అవి ఏవి ?

వాల్మీకి రామాయణంలోనివి 7 కాండలు. అవి : 1. బాలకాండ, 2. అయోధ్యాకాండ, 3. అరణ్యకాండ, 4. కిష్కింధాకాండ, 5.సుందరకాండ, 6. యుద్ధకాండ, 7. ఉత్తర కాండ.

56. ఉపనిషత్తులు మొత్తం ఎన్ని? వాటి పేర్లు తెలుపగలరు.

ఉపనిషత్తులు మొత్తం 108. వాటి అన్నిటిపేర్లూ ఇక్కడ చెప్పాలంటే స్థలాభావం అభ్యంతరం అవుతుంది. వాటిలో ప్రధానమైనవి ఇవి. కఠోపనిషత్తు, కేనోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు, ముండకోపనిషత్తు, మాండూక్యోపనిషత్తు, ఈశావాస్యోపనిషత్తు, తైత్తిరీయోపనిషత్తు, శ్వేతాశ్వతరోపనిషత్తు, బృహదారణ్య కోపనిషత్తు ఛాందోగ్యోపనిషత్తు, ఐతరేయోపనిషత్తు

57. శ్రీమహావిష్ణువు ఎత్తిన దశావతారాల పేర్లు తెలిపి- అవి ఏయే యుగాల్లో, ఏయే కార్యాల నిమిత్తం ఆయా అవతారాలు దాల్చినదీ తెలుపగలరు.

1. మత్స్యావతారం :- కృతయుగంలో సోమకాసురుణ్ణి వధించి వేదాలను రక్షించే నిమిత్తం చేపరూపాన్ని ధరించారు.

2. కూర్మావతారం:- దేవతలూ, రాక్షసులూ కలిసి పాలసముద్రాన్ని చిలికిన సమయంలో - కవ్వంగా వాడిన మందర పర్వతాన్ని తన వీపున నిలబెట్టడానికి తాబేలు రూపాన్ని ధరించారు.

3. వరాహావతారం:- హిరణ్యాక్షుని చంపి భూమికి సుస్థితి కలిగించడానికి వరాహ రూపాన్ని ధరించరు.

4. నృహసింహావతారం : హిరణ్యకశిపుడనే రాక్షసుని సంహరించడానికి.

5. వామనావతారం : బలి చక్రవర్తి ఔద్ధత్యాన్ని అణచడానికి.

6. బుద్ధావతారం :- ఒక దేవకార్యం నిమిత్తం నాస్తికగ సిద్ధాంతాలను బోధించాడనికి.

7. పరశురామావతారం:- అధికార మదోన్మత్తులైన పాలకులను దండించడానికి, భూమికి శాంతి కలిగించడానికి.

8. శ్రీరామావతారం:- సృష్టికి అశాంతి కలిగిస్తున్న రావణ కుంభకర్ణాది రాక్షస సంహారం నిమిత్తం - త్రేతాయుగంలో.

9. శ్రీకృష్ణావతారం:- కంసాది దానవ సంహారం నిమిత్తం - ద్వాపరయుగంలో.

10. కల్క్యవతారం (కల్కి+అవతారం):- కలియుగంలో ప్రబలిన అధర్మపరులనూ దుర్జనులనూ సంహరించి ధర్మాన్ని పునఃప్రతిష్ఠించడానికి కలియుగంలో.

58. మీ యక్షప్రశ్నలు శీర్షిక చాలా బాగుంది. పాఠకులు అడిగే వివిధ శాస్త్రాలకూ, పురాణాలకూ, ఆచార సంప్రదాయాలకూ సంబంధించిన ఎన్నో ప్రశ్నలకు మీరిచ్చే సమధానాలు ఎంతో విజ్ఞానదాయకంగా ఉన్నాయి. ఎన్నో తెలియని విషయాలను మీ శీర్షిక ద్వారా తెలుసుకొంటున్నాం. మీకు, అగాథమైన మీ పాండిత్యానికి మా అభినందనలు. స్వర్గలోకం అంటుంటారుకదా? ఆ లోకం ఎలా ఉంటుందో వివరించగలరు. అక్కడికి చేరే మార్గం ఏమిటి?

నా సమాధానాలు మీకు నచ్చినందుకూ, మీరిచ్చిన ఆశీర్వచనాలకూ, అభినందనలకూ, మీకు సర్వదా కృతజ్ఞురాలిని. అష్టాదశ మహాపురాణాలు, అష్టాదశ ఉపపురాణాలు, ఉపనిషత్తులు, స్మృతులు, ధర్మశాస్త్రాలు, సంహితలు, ఆగమశాస్త్రం, వాస్తుశాస్త్రం, జ్యోతిశ్శాస్త్రాలు, ఇత్యాదిగా కల ఆర్షమైన ప్రాచీన భారతీయ విజ్ఞాన వారాశినీ, రాశినీ మీవంటి ఉత్తమాభిరుచి కలిగిన సహృదయులైన అశేష పాఠక మహాశయులతో పంచుకునే ఉదాత్త సన్నివేశాన్ని సంఘటింపజేసిన ఆంధ్రభూమి పత్రికవారికి - వినయ వినమిత ఉత్తమాంగంతో - దోసిలి ఒగ్గి - అమేయ కృతజ్ఞతా నమస్కారాలను ఈ పత్రికాముఖంగా నివేదించు కొంటున్నాను. వారి ఉదాత్త సంస్కారమూ, ఉదార సౌజన్య గుణ సంపదల కారణంగానే నాకు ఈ రూపేణా ఆర్ష సంస్కృతికి సేవ చేసుకొనే భాగ్యం కలిగింది. ఆంధ్రభూమి పత్రికవారి వల్ల నేను ఋషి ఋణం తీర్చుకోగలుగుతున్నాను. అందుకు అనుగుణమైన ఈ సన్నివేశాన్ని కలిగించినందుకు వారికి బద్ధాంజలితో ప్రణామాలు అర్పిస్తున్నాను.

స్వర్గలోకమంటే -భూమి మీద పుణ్యకార్యాలు ఆచరించిన ధన్యజీవులు - మరణానంతరం పొందే దివ్యలోకం. యజ్ఞయాగాదులు, దానధర్మాలు, పరోపకారమూ, ఇత్యాది మంచి పనులు చేసినవారు, ధర్మశాస్త్రాలలో మహర్షులు చెప్పినవిధంగా నడుచుకొన్నవారూ - ఆయా శాస్త్రాలలో చెప్పిన అనేక పుణ్యకర్మలు ఆచరించినవారికి - స్వర్గలోకంలో

ప్రవేశించే అర్హత, ఆ లోకంలో నివాసాన్ని పొందే అర్హత కలుగుతుందని మహర్షులు చెప్పారు. స్వర్గలోకం - భోగభూమి. వివిధ పుణ్యాలు చేసి ఆ లోకాన్ని చేరుకున్న పుణ్యాత్ములు వారి సుకృత విశేషం వల్ల అక్కడ వివిధ భోగాలను పొందగలరు. స్వర్గం దేవతల నివాసం. దానికి అధిపతి ఇంద్రుడు. వివిధ దేవగణాలకు చెందినవారంతా స్వర్గంలో ఉంటారు. కల్పవృక్షమూ, కామధేనువులకది నెలవు.

59. విశ్వామిత్ర గోత్రీకులలో ప్రవరలు వేరు వేరుగా ఎందుకు ఉన్నాయో తెలియచేయగలరు.

విశ్వామిత్ర గోత్రీకులలో ప్రవరాంతరం కలగడానికి కారణం ఉంది. విశ్వామిత్రునికి నూరుగురు కొడుకులు. విశ్వామిత్రుడు శునశ్శేపుని రక్షించి తీసుకువచ్చాడు. శునశ్శేపుని విశ్వామిత్రుడు తన పుత్రుడుగా గ్రహించాడు. తన పుత్రులతో ఆ విషయాన్ని చెప్పి - శునశ్శేపుని అన్నగా గ్రహించమని వాళ్లను కోరాడు. విశ్వామిత్రుని పుత్రులలో మొదటి 50 మంది ఆ మాటలకు నవ్వి హేళన చేశారు. విశ్వామిత్రుడు మండిపడి వాళ్లను మ్లేచ్ఛులు కమ్మని శపించాడు.

విశ్వామిత్రుని పుత్రులలో 51వ వాడు మధుచ్ఛందుడు. మధుచ్ఛందుడు, అతడి తర్వాతి వారూ విశ్వామిత్రుడు చెప్పినట్లుగా శునశ్శేపునితను అన్నగా స్వీకరించడానికి అంగీకరించారు. ఈ విధంగా విశ్వామిత్రుని పుత్రులు రెండు విధాలుగా విడిపోయారు. అందుకే విశ్వామిత్ర గోత్రీకులలో ప్రవరాంతరం కలిగింది.

60. మధుకైటభుల జనన వృత్తాంతం, మరణవృత్తాంతం - వీటిని వివరించగలరని కోరుతున్నాము.

సృష్ట్యాదిలో సర్వమూ జలమయమై ఉన్నప్పుడు - ఆ మహాజలంలో శయనించి ఉన్న విష్ణుమూర్తి యొక్క నాభి నుంచి బ్రహ్మ జన్మించాడు. అదే విష్ణువు యొక్క చెవుల నుంచి మధువు, కైటభుడు అనే రాక్షసులు

జన్మించారు. మధుకైటభులు తాము ఎక్కడి నుంచి పుట్టినదీ తెలుసుకోలేక దానిగురించి తర్కించకొన్నారు. చివరకుజగన్మాతవల్ల తాము జన్మించినట్లుగా భావించి జగన్మాతను ప్రార్థించారు. జగన్మాత అనుగ్రహంవల్ల మధుకైటభులు బలవంతులై బ్రహ్మను యుద్ధానికి పిలిచారు.

బ్రహ్మ భయపడి మధుకైటభుల నుంచి తనను రక్షించమని విష్ణువును ప్రార్థించాడు. యోగమాయాప్రభావంవల్ల విష్ణువు నిద్రలేవలేదు. మధుకైటభులు బ్రహ్మను పీడిస్తున్నారు. బ్రహ్మయోగమాయను, విష్ణువును విడిచిపెట్టమని ప్రార్థించాడు. అప్పుడు యోగమాయ తొలగిపోగా విష్ణువు మేలుకొని – బ్రహ్మయొక్క పరిస్థితి తెలుసుకొని బ్రహ్మకు అభయమిచ్చాడు. విష్ణువు మధుకైటభులతో యుద్ధానికి దిగాడు. యుద్ధం జరుగుతుండగా విష్ణుమూర్తి – తానొక్కడే ఆ ఇద్దరితో పోరాటం చేస్తున్నాడు. కనుక తనకు కొంత విరామం కావాలని కోరాడు. రాక్షసులు అంగీకరించారు. ఆ విరామంలో విష్ణువు – ఆదిశక్తియైన జగన్మాతను ప్రార్థించాడు. జగన్మాత మాయవల్ల రాక్షసులు (మధుకైటభులు) ప్రభావితులయ్యారు. అంతట విష్ణుమూర్తి.–

'' మధుకైటభులారా! మీరు నాతో యుద్ధం చేయలేరు. నాకు నమస్కరించి శరణు వేడండి'' అని చెప్పాడుమధుకైటభులకు అహంకారం కలిగింది. ''నీవు మాకు వరమిచ్చేదేమిటి? మేమే నీకు వరమిస్తాం– కోరుకో'' అన్నారు. ''అలాగయితే మీరు నా చేతిలో మరణించేలా నాకు వరమివ్వండి'' అన్నాడు విష్ణుమూర్తి. మధుకైటభులు తెల్లబోయారు. తాము తొందరబడి మాట జారామని గ్రహించారు. కానీ మాట తప్పడం ఇష్టంలేక, అలాగని మరణించడానికి ఇష్టంలేక జలంలేని చోట తమను చంపమని విష్ణుమూర్తిని కోరారు. కానీ అప్పటికి సర్వం జలమయంగానే ఉంది. అందువల్ల విష్ణుమూర్తి తన ఊరువులను విశాలంగా పెంచి – వాటి మీద మధుకైటభులను చంపాడు. ఇదీ మధుకైటభుల జనన మరణాల వృత్తాంతం.

61. అరుంధతి యొక్క తల్లిదండ్రులెవరు ?

అరుంధతి – కర్దమ ప్రజాపతి పుత్రిక. ఆమె తల్లిపేరు దేవహూతి. విష్ణ్వవతారమైన కపిల మహర్షి – అరుంధతికి సోదరుడు.

62. నకుల సహదేవులు ఏ విద్యయందు ప్రవీణులు?

నకులుడు అశ్వ శిక్షణలోనూ, సహదేవుడు గోవుల సంరక్షణలోనూ ప్రవీణులు.

కలియుగప్రమాణం 4 లక్షల 32 వేల సంవత్సరాలనిచెప్పారు. అయితే ఈ కలియుగం ఆరంభమై ఎన్ని సంవత్సరాలు అయినదీ మాకు తెలియచేయగలరు.

ఈ కలియుగం ప్రారంభమై 5101 సంవత్సరాలయింది.

63. ఏకలవ్యుడు ఎవరి కుమారుడు? ఏకలవ్యుడు విలువిద్యలో నిపుణుడు ఎలా కాగలిగాడు? శ్రీరాముని తమ్ముడైన లక్ష్మణుని పెళ్లి ఎప్పుడు జరిగింది? ఎలా జరిగింది? వినాయకుని విగ్రహం వద్ద ఎలుక ఉంటుంది. ఎందువలన? వినాయకుని వద్ద ఎలుక ఉండడానికి కారణం తెలుపండి.

ఏకలవ్యుడు – హిరణ్యధన్వుడనే ఎరుకల రాజు కుమారుడు. గురువుగారి మీద అతడికిగల తీవ్రమైన భక్తిభావం, అతడి నిరంతర సాధనలవల్ల ఏకలవ్యుడు విలువిద్యలో నిపుణుడైనాడు.

శ్రీరాముని తమ్ముడైన లక్ష్మణుని పెళ్లి – శ్రీరాముని పెళ్లితోపాటే మిథిలానగరంలో జరిగింది. జనకమహారాజు కూతురైన ఊర్మిళనిచ్చి లక్ష్మణునికి వివాహం చేశారు.

అనింద్యుడనే ఎలుక – వినాయకుని వాహనం. అందుకే వినాయకుని విగ్రహం దగ్గర ఎలుక ఉంటుంది. వినాయకుడు మూషికవాహనుడు కావడమే ఆయన దగ్గర ఎలుక ఉండడానికి కారణం.

64. కౌరవుల చెల్లెలు ఎవరు? ఆమె భర్త ఎవరు? దయచేసి చెప్పగలరు.

కౌరవుల చెల్లెలు దుస్సల. ఆమె భర్త సింధురాజైన జయద్రథుడు.

65. సత్యహరిశ్చంద్రుడు ఎవరి కుమారుడు?

హరిశ్చంద్రుని తండ్రి పేరు సత్యవ్రతుడు. ఈ సత్యవ్రతునికే త్రిశంకుడనే ప్రసిద్ధ నామం ఉంది. హరిశ్చంద్రుని తల్లి పేరు సత్యరథ.

66. నవదుర్గల పేర్లేవి ?

1. శైలపుత్రి, **2.** బ్రహ్మచారిణి, **3.** చంద్రఘంట, **4.** కుష్మాండ, **5.** స్కందమాత, **6.** కాత్యాయని, **7.**కాళరాత్రి, **8.** మహాగౌరి, **9.** సిద్ధిదాత్రి- ఇవీ నవదుర్గల పేర్లు.

67. అష్టలక్ష్ముల పేర్లేవి?

ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, విద్యాలక్ష్మి, ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, గజలక్ష్మి సంతాన లక్ష్మి-ఇవీ అష్టలక్ష్ముల పేర్లు.

68. ఉపనయనం చేసి - జందెం వేయడంలోని ఆంతర్యమేమిటి? యజ్ఞోపవీతం అంటే అర్థం ఏమిటి? ఉపనయనంచేసి యజ్ఞోపవీతాన్ని ధరింపచేయడం యొక్క ప్రయోజనమేమిటి? పెళ్ళికి ముందు మూడు పోగులు, పెళ్లి అయినవారికి 9 పోగులూ జందెంలో ఉంటాయి ఎందుకు? యజ్ఞోపవీతాన్ని ధరించకపోతే దోషం ఏమిటి?

యజ్ఞోపవీతానికి ఉపవీతమనే నామాంతరం కూడ ఉన్నది. ఈ పేర్లు సార్థకములు, సాభిప్రాయములు. ఈ ఉపవీతాన్ని ధారణ చేయడంలో గల ఉద్దేశం మహనీయమైనది. త్రైవర్ణులకునూ ఉపనయనమూ, తద్వారా యజ్ఞోపవీత ధారణమూ విధించబడి ఉన్నది. వీరికి విధించబడిన సంస్కారాలలో ఉపనయన సంస్కారం అతిముఖ్యమైనది. ఈ ఉపనయన సంస్కారానంతరం మానవులు తమ తమ ధర్మోచితమైనకర్మలకు సమీపంగా తీసుకొని పోబడువారు. అనగా ఆ కర్మలను ప్రారంభించడానికి యోగ్యతను అర్హతను పొంద[illegible]కు శాస్త్ర విహితమైన ధర్మాచరణ

విధులను యుక్తమైన మార్గాన ఆచరించవలసి ఉంది. మనోవాక్కాయకర్మలచేత – తనకు ధర్మశాస్త్రం వల్ల విధించబడిన విద్యుక్తకర్మాచరణమందు నిమగ్నుడై ఉండగలందులకుగాను – ద్రష్టలైన ఋషులచేత కల్పించబడిన చిహ్నమే ఈ యజ్ఞోపవీతం.

కాబట్టి యజ్ఞోపవీతమనే పదానికి అర్థం – మానవుని తనకు శాస్త్రయ విధించిన కర్మకు సమీపముగా తీసుకొనిపోయేది అని. ఆ విధంగా మానవుని కర్మయందు ప్రవేశింపజేయడమే ఉపనయనం. ప్రధాన ఉద్దేశం మానవుని కర్మార్హునిగా చేయడమే. ఉపవీతంలోని మూడపోగులు ఈ జగత్సృష్టి, స్థితి, లయాత్మకంగాను, త్రిలోక, త్రిమూర్తి, త్రివర్గ, త్రిగుణ, త్రికాల, త్ర్యవస్థాత్మకంగాను ఉండడాన్ని సూచిస్తాయి. ఉపవీతంలోని ఒక్కొక్క పోగులోను తొమ్మిదేసి తంతువులు ఉంటాయి. తొమ్మండుగురు తంతుదేవతలు అధిష్టాన దేవతలై ఉన్నారు. వారు 'ఓంకారోగ్నిశ్చ సోమః పితృ ప్రజాపతీ వాయు సూర్యే విశ్వే దేవా ఇత్యేతాస్తంతు దేవతాః!!''

మూడుపోగుల ఉపవీతం మానవ శరీరంలోని ఇడా – పింగళా సుషుమ్నా నాడులకు కూడా చిహ్నం.

ఇక బ్రహ్మగ్రంథి – పరబ్రహ్మమును మానవుని శరీరంపైన ఆరోపించి– సర్వదా దేహ పవిత్రతను కాపాడే ఉద్దేశంతో ఏర్పరచబడింది.

ఉపవీత లక్షణం:–

'' త్రివృత్తం చోపవీతంచ తత్రైకోగ్రంధి రిష్యతే!

నాభే రూర్ధ్వ మనాయుష్యమధో నాభీస్తపక్షయః!'' – అని చెప్పబడింది.

అనగా– ఉపనీతం మూడు పోగులు కలిగి – ఒక గ్రంధితో కూడి ఉండాలి. ధారణ చేయబడినప్పుడు నాభికి సమానంగా ఉండవలసినది. నాభి స్థానమున కంటే పైకి ఉన్నట్లయితే ఆయువు క్షయిస్తుంది. నాభిని దాటి యున్న యెడల తపస్సుకు భంగము కలుగుతుంది.

''యజ్ఞోపవీతే ద్వేధార్యే శ్రౌతే స్మార్తేచ కర్మణి!
''వస్త్రాభావే తృతీయం తు గృహస్థోధారయే ద్ద్విజః!
చతుర్ధ ముత్తరీయార్థ మాయు ష్కామో బహూన్యపి!
గృహస్థస్యత్విధం ప్రోక్త మేకం వై బ్రహ్మచారిణః!!

భావం :- గృహస్థుడైన పురుషుడు శ్రౌతస్మార్మ కర్మలయందు రెండు ఉపవీతములను ధరించదగినది. యుక్తమైన వస్త్రలోపదోష నివారణకు గాను తృతీయము, ఉత్తరీయమునకు మారుగా చతుర్ధముఅయిన ఉపవీతములను ధరించ తగియున్నది. ఆయుష్కాముడైన వాడు అంతకంటే ఎక్కువ ఉపవీతములను ధరించవచ్చును. బ్రహ్మచారి మాత్రము ఒకే ఉపవీతమును ధరించవలెనని విధించబడింది. యజ్ఞోపవీతాన్ని ధారణ చేయడానికి పూర్వం - ఆ ఉపవీతానికి పవిత్రగ్రంధిని వేసి - భగవంతునికి సమర్పించుటచేసి ఉచిత సంస్కారం కావించి ధరించవలసి ఉంది. ఇక్కడ సంస్కారమంటే - నూతన యజ్ఞోపవీతం కానీ, వస్త్రం కానీ ధరించక పూర్వం దానికి పసుపు కుంకుమలు అలది సంస్కారం కావించాలి. కాని, ఉన్నది ఉన్న విధంగా వాడ కూడదు. యజ్ఞోపవీతానికి ఆ సంజ్ఞ (పేరు) ఏర్పడడానికి - మరొక కారణం కూడా ఉంది. సృష్ట్యాది యందు ఉపవీతాన్ని ధారణ చేయకపోవడం, ఉపవీత మహత్యాన్ని గ్రహించకుండడం, లేదా దానిని ధారణ చేసిన ఉద్దేశాన్ని పాటించకపోవడం, ఉపవీత రహితంగా యజ్ఞాదికార్యమువంటి దోషాలు అసురుల యందు కలిగాయి.

ఉపవీత మహోత్మ్యజ్ఞాన ధారణ అనుష్ఠాన యుక్తులైనట్టి దేవతలకు - ఉపవీతధారణ పూర్వకంగా యజ్ఞయాగాది క్రతునిష్ఠాపరులైన దేవతలకు - ఆ అసురులకు ప్రాప్తం కానట్టి స్వర్గాది సామ్రాజ్యలాభం కలిగింది. ఆ కారణంగా ఉపవీతానికి యజ్ఞోపవీతమనే పేరు ఏర్పడింది.

69. కుమార స్వామి భార్యలెవరు ?

కుమారస్వామి భార్యలు శ్రీవల్లి, దేవసేన.

70. 'యక్షప్రశ్నలు' శీర్షిక చాలా ఆసక్తికరంగా ఉంది. మాకు తెలియని ఎన్నో విజ్ఞాన విశేషాలను మీవల్ల ఈ శీర్షికలో తెలుసుకుంటున్నాము. మా ప్రశ్న ఏమంటే ఈ జ్యోతిష్యాలు,వాస్తు పరిమాణాలు, ఇంకా అనేక శాస్త్ర సంబంధమైన విషయాలు ఇవన్నీ ఇంత కచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారు? ఇవన్నీ మొదట వెల్లడి చేసినవారు ఎవరు? ఈ అన్నిటి గురించీ మొదట తెలుసుకున్నవారు ఎవరు? తెల్పండి. మూఢ నమ్మకాలను మీరు నమ్ముతారా, నమ్మరా?

ఈ విజ్ఞాన విషయాలన్నిటినీ, వాటన్నిటికీ మూలమైన అసంఖ్యాకమైన శాస్త్రాలనూ – మనకు అందించిన వారు మహర్షులు. మానవ జాతిపైన వారికి గల అపారమైన కరుణచేత, మానవులు తమ జీవితాలను తీర్చిదిద్దుకొనడానికి వీలుగా మహర్షులు మనకు అనుగ్రహించిన ఆ శాస్త్రాలే ఈ విజ్ఞానానికంతటికీ మూలం, ఆధారం. వాటికి కూడా మూలమైనవి– పరమేశ్వరుని నిశ్వాసరూపంగా వెలువడిన వేదాలు.

ఇక మూఢ నమ్మకాల గురించి ఏ ఒక్క నమ్మకమైనా మూఢమా, కాదా – అన్న విచారణ చేసి, ఉన్న విషయాన్ని నిగ్గు తేల్చుకొన్నాకకాని – దేనికైనా మూఢనమ్మకం అనే పేరు పెట్టకూడదు. ముందుగా దాని సారాన్ని, నిజానిజాలనూ పరిశీలించి తెలుసుకోవాలి. ఏ విషయాన్నైనా తెలుసుకోకుండా, దాని గురించి పూర్తిగా పరిశోధించకుండా ముందుగానే ప్రిజుడిస్డ్ అభిప్రాయాలతో ముద్రవేయడం,తృణీకరించడం తగదు.

71. భోజనం చేసే సమయంలో బిచ్చగాళ్ళు వస్తే తప్పకుండా భిక్ష వేయాలంటారు. తద్దినం రోజున భిక్షవేయరు. వీటికి కారణాలు ఏమిటి?

'అభ్యాగతః స్వయం విష్ణుః' అనేది సనాతన భారతీయ విశ్వాసం. తమంత తాముగా ఇంటికి వచ్చినా వారైనా ఆహ్వానించగా వచ్చిన వారైనా, ఆ అతిథి అభ్యాగతులను సాక్షాత్ భగవత్ స్వరూపాలుగా భావించి అర్చించడమే

మన సాంప్రదాయం. ఆ సత్సంప్రదాయం అంతవరకే పరిమితం కాలేదు. అపరాహ్ణ సమయాన వాకిటిలోనికి బిచ్చగాడు వచ్చినా సరే ఆ భిక్షకునికి ఆదరించి భోజనం పెట్టవలసినదే.

''అతిధావతిష్ఠతి ద్వారే
హ్యాపో గృహ్ణాతియోనరః!
ఆపోశనం సురాపాన మన్నం
గోమాంసభక్షణమ్!!'' అని ఆర్యోక్తి.

''అతిథి వాకిట నుండగా గృహస్థుడు ఉదకమైనా స్వీకరించకూడదు. అట్లు స్వీకరించిన జలము సురాపానమూ అన్నము తినినచో అది గోమాంస భక్షణం అగును'' అని పై శ్లోక భావం. శిష్టా చారవంతుల గృహాలలో ఒక సంప్రదాయముంది. భోజన వేళ వీధి వాకిలి తలుపు వేసే ముందు అటూ ఇటూ కలియజూసి మరీ తలుపులు మూయాలి. కారణం అక్కడ ఎవరైనా అన్నార్తులు ఉన్నట్లు అయితే వారిని ఉపేక్షించరాదనీ తప్పక వారికి ఆహారం ఇవ్వాలనీ పరమార్థం. మానవులకే గాక ప్రతి దినమూ గృహస్థుడు కాకబలి, శ్వాసబలి ఇత్యాది పంచబలులను ఇచ్చి భూత యజ్ఞాన్ని నిర్వహించిన అనంతరం మాత్రమే భుజించాలని స్మృతులు నిర్దేశించాయి.

అయితే పితృకార్యం నాడు మాత్రం శ్రాద్ధ నిర్వహణము పితృపిండ ప్రధానం అయినంత వరకూ ఆ గృహం నుండి ఎవరికీ ఏమీ ఇవ్వరాదు. మనకు ఒక సంవత్సర కాలం పితరులకు ఒకరోజు అవుతుందని చెప్పబడినది. ప్రతీ సంవత్సరం పితృశ్రాద్ధం చేయడం వారికి అనుదినమూ భోజనం పెట్టడమే. ఆనాడు తమ వారిని చూడగోరిన పితరులు ఏదో రూపంలో వస్తారనే నమ్మకముంది. కాబట్టి వారిని సమగ్రంగా అర్చించకుండా ఏ తృణమో ఇచ్చి పంపడం అవుతుందనే ఉద్దేశం ఒకటి. రెండవది పితృ తిథి నాడు పితృ దేవతార్చన ముఖ్యం గనుక - అంతకంటే ముందుగా ఎవరికీ ఏమీ ఇవ్వరాదని. సాధారణ ధర్మాలు ప్రత్యేక సందర్భాలలో పట్టవు.

72. ఇంట్లో ఏదో ఒక మూలలో దేవుళ్లను పెట్టి పూజ చేయ్యాలనీ, మరో మూలలో బరువు ఉంచాలనీ, ఇంకొకమూలలోకి పాచి ఊడ్చాలనీ, విన్నాము. ఏ ఏ మూలలో చెప్పండి.

ఇంటి ఈశాన్యమూలలో దేవతార్చన పీఠాన్ని పెట్టాలి. అది తూర్పు ఈశాన్యమైన, ఉత్తర ఈశాన్యమైనా కూడా దేవతాపీఠాన్ని పెట్టడానికి పనికివస్తుంది. బరువులు, చెత్తకుప్పలు, చీపుళ్ళువంటివి ఉంచవలసింది నైఋతిమూలలో.

73. రోజూ చదువుకొనే పారాయణ –పైకి వినపడేలాగ చేయవచ్చా? లేక మనసులోనే చేసుకోవాలా? మేము రోజూ ఆదిత్యహృదయం, విష్ణుసహస్రం, లలితా సహస్రం – ఇంకా చాలా స్తోత్రాలు పైకి వినపడేలాగ చదువుకుంటూ వంట పని చేసుకుంటాము.అది చాలా ఏళ్లుగా అలవాటయింది. ఒకరిద్దరు విని అలా బిగ్గరగా చెయ్యకూడదు, మనసులోనే చదువుకోవాలి అన్నారు. అలాగ చెయ్యలేకుండా ఉన్నాము. అలాచేస్తే పారాయణ కుదరడం లేదు. మేము చేసే పద్ధతి తప్పా? దయచేసి సమాధానం వ్రాయండి. బిగ్గరగా చదవడం వల్ల తప్పులు రాకుండా, ఎవరి మాటలు మీదా ధ్యాసలేకుండా మా పారాయణ సాగిపోతుంది.

పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ – అనే నాల్గురూపాలలో వాక్కు వ్యక్తమౌతుంది. అందులో మన వాక్ వ్యాపారానికి సంబంధించినవి – మధ్యమా, వైఖరీ రూపాలు. జపం 3 విధాలు. వైఖరీ జపం. ఉపాంశుజపం. దైవారాధనలో మానసిక జపం, ఉపాంశుజపం, వైఖరీ రూపం జపం – ఈ మూడింటిలో ఏది చేసినా, ఏవిధంగా చేసినా ఫలితం సిద్ధిస్తుంది. కానీ ఆ సిద్ధించే ఫలితంలో హెచ్చు తగ్గులుంటాయి. వైఖరీ రూపవాక్కు అనగా పైకి బిగ్గరగా పలికేది. ఉపాంశుజపం అనగా పెదవులు కదల్చుతూ, శబ్దం బయటకు వినబడకుండా జపించే విధానం. మానసిక జపం అనగా కేవలము మనస్సులోనే మననం చేస్తూ – బాహ్యేంద్రియాల ప్రమేయం లేని జపం.

ఈపై మూడు విధాలైన జపాలలో వైఖరీ, ఉపాంశు, మానసిక జపవిధానాలు ఉత్తరోత్తర శ్రేష్ఠాలని ధర్మశాస్త్ర నిర్ణయం. అంటే ఇవి ఇదే వరుసలో ఒకదానికంటే ఒకటి ఉత్తమమైనవి.

అంటే వైఖరీ జపం కంటె ఉపాంశు జపమూ, దానికంటే మానసిక జపమూ - శ్రేష్ఠ మైనవని చెప్పబడింది. వానివల్ల కలిగే ఫలం కూడా అదే వరుసలో ఉంటుంది. అనగా వైఖరీ జపం కంటే ఉపాంశు జపం వల్ల ఫలం ఎక్కువ. ఉపాంశు జపం కంటే మానసిక జపం వల్ల ఫలం ఎక్కువ. ఇది మహర్షుల నిర్ణయం.

అయితే, అంతమాత్రాన మీరు నిరుత్సాహ పడనవసరం లేదు. బిగ్గరగా చేసే స్తోత్ర జపాదుల వల్ల-చుట్టూ ఉన్నవాతావరణం, వినే వారిమనస్సులూ కూడా పవిత్రాలవుతాయి. అంతేగాక వంట చేస్తూ మీరు చేసే స్తోత్ర జపాదులవల్ల మీరు వండే ఆ ఆహారం కూడా పవిత్రమవుతుంది.

అంతేగాక, అలవాటులేని మానసిక జపం కోసం ప్రయత్నించి - ఉన్న వైఖరీ జపాన్ని కూడా కుదరకుండా చేసుకోవడం ఉచితం కాదు. మీరు బిగ్గరగా స్తోత్ర పారాయణాదులు చేయడంలో తప్పేమీ లేదు. మీకు అలవాటైన పద్ధతిలోనే కొనసాగించండి.

మానసిక జపం చేయడాన్ని - కావాలంటే అభ్యాసం మీద మెల్లగా క్రమంగా ప్రయత్నించవచ్చు. దానికోసం ఉన్నది మానుకోనవసరంలేదు.

74. ఇంటిలోకి అప్పుడప్పుడు గ్రద్దలు, గుడ్లగూబలు, గబ్బిలాలు, తీతువు, ఉడుము వంటివి పక్షులు రావడం కూయడం జరుగుతుంది. అలాగే తేనె పట్టులుంటే వీటి వలన దోషాలు కలుగుతాయంటారు. వాటివల్ల కలిగే దోషాలు ఎటువంటివి ? దీనికి శాస్త్రబద్ధంగా తీసుకోవలసిన చర్యలు, పరిహారాలు ఏమిటి? వివరంగా చెప్పండి.

గ్రద్దలు, గుడ్లగూబలు, గబ్బిలాలు - ఇంట్లోకి వచ్చినా, లేదా ఇంటిమీద ఈశాన్య, వాయువ్య, దక్షిణ, అగ్నేయ దిక్కులలో కాని, ఇంటికి

మధ్య భాగంలోకాని, వాలినా –దోషం. ఆ ఇంట్లో 3 మూసాలపాటు ఉండకూడదు. గృహశాంతి చేసుకుంటే ఇల్లు విడిచి వెళ్లనవసరంలేదు. గృహశాంతి చేసే విధానం చాలా సింపుల్. పురోహితులకు తెలుస్తుంది. వారిచేత చేయించకోండి.

ఇక తేనెపట్టు విషయం. తూర్పు, ఈశాన్యాలలో తేనెపట్టు శుభమే. తక్కినవైన ఆగ్నేయం, దక్షిణం,నైఋతి, పడమర,వాయువ్యం,ఉత్తరం – ఈ దిక్కులు, విదిక్కులలో తేనె పట్టువల్ల దోషం. అగ్నేయంలో అగ్నిభయం, దక్షిణంలో మరణం, నైఋతిలో ధాన్యనాశనం, పడమరలో మనఃక్లేశం, వాయువ్యంలోధన మూలకదుఃఖం. ఉత్తరంలో పుత్రహని. గృహమధ్యంలో కూడా మహాదోషం. ఈశాన్యంలో బంధుమిత్ర దర్శనం. తూర్పులో ధనలాభం. ఆ దోషాలేమిటని అడిగారని చెప్పాను. దోష దిశలలో తేనెపట్టు ఉంటే దాన్ని తీసివేసి,గృహశాంతి చేయించండి. సరిపోతుంది.

75. గుడిచుట్టూ నాలుగువైపులా బలిపీఠం ఉంటుంది. ధ్వజస్తంభం, భలిపీఠాలకు అన్నం ఆరగింపుచేస్తారు.దాని అంతరార్థం ఏమిటి?

ఆగమశాస్త్రరీత్యాదేవాలయంలోని వివిధ దిక్కులలో వివిధ దేవతలను ప్రతిష్ఠంచడం జరుగుతుంది. వైఖానసాగమప్రకారం ఈశాన్యాన శివుని, తూర్పున సూర్యుని,ఆగ్నేయమున గణేశుని,దక్షిణంలో వింధ్యవాసినిని, నైరుతియందు షణ్ముఖుని, పశ్చిమమున విష్ణువును,అష్టదిక్కులలో మాతృకలను ప్రతిష్ఠంచవలసి ఉంది.

ఈశాన శివగురుదేవ పద్ధతి ప్రకారం. ఈశాన్యమున శివుని వాస్తు పురుషుని,చాముండిని, గణేశుని,తూర్పు సూర్యుని, గౌరిని, విష్ణువును, క్షేత్రపాలకుని అగ్నేయంలో విష్ణువును, కాళిని, దక్షిణమున గుహ, మాతృకలను, నైరుతియందు గణేశుని, పశ్చిమమున విష్ణువును, కార్తికేయుని, వాయువ్యమున జ్యేష్ఠా, చండీశ్వరులను ఉత్తరమున చండికా, మహాకాళీ, దుర్గా,క్షేత్రపాలకా, మాతృకలను మధ్యన బ్రహ్మను, అష్టదిక్కులందు

లోకపాలకులను - ప్రతిష్ఠించాలి. కామికాగమం ప్రకారం ఈశాన్యంలో అగ్నిని,తూర్పున సూర్యుని అగ్నేయమున విష్ణుని, దక్షిణమున విష్ణు,బ్రహ్మలను, నైరుతియందు సోముని, పశ్చిమమున విష్ణుని,ఉత్తరమున సోమ, శాస్తలను, మధ్యను సోమ విఘ్నేశులను, అష్టదిక్కులందును పార్వతీ, క్షేత్రపాల, సార్వదేశికులను ప్రతిష్టించవలసి ఉంది.

సమరాంగణ సూత్రధారం ప్రకారం ఉత్తరమున విశాఖ, స్కంద, సోమ, కుబేరులను, వాయువ్యమున సర్ప, శని, కాత్యాయనీ దేవతలను, పశ్చిమమున సాగర, నదీ, విశ్వకర్మ,ప్రజాపతి, వరుణులను నైరుతిలో భద్రకాళీ,పితరులను, దక్షిణమున గణేశ, మాతృకా, యములను, ఆగ్నేయమున సావిత్రీ,మరుత్,మారుత, సనత్కుమారులను, తూర్పున సూర్య,విష్ణు,ఇంద్ర, దర్మలను ఈశాన్యమున మహేశ్వర, శ్రీవహ్నిదేవతలను - ప్రతిష్ఠించాలి.

ఇంకా మానసార, స్వస్తిక, తంత్ర సముచ్చయాది గ్రంథాలలో వివిధ మత భేదాలతో విశేషంగా అనేక విషయాలు చెప్పబడినాయి.

కనుక, ఆలయంలో ప్రధాన దేవతలతోబాటు, అంగ, ప్రత్యంగ, ఆవరణ, పరివార - ఇత్యాది దేవతలందరికీ బల్యన్న నివేదనాది ఉపచారములు చేయడం విధి విహితం. బలిపీఠాలపై అన్నం ఉంచడం దానికొరకేనని గ్రహించాలి.

76. వివాహానంతరం అరుంధతీ నక్షత్రాన్ని ఎందుకు చూపిస్తారు?

అరుంధతీ నక్షత్రదర్శనం చేయించే సమయంలో ఈ క్రింది మంత్రాన్ని చెబుతారు:

> ''సప్తర్షయః ప్రథమా కృత్తికానాం
> అరుంధతీం యత్ ధ్రువతాం
> హవిన్యుఃషట్కృత్తికా
> ముఖ్యయోగంవహంతీయం''

షట్కృత్తికలకు ఆద్యురాలిగా సప్తఋషులు ఈమెను సంభావించుట చేత ఆ మిగిలిన షట్ కృత్తికలకు ప్రధానమైనకలయికను ఈ అరుంధతి నిర్వహించుచున్నది – అని దీని భావం. సౌభాగ్యానికి, మాంగల్యానికి అధిదేవతయైన గౌరీదేవిని వధువుచేత వివాహానికి ముందుగా పూజింపచేయడం జరుగుతుంది. అదే విధముగా వధూవరులు దంపతులుగా ఏకమయ్యే యోగానికి కారకురాలు, ఆ ఏకతాభావనకు అధిదేవత అరుంధతి. వశిష్ఠుడు ఎన్ని జన్మలు పొందినప్పటికీ ప్రతి జన్మలోనూ ఆయనకు భార్య అయింది అరుంధతి. అటువంటి నిత్యానపాయిని–భర్తను వెన్నంటి ఉన్న అరుంధతీ దేవికి వధూవరుల చేత మ్రొక్కించడం సముచితం.

ఈ భార్యాభర్తలు కూడా ఆ విధంగానే జంట బాయక, అన్యోన్యానురాగంతో కలకాలం ఉండాలనే ఉద్దేశంతో ఆ విధంగా చేస్తారు.

యుగయుగాలకూ విడివడక,నక్షత్ర మండలంలో స్థానం పొందిన పునీతులు, ఋషిదంపతులు అరుంధతీ వశిష్ఠులు.సీతారాముల నమస్సులు సైతం అందుకున్నవారు. దంపతులందరికీ పూజనీయులు.

77. సుమంగళులు వచ్చి వెళ్లేటప్పుడు గృహిణి వారికి పసుపు, కుంకుమ, పూలు, పళ్లు, తాంబూలం ఇవ్వడంలోని అంతరార్థం ఏమిటి?

''విద్యా సమస్తాస్తవ దేవి భేదాః
స్త్రియః సమస్తాః సకలజగత్సు

అని మార్కండేయ పురాణంలో చెప్పబడింది. లోకంలోని స్త్రీలందరూ దేవీకళలు కలిగి ఉంటారని ఈ విధంగా మహర్షులు చెప్పిన దానిననుసరించి, స్త్రీలందరినీ దేవీ స్వరూపిణులుగా భావించి గౌరవించడం భారతీయ సంప్రదాయం. అట్టి దేవీ స్వరూపిణులైన స్త్రీలను అర్చించే విధానమే వారికి ఆయా మంగళ ద్రవ్యాలను సమర్పించడంలోని అంతరార్థం. అది దేవీ ప్రీతికరమైన విషయమని ఆర్షమయిన భావన.

78. దేవాలయాలలో స్త్రీలను అర్చకులుగా ఎందువల్ల నియమించరు?

ప్రాణప్రతిష్ఠాపన చేసి అర్చన ప్రారంభించిన దేవాలయంలో నిత్యమూ జరగవలసిన ధూపదీప నైవేద్యాలకు ఆటంకం కలగడానికి వీలులేదు. ప్రాణకళలతో ఆవాహన చేయబడిన అర్చామూర్తులు సాక్షాత్ దైవ స్వరూపాలుగా భావించవలసి ఉంది. వాటి అర్చనలో ఎట్టి అంతరాయమూ రావడానికి వీలులేదని ఆగమశాస్త్రం విధించి ఉంది. స్త్రీలకు ప్రకృతి సిద్ధంగా అశుచి కలిగే సమయాలలో దేవతార్చనకు ఆటంకం కలుగుతుంది కనుకనూ, స్త్రీలకు గర్భధారణ, ప్రసవం వంటి పరిస్థితులు కలుగుతాయి కనుకనూ, ఆయా సమయాలలో సహితం వారు దేవతార్చన నిర్వహించలేని స్థితిలో ఉంటారు కనుకనూ స్త్రీలను దేవాలయార్చకులుగా నియమించే ఆచారం నెలకొల్పబడలేదు.

79. వివాహిత స్త్రీలు మెట్టెలు, పుస్తెలు మొదలైన వాటిని ఎందుకు ధరిస్తారు?

ఆయా అలంకారాలు మంగళప్రదమైనవి, సౌభాగ్యదాయకమైనవి కావడం వలన ధరిస్తారు. సౌభాగ్యవతులకు మంగళ ప్రదాయిని అయిన గౌరీదేవి యొక్క అలంకారాలు కావడం వలన – ఆ దేవి యొక్క అలంకార విధానంగా వాటిని ధరిస్తే సౌభాగ్యవృద్ధి జరుగుతుందనే నమ్మకంతో, విష్ణుభక్తులు త్రిపుండ్రాలను, శివభక్తులు, విభూతి రేఖలను ధరించినట్లుగానే సౌభాగ్యం కోరే స్త్రీలందరూ గౌరీభక్తులే కనుక. ఆయా దేవతల భక్తులు, లేదాఆయా మతాల వారు – తాము నమ్మే దేవతలకు సంబంధించిన చిహ్నాలను ధరించడం సంప్రదాయం.

అంతేకాక శారీరక శాస్త్రరీత్యా ఆయాశరీర భాగాలతో ఆయా అలంకారాలను ఉంచడం వల్ల కొన్ని వ్యాధుల నివారణకు ఉపకరిస్తుంది. వీటికి ఋజువులున్నాయి. ఏయే లోహాలను శరీరంలో ఏయే భాగాలలో ధరించడం

వల్ల అవి ఏయే రోగాలను నివృత్తి చేస్తాయి – అన్నది విస్తృతమైన ఒక శాస్త్రం. అది అంతా ఇక్కడ చెప్పడం సాధ్యంకాదు.

80. అష్ట ఐశ్వర్యాలు ఏవి? అష్ట కష్టాలేవి?

భార్య లేకపోవడం, యాచన చేయవలసి రావడం, తననుఅర్థించిన యాచకులకు లేదనవలసి రావడం, ఋణగ్రస్తుడు కావడం, స్వదేశాన్నీ, స్వస్థానాన్నీ విడిచి పరదేశాలకు వెళ్ళి అక్కడ నివసించవలసి రావడం, కష్టించి సంపాదించుకొంటేకానిపూట గడవని స్థితిలో శ్రమజీవనం చేయవలసి రావడం, ఇతరులకు భృత్యుడుగా బానిసత్వం చేయడం, అన్న వస్త్రాలకు కూడా లేని కటికి దారిద్ర్యం – ఇవి అష్టకష్టాలు.

ధనం, ధాన్యం, వాహనం, సంతానం, స్నేహితులు, బంధువులు, దాసీజనం, భటులు – ఇవిఅష్టఐశ్వర్యాలు.

81. 'నల్లేరుపై బండి నడక' అంటే ఏమిటి?

గ్రామాలలో రహదారులు తిన్నగా ఉండక బాగా గోతులు, గొప్పులతో ఎగుడు దిగుడుగా ఉండడం పరిపాటి అందునాపూర్వం ఈ దారుల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉండేది. అటువంటి గోతులలో ముఖ్యంగా వర్షాకాలంలో నీరు కూడా నిండి, బండి నడకకు అవరోధంగా ఉన్నప్పుడు ఆగోతులలో నల్లేరును పడేసేవారు. దారుల పక్క ఎక్కడ పడితే అక్కడ కాడలవలే పెరిగే ఈ నల్లేరును గోతులలో వేయడం ద్వారా బండినడక సాఫీగా సాగిపోవడం వల్ల అనాయసంగా జరిగే కార్యాలకు ఆవిధంగా 'నల్లేరుపై బండి నడక' అనడం అలవాటుగా మారింది.

82. అర్థంకాని దస్తూరీని బ్రహ్మరాత అంటారు. బ్రహ్మగారి దస్తూరీ అంత గజిబిజిగా ఉంటుందా?

అర్థంకాని దస్తూరీని బ్రహ్మవ్రాత అనడంలోని భావం – బ్రహ్మగారి దస్తూరీ గజిబిజిగా ఉంటుందని కాదు. కాలగమనంలో భవిష్యత్తులో రాగల

పరిణామాలు, మానవుని జీవిత పథం – వీనినే కదా తలవ్రాత అనీ, బ్రహ్మవ్రాత అనీ వ్యవహరిస్తారు? బ్రహ్మవ్రాత తెలుసుకోవడం అంటే – వాటిని తెలుసుకోవడమే కదా? ఏ క్షణంలో ఏమి జరుగుతుందో తెలుసుకోవడం ఎవరి తరమూకాదు. అదే విషయాన్ని మరొక మాటలో బ్రహ్మవ్రాతఎవరికీ తెలియదు అనే కదా?

మన విశ్వాసం – బ్రహ్మ అనగా సృష్టి కర్త మానవుని నుదుటిపై మూడు గీతలలో వాని భవిష్యత్తును లిఖిస్తాడని, ఆ లిపిని ఎవరూ చదవలేరని.

సారాంశంగా – ఏ వ్యక్తి జీవితగమనం ఎలా ఉండేది ఎవరికీ తెలియదు అనే భావమే దీనికి ఆధారం. ఏ వ్యక్తి జీవితం ఎలా ఉండేదీ, సృష్టికర్త వానిముఖాన ఏమి వ్రాసినదీ అర్థం చేసుకోనడం సాధ్యం కాదు అనే భావమే బ్రహ్మవ్రాత అర్థం కాదు అనడంలోని అభిప్రాయము. కాలగమనంలో వ్యవహారంలో, అర్థంకాని దస్తూరీని బ్రహ్మరాత అనడం అలవాటుగా మారింది.

83. సప్తమహర్షులెవరు?

సప్తమహర్షుల మండలి– ఒక పదవికి సంబంధించినది. ఈ పదవులలో ఎల్లప్పుడూ ఒక్కరే స్థిరంగా ఉండడం జరగదు.

మన్వంతరానికొకమారు సప్త మహర్షి మండలి మారుతూ ఉంటుంది. బ్రహ్మ, విష్ణువు, శివుడు, ఇంద్రుడు మొదలైన లోకపాలకులు ప్రతి మన్వంతరంలోనూ ఉండవలసిన సప్తమహర్షి మండలిని నిర్ణయిస్తారు.

ఈ క్రింది వారు ఒక్కొక్క మన్వంతరంలోనూ సప్తమహర్షులుగా ఉండేవారు.

స్వాయంభువ మన్వంతరంలోని సప్తమహర్షులు :– మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వశిష్ఠుడు.

స్వారోచిష మన్వంతరంలోని మహర్షులు :- ఔర్వుడు, వశిష్ఠపుత్రుడు, స్తంభుడు, కశ్యపుడు, పాణుడు, బృహస్పతి, దత్తాత్రేయుడు, చ్యవనుడు, అత్రి (ఒక్కొక్కప్పుడు వీరి సంఖ్య పెరిగినా పెరగవచ్చు)

ఉత్తమ మనువు కాలంలో మహర్షులు:- వశిష్ఠ మహర్షి భార్యయైన ఊర్జయందు జన్మించిన ఏడుగురు వాసిష్ఠులు. (వీరికిహిరణ్యాగర్భులనే నామాంతరం కూడా ఉంది)

తామస మనువు కాలంలోని మహర్షులు:- పృథుడు, కావ్యుడు, అగ్ని, జహ్నుడు, ధాత, కపీవంసుడు, అకపీవంసుడు.

రైవత మన్వంతరంలోని సప్త మహర్షులు:- యదుధ్రుడు, వేదశిరుడు, హిరణ్య రోముడు, పర్జన్యుడు, ఊర్ధ్వబాహుడు, సత్యనేత్రుడు, దేవబాహుడు. చాక్షుషమన్వంతరంలోని సప్త మహర్షులు:- భృగుడు, నభుడు, వివస్వంతుడు, సుధాముడు, విరజుడు, అతినాముడు, సహిష్ణుడు.

వైవస్వత మన్వంతరంలోని సప్తమహోర్షులు:- వశిష్ఠుడు, అత్రి, గౌతముడు,కశ్యపుడు, భరద్వాజుడు, జమదగ్ని, విశ్వామిత్రుడు.

బ్రహ్మసావర్ణిక మనువుకాలంలోని మహర్షులు :- రామ,వ్యాస, అత్రేయ,దీప్తిమంత,బహుశ్రుత,భరద్వాజ, అశ్వత్థామలు.

సూర్యసావర్ణిక మన్వంతరంలోని సప్తమహర్షులు :- గౌతముడు, అజరుడు, శరద్వంతుడు, కౌశికుడు, కాశ్యపుడు, ఔర్వుడు.

దక్షసావర్ణిక మన్వంతరంలోని మహర్షులు:- మేధా,తిథి, వసువు, సత్యుడు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, హవ్యవాహనుడు.

రుద్రసావర్ణిక మన్వంతరంలోని మహర్షులు :- ద్యుతి, తపస్వి,సుతపుడు, తపోమూర్తి,తపోధనుడు,తపోనిధి, తపోద్రుతి.

మహర్షి అనేది ఒక పదవి. ప్రతి మన్వం తరంలోనూ నిర్ణయించిన కొందరు మహర్షులుగా ఉంటారు. సాధారణంగా వీరు ఏడుగురుగా ఉండడం

జరుగుతుంది.కానీ ఈ సప్త సంఖ్య ఒక్కొక్కప్పుడు మారవచ్చు. వీరి సంఖ్య కొంత పెరగడం లేదా తగ్గడం జరుగువచ్చు.

ప్రస్తుతం వైవస్వత మన్వంతరం నడుస్తూ ఉంది.

84. ఆంజనేయుడు నవ వ్యాకరణ వేత్త అని అంటారు. అంటే ఏమిటి?

నవ వ్యాకరణ వేత్త అనగా తొమ్మిది వ్యాకరణాలనూ నేర్చిన వాడని అర్థం. ఆ తొమ్మిది వ్యాకరణాలూ ఇవి : 1. పాణినీయము, 2. కలాపము, 3. సుపద్మము, 4. సారస్వతము, 5. ప్రాతిశాఖ్యము, 6. కుమారవ్యాకరణం, 7. ఐంద్రము, 8. వ్యాఘ్రభౌతికము, 9. శాకటాయనము.

85. అష్టగణపతులెవరు ?

1. లక్ష్మీగణపతి, 2. క్షిప్ర గణపతి, 3. ఋద్ధి గణపతి, 4. చింతామణి గణపతి, 5. శక్తిగణపతి, 6. ఉచ్ఛిష్ట గణపతి, 7. ఏకాక్షర గణపతి, 8. కుమార గణపతి.

86. పంచభక్ష్య భోజనం అంటే ఏమిటి?

భక్ష్యము, భోజ్యము, లేహ్యము, చోష్యము, పానీయము, ఈ 5 విధాలైన పదార్థాలతోనూ కూడిన భోజనమే పంచభక్ష్య భోజనం. అంటే కొరికి తినేవి, నమిలితినేవి, చప్పరించితినేవి, నాకి తినేవి, జుర్రుకొని తినేవి, త్రాగేవీ అయిన అయిదు విధాలైన ఆహార పదార్థాలతో కూడిన భోజనం అన్నమాట.

87. గృహదేవతార్చనలో సాలగ్రామం తప్పక ఉండాలా?

శైవ, వైష్ణవ, శాక్తేయ, గాణాపత్య, సౌరమతాల మధ్య ఆనాటికి ఉండిన సంఘర్షణను, సాంఘిక కల్లోలాన్ని, రూపుమాపడానికి, వైదిక ధర్మంలో ఇవనీ అంతర్భాగాలేనని వివరించడానికి, సమన్వయం సాధించడానికి – శంకారచార్యులవారు పూజా విధానంలో పంచాయతన దేవతార్చన పద్ధతిని ప్రవేశపెట్టారు.

ఈ పంచాయతన విధానంలో గణపతి,సాలగ్రామం (విష్ణు రూపం), శివలింగం, శక్తి (దేవి),సూర్యుడు ఉంటారు. సర్వమతాలవారికీ అంగీకార్యమైన ఈ విధానం వేదమతంలో ఉన్న అనైకత్యాన్ని తొలగించడానికి; ఆనాడు ప్రబలంగా ఉన్న చార్వాకాది నాస్తిక మతాల ప్రభావాన్ని తప్పించడానికీ, జగద్గురువులైన శ్రీశంకర భగవత్పాదులవారు ఏర్పరచిన వ్యవస్థ ఇది. క్షీణదశలో ఉన్న హిందూ ధర్మం, వైదిక ధర్మం,శంకరాచార్యులవారి రాకతో - పునరుజ్జీవనం పొందింది. ఆ సేతు హిమాచలం పర్యటించి,నాస్తిక మతాలను సమూలంగా ఖండించి,వేద ధర్మానికిప్రాణం పోసి,ఉజ్జ్వలంగా వెలిగింపజేశారు శంకరులు. ఆదిశంకరులు ఏర్పరచిన ఈ పంచాయతన విధానమే ఈనాటికీ సంప్రదాయంగా నిలిచి ఉన్నది. అందువల్ల దేవతార్చనలో సాల గ్రామం ఉండవలసినదే.

88. కొందరు పురోహితులు సాల గ్రామం దగ్గరుచుకుంటారు కదా! ఎందుకు?

విధి విహితంగా ఏదైనాదానం చేసే సమయంలో, ఆ దానంతోపాటు సాలగ్రామాన్ని కూడా దానం చేయవలెనని శాస్త్రవాక్య ప్రమాణం.

దానంతోబాటు దక్షిణ,సాలగ్రామము ఇవ్వవలసి ఉంది. అయితే దాన మీయదలచిన ప్రతివారూ,అందునా ఈ రోజులలో సాలగ్రామాన్ని సిద్ధం చేసుకోని, ఉంచుకోవడం జరగదు కనుక, పురోహితులలోశాస్త్రం క్షుణ్ణంగా తెలిసిన వారు ఆ విధంగా సాలగ్రామాన్ని దగ్గర ఉంచుకుంటారు.

ఏదైనా స్వల్పదానం నుంచి కన్యాదానం వరకూ, శాస్త్రబద్ధమైన ప్రతివైదిక కార్యక్రమానికీ సాలగ్రామం అవసరం ఉంటుంది. అంతేగాక,ఏ విధమైన పూజా కార్యక్రమాలు చేయించవలసి వచ్చినా, వానిలో సాలగ్రామాన్ని ఉంచవలసి ఉంటుంది. ఈ దృష్టితో పురోహితులే సాలగ్రామాన్ని ఆయా గృహస్థుల అవసరాల నిమిత్తం తామే దగ్గర ఉంచుకొని ఉపయోగించడం జరుగుతుంది.

89. విష్ణువు ఆలయంలో ధ్వజ స్తంభానికి వరి కట్టడం ఎందుకు ?

పక్ష్యాదులకు ఆహారంగా ఉండడం కోసం ఆ విధంగా చేస్తారు. ఆలయాల్లోనేగాక, చాలా గృహాలలో కూడా చూరుకువరి వెన్నులు కడతారు. మనకున్నది పరులకు పెట్టడం, మానవులకే గాక పశుపక్ష్యాదులకు కూడా ఆహారాన్ని ఈయడం భారతీయసంస్కృతిలోని మహోన్నత ఆదర్శనం.

మానవుడు ప్రతి నిత్యము పంచ యజ్ఞాలు చేయవలసి ఉంది. అందులో భూత యజ్ఞం ఒకటి. సర్వజీవరాసులకు ఆహారాన్ని సమర్పించిన అనంతరమే గృహమేధి ఆహారాన్ని స్వీకరించాలి. అప్పుడు ఆ అన్నం హవిస్సుగా, అమృతంగా మారుతుందని చెప్పడింది.

విష్ణువు స్థితి కారకుడు కనుక, సర్వజీవుల సుస్థితిని ఆయన కనిపెట్టి ఉంటాడనేదానికి ఇది సంకేతం కూడా.

90. సంక్రాంతి మొదలైన విశేషదినాలు పుణ్యకాలమనీ, ఆ సమయంలో దానం చేయడం పుణ్యప్రదమనీ అంటారు. పుణ్యకాలమంటే ఏమిటి? అది ఎంతసేపు ఉంటుంది.?

సంక్రమణాలు సంవత్సరానికి పన్నెండు. ప్రతి మాసంలోను సూర్యుడు ఒక రాశి నుండి మరొక రాశిలోనికి ప్రవేశించడానికి సంక్రమణమని పేరు. ఈ ద్వాదశ సంక్రమణములూ పుణ్యకాలాలే - వీనిలో కొన్ని సంక్రాంతులలో సూర్యుని రాశి ప్రవేశానికి ముందు, మరికొన్ని సంక్రాంతులకు సూర్యుని రాశి ప్రవేశానంతరం, ఇకకొన్నింటికి , సూర్యుని రాశి సంక్రమణ కాలానికి ముందు వెనుకలలోనూ పుణ్యకాలం ఉంటుంది. ఆ సంక్రమణానికి సంబంధించిన పవిత్ర సమయం, పుణ్యప్రదమైన సమయం అది.

★ మేషసంక్రాంతి : దీనికి వసంత విషువత్ అని పేరు. ఇది సౌర సంవత్సరాది. మేషరాశి యందలి ప్రథమ భాగమందు సూర్యుని ప్రవేశకాలము. ఈ మేష సంక్రాంతికి పూర్వమందు దశఘడియలు, అనంతరమందు దశ ఘడియలు పుణ్యకాలం.

★ వృషభసంక్రాంతి :- దీని వలన ఏర్పడే పుణ్యకాలం - సంక్రమణ సమయానికి ముందు పదహారు ఘడియలు. దీనిని హరిపద పుణ్యకాలమని వ్యవహరిస్తారు.

★ మిధున సంక్రాంతి:- దీనికి షడశీతి పుణ్యకాలమని పేరు. ఈ మిధున సంక్రాంతికి అనంతరమందలి పదహారు ఘడియలు పుణ్యకాలం.

★ కర్కాటక సంక్రాంతి :- దీనికి దక్షిణాయన పుణ్యకాలమని పేరు. ఈ సంక్రమణానికి ముందు 30 ఘడియలు పుణ్యకాలము.

★ సింహసంక్రమణం :- దీనికి ముందు పదహారు ఘడియలు పుణ్యకాలం. దీనికి విష్ణుపదమని పేరు.

★ కన్యాసంక్రమణం :- దీని ప్రవేశానంతరం పదహారు ఘడియలు. -పుణ్యకాలం. దీనికి విష్ణుపదమని పేరు.

★ తులా సంక్రమణం :- దీనికి పూర్వమందు దశ ఘడియలు సంక్రమణాంతరమందు దశ ఘడియలు పుణ్యకాలం. ఈ సంక్రాంతికి ''శరద్విషువత్'' అని పేరు.

★ వృశ్చిక సంక్రాంతి :- దీనికి పూర్వమందు పదహారు ఘడియలు షడశీతి పుణ్యకాలం.

★ ధనుస్సంక్రాంతి: దీని అనంతరము పదహారు ఘడియలు పుణ్యకాలం. ఇది హరిపదపుణ్యకాలము.

★ మకర సంక్రాంతి :-దీని అనంతరము ఇరువది ఘడియలు ఉత్తరాయణ పుణ్యకాలం.

★ కుంభ సంక్రమణం :- దీనికి పూర్వం పదహారు ఘడియలు విష్ణుపద పుణ్యకాలం.

★ మీన సంక్రమణం :- దీని అనంతర షోడశ (16) ఘటికాపర్యంతం షడశీతి పుణ్యకాలం.

రాత్రి సమయాలందు సంక్రమణం జరిగినట్లయితే, సంక్రమణా తత్పూర్వం పుణ్యకాలం గల సంక్రాంతులకు ముందు రోజునను, సంక్రమణాంతరం పుణ్యకాలం గల సంక్రాంతులకు మరుసటి దినం సూర్యోదయం మొదలు పుణ్యకాలంగా పరిగణించాలి.

స్నాన, దాన, సంక్రాంతి వ్రతాలను ఆ పుణ్యకాలంగా చెప్పబడిన నిర్దిష్ట సమయంలోనే చేసినట్లయితే అంతులేని పుణ్యంకలుగుతుంది. సంక్రాంతి పుణ్యకాలాలలో చేయదగిన సంక్రాంతి వ్రతాదులున్నాయి. ఆ అంశంలో చెప్పవలసింది చాలా ఉంది.

91. 14 లోకాలు ఏవి?

భూలోకం, భువర్లోకం, స్వర్లోకం (ఇదే స్వర్గలోకం), మహర్లోకం, జనోలోకం, తపోలోకం, సత్యలోకం, ఇవి ఏడూఊర్ధ్వలోకాలు.

అతలము, వితలము, సుతలము, తలాతలము, రసాతలము, మహాతలము, పాతాళము. ఇవి ఏడూ అధోలోకాలు. 14 లోకాలన్నా, చతుర్దశ భువనాలన్నా ఇవే.

92. అష్టదిక్పాలకులెవరు?

తూర్పు దిక్కుకు అధిపతి ఇంద్రుడు, ఆగ్నేయానికి అధిపతి అగ్నిదేవుడు, దక్షిణ దిక్కుకు అధిపతి యముడు, నైరుతి దిక్కుకు అధిపతి నిర్వతి, పడమర దిక్కుకు అధిపతి వరుణుడు, వాయువ్య దిక్కుకు అధిపతి వాయుదేవుడు, ఉత్తరదిక్కుకు అధిపతికుబేరుడు, ఈశాన్య దిక్కుకు అధిపతి ఈశానుడు.

93. అష్ట దిక్పాలకులు పాలించే పట్టణా లేమిటి ?

ఇంద్రుని నగరం అమరావతి, అగ్నిదేవుని పట్టణం పేరు తేజోవతి యమునిపట్టణం సంయమని, నిర్వతి పట్టణం పేరు కృష్ణాంగన, వరుణుని పట్టణం పేరు శ్రద్ధావతి, వాయువు పట్టణం పేరు గంధవతి, కుబేరునిది అలకానగరం, ఈశానునినగరం యశోవతి.

94. తాతాచార్యముద్ర భుజం తప్పినా వీపుతప్పదు'' – వివరించండి.

శ్రీకృష్ణ దేవరాయలకు వైష్ణవ మత దీక్ష ఇచ్చిన వైష్ణవ గురువుల నామధేయం తాతాచార్యులని వింటున్నాము. అదే విధంగా తంజావూరు నాయకరాజులలోని వాడైన విజయరాఘవ నాయకుని దీక్షా గురువు శ్రీనివాస తాతాచార్యులని – రంగాజమ్మ వ్రాసిన మన్నారు దాసవిలాసప్రబంధ – యక్షగానాల ఆధారంగా తెలియవస్తున్నది. సారాంశంగా తాతాచార్యులనే నామం – వైష్ణవ మతగురువులదని తెలుస్తున్నది.

ఎవరికైనా వైష్ణవ మత దీక్షను ఇచ్చేసందర్భంలో స్వీకరించే వారి భుజాల వద్ద – శంఖ చక్రాల ముద్రలను కాల్చి వాటితో గుర్తులు వేసే సంప్రదాయం ఉన్నది. దీక్షను స్వీకరించేవారికి ఈ ముద్రలను వైష్ణవ గురువులు వేస్తూ ఉంటారు. ఈ ఆచారం ఈనాటికీ కొనసాగుతోంది.

రాయల గురువైన తాతాచార్యులవారు, వైష్ణవ మతాచారాల విషయంలోచాలా పట్టుదలగా ఉండేవారట. వైష్ణవ మత దీక్షను స్వీకరించదలచిన శిష్యులు తీరా ఆ సమయానికి ఈ ముద్రల సంగతి తెలిసి భయంతో వెనుకంజ వేయబోయినా తాతాచార్యులవారు వారిని వదలక ముద్రలు వేసేవారట. గింజుకొంటున్నవారిని పట్టుకొని ముద్రవేయడంలో ఒక్కొక్కప్పుడు ఆ ముద్ర భుజాలమీద పడవలసినది వీపుమీద పడడం జరుగుతుంది కదా! మొత్తం మీద ఎక్కడో ఒకచోట ముద్రవేసి తీరవలసిందే. తాతాచార్యులవారి పట్టుదల అటువంటిది. అందుకే తాతాచార్య ముద్ర భుజం తప్పినా వీపుతప్పదనే మాట వాడుకలోకి వచ్చింది.

తప్పించుకొని పోలేని తప్పనిసరి పరిస్థితిని వర్ణించే సందర్భంలో ఈ విధంగా అనడం అలవాటుగా మారింది.

95. నోము నోచుకునే స్త్రీలు – తమకన్నా చిన్నవారైన ముత్తైదువుల కాళ్లకు నమస్కరిస్తారు ఎందుకు? చిన్నవారి కాళ్లకు నమస్కరిస్తేఆయుక్షీణం అంటారుకదా?

చిన్నవారైనా పెద్దవారైనా వారిని దేవీ స్వరూపంగా భావించి అర్చించడం జరుగుతుంది. అందువల్ల దోషంలేదు.

96. బ్రహ్మదేవుడు వివాహితుడు కదా? పెళ్లికాని వారిని బ్రహ్మచారులు అని ఎందుకు అంటారు?

త్రిమూర్తులోనివాడూ, సరస్వతీనాథుడూ అయిన బ్రహ్మదేవునికీ, బ్రహ్మచారికీ సంబంధలేదు. వేద, ఉపనిషత్ ప్రతిపాదితమైన బ్రహ్మ పదార్థమనే మహాతత్వానికి సంబంధించి ఈ బ్రహ్మశబ్దాన్ని వాడడం జరిగింది.

''బ్రహ్మణి చరతీతి ఇతి బ్రహ్మచారీ''

ఆ బ్రహ్మపదార్ధాన్ని తెలుసుకొనే అన్వేషణా మార్గంలో ఉన్నాడనే అర్థంతో ఈ పదప్రయోగం చేశారు.

ఐహిక లంపటాలకు దూరంగా, బ్రహ్మ పథానువర్తిగా బ్రహ్మమార్గగామిగా ఉన్న వ్యక్తి అని చెప్పడమే ఈ శబ్దపరమార్థం.

(ఈ సందర్భంగా మరొక విషయం. రసానందాన్ని ''బ్రహ్మానంద సబ్రహ్మచారి'' అని అనడం కద్దు)

97. మంసాహారులైన చాలా మంది హిందువులు గురువారం కానీ, శనివారం కానీ, మాంసం, చేపలు, గ్రుడ్లు లాంటివి తినరు. కానీ మిగతా రోజులలో తింటుంటారు. ఇలా కొన్ని ప్రత్యేక దినాలలో మాత్రమే తినకపోవడానికి కారణమేమిటి ?

''ఆమిషం మధుపానం చయఃకరోతి రవేర్దినే

సప్తజన్మ భవేద్రోగీ జన్మ జన్మ దరిద్రతా'' అని చెప్పబడింది.

అంటే ఆదివారం నాడు మాంసభోజనము, మద్యపానమూ చేసినవాడు ఏడు జన్మల పర్యంతం రోగగ్రస్తుడుగానూ దరిద్రుడుగానూ కాగలడని అర్థం.

''స్త్రీతైల మధు మాంసాని యస్త్యజేత్తు రవేర్దినే

నవ్యాధి శోక దారిద్ర్యం సూర్యలోకం సగచ్ఛతి ''

అని కూడా చెప్పబడింది.

అంటే – ఆదివారం నాడు స్త్రీని, నూనెనూ, మద్యాన్నీ, మాంసాన్నీ విడిచిపెట్టిన వాడు – వ్యాధినీ, శోకాన్ని దారిద్ర్యాన్నీ పొందడు. అట్టివాడు సూర్యలోకాన్ని చేరుకుంటాడని అర్థం.

కాబట్టి ఆదివారం నాడు మాంసాదిగా గల పైన చెప్పిన పదార్థాలను స్వీకరించకూడదు. ఆదివారం నాడే గాక – గురువారం, శనివారం, మంగళవారం ఇత్యాది దినాలలో కూడా వార నియమం కలవారు మాంసాది పదార్థాలను స్వీకరించకూడదు. అది నియమం.

98. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం అని నాలుగు యుగాల పేర్లు మీరు చెప్పారు. వాటిలో ఏ యుగానికి ఎన్ని సంవత్సరాలో తెలుపగలరు.

కృతయుగ ప్రమాణం 17 లక్షల 20 వేల సంవత్సరాలు. త్రేతాయుగ ప్రమాణం 12 లక్షల 96 వేల సంవత్సరాలు. ద్వాపరయుగ ప్రమాణం 8 లక్షల 64 వేల సంవత్సరాలు. కలియుగ ప్రమాణం 4 లక్షల 32 వేల సంవత్సరాలు.

99. మతం అంటే అర్థం ఏమిటో వివరించండి?

'మతం' అనే పదానికి అభిప్రాయం అని మాత్రమే అర్థం ఉంది. చాలామంది అనుకునే 'రెలిజియన్' అనే అర్థం కాదు. భారతీయులది సనాతన ధర్మమేకాని,రెలిజియన్ కాదు. అందుకే రెలిజియన్ అనే అర్థానికి సరిపడేపదం మన భారతీయ భాషలలో, ముఖ్యంగా సంస్కృతంలోలేదు. మతం అంటే స్కూల్ ఆఫ్ థాట్ అని అర్థం.

మతం అనే పదాన్ని స్కూల్ ఆఫ్ థాట్ అనే అర్థంలోనే పూర్వం నుంచీ వాడడం జరుగుతున్నది. ఉదాహరణకు, జ్యోతిశ్శాస్త్రంలో

పరాశరమతం, జైమినిమతం ఇత్యాదిగా, ఇలాగే అన్ని శాస్త్రప్రసక్తి ప్రసంగాలలోకూడా వ్యాఖ్యానించవచ్చును.

100. అష్టవిధ నాయికల లక్షణాలేమిటి? వారి పేర్లేమిటో వివరించగలరు?

అష్టవిధ నాయకల పేర్లు, వారి లక్షణాలు ఈక్రింది ఇస్తున్నాను.

1. స్వాధీన పతిక : తాను కోరినట్లు ప్రవర్తించే స్వాధీనుడైన భర్తను కలిగిన నాయిక.
2. అభిసారిక : అలంకారం చేసుకొని నాయకుని కోసమై ముందుగా నిర్ణయించుకొన్న సంకేత ప్రదేశానికి వెళ్ళే నాయిక.
3. వాసక సజ్జిక : నాయకుడు (భర్త) రాబోతున్నాడని పడకటింటిని అలంకరించే నాయిక.
4. విరహోత్కంఠిత : సంకేత స్థలానికి నాయకుడు రాకపోవడం చేత విరహంతో బాధపడే నాయిక.
5. ప్రోషిత భర్తృక : భర్త దూరదేశానికి వెళ్లగా అతనిని గురించి చింతించే నాయిక.
6. ఖండిత :- నాయకుడు తన ఇంటికి రాగా అతడు తన సపత్ని (అతని మరొక భార్య) వద్దకు వెళ్లివచ్చిన చిహ్నాలను గుర్తించి అసూయపడే నాయిక.
7. కలహాంతరిత : నాయకుని అవమానించి, కోపంతో వెళ్ళగొట్టి - అనంతరం పశ్చాత్తాపపడే నాయిక.
8. విప్రలబ్ధ : అనుకొన్న సమయానికి నాయకుడు రాకపోగా - నాయకుని రమ్మని సందేశాన్ని పంపే నాయిక.

101. దేవాలయాలపై నగ్న శిల్పాలు ఎందుకు ?

దేవాలయాలపై నగ్న శిల్పాలు ఉండడానికి కారణం - కామశాస్త్రాన్ని ఒక కళగా ప్రాచీనులు ఉపాసించడమే. దీనికి నిదర్శనం - మహర్షియైన వాత్స్యాయనుడు కామసూత్రాలను వ్రాయడం,.

ప్రాచీన కాలంలో దేవాలయాలు - కళా విద్యా,సాంస్కృతి కేంద్రాలుగా ఉండేవి. అందువల్ల - ఆ శాస్త్రానికి ప్రాచుర్యం లభించడానికీ, తద్వారా ప్రజా బాహుళ్యానికి పరిచయం కలగడానికీ వీలుగా ఉండేటట్లు - కామశాస్త్రాన్ని శిల్పరూపంలో పదుగురూ సంచరించే దేవాలయాలపైన చిత్రించేవారు.

102. రుద్రాక్షలు,దేవతా ప్రతిమలు ఇలాంటివి మెడలోకాని, చేతికి కాని ధరిస్తారు. వీటిని సంసారులు రాత్రి సమయంలోనూ, లేదా దినచర్యలోని లఘుశంకలు, దీర్ఘశంకలు తీర్చుకొనే సమయంలోనూ - శరీరంపైన ధరించ వచ్చా లేదా తీసి పక్కన పెట్టాలా? తెలియచేయ కోరుతున్నాము.

దినచర్యలో శరీరానికి అశుచి కలిగే ఆయా సమయాలలో రుద్రాక్షలు, యంత్రాలు, దేవతామూర్తుల వంటి వాటిని శరీరం మీద ధరించకూడదు. ముందుగానే తీసి పక్కన పెట్టాలి. శుచిగా, మడిగా ఉన్నప్పుడే వాటిని ధరించాలి.

103. కొన్ని పుస్తకాలలో నారాయణ ఋషి పూర్వజన్మలో కపిల మహాముని - అని ఉంది. కొన్ని పుస్తకాలలో విష్ణుమూర్తి అవతారంగా నారాయణ ఋషి - శ్రీకృష్ణుడిగా జన్మించారని ఉంది. ఈ వ్యత్యాసాన్ని వివరిచి నా సందేహం తీర్చగలరని ఆశిస్తున్నాను.

ఆది ఋషులైన నరనారాయణులే శ్రీకృష్ణార్జునులుగా జన్మించారు. నారాయణ ఋషిగానూ, కపిలమహర్షిగానూ అవతరించినది

శ్రీమన్నారాయణుడే. ఆ శ్రీమన్నారాయణుడే శ్రీకృష్ణుడుగానూ అవతరించాడు.

104. మా నాయనమ్మ సాయంత్రం సంధ్యవేళ తినవద్దని అనేది. ఆ సమయంలో భోజనం చేయకూడదా? అలాగే సెకండ్‌షోకువెళ్ళొచ్చి రాత్రి12 గంటలకు తింటామన్నా వద్దనేది. అది రాక్షసులతిండి అన్నట్లు గుర్తు. సాయంత్రం 5, 6 గంటలసమయంలో టీ, టిఫిన్,లేదా శ్నాక్స్ - ఏదో తినడం సామాన్యంగా అందరూ చేస్తుంటారు కదా? ఇది కూడా మంచిది కాదా? కొందరు సూర్యాస్తమయానికి ముందే తినాలంటారు. ఏది మంచిదో కన్‌ఫ్యూజింగ్‌గా ఉంది.

సృష్టిలో అన్ని జీవరాసులకూ ఎవరి సమయం వారికి ఏర్పరచాడు భగవంతుడు. అడవిలో జంతువులు సహజ జ్ఞానం చేత ఆ ఏర్పాటును బట్టే నడుచుకుంటాయి. రాత్రి మొదటి జాము మానవసంచార సమయం. రాత్రి 4వ జాము దేవతా సంచార సమయం. రాత్రి మొదటి జాము ముగిసేలోపున మానవులు తమ ఆహార విహారాదులు ముగించుకొని నిద్రించాలి. పిశాచసంచార సమయం అయిన అర్ధరాత్రిలో తినకూడదు. తిరగకూడదు. అలాగే సాయంకాలం అసుర సంధ్యాసమయం. ఆ సమయంలో కూడా తినకూడదు. రావణుని-తల్లియైన కైకసి అసుర సంధ్యాసమయంలో సంతానార్థినియై విశ్రవో బ్రహ్మను కోరడం వల్లనే ఆమెకు రాక్షసులు, క్రూరులు జన్మిస్తారని విశ్రవో బ్రహ్మ చెప్పాడు. విశ్రవో బ్రహ్మ అనుగ్రహం వల్ల ఆఖరివాడు మాత్రం ధర్మాత్ముడుగా జన్మించాడు. (విభీషణుడు)

105. విఘ్నేశ్వరునికి ఎంత మంది భార్యలు? వారి పేర్లేమి? విఘ్నేశ్వరుని కుమారులెవరు? ఆయన భార్యలు ఎవరి కుమార్తెలు?

విఘ్నేశ్వరుని భార్యలు ఇద్దరు. వారి పేర్లు సిద్ధి, బుద్ధి, విఘ్నేశ్వరుని భార్యలైన సిద్ధి, బుద్ధి-దేవశిల్పియైన విశ్వకర్మ కుమార్తెలు.

106. గుడికి దైవదర్శనానికి వెళ్లేటప్పుడు పాటించవలసిన పరిశుభ్రతా నియమాలు ఏమిటి? ఏ సమయంలోనైనా గుడికి వెళ్లవచ్చునా? వివరించగలరు.

గుడికి మధ్యాహ్నకాలంలోనూ అర్ధరాత్రిలోనూ వెళ్లకూడదు. ప్రాతఃకాలంలోనూ సాయం కాలంలోనూ, మాత్రమే వెళ్లాలి. స్నానంచేసి, మడిగా ఆరవేసిన బట్టలతో శుచిగా గుడికి వెళ్లాలి. జాతాశౌచ మృతాశౌచాలు - అంటే పురుడు, మైల కలిగినప్పుడు గుడికి వెళ్లకూడదు. స్త్రీలకు బహిష్టు సంభవించిన రోజులలో వారు గుడికి వెళ్లకూడదు. ఇంట్లో వేటినీ తాకకుండా వేరుగా వుండాలి - అది అశుచి అని మహర్షులు శాసించారు కనుక.

107. 'ఓం తత్సత్' - దీనిని వివరింప ప్రార్థన. పారాయణ శబ్ద ఉచ్చారణ దోషములను ఇది తొలగించునా?

ఓం, తత్, సత్ - అనే శబ్దాలకు భగవంతుడని అర్థం. ఆ భగవంతుని చేత సృష్టి ప్రారంభంలో వేదాలు, యజ్ఞాలు, విప్రులూ సృష్టించబడడం జరిగింది. ఈ ఓం, తత్, సత్-అనే శబ్దాలు భగవంతుని సూచిస్తాయి. వేదాలకు, యజ్ఞాలకు, విప్రులకు - ఈ ఓం, తత్, సత్ శబ్దాల వల్ల పావనత్వం కలుగుతుందని చెప్పబడింది. వాటిలో ఏ లోపాలున్నా అవి ఈ శబ్దాల ఉచ్చారణ వల్ల ఆలోపాలు తొలగిపోతాయి. కనుక పారాయణ శబ్ద ఉచ్చారణదోషాలు కూడా వీటిని ఉచ్చరించడం వల్ల నశిస్తాయి. పారాయణ దోషాలు నశించడానికి ఈ క్రింది శ్లోకాన్ని కూడా చదువుకోవచ్చును.

శ్లో. : యదక్షర పదభ్రష్టం ! మాత్రాహీనంతు యద్భవేత్!
తత్సర్వం క్షమ్యతాం దేవ! నారాయణ నమోస్తుతే!!

108. ఇంట్లో ఏదైనా యంత్రంగాని దేవతాప్రతిమకాని మధ్యలో అరిగి చిల్లుపడినా, విరిగిపోయినా - దానికి పూజ చేయవచ్చా? చేయకూడదా? లేనిచో ఎందుకు చేయకూడదో చెప్పవలెను. వాటిని ఏమి చేయాలో కూడా చెప్పండి.

విరిగినవీ, పోయి చిల్లులు పడినవీ అయిన విగ్రహాలకు, యంత్రాలకూ, చిరిగిన పటాలకూ పూజ చేయకూడదు. వాటిని ప్రవాహజలంలో కలిపివేయాలి. వాటికి ఎందుకు పూజ చేయకూడదు - అంటే, మహర్షులు ఆ విధంగా శాసించారు కనుక.

109. నవ విధ భక్తులనగా ఏమి?

1. శ్రవణం, 2. కీర్తనం, 3. స్మరణం, 4. పాదసేవనం, 5. అర్చనం, 6. వందనం, 7. దాస్యం, 8. సఖ్యం, 9. ఆత్మనివేదనం.

ఈ పైన చెప్పినవే నవవిధ భక్తిమార్గాలు. అంటే తొమ్మిది విధాలైన భక్తిమార్గాలు. వీటిలో ఏ ఒక్కదాన్నైనా పరిపూర్ణంగా ఆచరించి భగవంతుని చేరుకోవచ్చునని చెప్పబడింది. ఆ విధంగా ఈ తొమ్మిది విధాలైన భక్తిమార్గాల ద్వారా భగవంతుని చేరుకొన్న పరమ భాగవతోత్తములు ఎందరో ఉన్నారు.

110. షోడశ సంస్కారాలేవి ?

షోడశ సంస్కారాలు ఈ క్రిందివి :

1. ఆధానము, 2. పుంసవనము, 3. సీమంతము, 4. జాతకర్మము
5. నామకరణము, 6. అన్నప్రాశనము, 7. చౌలము, 8. ఉపనయనము
9. ప్రాజాపత్యము , 10. సౌమ్యము, 11. ఆగ్నేయము 12.వైశ్వదేవము,
13. గోదానము, 14. సమావర్తనము, 15. వివాహము 16. అంత్యకర్మ

111. శ్రీకృష్ణులవారినైనా, దుర్గామాతనైనా, శ్రీ వేంకటేశ్వరులనైనా, మహాశివునైనా - ఈ దేవుళ్లనెలపూజించాలి? ప్రదక్షిణం చేసే ముందు కుడివైపు నుంచి మొదలు పెట్టాలా? లేక ఎడమ వైపునుంచా?

ఏ దేవతలనైనా షోడశోపచారాలతో అంటే - 16 ఉపచారాలతో పూజించాలి. (ధ్యానం, ఆవాహనం మొదలగు ఉపచారాలు) ఆ దేవతలకు సంబంధించిన అష్టోత్తర శతనామావళితో కాని, సహస్ర నామావళితోకాని, పూజించవచ్చును. (వీలునూ, ఆసక్తినీ బట్టి) ప్రత్యేక వ్రతాలుచేసే

సందర్భంలో మాత్రం ఆయా వ్రతకల్పాలలో చెప్పిన ప్రకారం పూజించాలి. ప్రదక్షిణం కుడిచేతిమీదుగా చేయాలి. దేవుని చుట్టూ చేయాలిగాని, దేవుని ముందు గుండ్రంగా తిరగరాదు.

112. భగవంతుడు నిజానికి నిర్వికారుడు. సర్వాంతర్యామి. మరి మనం విగ్రహం చేసి పూజిస్తాము. ఇది ఎంతవరకు సమంజసం ?

దేవుడు నిర్వికారుడు అన్నది నిజమే. కానీ నామరూప రహితమైన దైవాన్ని ఉపాసించడం అనేది - సాధారణులకు సాధ్యం కాని విషయం. సామాన్యులకు దైవాన్ని భావన చేయడానికి నామరూప సహితమైన ఆలంబనం కావాలి. ఆ ఆలంబనం కోసమే విగ్రహాన్నో,చిహ్నాన్నో పూజించడం. నిర్గుణోపాసన చేయగలగాలంటే – ఒక స్థాయి దాటి పరిణతి చెందిన వ్యక్తులకే సాధ్యం.

113. దేవుని ఫోటోలు - రంగు వెలిసి పోయి జీవంలేనట్టుగా ఉంటే - తీసివెయ్యాలా? లేక మాకు ఆ ఫోటో వల్ల కలిసివచ్చింది అనే సెంటిమెంటు వున్నప్పుడు కొత్త ఫోటో మార్చుకోవచ్చా?

దేవుని ఫోటోలు, చిత్రపటాలు – చిరిగిపోయినా రంగువెలసి పాడైనా ఆ ఫోటోను తీసి వెయ్యదల్చుకుంటే దాన్ని ప్రవాహ జలంలో కలిపి వెయ్యాలి.కావాలనుకుంటే అదే దేవుని పటాన్ని కొత్తది తెచ్చి పెట్టుకోవచ్చును. చిరిగిన పటాలు,విరిగిన విగ్రహాలూ మాత్రం ఎక్కడా ఇక్కడా పారేయక – ప్రవాహజలంలోనే కలపాలి.

114. గాంధారీ ధృతరాష్ట్రులను తనకు అత్తమామలుగాకుంతి ఆశ్రమవాస పర్వంలో ప్రస్తావించడం, వారిని సేవించుకుంటాననడం- అందలి పరమార్థం ఏమిటి ?

'రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజా!

అయోధ్యా మటవీం విద్ధి గచ్ఛతాత యథాసుఖమ్!'

అని బోధిస్తుంది- లక్ష్మణునికి సుమిత్రాదేవి. అరణ్య వాసి కాబోతున్న శ్రీరామచంద్రుని వెంబడించదలచిన లక్ష్మణునికి ఆ తల్లి చేసిన ఉపదేశమిది.

''నాయనా! నీ అన్న శ్రీరాముని తండ్రిగారైన దశరథ మహారాజు వలెను, జానకీదేవిని నావలెను. గ్రహించు.(అన్నను తండ్రిగా,వదినను తల్లిగా భావించు) అడవినే అయోధ్యగా భావించు. సుఖంగా వెళ్లిరా తండ్రీ! అని చెప్పింది సుమిత్ర.

అన్నగారిని, ముఖ్యంగా జ్యేష్ఠసోదరుని తండ్రిగాను,వదినను తల్లిగాను భావించమనడం మనకు క్రొత్తది కాదు. ఉత్తమమైన ఆర్ష సంప్రదాయం అది. పరికించండి.

'అన్నదాతా భయత్రాతా విద్యాదాతా తథైవచ!

జనితా చ ఉపనేతాచ పంచైతే పితరఃస్మృతాః!!'

అన్నదాతా, భయం నుంచి కాపాడినవాడు, విద్యాదాత, జన్మకు కారకుడైనవాడు,ఉపనయనం చేసిన వాడు-ఈ అయిదుగురూ తండ్రులుగా భావించవలసినది.

'గురుపత్నీరాజపత్నీ జ్యేష్ఠభ్రాతృకుటుంబినీ
పత్నీమాతా స్వమాతాచ పంచైతా మాతరః స్మృతాః ।

గురుపత్ని, రాజపత్ని, జ్యేష్ఠ భ్రాతృ కుటుంబిని (పెద్ద అన్నగారి భార్య), తన భార్యయొక్కతల్లి,తననుకనినస్త్రీ – అయిదుగురినీ తల్లులుగా భావించవలసినది. ఆ విధంగా పాండురాజుకు మాతా పితృ స్థానీయులైన గాంధారీ ధృతరాష్ట్రులను- కుంతి తనకు అత్తమామలుగా పేర్కొనడంలో అసంబద్ధమైన విషయమేమీ లేదు. అయితే, వారిని తనకు అత్తమామలతో సమానులనికానీ, అత్తమామల వంటివారని కానీ పేర్కొనక,'అత్తమామలే' అని నిర్ధారణతో పలుకడంలోని అభిప్రాయం ఏమై ఉంటుందని కదా

సందేహం! గాఢమైన,అత్యధికమైన ప్రత్యయం కలచోటున ఆ విధంగా నిర్ద్వంద్వంగా,సందేహాతీతంగా స్పష్ట పరచి చెప్పడం అసాధారణం కాదు. ఉదాహరణగా వీనిని గమనించండి.

'త్వమేవ మాతాచ పితాత్వమేవ,
త్వమేవ బంధు శ్చసఖా త్వమేవ!
త్వమేవ విద్యాద్రవిణం త్వమేవ!
త్వమేవ సర్వం మమ దేవ దేవ!'
'నీవే తల్లివి తండ్రివి
నీవే నా తోడు నీడ నీవే సఖుడా
నీవే గురుడౌ దైవము
నీవే నాపతియు గతియు నిజముగ కృష్ణా!'

పై సందర్భాలలో 'త్వమేవ - నీవే' అంటూ సంశయాతీతంగా చెప్పడమే జరిగిందిగానీ,'నీవు నాకు అంతటి వాడవు,అంతకు సమానుడవు' అని చెప్పబడలేదు. ఖచ్చితంగా చెప్పడం కోసము, నిశ్చయాత్మకమైన తన మనః స్థితిని వెల్లడించడం కొరకే కుంతి ఆ విధంగా చెప్పిందికాని, వారిమధ్య మరొక విధమైన చుట్టరికం ఏమీలేదు. భారతాన్ని తరచి చూస్తే ఆ విషయం అవగాహన కాగలదు.

115. సుబ్రహ్మణ్యేశ్వరుడు, నాగేంద్రుడు, కుమారస్వామి, వీరు ముగ్గురూ ఒక్కరేనా? మనకు ముక్కోటి దేవతలు ఉన్నారు. అందరినీ పూజించాలా లేక ఏ ఒక్కరిని పూజించినా అందరికీ చెందుతుందా?

సుబ్రహ్మణ్యేశ్వరుడన్నా, కుమారస్వామీ అన్నా , నాగేంద్రుడన్నా ఒక్కరే. ముక్కోటి దేవతలలో ఒక్కొక్క ఫలితం కోసం ఒక్కొక్కరిని పూజించాలి. ఏఒక్కరిని పూజించినా అందరికీ చెందుతుంది.

''సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి!
సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి!!''

116. వేదములలో గాని, ఉపనిషత్తులలోగాని, బ్రహ్మసూత్రాలలో గాని, భగవద్గీతలో గాని చెప్పని హిందూమతం మానవుడు చనిపోయినప్పుడు జరిపించే అపరకర్మలు ఏ శాస్త్ర ప్రకారం జరిపిస్తున్నదీ వివరించగలరు?

మానవుల ప్రవర్తనా నియమావళిని, విధి నిషేధాలనూ నిర్దేశించే ధర్మ శాస్త్రాలు, స్మృతుల ప్రకారం శుభాశుభ కార్యక్రమాలు జరుగుతాయి. వాటికి అవే ప్రమాణ గ్రంథాలు.

117. 'రుద్రోవా ఏష అగ్నిః' రుద్రుడే అగ్ని స్వరూపుడు అని శైవం చెప్తుంది. 'అగ్నిర్నారాయణో భగవాన్' – నారాయణుడే అగ్ని స్వరూపుడు అని వైష్ణవం చెప్తుంది. ఇంతకీ ఏది ప్రమాణమో తెలియచేయగలరు.

రెండూ ప్రమాణమే. శివకేశవులకుభేదం లేదు. అవి వేద వాక్యాలు. వేద వాక్యాలు నిస్సందేహంగా ప్రమాణాలు.

118. శివ భగవానుని అర్ధనారీశ్వరుడు అంటారు. ఎందుకు?

గౌరిదేవికి శివుడు తన శరీరంలో సగబాగాన్నిచ్చి - అర్ధనారీశ్వరుడుయ్యాడు.

119. నవదుర్గల పేర్లేవి?

1. శైలపుత్రి, 2. బ్రహ్మచారిణి, 3. చంద్రఘంట, 4. కుష్మాండ, 5. స్కందమాత, 6. కాత్యాయని, 7. కాళరాత్రి, 8. మహాగౌరి, 9. సిద్ధిదాత్రి – ఇవి నవదుర్గల పేర్లు.

120. స్త్రీ అయిన భృగువు భార్యను శ్రీహరి చంపిన చరిత్ర ఉందని చదివాను. శ్రీహరి ఎందుకు చంపవలసివచ్చింది?

ఒకానొకప్పుడు భృగుమహర్షి భార్య రాక్షసులకు ఆశ్రయం ఇచ్చిన సందర్భంలో అలా జరిగింది.

121. పూజచేసే సమయంలో తూర్పు, లేదా ఉత్తరముఖంగా కూర్చుని చెయ్యాలంటారు. మరికొన్ని చోట్ల దేవాలయాలలో దేవతా విగ్రహాలు తూర్పుముఖంగానూ, మరికొన్నిచోట్ల పడమర ముఖంగానూ ప్రతిష్ఠించారు. ఇది మంచి పద్ధతేనంటారా? వివరించండి.

ఇళ్లలో పూజ చేసే విషయం వేరు. దేవాలయాలు ఆగమశాస్త్ర ప్రమాణాన్ని అనుసరించి నిర్మించబడతాయి. కాబట్టి దానికీ దీనికీ సంబంధం లేదు.

122. కుచేలుడు ఒకరా ఇద్దరా? వీరిలో వేంకటేశ్వరస్వామి వివాహానికి అప్పు ఇచ్చినవారెవరు? శ్రీకృష్ణుని వద్దకు వచ్చినవారెవరు? దయచేసి తెలుపగలరు.

వేంకటేశ్వరస్వామి వివాహానికి అప్పు ఇచ్చినవారు కుబేరుడు. శ్రీకృష్ణుని వద్దకు వచ్చినవారు కుచేలుడు. వారిద్దరూ ఒకరుకాదు. వేరు వేరు వ్యక్తులు.

123. పంచ మహాపురుష యోగములు ఏవి? పంచమహా పాతకాలేవి?

హంసయోగం, మాలవ్యయోగం, రుచకయోగం, భద్రయోగం, శశయోగం – ఇవి పంచ మహాపురుషయోగాలు. స్వర్ణస్తేయం, సురాపానం, బ్రహ్మహత్య, గోహత్య, గురుపత్నీ గమనం – ఇవి పంచ మహాపాతకాలు. ఇందులో గోహత్యకు బదులు – మహాపాతక సహవాసమని పాఠాంతరం.

124. శివాలయంలో, అయ్యప్ప, శిరిడీ సాయినాథుల ఆలయాలు నిర్మిస్తున్నారు. ఒకే ప్రాంగణంలో ఇలా వివిధ ఆలయాలు నిర్మించడానికి శాస్త్రప్రమాణం ఏదైనా ఉందా?

ఒకే ఆలయంలో వివిధ దిక్కులలో ఆగమశాస్త్ర ప్రమాణ రీత్యా వివిధ దేవతలను ప్రతిష్ఠించవచ్చును. దానికెలాంటి అభ్యంతరమూ లేదు.

ఆగమశాస్త్రరీత్యా- దేవాలయంలో వివిధ దిక్కులలో ఆయా దేవతలను ప్రతిష్ఠించక పోయినా - ఆయాదేవతలు అక్కడ ఆయా దిక్కులలో ఉన్నట్లుగానే భావించడం జరుగుతుంది.

125. పెద్దలు దీవించేటప్పుడు 'అష్టలక్ష్మీ ప్రాప్తిరస్తు' అంటారుకదా? మనం పూజించే అష్టలక్ష్మీ దేవతలు, పెద్దలు దీవించే అష్టలక్ష్మీ దేవతలూ ఒకరేనా?

ఒకరే.

126. యోగ్యుడని ఇవ్వాలి అని కొన్నింటిని కొంతమందికిస్తాము. ఫలాపేక్షతో కొన్నింటినిస్తాము. ఇష్టం లేకపోయినా అయోగ్యులకు కూడా తప్పనిసరై విసుగుతో కొన్నింటినిస్తాము. ఈ మూడింటికి తేడా ఉందా? ఇవి ఎలాంటి దానాలు?

దానాలు మూడు విధాలు. అవి. 1. సాత్త్వికదానం, 2. రాజసిక దానం, 3. తామసికదానం.

ఏ పనినైనా దేశకాల పాత్రములు విచారించి చేయడం ముఖ్యమని మహర్షులు బోధించారు. అంటే ఆ పనిచేసే స్థలమూ, కాలమూ, ఎవరినుద్దేశించి చేస్తున్నామో ఆ వ్యక్తి యొక్క పాత్రత (అర్హత) వీటిని విచారించి - విచక్షణతో చేయాలి.

దానం చేసే విషయంలో - దానం చేసే స్థలమూ, కాలమూ, అర్థియొక్క పాత్రతనూ గుర్తించి చేయాలి. అట్టి దానమే శ్రేష్ఠం.

పవిత్ర పుణ్యక్షేత్రాలలో - గ్రహణకాలాల వంటి పర్వకాలాలలో - యోగ్యత కలిగిన ఉత్తమ పాత్రునకిచ్చే దానం వల్ల అనంతమైన పుణ్యం లభిస్తుంది.

ఆ విధంగా దేశకాల పాత్రాలను విచారించి - ప్రతిఫలాన్ని కోరకుండా కర్తవ్యతా బుద్ధితో ఇచ్చేది సాత్త్వికదానం. దానాన్ని తీసుకొనే వ్యక్తి నుంచి కాని,

భగవంతుని నుంచి కాని ప్రతిఫలాన్ని కోరి – మనస్సులో ఇష్టం లేకుండా ఇచ్చేదానం రాజసికదానం.

దేశకాల పాత్రాలను విచారించక – తీసుకొనే వ్యక్తిని కించపరుస్తూ ఇచ్చేదానం తామసిక దానం. దీనికి ప్రమాణం.

''దాతవ్యమితి యద్దానం దీయతేఽ నుపకారిణే!
దేశేకాలేచ పాత్రేచ తద్దానం సాత్త్వికం స్మృతమ్ ।
యత్తుప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్యవా పునః ।
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్
అదేశకాలే యద్దానం అపాత్రేభ్యశ్చ దీయతే!
అసత్కృత మవజ్ఞాతం తత్తామస ముదాహృతమ్!''

127. శిష్టులైన వారు కొన్ని కొన్ని ఆహార పదార్థాలను ఎందుకు పరిహరిస్తారు. (తినరు –స్వీకరించరు)? సాత్త్వికాహారాన్నే తినాలని ఎందుకంటారు? తినే ఆహారాన్ని బట్టి మానవుల స్వభావంలో మార్పులుంటాయా? అసలు మానవ స్వభావం ఎన్ని రకాలు?

లోకంలో మానవ స్వభావాన్ని 3 విధాలుగా విభజించవచ్చు. ఎటువంటి క్లిష్టమైన మనస్తత్త్వాలైనా, ఏ కాలంలోనైనా – సర్వమానవులూ ఈ మూడు విధాలైన విభజనలోనికే విభజించబడతారు. ఆ విభజనే – సత్త్వరజస్తమోగుణాలు.

ఇందులో సత్త్వగుణం జ్ఞానాన్నీ, కాంతినీ కలిగిస్తుంది. వేదపఠనం, జ్ఞానమూ, తపస్సూ, దానమూ, అహింసా, శుచిత్వమూ వంటిగుణాలను అభివృద్ధి చేసుకోదలచిన వారు సత్త్వగుణాన్ని వృద్ధిచేసుకోవాలి.

యజన – యాజన, అధ్యయన – అధ్యాపన, దాన–ప్రతిగ్రహణ ములనే ఈషట్కర్మలను నిర్వర్తించవలసిన శ్రోత్రియులు – ఆహార నియమాన్ని పాటించవలసి ఉంది.

'అన్నాద్భవంతి భూతాని'

ప్రాణులన్నీ ఆహారం నుంచే జన్మిస్తున్నాయని చెప్పబడింది. అందువల్ల ఆహారం ఎటువంటిదైతే- అదే స్వభావం జీవులకు కలుగుతుంది. అందువల్ల - సత్త్వగుణాభివృద్ధికరమైన ఆహారాన్నే శిష్యులు స్వీకరించడం ఉచితం. విప్రులేగాక, జ్ఞానాభివృద్ధిని కోరే వారెవరైనా ఆ విధమైన ఆహారాన్నే స్వీకరించాలి. హృద్యమైనవీ, రసవంతమైనవీ, స్నిగ్ధాలైనవీ, జిడ్డుకలవీ, అధికకాలం ఆకలిని అదుపు చేయగలిగినవీ అయిన ఆహార పదార్థాలు సత్వగుణాన్ని వృద్ధి చేస్తాయనీ, అవి ఆయువును, బుద్ధిబలాన్ని, శరీరబలాన్ని, ఆరోగ్యాన్ని సుఖసంతోషాలనూ కలిగిస్తాయనీ చెప్పబడింది. పరికించండి.

''ఆయుస్సత్త్వ బలారోగ్య సుఖప్రీతి వివర్ధనాః!
రస్యాఃస్నిగ్ధాః స్థిరాః హృద్యాః ఆహారాస్సాత్త్విక ప్రియాః!!
''కట్వామ్లలవణాత్యుష్ణాః తీక్ష్ణ రూక్ష విదాహినః!
ఆహారాః రాజసస్యేష్టాఃదుఃఖ శోకామయప్రదాః!!''
'' యాతయామం గతరసం పూతి పర్యుషిత చ యత్!
ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్!!''

అతిగా ఉప్పూ, పులుపూ, కారమూ కలిగినవీ,చేదైనవీ, అతివేడిగా ఉండేవీ, కడుపు మండించి దాహాన్ని కలిగించేవీ అయిన ఆహారాలు రాజసస్వభావులకిష్టమైనవి. ఇవి దుఃఖ శోక రోగాలను కలిగిస్తాయి - అని చెప్పబడింది.

ఉడికించి చాలా సేపైనవీ,తిన్నగా పక్వంకానివీ, రుచి పోయినవీ, పాచివీ,బాగా నిలవైపోయినవీ, ఎంగిలివీ,అపవిత్రమైనవీ అయిన ఆహారాలు తామసులకిష్టమైనవి - అని చెప్పబడింది.

సాత్త్విక,రాజసిక,తామసిక ఆహారాలను గురించి పై విధంగా విశదీకరించబడింది. సాత్విక, రాజసిక, తామసులకు ప్రీతి కరాలైన ఆహారాలను వరుసగా చెప్పబడిన పై శ్లోకాలను పరిశీలిస్తే ఆహారానికి స్వభావానికీ ఉన్న సంబంధం అవగత మవుతుంది. నిత్యనైమిత్తికాదీ కర్మాచరణ పరాయణులు, యజ్ఞయాగక్రతు దీక్షాదురంధరులైనవారు - సాత్త్వికాహారాన్నే

స్వీకరించాలనే సదాశయంతో కొన్ని పదార్థాలను పరిహరిస్తారు. రాజస, తామసాహార భక్షణం వల్ల శరీరం స్వాధీనమై ఉండదు. నియమపాలన పరులకు దేహాన్ని స్వాధీనంలో ఉంచుకోవడం ఎంతో అవసరం. కర్మిష్ఠులకూ యోగసాధకులకూ ఇది మరింత అవసరం. వారికేగాక, ఏవిధమైన లక్ష్యంతో కృషిచేసే వారికైనా – ఆహార నియమంవారి లక్ష్య సాధనకు ఉపకరిస్తుంది. ఆ కారణం వల్లనే–ఎటువంటి వ్రతాచరణానికైనా ఆహార నియమం ప్రధానంగా చెప్పబడింది.

128. లోకంలో అనేక రకాల తపస్సుచేసే వారున్నారు. ముక్కుమూసుకొని కొంగజపం చేసేవారున్నారు. (ప్రదర్శనకోసం). ఉత్తమమైన తపస్సు ఎన్ని రకాలు? అరణ్యాలకు పోయి తపస్సు చేయకుండా సంసారంలో చేయగలిగిన తపస్సులు ఎలా ఉంటాయి ?

తపస్సుచేసే విధానాన్ని బట్టి తపస్సు మూడు విధాలు.

1. శారీరక తపస్సు, 2. వాచిక తపస్సు 3. మానసిక తపస్సు.

శ్లో. దేవ ద్విజగురు ప్రాజ్ఞపూజనం శౌచమార్జవమ్ !
బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే!!''

దేవతలనూ, ద్విజులనూ, గురువులూ, జ్ఞానులనూ పూజించడం, శుచిగా ఉండడం, కపటంలేని ప్రవర్తనా, బ్రహ్మచర్యం, అహింస – ఇవి కాయిక (శారీరక) తపస్సు – అని పిలవబడుతాయి.

శ్లో. ''అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చయత్!
స్వాధ్యాయాభ్యసనం చైవవాఙ్మయం తప ఉచ్యతే!!

హృదయాన్ని నొప్పించనివీ, సత్యమూ, హితాన్ని కలిగించేవీ, అహ్లాదాన్ని కలిగించేవీ అయిన మాటలున్నూ, స్వాధ్యాయాభ్యసనమున్నూ (పవిత్రగ్రంథాల పారాయణమూ, వాగ్రూపమైన జపమూ, స్తోత్ర పారాయణమూ, దైవసంకీర్తనా ఇత్యాదులు) ఇవి వాచిక తపస్సుగా పేర్కొనబడతాయి.

శ్లో. ''మనఃప్రసాద స్సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః!
భావసంశుద్ధిరిత్యేతత్ తపోమాన సముచ్యతే!''

ప్రసన్నమైన మనస్సు,పవిత్ర భావాలు,సౌమ్యత, నెమ్మది, బావ రహితమైన మౌనమూ, ఆత్మనిగ్రహమూ - ఇవన్నీ మానసిక తపస్సుగా పేర్కొనబడతాయి. ఈ కాయిక, వాచిక, మానసిక తపస్సులు మూడూ సంసారంలో ఉంటూనే చేయతగినవి.

శ్లో. ''శ్రద్ధయా పరయాతప్తం తపస్త్రి విధం నరైః!
అఫలాకాంక్షి భిర్యుక్తైః సాత్త్వికం పరిచక్షతే!!''

ఉత్తమ శ్రద్ధతో మానవులు ఆచరించే తపస్సు చేసేవారి భావాన్ని బట్టి మూడు విధాలు. నియమబద్ధులై ప్రతి ఫలాపేక్ష లేకుండా చేసే తపస్సు -సాత్త్వికమైన తపస్సు.

శ్లో. ''సత్కార మానపూజార్థం తపోదంభేన చైవయత్!
క్రియతే తదిహప్రోక్తం రాజసం చల మధ్రువమ్!!''

ఇతరుల నుంచి సన్మానాలనూ గౌరవాలనూ, పూజలనూ పొందడం కోసం, ఆడంబరంతో,దంభం కోసం చేసే తపస్సు - స్థిరత్వం లేనిది. చంచలమైనది,క్షణికతమైనది. ఇటువంటి తపస్సు రాజసిక తపస్సు.

శ్లో. ''మూఢ గ్రాహేణాత్మనోయత్ పీడయాక్రియతే తపః!
పరస్యోత్సాదనార్థం వా తత్తామసముదాహృతమ్!!''

విపరీతమైన భావాలతోనూ, తనను తాను బాధించుకొనిగాని, ఇతరులకు ఆపద కలిగే విధంగాకాని చేసే తపస్సు తామసిక తపస్సు.

వీనిలో సాత్త్విక తపస్సు శ్రేష్ఠమైనది.రాజసిక తపస్సు అంతకంటే తక్కువ. తామసిక తపస్సు అంతకంటేనూ తక్కువ.

129. నవగ్రహ మూల మంత్రములను తెలియచేయగలరు. మేము గ్రహ శాంతి చేయించుకోలేని పక్షమున స్వయముగా చేసుకోవచ్చునా? ఏవైనా నియమ నిబంధనలు ఉంటే తెలియపర్చగలరు. ఇంటి

వాతావరణములోనైనా నవగ్రహ జపము చేసుకోవచ్చా? ఇంకా ఇతర విషయములు తెలియపర్చగలరు.

మూల మంత్రాలను ఇలా చెప్పడం పనికిరాదు. దోషం.మూల మంత్రాలు తెలియనివారికి నవగ్రహస్తోత్రాలున్నాయి. అవి చదువుకోవచ్చును. నవగ్రహశాంతి చేయించుకోలేని పక్షంలో నవగ్రహాలకు ప్రదక్షిణాలు చేయవచ్చును. రోజుకు 108 ప్రదక్షిణాల చొప్పున 45 రోజులు చేయవచ్చును. నవగ్రహస్తోత్రాలైనా రెండు పూటలా కాని,మూడు పూటలా కాని శుచిగా పారాయణ చేసుకోవచ్చును. ముఖ్యంగా శుచిగా ఉండాలి. ఋతు క్రమం, అంటు,ఎంగిలి - వీటిని కలుపు కోకూడదు. ఈ నియమాలు అందరికీ వర్తిస్తాయి. ఎవరెవరు ఏదేవతలను గ్రహదేవతలను పూజించాలనేది ఆయావ్యక్తుల జాతక చక్రాలపై ఆధారపడి ఉంటుంది.

130. సమాజంలో అనేకమంది అనేక రకాలుగా వారి వారి ఇష్టదైవాలను పూజిస్తుంటారు. కొందరికి ఫలాపేక్ష ఉండదు. కొందరికి ఫలాపేక్ష ఉంటుంది. మరి కొందరికి శ్రద్ధగాని, శాస్త్ర నియమాలు కాని వుండవు. వీటిని బట్టి వారి వారి ఆరాధనలను మనం వేరుగా అనుకోవచ్చా?

మానవ స్వభావం మూడు విధాలైనట్లుగానే మానవులు ఆచరించే పూజలు, యజ్ఞాదికాలూ కూడా మూడు విధాలు. అవి ఈక్రిందివి.

1. ఫలాపేక్ష లేకుండా ఇది నా కర్తవ్యమనే భావంతో విధివిహితంగా, శాస్త్రబద్ధంగా చేయబడే యజ్ఞం,లేదా పూజ - సాత్త్వికం అనబడుతుంది.

2. ఫలాపేక్ష కలిగి కాని ఆడంబరం కోసం కాని చేయబడే పూజలు,యజ్ఞాలు - రాజసము లనబడతాయి.

3. శాస్త్రవిధికి విరుద్ధంగాను, విధి విహితమైన మంత్ర తంత్రాలు లేకుండాను,ఋత్విక్కులకు తగిన దక్షిణలివ్వకుండాను,భూత తృప్తికై చేసే అన్నదానం చేయకుండాను, అశ్రద్ధతో చేయబడే పూజ,లేదాయజ్ఞం- తామసికం అనబడుతుంది.

ఈ విధంగా మానవులు చేసే కర్మలు సాత్త్విక, రాజసిక, తామసికాలనే మూడు విధాలు.

దీనికి ప్రమాణం :

''శ్లో. అఫలాకాంక్షిభిర్యజ్ఞో విధిదృష్టోయ ఇజ్యతే
యష్టవ్యమేవేతి మనః సమాధాయ ససాత్త్వికః

శ్లో. అభిసంధాయ తు ఫలం దంభార్థమపి చైవయత్
ఇజ్యతే భరతశ్రేష్ఠతం యజ్ఞం విద్ధి రాజసమ్

శ్లో. విధిహీన మసృష్టాన్నం మంత్రహీన మదక్షిణమ్
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే!!

131. గుడిలో డబ్బు హుండీలో వేయడం ఎందుకు?

దేవాలయాలు పూర్వం కళలకూ, విద్యలకూ, శాస్త్రాలకూ ఆలవాలమై గొప్ప సాంస్కృతిక కేంద్రాలుగా విలసిల్లేవి. ఎందరో శాస్త్రకారులు, పండితులు, కళాకారులు దేవాలయాలచేత పోషించబడుతూవుండేవారు. అలాంటి ధార్మిక వ్యవస్థల పోషణ నిమిత్తం సంపన్నులు ఆలయాలకు ఎన్నో మాన్యాలు ఇవ్వడం జరిగింది.

దానికి ప్రతీకగానే గుడిలో డబ్బు వేసే ఆచారం మిగిలిపోయింది. ఆలయ నిర్వహణకు, ధూపదీప నైవేద్యాలకు అది ఉపకరిస్తుంది. భగవంతుని, పసిపిల్లలను, వృద్ధులను, గర్భిణులను, ఉత్తచేతులతో చూడబోరాదనే ఆచారం కూడా వుంది. భగవంతునికి అర్పించదలుచుకున్న ఎన్నో ఉపచారాలకు ప్రతిగానూ, ఆయన సేవలోమనమూ పాలుపంచుకుంటున్నామనే దానికి నిదర్శనంగానూ ఈ చర్య.

132. మన్వంతరాల పేర్లు తెలుపగలరు. కల్పములు ఎన్ని? అవి ఏవి?

1. స్వాయంభువ మన్వంతరం, 2. స్వారోచిష మన్వంతరం, 3. ఉత్తమ మన్వంతరం, 4. తామస మన్వంతరం, 5. రైవత మన్వంతరం,

6. చాక్షుష మన్వంతరం, 7. వైవస్వత మన్వంతరం, 8. సూర్యసావర్ణిక మన్వంతరం, 9. దక్షసావర్ణిక మన్వంతరం, 10. బ్రహ్మసావర్ణిక మన్వతరం, 11. రుద్రసావర్ణిక మన్వంతరం, 12. ధర్మసావర్ణిక మన్వంతరం, 13. రౌచ్య మన్వంతరం, 14. భౌచ్య మన్వంతరం. ఇవీ మన్వంతరాలు.

కల్పములు మూడు. అవి 1. బ్రహ్మకల్పం, 2. శ్వేతవరాహ కల్పం, 3. పద్మకల్పం.

133. బ్రహ్మాస్త్రం మొదలైన అస్త్రాలను అనేక చోట్ల ప్రస్తావిస్తుంటారు కదా! ఆ అస్త్రాల పేర్లు తెలియజేయండి.

నారాయణాస్త్రం, బ్రహ్మశిరోనామ కాస్త్రం, పాశుపతాస్త్రం, బ్రహ్మాస్త్రం, వైష్ణవాస్త్రం, పర్జన్యాస్త్రం (మేఘాస్త్రం), ఆగ్నేయాస్త్రం, వాయువ్యాస్త్రం, వారుణాస్త్రం, ఇంద్రాస్త్రం, నాగాస్త్రం, జృంభకాస్త్రం, శబ్దభేది, సమ్మోహనాస్త్రం, మానవాస్త్రం, యమాస్త్రం, గంధర్వాస్త్రం, రౌద్రాస్త్రం, గారుడాస్త్రం, విద్యాధర్మాస్త్రం, పైనాకాస్త్రం, దండాస్త్రం, ఇషీకాస్త్రం కంకణాస్త్రం, కంకాలాస్త్రం, కాందర్పాస్త్రం, కాపాలాస్త్రం, క్రౌంచాస్త్రం, నందనాస్త్రం, పైశాచాస్త్రం, ప్రమధాస్త్రం, శిఖరాస్త్రం, సత్యాస్త్రం, సోమాస్త్రం, గభస్తి-అస్త్రం.

134. మనిషి ప్రాణం నవ రంధ్రాలలో ఏదో ఒక రంధ్రం ద్వారా పోతుందని అంటారు. కానీ మనిషికి నవరంధ్రాలు ఉండవు కదా? మరి ఇలా ఎందుకు అంటారు?

మానవ శరీరానికి నవరంధ్రాలు ఉండనే ఉన్నాయి. అవి ఏవంటే... నాసికా (ముక్కు) రంధ్రాలు రెండు, నేత్ర (కళ్లు) రంధ్రాలు రెండు, చెవి రంధ్రాలు రెండు, నోరుప్లస్ విసర్జన ద్వారాలు. మొత్తం తొమ్మిదే కదా!

135. అష్టసిద్ధులు అనగా ఏవి?

అష్టసిద్ధులు ఈక్రిందివి.

1. అణిమ :- అణువంత సూక్ష్మరూపాన్ని ధరించగలగడం.

2. మహిమ :- బ్రహ్మాండమైన విరాట్ స్వరూపాన్ని పొందడం.
3. గరిమ :- బ్రహ్మాండ గోళాల కంటె బరువుగా వుండడం.
4. లఘిమ :- గడ్డిపోచ కంటె తేలికగా ఉండగలగడం,
5. ప్రాప్తి:- కోరిన వస్తువును లభింపజేసుకోనడం.
6. ప్రాకామ్యము:- ఆకాశగమనము.
7. ఈశత్వము:- సర్వానికీ అధికారి అయి ఉండడం
8. వశిత్వము :- సర్వ ప్రాణికోటినీ వశం చేసుకొని శాసించగలిగి ఉండడం.

136. పంచప్రాణాలు అంటే ఏమిటి ?

ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము - ఇవి ఐదూ జీవులకు ఉండే పంచప్రాణాలు.

137. సాధారణంగా ఇళ్ళలో కానిమఠెక్కడైనా కాని పూజలు లేదా మరేదైనాపని మొదలు పెట్టేటప్పుడు చదివే 'శుక్లాంబరధరం విష్ణుం....' అనే శ్లోకం ఏ దేవునికి సంబంధించినది? గణపతికా? విష్ణువుకా?

ఈ శ్లోకం విఘ్నేశ్వరునికి సంబంధించినది. శ్రీమహా విష్ణువుకు సంబంధించినది కాదు.

138. అరిషడ్వర్గములు అంటే ఏమిటి?

కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము - వీటికే అరిషడ్వర్గమని పేరు. ఇవి ఆరూ మానవుని అంతఃకరణంలో దాగి వుండే అంతశ్శత్రువులు.

139. ముక్కోటి దేవతలని అంటారు. అది చాలా పూర్వపు సంఖ్య. మరి ఇంకా అంతమందే ఉంటారా? ఎవరూజన్మించి ఉండరా?

ఒకానొక సందర్భంలో దేవతలకు ఇకమీదట సంతానం కలగరాదని పార్వతీదేవి శపించింది. ఆ కారణంగా అప్పటికే అంతకు పూర్వమే సంతానం

కలిగి ఉన్నవారుతప్ప ఆపైన దేవతలకెవరికీ సంతానం లేకుండా పోయింది. కాబట్టి ఆనాటి తర్వాత దేవతల సంఖ్య పెరిగే అవకాశం లేదు.

మనకున్నది మూడుకోట్లు దేవతలు కాదు. 33 కోట్ల మంది దేవతలు.

140. 'పుణ్యంకొద్దీ పురుషుడు - దానం కొద్దీ బిడ్డలు' అంటారుకదా! దానం చేస్తే వచ్చేదే పుణ్యం. అలాంటప్పుడు ఆ రెండింటికీ విడివిడిగా ఫలితాలు చెప్తారెందుకు?

పుణ్యంకొద్దీ కాదు, 'పూజకొద్దీ పురుషుడు - దానం కొద్దీ బిడ్డలు' అని సవరించుకోవాలి. పుణ్యం - ఒక్క దానం వల్లనేకాక - అనేక విధాలుగా వస్తుంది. అలా పుణ్యం లభించే విధానాలలో దానం కూడా ఒకటి. పూజ వేరు, దానం వేరు. శ్రేష్ఠమైన పూలతో పూజ చేస్తే మంచి వాల్లభ్యం లభిస్తుందనీ, శ్రేష్ఠమైన వస్తువులను దానం చేస్తే మంచి సంతానం కలుగుతుందనీ దాని భావం.

141. శ్రీ వేంకటేశ్వరస్వామి వ్రతం ఉన్నదా? ఉంటే చేసే విధానం తెలుపగలరు. ఈ వ్రతానికి కావలసిన పూజా సామాగ్రి తెలుపగలరు. వివాహం కాని వారు, బ్రహ్మచారులు ఈ వ్రతాన్నిచేయవచ్చునా?

శ్రీవేంకటేశ్వర స్వామి వ్రతం ఉన్నది. ఈవ్రత విధానాన్నితెలిపే పుస్తకాలు - షాపుల్లో దొరుకుతాయి, విచారించండి. ఎందుకంటే వ్రత విధానమంతా ఇక్కడ తెలియజేయడం సాధ్యంకాదు. వ్రతం చేసే విధానం. కావలసిన పూజా సామగ్రి - ఆ పుస్తకాలలోనే వివరాలన్నీ ఉంటాయి. వివాహం కాని అమ్మాయిలు, బ్రహ్మచారులు, అందరూ ఈ వ్రతాన్ని ఆచరించవచ్చును. నిషేధం లేదు. ఎవరైనాసరే తగిన శుచి పాటించి ఈ వ్రతాన్ని చేయవచ్చును.

142. అందరు దేవీ దేవతలకూ విగ్రహమూర్తులు ఉండగా ఒక్క శివునికి మాత్రం లింగాకారంలో పూజిస్తారెందుకు? అర్ధనారీశ్వర చిత్రపటం ఇళ్లలో ఎందుకని ఉండకూడదు?

శివుని లింగాకారంలోనే పూజించడానికి కారణం భృగుమహర్షి శాపం. శివలింగంలోఆధారపీఠం విష్ణుస్వరూపం. లింగం శివస్వరూపం- శివలింగం - శివకేశవులస్వరూపం. అర్ధనారీశ్వర చిత్రపటం ఇళ్లలో ఉండవచ్చును. దానికేమీ అభ్యంతరంలేదు.

143. ద్వాదశాదిత్యులు అని చదివాము. వారెవరు? వారిని గురించిన వివరాలు తెలియజేయండి.

పరబ్రహ్మ స్వరూపుడైన సూర్యుడు ఏకస్వరూపుడే. కాని, దేశ కాలక్రియాది భేదములచేత ఆయననేఅనేక విధాలుగా ఋషులు వర్ణించారు.

సంవత్సరంలో ఒక్కొక్క మాసంలో సూర్యుడు, ఆయన పరివారమూ ఒక్కొక్క పేరుతో సంచారం చేస్తూ ఉంటారు. చైత్రమాసంలో సూర్యుని పేరు ధాత. కృతస్థలి, హేతి, వాసుకి, రథకృత్తు, పులస్త్యుడు, తుంబరుడు – వీరు చైత్రమాసంలో సూర్యుని పరివారం.

వైశాఖ మాసంలో సూర్యుని పేరు అర్యముడు. పులహుడు, భోజుడు, ప్రహేలి. పుంజకస్థలి, నారదుడు, కంజనీరుడు - వీరు వైశాఖ మాసంలో సూర్యుని పరివారం.

జ్యేష్ఠమాసంలో సూర్యుని పేరు మిత్రుడు. అత్రి, పౌరుషేయుడు, తక్షకుడు, మేనక, హాహా, రథస్వనుడు - వీరు జ్యేష్ఠమాసంలో సూర్యుని పరివారం. అషాఢమాసంలో సూర్యుని పేరు వరుణుడు. వశిష్ఠుడు, రంభ, సహజన్యుడు, హూహువు, శుక్రుడు, చిత్రస్వనుడు – వీరు ఆషాఢమాసంలో సూర్యుని పరివారం.

శ్రావణమాసంలో సూర్యుని పేరు ఇంద్రుడు. విశ్వావసువు, శ్రోత, ఏలాపుత్రుడు, అంగీరసుడు, ప్రమ్లోచి, చర్మ్మడు – వీరు శ్రావణ మాసంలో సూర్యుని పరివారం. భాద్రపదమాసంలో సూర్యుని పేరు వివస్వంతుడు. ఉగ్రసేనుడు, వ్యాఘ్రుడు, అసారణుడు, భృగువు, అనుమ్లోజుడు, శంఖపాలుడు – వీరు భాద్రపదమాసంలో సూర్యుని పరివారం. ఆశ్వయుజమాసంలో సూర్యుని పేరు త్వష్ట. కంబళాశ్వుడు, తిలోత్తమ, బ్రహ్మోపేతుడు, శతజిత్తు, ధృతరాష్ట్రుడు, ఇషంబరుడు – వీరు ఆశ్వయుజమాసంలో సూర్యుని పరివారం. కార్తీకమాసంలో సూర్యుని పేరు విష్ణువు. ఆశ్వతరుడు, రంభ, సూర్యవర్చసుడు, సత్యజిత్తు, విశ్వామిత్రుడు, మఘోపేతుడు – వీరు కార్తీకమాసంలో సూర్యుని పరివారం. మార్గశిరమాసంలో సూర్యుని పేరు తర్వయువుడు. కశ్యపుడు, తారుక్ష్యుడు ఋతసేనుడు, ఊర్వశి, విద్యుచ్ఛతువు, మహాశంఖుడు – వీరు మార్గశిర మాసంలో సూర్యుని పరివారం.

పుష్యమాసంలో సూర్యునిపేరు భగుడు. స్ఫూర్జుడు, అరిష్టనేమి, ఊర్ణుడు, ఆయువు, కర్కోటకుడు, పూర్వజిత్తి – వీరు పుష్యమాసంలో సూర్యుని పరివారం. మాఘమాసంలో సూర్యుని పేరు పూషుడు. ధనంజయుడు, వాతుడు, సుషేణుడు, సురుచి, ఘృతాచి, గౌతముడు – వీరు మాఘమాసంలో సూర్యుని పరివారం. ఫాల్గుణమాసంలో సూర్యుని పేరు క్రతువు. వర్యసుడు, భరద్వాజుడు, పర్జన్యుడు, సేనజిత్తు, విశ్వుడు, ఐరావతుడు – వీరు ఫాల్గుణమాసంలో సూర్యుని పరివారం.

144. దత్తాత్రేయుని భార్య లీలావతియా లేక అనఘాదేవియా?

దత్తాత్రేయులవారి భార్య అనఘాదేవి.

145. పురాణాల ప్రకారం భూమిమీద ఎన్ని పర్వతాలు ఉన్నాయి?

పురాణాలను అనుసరించి భూమండలంలో ఈ క్రింది పర్వతాలున్నాయని చెప్పబడింది. జంబూద్వీపంలోని పర్వతాలు : గోమదము,

చంద్రపర్వతము,నారదగిరి,దుందుభి, సోమకము, సుమనః పర్వతము, వైభ్రాజము.

శాల్మలీద్వీపంలోని పర్వతాలు : కుముదము,ఉన్నతము, వలాకహకము,ద్రోణగిరి, కంకము,మహిషము,కకుద్మంతము.

కుశద్వీపంలోని పర్వతాలు : విద్రుమము, హేమశైలము, ద్యుతిమంతము, పుష్టిమంతము, కుశేయము, హరిపర్వతము మందరము.

క్రౌంచ ద్వీపంలోని పర్వతాలు : క్రౌంచము,వామనము, అంధకారకము,దేవవ్రతము,ధమము, పుండరీకవంతము, దుందుభి.

శాకద్వీపంలోని పర్వతాలు : ఉదయగిరి, జలధారము, రైవతకము, శ్యామము,అంభోగిరి,ఆస్తికేయము,కేసరి.

పుష్కర ద్వీపంలోని పర్వతం : మానసోత్తరం.

మేరు పర్వతానికి ఉత్తరాన శంఖకూటము,ఋషభము, హంసము, నాగము, కాలంజరము అనే పర్వతాలున్నాయి. మేరువుకు దక్షిణాన త్రికూటము, శిశిరము, పతంగము,రుచకము, నిషధము అనే పర్వతాలున్నాయి.

మేరువుకు తూర్పున శాంతవంతము, చక్రకుంభము, కురలి,మాల్యవంతము,వైకంకము – అనే పర్వతాలున్నాయి.మేరుపర్వతానికి పశ్చిమాన శిఖివాసము,వైడూర్యము,కాపిల్యము,గంధమాదనము, జానుధి – అనే పర్వత పంక్తులున్నాయి.

146. నాగపంచమి పర్వదినం ఏవిధంగా ఏర్పడింది?

నాగపంచమి పర్వదినం ఏర్పడిన గాథ – వరాహపురాణంలోని షష్ఠాశ్వాసంలోనిది.

పూర్వం కశ్యప ప్రజాపతికి –అతని భార్యయైన కద్రువ యందు నాగులు–అనంతుడు,తక్షకుడు,వాసుకి,మహాపద్మడు, మణినాగుడు, కాళీయుడు,ఏలాపుత్రుడు, ఉగ్రకుడు, శంఖుడు, కర్కోటకుడు,

నహుషుడు, పిండారకుడు, ధృతరాష్ట్రుడు, ఐగావతుడు – మొదలైన వారు జన్మించారు.

అలా జన్మించిన నాగులు మహా విషసహితాలై – అడ్డూ ఆపూ లేక లోకంలో కనిపించిన ప్రతిజీవినీ కరచి చంపసాగాయి. చరాచర జీవులనెల్లా తమ విషాగ్నికి బలిచేస్తూ సృష్టి వినాశకరంగా రూపొందిన నాగుల దుశ్చేష్టలను గురించి జనులంతా పోయి బ్రహ్మదేవునికి విన్నవించుకున్నారు.

ఆగ్రహంతో వాసుకి మొదలైన నాగులను తన సముఖానికి పట్టి తెప్పించాడు సృష్టికర్త.

" ప్రపంచాన్నంతనూ విష కలుషితం చేసి, జగద్ద్రోహకారకులుగా పరిణమించారు కనుక – మీ తల్లి శాపానికి గురై చెడిపోతారు" అని శపించాడు బ్రహ్మ.

"తామే మమ్ము విషయుక్తులుగా సృష్టించి ఇప్పుడీ విధంగా కోపించడం భావ్యమా" అని విన్నవించారు నాగులు.

" విషసహితంగా పుట్టించినంత మాత్రం చేత విశ్వాన్ని సమస్తమూ నాశనం చేస్తారా ? కాలం ప్రాప్తించిన వారిని, మీకు నిష్కారణంగా అపకారం తలపెట్టిన వారిని తప్ప ఇతరులను మీరు కరవరాదు. గరుడ మంత్ర విదులను ఔషధమణి సమేతులను తప్పుకొని సంచరించండి. సకల దేవతా, విహంగ గణాలకు జ్ఞాతులైన మీరు మీ అన్వయ గౌరవాలను నిలుపుకోండి. వాయు భక్షకులై సాధుజీవులై మెలగండి. భూలోకాన్ని అతలా కుతలంచేసే దుండగాలు మానండి. కరుణారహితాలైన పాపకృత్యాలను విడచి గౌరవాన్ని పొందండి.

మీకు నివాసస్థానాలుగా అతల వితల పాతాళలోకాలను ప్రసాదిస్తున్నాను" అని పరమేష్ఠి శాసించాడు.

విధాత సమవుచొప్పున నడచుకొన్న నాగులను భూలోకవాసులు కీర్తించారు. దివ్యప్రభావ సంపన్నులయిన నాగులపట్ల కృతజ్ఞతా సూచకంగా, భక్తిపురస్సరంగా – నాగులజన్మదినమైన నాగపంచమినాడు నాగులను అర్చించడం

ప్రారంభించారు. నాగపంచమి రోజున ఉప్పు,పులుపు తినడం విడిచిపెట్టి నాగులకు గోక్షీరం సమర్పించి భక్తితో పూజించే పుణ్యాత్ములకు సర్పభయం ఉండబోదని చెప్పబడింది.

147. చాతుర్మాస్యవ్రతం,వానప్రస్థాశ్రమధర్మం... వీటి గురించి తెలియచేయండి.

ఆషాఢ శుద్ధ ఏకాదశి మొదలు కార్తీక శుద్ధ ఏకాదశి వరకూ చాతుర్మాస్య వ్రతాచరణం సంప్రదాయం. బ్రహ్మచారులు, యతులు, – ఈ నాలుగు నెలలూ ఏదో ఒకచోట కదలకుండా ఉండి ఆ వ్రతాన్ని సాగిస్తారు.

వర్షాలు కురిసి, మార్గాలు సుగమంగా ఉండని కాలమూ, వ్యాధులు అధికంగా ఉండే కాలమూ అయిన ఈ నాలుగు నెలలకూ యమ దంష్ట్రాకాలమని పేరు. ఈ కాలంలో యతులు ఏదో ఒక నియమిత స్థలంలో ఉండవలసిన అవసరం ఉంది. అంటు వ్యాధులు ప్రబలే ఈ కాలంలో సంచారం నిషిద్ధం. మానవ సంచారం వల్ల వ్యాధులు ఒకచోటు నుంచి మరో చోటుకు త్వరగా వ్యాపిస్తాయి. అంటు వ్యాధుల వల్ల మరణాలు అధికంగా ఉండే కాలం కనుకనే దీనిని యమ దంష్ట్రా కాలమన్నారు.

ఈ కాలంలో ఒక ప్రదేశంలో నిలిచి, చాతుర్మస్య వ్రతాచరణం కావించే యతులకు – తత్సంబంధమైన సర్వసదుపాయాలూ గృహస్థులు చేయవలసి ఉంది. మిగిలిన మూడు ఆశ్రమాల వారికి పట్టు కొమ్మ గృహస్థాశ్రమం అని కదా! ఇక వానప్రస్థాశ్రమం గురించి –

బ్రహ్మచర్యగృహస్థాశ్రమ ధర్మాలను సక్రమంగా నెరవేర్చి ధర్మబద్ధంగా అర్థకామాలను పొంది తృప్తులైన గృహస్థులకు, చతుర్థ పురుషార్థమైన మోక్షసాధనా మార్గానికనువైన మూడవ ఆశ్రమం వానప్రస్థం.

ఇది సన్యాసాశ్రమానికి ముందుమెట్టు, గృహస్థాశ్రమానికి తరువాతి మెట్టు. గృహస్థులు భార్యాసమేతంగా ఈ ఆశ్రమం స్వీకరించవచ్చును. కొంత వయసు వచ్చిన దంపతులు – ప్రాపంచికవిషయాలపై ఆసక్తిని వదులుకోవడం ద్వారా మనశ్శాంతిని పొంది, భగవద్ధ్యానంలో తమ కాలాని ప్రశాంతంగా

గడపడమే ఈ ఆశ్రమ పరమావధి. గృహ విషయాలలో లీనమై విశ్రాంతి లేని జీవితాన్ని గడపడం మానుకుని,మానసిక పరిపక్వతమును పొంది వనవాసులై ప్రవృత్తి నుంచి నివృత్తివైపు మళ్లడమే వానప్రస్థ లక్ష్యం.

148. దేవుని స్తోత్రం, జపం ఉచ్ఛస్వరంతో చేయాలా? మనసులో చేస్తే చాలా?

వాక్కు, పరా, పశ్యంతీ - మధ్యమా, వైఖరీ - రూపాలు కలది. అందులో మన వాక్ వ్యాపారానికి సంబంధించి మధ్యమా, వైఖరీ ఉపాంశు భేదాలతో మూడు విధాలుగా ఉన్నది. దైవారాధనలో మానసిక జపం,ఉపాంశుజపం, వైఖరీ రూప జపం - ఈ మూడింటిలో ఏది చేసినా, ఏ విధంగా చేసినా ఫలితం సిద్ధిస్తుంది. వైఖరీ రూప వాక్కు అనగా పైకి బిగ్గరగా పలికేది. ఉపాంశుజపం - అంటే పెదవులు కదుల్చుతూ శబ్దం బయటికి వినిబడకుండా జపించే విధానం. మానసికా జపం అనగా కేవలమూ మనస్సులోనే మననం చేస్తూ బాహ్యేంద్రియ ప్రమేయం లేని జపం.

ఈ పై మూడు విధాలైన జపాలలో వైఖరీ, ఉపాంశు,మానసిక జప విధానాలు ఉత్తరోత్తర శ్రేష్ఠములని నిర్ణయింపబడినాయి. అనగా వైఖరీ జపం కంటే,ఉపాంశు జపమూ, దానికంటే మానసిక జపమూ, శ్రేష్ఠమైనవని.

149. మనువు అంటే అల్లసాని పెద్దన రాసిన మనుచరిత్రలోని వాడేనా?

అల్లసాని పెద్దన రాసిన ప్రబంధం 'స్వారోచిష మనుసంభవం స్వారోచిషమనువుయొక్క జన్మవృత్తాంతం అందులో చెప్పబడింది. మనువు అతడొక్కడే కాదు. మనువులు మొత్తం 14 మంది వారు. 1. స్వాయం భువ మనువు, 2. స్వారోచిష మనువు, 3. ఉత్తమ మనువు, 4. తామస మనువు, 5. రైవత మనువు, 6. చాక్షుష మనువు, 7. వైవస్వత మనువు. 8. సూర్యసావర్ణిక మనువు, 9. దక్షసావర్ణిక మనువు, 10. బ్రహ్మసావర్ణిక మనువు, 11. రుద్రసావర్ణిక మనువు, 12. ధర్మసావర్ణిక మనువు, 13. రౌచ్యమనువు, 14. భౌచ్యమనువు.

150. ప్రజాపతులెందరు? వారు ఎవరెవరు?

ప్రజాపతులు 21 మంది. వారు బ్రహ్మ, స్థాణువు, మనువు, దక్షుడు, భృగువు, ధర్ముడు, యముడు, మరీచి, అంగీరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వశిష్ఠుడు, పరమేష్ఠి, సూర్యుడు సోముడు, క్రోధుడు, అర్వాకుడు, ప్రీతుడు, కర్దమప్రజాపతి. వీరే 21 ప్రజాపతులు.

151. 'కొత్తబిచ్చగాడు పొద్దెరుగడు' అంటేమిటి?

అలవాటుగా యాచనా వృత్తిలో ఉన్న వ్యక్తికి దానికి సంబంధించిన వేళలు, వీలు, దానిలోని సులవులు ఇవన్నీ తెలుస్తాయి. క్రొత్తగా ఆ వృత్తిలో ప్రవేశించిన వానికి అవేమీ తెలియక భంగపడడం జరుగుతుంది. ఆవిధంగానే ఏదైనా ఒక పనిని క్రొత్తగా ఆరంభించిన వ్యక్తి, అందులోని ఇబ్బందలూ కష్ట సుఖాలూ తెలియక, కేవలం నూతనోత్సాహంవల్ల కలిగిన ఆరంభ శూరత్వంతో క్రిందామీదా అవుతున్నప్పుడు ఈ విధంగా పోల్చడం కద్దు.

152. మూడు పువ్వులు ఆరుకాయలు అంటారు. దీని భావాన్ని వివరిస్తారా?

పరిమితిలేని అభ్యుదయాన్ని సూచిస్తూ ఈనానుడి పుట్టింది. మూడు పువ్వులు మూడు కాయలుగా మారడం లోకసాధారణమైన విషయం. మూడుపువ్వులు ఆరుకాయలు కావడం అనేది – అసాధారణమైన విషయం రెట్టింపు అభివృద్ధి కలుగుతోంది – అని చెప్పడానికి సంకేతంగా ఇలా అంటారు.

153. పధ్నాలుగు లోకాలేవి ?

పధ్నాలుగు లోకాలలో ఏడు ఊర్ధ్వ లోకాలు, ఏడు అధో లోకాలు, ఏడు అధో లోకాలు. అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళాలు – ఇవి అధోలోకాలు. భూలోక, భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకాలు – ఇవి ఊర్ధ్వలోకాలు.

154. పురాణేతి హాసాలలో ఎక్కువగా వినిపించే అనేక ఆయుధాల పేర్లు ఉన్నాయి. ఆ ఆయుధాలు మొత్తం ఎన్ని? వాటి పేర్లు ఏమిటి?

పురాణేతి హాసాలలో పేర్కొనే ఈ ఆయుధాల సంఖ్య 32. వాటి పేర్లు 1. బాణం, 2. ఖడ్గం, 3. తోమరం, 4. స్తోమము, 5. సృగము, 6. చేరి, 7. శక్తి, 8. యష్టి, 9. భిండివాలము, 10. పరిఘము, 11.పరశ్వధము, 12. గద, 13. ప్రాసము, 14. ముద్గరము, 15. ముసలము, 16. శూలము, 17. పాశము, 18. చక్రము, 19. ముసుండి, 20. వజ్రము, 21. దండము, 22. హలము, 23. అశని,24. కుంతము, 25. అరిష్టము, 26. క్రకచము, 27. పరశువు, 28. శంకువు, 29. తోత్రము,30. వేణువు, 31. త్రిశూలము, 32. కుసూలము.

155. అష్టదిక్పాలకుల వాహనాలు ఏవి?

ఇంద్రుని వాహనం ఐరావతం. అగ్ని వాహనం తగరు (మేక). యముని వాహనం మహిషం, నిర్బతి వాహనం గుర్రం. వరుణుని వాహనం మొసలి. వాయుదేవుని వాహనం లేడి. కుబేరుని వాహనం నరుడు. ఈశానుని వాహనం వృషభం.

156. అష్టదిక్పాలకుల ఆయుధాలు ఏవి?

ఇంద్రుని ఆయుధం వజ్రాయుధం. అగ్నిదేవుని ఆయుధం శక్తి. యముని ఆయుధం కాలదండం. నిర్బతి ఆయుధం, కుంతం. వరుణుని ఆయుధం పాశం. వాయుదేవుని ఆయుధం ధ్వజం. కుబేరుని ఆయుధం ఖడ్గం . ఈశానుని ఆయుధం త్రిశూలం.

157. ద్వాదశాదిత్యు లెవరు ?

1. ఇంద్రుడు, 2. ధాత, 3. పర్జన్యుడు, 4. త్వష్ట, 5. పూష, 6. అర్యముడు, 7. భగుడు, 8. వివస్వంతుడు, 9. విష్ణువు, 10.అంశుమంతుడు, 11. వరుణుడు, 12. మిత్రుడు- వీరు కశ్యపునకు

అదితి యందు కలిగిన ఆదిత్యులనబడే దేవజాతి. వీరికి తుషితులనే మరొక పేరు కూడా ఉంది.

158. అష్టదిక్పాలకులభార్యలెవరు?

ఇంద్రుని భార్య పేరు శచీదేవి అగ్నిదేవుని భార్య పేరు స్వాహాదేవి యముని భార్య పేరు శ్యామలాదేవి నిర్రుతి భార్య పేరు దీర్ఘాదేవి వరుణుని భార్య పేరు కాళికాదేవి వాయుదేవుని భార్య పేరు అంజనాదేవి కుబేరుని భార్య పేరు చిత్రరేఖాదేవి ఈశానుని భార్య పేరు పార్వతీదేవి.

159. అప్సరసలు ఎవరు?

ఊర్వశి, మేనక రంభ, ఘృతాచి, తిలోత్తమ, చిత్రరేఖ, మోహిని, మదన, కాంతి చంద్రిక, కుమారి.

160. వేదాలు నాలుగా, అయిదా? వేదాలను ఎవరు రచించారో చెప్పండి.

వేదాలు నాలుగు. అవి 1. ఋగ్వేదం, 2. యజుర్వేదం, 3. సామవేదం, 4. అధర్వవేదం. వీటిని ఎవరూ రచించలేదు. ఇవి పరమేశ్వరుని నిశ్వాసరూపంగా వెలువడ్డాయి. ఇక విషయ గౌరవాని బట్టి భారతాన్ని పంచమవేదమని ప్రశంసించారు అంతే.

161. అష్టాదశ పీఠాలు అంటే ఏమిటి? ఎన్ని ? అవి ఎలా ఏర్పడ్డాయి? వాటికి ఆ పేరు ఎలా వచ్చింది?

దక్షయజ్ఞ సమయంలో యోగాగ్నిలో ప్రవేశించిన సతీదేవి శరీరాన్ని శివుడు తన భుజం మీదవేసుకుని ఆవేశంతో సంచరిస్తూ ఉన్నాడు.సతీదేవి శరీరంవున్నంతవరకూ శివుని దుఃఖావేశం తగ్గదని గ్రహించాడు విష్ణుమూర్తి. తన సుదర్శన చక్రంతో సతీదేవి శరీరాన్ని శివునికి తెలియకుండానే అనేక భాగాలుగా ఖండించి వేశాడు. సతీదేవి శరీర భాగాలు పడిన ప్రదేశాలే శక్తి పీఠాలుగా ఏర్పడ్డాయి. అవే అష్టాదశ శక్తి పీఠాలు. ఇవి శక్తి నిలయాలైన 18 దివ్య క్షేత్రాలు కనుక వాటికి ఆ పేరు వచ్చింది.

70,500

లంకా నగరంలో శాంబరీ (శాంకరీ అని పాఠాంతరం) దేవి. కాంచీపురంలో కామాక్షీదేవి. ప్రద్యుమ్న క్షేత్రంలో శృంగళాదేవి. క్రౌంచ పట్టణంలో చాముండీ దేవి. అలంపురంలో జోగులాంబ శ్రీశైలంలో భ్రమరాంబ, కొల్హాపురంలో మహాలక్ష్మి,మాహూరీ క్షేత్రంలో ఏకవీరాదేవి, ఉజ్జయినీ నగరంలో మహాకాళి, పిఠికాపురం (పీఠాపురం) లో పురుహూతికాదేవి. ఓఢ్యాక్షేత్రంలోగిరిజాదేవి. దక్షవాటిక (నేటిద్రాక్షారామం) లో మాణిక్యాంబ. హరి క్షేత్రంలో కామరూపాదేవి, ప్రయాగలో మాధవేశ్వరీదేవి, జ్వాలా క్షేత్రంలో వైష్ణవీదేవి,గయా క్షేత్రంలో మంగళగౌరీ దేవి, వారణాసీ క్షేత్రంలో విశాలాక్షీదేవి, కాశ్మీరంలో సరస్వతీదేవి.

ఈపైన చెప్పినవే అష్టాదశ శక్తిపీఠాలు.

162. పంచయజ్ఞాలంటారు? అవి ఏవి?

1. బ్రహ్మ యజ్ఞము, 2. దేవయజ్ఞను, 3. పితృ యజ్ఞము, 4. భూత యజ్ఞము, 5. మనుష్య యజ్ఞము.

బ్రహ్మయజ్ఞము:- ఒక ఋక్కును గాని, యజుస్సును గాని, సామాన్ని కాని శక్తికొద్దీ నిత్యమూ అభ్యసించడం. అనగా నిత్య వేదాధ్యయనం.

దేవ యజ్ఞము:- దేవతా తృప్తి కొరకై హవిస్సు మొదలైన దేవతా ప్రీతికరమైన పదార్థాలను అగ్నిలో హోమం చేయడం.

పితృయజ్ఞము:- పితృదేవతా ప్రీతికై స్వధాకారంతో తర్పణాలిచ్చి, విప్రులకు భోజనం పెట్టడం.

భూతయజ్ఞము :- నిత్యమూచేయువలసిన వైశ్యదేవానుష్ఠానం అనంతరం ఆరుబయలు ప్రదేశంలో భూతతృప్తి (జీవరాసుల తృప్తి) నిమిత్తం భూతబలిగా ఇచ్చే ఆహార సమర్పణం.

మనుష్య యజ్ఞము:- యథాశక్తిగా అతిథులకుభోజనం పెట్టడం.

163. ఋణత్రయం అంటే ఏమిటి?

మానవుడు పుట్టుకతోనే మూడు ఋణాలతో జన్మిస్తాడని చెప్పబడింది. ప్రతిమానవుడూ ఋషులచేత చెప్పబడిన మార్గాన్ని అనుసరించి ఈ మూడు ఋణాల నుండి విముక్తుడు కావాలి.

1. దేవఋణం:- కాంతి, వాయువు, అగ్ని జలం - వంటి ప్రకృతి శక్తులపట్లనూ, కాలోచితంగా వర్షాన్నీ, ఎండనూ, చల్లదానాన్నీ ఇస్తూ వున్న ఋతుదేవతల పట్లనూ, సహజ సంపదను ప్రసాదించిన ప్రకృతి దేవతలపట్లనూ తీర్చవలసిన ఋణం. దీనిని యజ్ఞయాగాది క్రతుహోమాలను ఆచరించడం ద్వారా వాతావరణ కాలుష్య నివారణకు కృషి చేసి ఈ దేవ ఋణాన్ని మానవులు తీర్చుకోవాలి.

2. పితృఋణం:- సత్సంతానాన్ని పొంది ఉత్తమ మానవజాతి పరంపరను, వేదాన్ని ఉపదేశించడం ద్వారా శిష్యపరం పరను - ఎడతెగకుండా కాపాడి తన పూర్వుల ఋణాన్ని తీర్చుకోవాలి.

3. ఋషి ఋణం:- సృష్ట్యాదిగా నేటివరకూ అనుస్యూతంగా వస్తూ ఉన్న జ్ఞాన సంపదను ఎడతెగకుండా కొనసాగించిన మహాత్ముల పట్ల కృతజ్ఞతాసూచకంగావిద్యాధ్యయన విజ్ఞాన సముపార్జన విషయాలలో తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించి - తద్వారా విశ్వవిజ్ఞానాన్ని పెంపొందించడం వల్ల మానవుడు ఋషి ఋణం నుంచి విముక్తుడవుతాడు.

164. సాలగ్రామం ఏ దేవుని రూపం? శివుడా, విష్ణువా?

సాలగ్రామం అంటే విష్ణు స్వరూపమైన శిల. సాలగ్రామాల పైన విష్ణు సంబంధమైన చిహ్నాలు ప్రకృతి సహజంగా ఏర్పడి ఉంటాయి. ఈసాలగ్రామాలు గండకీనదిలో లభ్యమవుతాయన్నది పురాణ వాక్యం.

165. మా అమ్మ 11 వారాలు వైభవలక్ష్మి వ్రతం చేసి అందరికీ వైభవలక్ష్మి వ్రత విధానం ఉన్న పుస్తకాలు, గాజులు పంచింది. మేము మాకు ఇచ్చిన పుస్తకంలోని శ్రీచక్రంగల పేజీని చింపి బీరువా లాకర్‌లో

అతకించినాము. వ్రతం చేసినవారే అలా శ్రీచక్రాన్ని బీరువాలోగానీ, పూజ దగ్గరాకనీ పెట్టాలా? పూజ(వ్రతం) చేయనివారు బీరువాలో పెట్టకూడదా ?

వ్రతం చేయనివారు కూడా శ్రీ చక్రాన్ని బీరువాలోకానీ, పూజాపీఠంలోకానీ పెట్టుకోవచ్చును. ఐతే ఏ యంత్రం అయినా ఇంట్లో వున్నప్పుడు నిత్యమూ దానికి ధూపదీపనైవేద్యాలు సమర్పించాలి. ఇంట్లో అంటు,ఎంగిలి,బహిష్టు, పురుడు, మైల– కలుపకోకుండా శుచిగా వుండాలి.

166. భగవంతుడు ఉన్నాడో,లేడో? నాకు తెలియదు. కొందరు ఉన్నాడనీ, మరి కొందరు లేడనీ అంటారు. భగవంతుడే ఉంటే మంచి వాళ్ళకి కష్టాలు ఎందుకు? చెడ్డవాళ్ళు సుఖంగా ఉన్నారు ఎందువలన? మనుషులు పెట్టిన బాధలు భరించలేక తన దగ్గరకు నన్ను చేర్చుకోమని భగవంతుణ్ణి కోరుకుంటున్నా?

ఏ జీవిని ఎప్పుడు తన దగ్గరకు చేర్చుకోవాలో ఆ భగవంతునికి తెలుసు.

'అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్!' –

అని భగవంతుడే చెప్పాడు. జీవులు తాము పూర్వజన్మలలో చేసిన పుణ్యపాపాల ఫలితాలను అనంతర జన్మలలో సుఖదుఃఖాల రూపంలో అనుభవించవలసి ఉంటుంది. ఒక్కొక్క సందర్భంలో కష్టాల పరంపరల తాకిడికి తట్టుకోలేక మానువులు విలవిలాడుతారు. పుర్వజన్మలలో చేసిన పుణ్యపాపాలే జీవుల జాతకాలలో యోగవయోగాలుగా రూపొందుతాయి. అవే జీవుల కష్టసుఖాలకు కారణమవుతాయి.

167. రాత్రి ఏ దిక్కుకు తలపెట్టి నిద్రించాలి? ఉదయం లేవగానే ఏ వస్తువులను, లేదా ఏ వ్యక్తులను చూడాలి? దేవతావిగ్రహాలను గృహంలో ఏ దిక్కున పెట్టి పూజించాలి.?

స్వగృహంలో నిద్రించేటప్పుడు తూర్పు దిక్కుకు లేదా దక్షిణ దిక్కుకు తలపెట్టి నిద్రించాలి. ఇతరుల గృహానికి వెళ్లవలసివచ్చినప్పుడు అక్కడ పశ్చిమదిక్కుకు తలపెట్టి నిద్రించాలి. ఉత్తర దిక్కుకు ఎన్నడూ ఎక్కడా కూడా తలపెట్టి నిద్రించకూడదు.

ప్రతిదినమూ ఉదయం లేవగానే -

''కరాగ్రే వసతే లక్ష్మి కరమధ్యే సరస్వతీ! కరమూలే తథాగౌరీ ప్రభాతే కరదర్శనమ్!!'' అనే శ్లోకాన్ని చదువుకొని, తన కుడి అరచేతిని చూసి కళ్లకు అద్దుకోవాలి. ఆ తర్వాత-

''సముద్రవసనే దేవి పర్వతస్తనమండితే!

విష్ణుపత్ని నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే!''

- అనే శ్లోకాన్ని పఠించి భూదేవికి క్షమార్పణ చెప్పుకొని నమస్కరించి భూమిమీద కాలుపెట్టాలి. అనంతరం -

'' అనన్యదర్శనాః ప్రాతర్యేపశ్యంతి తపోధన!

జగత్త్రితయ తీర్థాని తైర్దృష్టాని న సంశయః

-అనే ప్రమాణాన్ని బట్టి ప్రాతఃకాలాన నిద్రలేవడంతోనే తులసిని చూసినట్లయితే ముల్లోకాల్లోని సమస్త తీర్థాలను దర్శించిన ఫలం కలుగుతుంది. కాబట్టి ఉదయానే నిద్రలేవగానే తులసిని దర్శించి నమస్కరించాలి.

అనంతరం దేవతల పటాలను దర్శించి నమస్కరించుకోవాలి.

ఆ తర్వాత గోవు, అద్దం, పుష్పాలు, ఫలాలు వంటి మంగళకరమైన వస్తువులను దర్శించాలి. అనంతరం తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి వారి ఆశీర్వాదాలను పొందాలి.

దేవతా విగ్రహాలను గృహంలో తూర్పు ఈశాన్యంలోకానీ, ఉత్తర ఈశాన్యంలోకానీ ఉంచి పూజించాలి. సాధ్యమైనంతవరకు ఆవిధంగానే

చెయ్యాలి. ఒకవేళ ఆ విధంగా వీలుకానిపక్షంలో (ఇంటికి ఈశాన్యంలో వీలుకాని పక్షంలో) గదికి ఈశాన్యంలో ఉంచి పూజించవచ్చును.

168. యజ్ఞోపవీతాన్ని లఘు, గురుశంకల సందర్భంలో చెవికి చుట్టుకోవాలని మా పెద్దలు చెప్పేవారు. అంతేగాక వారు ఆ విధంగానే చేసేవారు. ఆ విధంగా చేయాలనడానికి కారణం ఏమిటి?

''ఆదిత్యా వసవో రుద్రాః వాయురగ్నిశ్చ ధర్మరాట్!

పుష్కరాద్యాన్ని తీర్థాని గంగాద్యాః సరితస్తదా!
విప్రస్య దక్షిణే కర్ణే నివసంతి హి సర్వదా!!''

అనగా విప్రుని కుడిచెవి యందు ఆదిత్యుడు, వసువులు, రుద్రులు,వాయుదేవుడు, అగ్ని, ధర్ముడు, పుష్కరాది తీర్థములు, గంగాదినదులు – వీరంతా సర్వదా నివసిస్తూ ఉంటారు అని చెప్పబడింది.

లఘు, గురు శంకల సందర్భంలో మానవ దేహానికి అశుచి కలుగుతుంది. దేహానికి అశుచి కలిగినప్పుడు – దేహాన్ని అనుక్షణమూ అంటిపెట్టుకొని ఉండి – కర్మార్హతను కలిగించే యజ్ఞోపవీతానికి అశుచి కలుగకుండే నిమిత్తం – యజ్ఞోపవీత పవిత్రతను నిలపడం కొరకు – దానిని పవిత్ర స్థానమైన కుడిచెవికి వెనుకనుండి చుట్టి మాలాకారంగా మెడలో వేసుకొనలసి ఉంది.

యజ్ఞోపవీతాన్ని ఈ విధంగా మాలాకారంగా ధరించడానికి 'నివీతి' – అని పేరు. శారీరకమైన శుద్ధిలేని సందర్భంలో ఈ విధంగా ధరించాలి.

సామాన్యస్థితిలోను,శుభకర్మలలోనూ ఎడమభుజం మీదుగా ధరించాలి. దీనికి 'ఉపవీతి' అనిపేరు.

169. అరవై నాలుగు కళలంటారు. అవి ఏవి?

అరవై నాలుగు కళలు ఈ క్రిందివి. **1.** ఇతిహాసము, **2.** ఆగమము, **3.** కావ్యము, **4.** అలంకారము, **5.** నాటకము, **6.** గాయకత్వము, **7.** కవిత్వము, **8.** కామ శాస్త్రము, **9.** దురోదరము, **10.**

దేశభాషాలిపిజ్ఞానము, 11. లిపికర్మము, 12. వాచకము, 13. అవధానము, 14. స్వరశాస్త్రము, 15.శాకునము, 16. సాముద్రికము, 17.రత్నశాస్త్రము, 18. రధకౌశలము, 19. అశ్వకౌశలము, 20.గజకౌశలము, 21. మల్లశాస్త్రము, 22. సూదకర్మము, 23.దోహదము, 24. గంధవాదము, 25. ధాతువాదము, 26. ఖనివాదము, 27. రసవాదము, 28. జలవాదము, 29. అగ్నిస్తంభము, 30. ఖడ్గస్తంభము, 31.జలస్తంబము, 32. వాక్‌స్తంభము, 33. వయఃస్తంభము, 34. వశ్యము, 35. ఆకర్షణము, 36. మోహనము, 37. విద్వేషణము, 38. ఉచ్చాటనము, 39. మారణము, 40. పాదుకాసిద్ధి, 41. వాక్సిద్ధి, 42. కాలవంచనము, 43. పరకాయప్రవేశము, 44. ఇంద్రజాలికము, 45. అంజనము, 46, దృష్టివంచనము, 47.స్వరవంచనము, 48. మణిమంత్రేషదాది 49. చోరకర్మము, 50.చిత్రక్రియ, 51. లోహక్రియ,52. అశ్మక్రియ, 53. మృత్క్రియ, 54. దారుక్రియ, 55. వేణిక్రియ, 56. చర్మక్రియ, 57. అంబరక్రియ, 58. అదృశ్యకరణము, 59. దూతీకరణము, 60 వాణిజ్యము, 61.పాశుపాల్యము, 62. కృషి, 63. ఆసవకర్మము, 64. పాణిద్యూత కౌశలము.

170. ఏదైన ఒక పాపపు పని చేసినప్పుడు –ఆ పాపం చేసినవాడిదా, చేయించినావాడిదా, చూస్తూ ఊరుకున్నవాడిదా?

కర్తా కారయితా చైవ ప్రేరకశ్చాను మోదక :

సుకృతం దుష్కృతం చైవ చత్వార స్సమభాగినః

అనేది ధర్మశాస్త్ర నిర్ణయం ఇదే మీరడిగిన ప్రశ్నకు సమాధానం.

దీని భావమేమిటంటే ఒకపుణ్యకార్యం కాని పాపకార్యంకానీ జరిగినప్పుడు 1. దాన్ని స్వయంగా చేసినవాడు, 2. దానకి కారకుడై చేయించినవాడు, 3. ఆ పనికి ప్రేరేపించినవాడు, 4. ఆ కార్యం జరుగుతున్నదని తెలిసి ఉండీ, అది చెడ్డదని తెలిసిఉండీ, నివారించకుండా

ఆమోదించినవాడు (సమ్మతించి, జరగనిచ్చినవాడు) ఈ నలుగురూ కూడా ఆ పనివల్ల కలిగిన పుణ్యఫలాన్ని లేదా పాపఫలాన్ని సమానంగా పొందుతారన్నది ధర్మశాస్త్ర నిర్ణయం.

171. కొన్ని కుటుంబాలలో పుట్టింటివారికీ, ఆ ఇంటి నుంచి పెళ్లయి వెళ్లిన ఆడపడుచులకూ కొన్ని కారణాల వల్ల సంబంధాలుండనప్పుడు, తిరిగి సంబంధాలు మెరుగుపరుచుటకు ఆడపిల్ల తల్లిదండ్రులు, లేక అన్నదమ్ములు-ఆమెనూ, భర్తనూ పిలిచి మర్యాద చేసి పెట్టుపోతలు జరపవచ్చునా? అలాగే ఆ ఆడపిల్ల తన పుట్టింటివారిని మంచి చెడులకు పిలిచినప్పుడు వీళ్లు వెళ్లవచ్చునా? వాళ్లు ఇచ్చేవి తీసుకోవచ్చా? దీనికి ఏమైన నియమాలున్నాయా? కాలపరిమితి ఏదైనా ఉందా?

ఆత్మీయుల మధ్య కలతలు రావడం - ఇరుపక్షాలవాళ్లకూ క్షేమంకాదు. ఆకలహాల వల్ల వచ్చే నష్టం ఉభయ పక్షాలకూ కలుగుతుందేకాని ఏ ఒక్క పక్షానికో మాత్రమే ఉండదు. ఆప్తుల మధ్య కలహాలు రేపి లాభం పొందేవాళ్లు ఎప్పుడు ఉంటారు. వాళ్ళవల్ల చీలిపోయిన ఆప్తులు, ఉభయ పక్షాలకూ నష్టం ఉంటుందనేది కౌరవపాండవ చరిత్ర చెప్తున్న సత్యం. విడిపోయిన ఆప్తులు తిరిగి తప్పక కలవవచ్చును పుట్టింటివారు ఆడపడుచును తృప్తిపరచడమే క్షేమం. ఉభయులూ ఒకరిచ్చేవి ఒకరు పుచ్చుకోవచ్చును. 12 సంవత్సరాల పాటు కలవకపోతే మాత్రం ముందుగా దేవాలయంలో కలవాలి. మీరు మీ ఆప్తులతో తప్పక కలవమని నా సలహా. ఆ తర్వాత వారూ వీరూ కలిసేందుకు, మంచి చెడులకు వెళ్లడానికి ఏ నిషేధమూలేదు.

172. కర్మకాండ సందర్భంగా జ్యేష్ఠ, కనిష్ఠ పుత్రుల ప్రాధాన్యత ఏమిటి?

'ఆత్మావై పుత్ర నామాసి' అని చెప్పబడింది. అనగా మానవుడు తానే పుత్రుడై జన్మిస్తున్నాడని అర్థం . అందులోనూ మానవునికి తన జ్యేష్ఠ సంతానం కేవలం ఆత్మ స్వరూపంగా పరిగణించబడుతుంది. అందువల్ల జ్యేష్ఠ సంతానికి ఆ విధమైన ప్రాధాన్యత వుంది.

మరణించిన వాని జీవుడు పన్నెండు రోజుల కర్మకాండ పూర్తి అయ్యేవరకూ కర్మవేసిన వానిని అనుసరించి ఉంటుందని చెప్పబడింది. మరణించిన జీవుని పంచప్రాణాలున్నూ ఒకటి మరణించిన స్థలంలోనూ, ఒకటి దహనం, ఖననం చేసిన చోటున,ఒకటి కర్మ చేసిన వానియందును, కర్మాంతం వరమే వసించి ఉంటాయని చెప్పారు. అందువల్ల జీవుని ఆత్మ రూపకమైన జ్యేష్ఠ సంతానానికే కర్మకాండయందు ప్రాధాన్యతి ఇచ్చారు.

తండ్రికి జ్యేష్ఠ సంతానంపట్లనూ,తల్లికి కనిష్ఠసంతానం పట్లనూ అధిక ప్రేమాదరాలు ఉంటాయన్నది లోక ప్రసిద్ధం. అందువల్ల తండ్రి మరణించిన సందర్భంలో జ్యేష్ఠ సంతానానికి, తల్లి మరణించిన సందర్భంలో కనిష్ఠ సంతానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి వారి చేతి మీదుగా కర్మకాండ జరిపించే ఆచారం కొన్ని కులాలలో వుంది.అయితే ఇది అనగా కనిష్ఠుని చేత కర్మ నిర్వహణ అనేది కొన్ని ప్రాంతాలలో, కొన్ని కులాలలో మాత్రమే అనుసరిస్తున్నారు. కనుక ఇది శాస్త్రబద్ధంకాదు.

తల్లికిగానీ,తండ్రికి గానీ ఎవరికైనప్పటికీ జ్యేష్ఠ సంతానమే కర్మ చేయడం మాత్రమే శాస్త్ర సమ్మతం.

173. దేవతల్లో చాలా మందికి ఇద్దరు భార్యలున్నారు ఎందుకు ?

దేవత అనేది ప్రతీకాత్మకమైన ఒక తేజస్సు. నిర్దేశించబడినట్టి కొన్ని శక్తులకు సంకేతమే దేవత.

ఆ యా దేవతలు వారి భార్యలు, అలంకారాలు,ఆయుధాలు అన్నీకూడా ప్రతీకలే (సింబాలిక్ అన్నమాట!)

ఉదాహరణకు స్థితికారకుడై సర్వ సృష్టి పాలన పోషణలను నిర్వహించే విష్ణుమూర్తి భార్యలు శ్రీదేవి, భూదేవి. సర్వసంపత్సమృద్ధియే లక్ష్మీదేవి. భూదేవి అనగా భూమి, భూసంబంధమైన సర్వ భూ, జలవనాది సహజ సంపదా, లక్ష్మీదేవి - అనగా సర్వ ఐశ్వర్యమూ, సర్వ వస్తు,ధన సంపదా - విష్ణువు ఆధీనంలో ఉన్నాయనే విషయానికి సంకేతమే - లక్ష్మీదేవి,

భూదేవి, విష్ణుమూర్తి భార్యలని చెప్పడంలో అంతరార్థం. ఆ విధంగానే విఘ్నేశ్వరుని భార్యలు సిద్ధి, బుద్ధి. ఆ వినాయకుని పుత్రులు క్షేముడు, లాభుడు. అనగా విఘ్ననాయకుడైన గణపతి విఘ్నాలను అదుపుచేసేవాడనీ, బుద్ధి కుశలతనూ, ధనసిద్ధి, విద్యాసిద్ధి, కార్యసిద్ధి ఇటువంటి సర్వసిద్ధులనూ, క్షేమ లాభాలనూ కలిగించే దైవం అని సాంకేతికంగా తెలియజేయడమే.

దైవాలకు సంబంధించిన అంశాలను ఇదే విధంగా అర్థం చేసుకోవాలి.

174. తిరుపతి మొదలైన పుణ్యక్షేత్రాలలోని గుడులకు ఉన్న శక్తి అదే దేవుని గుడి వేరే చోట ఉంటే ఉండదా?

శ్రీ మహావిష్ణువు అర్చావతారంగా స్వయం వ్యక్తమైన పవిత్ర క్షేత్రం తిరుపతి

పుణ్యక్షేత్రాలలో, సిద్ధ పురుషులు తపస్సుచేసిన స్థలాలకు, భగవదవతారమేదైనా వ్యక్తమైన స్థలాలకు ప్రత్యేకత ఉంది. మానవులు చెక్కించి ప్రతిష్ఠించిన మూర్తులకంటే దేవతామూర్తులు స్వయం వ్యక్తమైన స్థలాలకు ప్రత్యేకత ఉంది. అయా క్షేత్రాలలో ప్రతిష్ఠించబడిన యంత్రశక్తినిబట్టి కూడా క్షేత్రం మహత్తరమైనది అవుతుంది. ఇవన్నీ కూడిన క్షేత్రం కావడం వల్ల తిరుపతి క్షేత్రం అపూర్వ వైభవ శోభితమైంది.

శ్వేత వరాహ రూపంలో ప్రళయకాల సముద్రం నుంచి భూమిని ఉద్ధరించిన అనంతరం శ్రీ మహా విష్ణువు, భూలోకంలో నివసించే నిమిత్తం, వైకుంఠం నుంచి తన క్రీడా పర్వతాన్ని తెప్పించినట్లు వరాహపురాణంలో చెప్పబడింది. నారాయణగిరి అనే ఆ పర్వతమే వేంకటేశ్వర నివాస స్థానం కావడం వల్ల దానికి అంత పవిత్రత చేకూరిందని వరాహపురాణోక్తి. అక్కడ శ్రీనివాసుడు స్వయం వ్యక్తుడు కావడం వల్ల అది కలియుగ వైకుంఠ మయింది.

175. శ్రీ ఆంజనేయస్వామి ఇప్పటికీ చిరంజీవిగా ఉన్నారా ?

''అశ్వత్థామా బలిర్వ్యాసో హనుమాంశ్చ విభీషణః! కృపః పరశురామశ్చసప్తైతే చిరంజీవినః!... మార్కండేయ మథాష్టమమ్..'' అనిచెప్పబడింది. అశ్వత్థామ,బలిచక్రవర్తి,వ్యాసమహర్షి, ఆంజనేయస్వామి, విభీషణుడు,కృపాచార్యుడు,పరశురాముడు, మార్కండేయుడు-వీరు ఎనమండుగురూ చిరంజీవులుగా వరం పొందినవారు.

జ్యోతిశ్శాస్త్ర ప్రశ్నల విభాగం

176. పంచాంగమనే మాటకు అర్థం ఏమిటి? పంచాంగశుద్ధి లేనిదే ఏ పనీ చేయరాదని ఎక్కడో విన్నాం. పంచాంగ శుద్ధి - అంటే తెలియజేస్తారా?

తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం - ఈ ఐదూ పంచాంగాలు. అంటే ఐదు విభాగాలు. ఇవి ఐదూ శుభప్రదంగానూ, శుద్ధిగానూ ఉండేటట్లు చూసుకోవాలి. అదే పంచాంగశుద్ధి. అంటే ఈ ఐదు అంశాలు దోషరహితంగా ఉండడమే పంచాగశుద్ధి అనే దానికి అర్థం.

177. యోగం కరణం - అంటే ఏమిటి?

అశ్విని మొదలుగా ఒక్కొక్క నక్షత్రాన్ని అనుసరించి ఒక్కొక్క యోగం ప్రకారంగా - 27 నక్షత్రాలకూ చెందినవి 27 యోగాలు. నక్షత్రాన్ని బట్టి వచ్చేవి లవి :

1. విష్కంభము, 2. ప్రీతి, 3. ఆయుష్మాన్, 4. సౌభాగ్యము, 5. శోభనము, 6. అతి గండము, 7. సుకర్మము, 8. ధృతి, 9. శూల, 10. గండము, 11. వృద్ధి, 12. ధ్రువము, 13. వ్యాఘాతము, 14. హర్షము, 15. వజ్రము, 16. సిద్ధి. 17. వ్యతీపాత, 18. వరీయాన్, 19. పరిఘ, 20. శివము, 21. సిద్ధము, 22. సాధ్యము, 23. శుభము, 24. శుక్లము, 25. బ్రహ్మము, 26. ఐంద్రము, 27. వైధృతి ఇవీ 27 యోగాలు.

ఇక కరణాల గురించి. కరణాలు 11. వీనిలో చరకరణాలు 7. స్థిరకరణాలు4. ఇవి తిథిని బట్టి ఏర్పడతాయి. ఎలాగంటే - ప్రతిమాసంలోనూ శుద్ధ పాడ్యమి ఉత్తరార్థం (సెకండ్‌హాఫ్) మొదలుగా - బహుళ చతుర్దశి పూర్వార్థం అంతం వరకూ ఒక్కొక్క తిథికీ రెండేసి కరణాల ప్రకారంగా చరకణాలు ఏడూ తిరిగి వస్తూ ఉంటాయి.

1. బవ, 2. బాలవ, 3. కౌలవ, 4. తైతుల, 5. గరజి, 6. వణజి, 7. విష్టి లేదా భద్ర – కరణములు.

ప్రతిఅమావాసంలోనూ బహుళ చతుర్దశి ఉత్తరార్ధం మొదలు శుద్ధపాడ్యమి పూర్వార్ధం చివరి వరకూ ఒక్కొక్క తిథికి రెండేసి కరణాల చొప్పున స్థిర కరణాలు నాలుగూ తిరిగి తిరిగి వస్తూంటాయి. 1. శకుని, 2. చతుష్పాత్, 3. నాగవ, 4. కింస్తుఘ్నము.

మానవులు చేసే ప్రతి పనికీ – ఆ పనిచేసే కాలంపైన ఆధారపడి ఆ కాల శుభాశుభాలను బట్టి ఫలితాలుంటాయి. కేవలమూ మానవ ప్రయత్నాన్ని బట్టి మాత్రమే శుభాశుభాలు ఏర్పడడంలేదన్న విషయాన్ని మనమందరమూ చూస్తూనే ఉన్నాం.

అంతేకాక – కొన్ని కొన్ని తిథి నక్షత్రయోగాదుల కలయికలు నిషిద్ధాలు. వాటిని వాడరాదు. అలాగే– శుభ ముహూర్త నిర్ణయంలో విడవవలసిన 21 మహాదోషాలున్నాయి. అవి ఎంత మాత్రమూ పనికిరావు. ఇంకా– పంచకరహితంకాని ముహూర్తాలను శుభకార్యాలకు వాడకూడదు. ఇలా విడవవలసిన దోషాలను విడిచిపెట్టి – తిథి వార నక్షత్రాదులు శుద్ధిగా ఉండేటట్లు చూచుకోవడమే పంచాంగశుద్ధి. ఈ ఒక్కొక్క అంశాన్నీ, విస్తృతంగా వివరిస్తే ఎంతో ఉంది.

178. భీమాది పంచబలులు ఒకే లగ్నంలో ఒకేరోజున జన్మించారంటారు. నిజమేనా? ఈ విషయం మీద భారతంలో ఏం చెప్పారు? భీమాది ఒకేరోజున జన్మించిన వాళ్ళ జాతకాలుఒకేలా నడుస్తాయా? ఒకే రోజున ఒకే లగ్నంలో జన్మించడం వాస్తవమేనా? ఒకేరోజున జన్మించిన వాళ్ళ జాతకాలు ఒకేలా నడుస్తాయా?

పంచభీములు లేదా పంచబలులు అనబడే భీముడు, దుర్యోధనుడు, బకాసురుడు, జరాసంధుడు, కీచకుడు – ఒకే సమయంలో జన్మించలేదు. వారు సమవయస్కులనేది కూడా ఎంతమాత్రమూ నిజం కాదు. ఈ విషయానికి సంబంధించి ఈక్రింది అంశాలను పరిశీలించండి.

జరాసంధుడు - కంసుని మామగారు.

శ్రీకృష్ణుడు - కంసుని మేనల్లుడు

కనుక - జరాసంధునికీ, కృష్ణునికీ - మూడు తరాల వయోభేదం ఉన్నది. ఈ లెక్క ప్రకారం భీమ, జరాసంధుల మధ్య కూడా అంతే వయోభేదం ఉన్నది. భీమ దుర్యోధనులు సమవయస్కులు. వారు కృష్ణుని కంటే కొద్దిగా చిన్నవాళ్ళు.

భీమాది పంచబలులు జన్మించిన జన్మ నక్షత్రాలు, జన్మ సమయాలు,లగ్నరాశ్యాదులు,వేరు వేరు కావడం వల్ల వారి జాతకాలు కూడా వేరుగానే ఉన్నాయి. కనుక వారి జీవిత గమనాలు కూడా వేరుగానే ఉన్నాయి. కనుక వారి జీవిత గమనీలుకూడా వేరుగానే ఉంటాయి. వ్యాసకృతమైన భారతంలో ఎక్కడా ఈ అయిదుగురూ ఒకే సమయంలో ఒకే నక్షత్రంలో జన్మించారని చెప్పబడలేదు.

''యస్మిన్నహని భీమస్తు జజ్ఞేభరతసత్తమ!

దుర్యోధనోపి తత్రైవ ప్రజజ్ఞే వసుధాధిప!!

అనే వ్యాసభారత శ్లోకాన్ని అనుసరించి భీమ - దుర్యోధనులిద్దరూ మాత్రమే ఒకే రోజున జన్మించారు. అదీ - ఒకేరోజున జన్మించారనే చెప్పబడింది కాని ఒకే సమయంలో కాదు ఆ సందర్భంగా జరిగిన కథ ఈ క్రిందిది.

ధర్మరాజు జన్మించిన వార్త వినగానే అప్పటికి గర్భవతిగా వున్న గాంధారి - తనకంటే ముందుగా కుంతీదేవి సంతానవతి అయిందనీ,ఆ పిల్లవాడు భవిష్యత్తులో రాజ్యార్హుడు కాబోతాడనే ఆక్రోశంతో గర్భాన్ని మోదుకున్నది. అప్పుడు ఆమెకు గర్భపతనం జరిగింది. ఆ సమయంలో వ్యాసమహర్షిని ప్రార్థించగా ఆ మహర్షి వేంచేసి, ఆమాంసఖండాన్ని నూటొక్క ముక్కలుగా విభజించి - ఒక్కొక్క దానినీ ఒక్కొక్క నేతికుండలో ఉంచాడు. తనకు నూరుగురు కుమారులూ, ఒక్కకుమార్తె కావాలనే గాంధారి మనోభీష్టాన్ని అనుసరించి ఆయన ఆ విధంగా చేశారు

అలా ఉంచబడిన కుండల నుంచి దుర్యోధనాదులు జననం జరిగిందనీ, భీముడుశతశృంగ పర్వతారణ్యంలో జన్మించిన రోజుననే ఇక్కడ హస్తినాపురంలో దుర్యోధనుడు జన్మించాడనీ వ్యాస భారతం స్పష్టం చేస్తున్నది.

జరాసంధుడు భీమునికంటే బాగా వయోధికుడు. అతడూ, భీమ దుర్యోధనులూ, ఒకేసారి జన్మించడం యదార్థం కాదు.

ఈ పంచబలులని పేర్కొనబడేవారు ఓకేరోజున జన్మించిన వారని భారతంలో ఎక్కడా చెప్పబడిన ఉండలేదు. ఇక ఒకే రోజున జన్మించిన వారి జాతక ఫలితాలు గురించి-

ఎవరైనా ఒకే రోజున జన్మించినా,వారి జనన సమయాలలో తేడా ఉంటే, జాతక ఫలితాలు తప్పక మారుతాయి.

జనన సమయంలో ఉన్న తేడానుబట్టి జన్మ లగ్నం మారుతుంది. జన్మలగ్నం మారినప్పుడు, ద్వాదశ భావఫలాలున్నూ తప్పక మారడం జరుగుతుంది. ఆయాభావాలలో ఉన్న గ్రహాలు మారుతాయి. వాటిని బట్టి ఫలితాలు మారుతాయి.

ప్రతి దినమూ, సూర్యోదయానికి మరుసటి దినం సూర్యోదయం వరకూ ద్వాదశ లగ్నాలు నడుస్తాయి. ఏ లగ్న సమయంలో జన్మించిన వారికి ఆ లగ్నం జన్మలగ్నమవుతుంది.

ఒకే రోజున జన్మించినప్పటికీ జన్మ సమయం మారేసరికి,లగ్నమూ, గ్రహాల యొక్క స్థితి కూడా మారుతాయి. ఉదాహరణకు మేష రాశిలో కుజుడు ఉండగా మకర లగ్నంలో జన్మించిన వారికి కుజుడు చతుర్థమందు ఉండగా ఆ కుజుడు అదే మేష రాశిలో ఉండగా కుంభ లగ్నంలో జన్మించిన వారికి తృతీయమందు కుజుడు ఉండడం జరుగుతుంది. మొదటి వారికి చతుర్థకుజ ఫలితాలు, రెండవవారికి తృతీయ కుజ ఫలితాలు కలుగుతాయి. రెండింటిలోనూ ఎంతో భేదం ఉంటుంది.

ఈ విధంగా జన్మించిన దినం ఒకటే అయినా. సమయం మారినట్లయితే,ఫలితాలు ఎంతగానో మారడం జరుగుతుంది. జాతక చక్రం పూర్తిగా మారుతుంది. జన్మదినం ఒకటే అయినా, ఈ జననానికీ, ఆ జననానికీ మధ్య గ్రహాలేవీ కూడా ఇతర రాశి ప్రవేశం చేయకుండా ఉన్నప్పటికీ కూడా జన్మసమయం మారితే జాతక కుండలి పూర్తిగా మారుతుంది · దానినిబట్టి ఫలితాలూ మారుతాయి. దశాంతర్దశలు విభేదిస్తాయి.

ఒకే దినమందు జన్మసమయం మారేసరికి అనేక మార్పులుంటాయి. లగ్నం మారుతుంది. తిథి మారవచ్చును. నక్షత్రం మారవచ్చును. గ్రహాలు తాము ఉన్న రాశిగాని, నక్షత్రంగాని, నక్షత్ర పాదం కాని మార్పు చెందవచ్చును. ఇంకా అనేక స్థూల, సూక్ష్మ అంశాలలో మార్పులు సంభవించవచ్చును. ఈ మార్పు వల్ల రాశి కుండలిలో, నవాంశకుండలిలో ఎన్నో భేదాలు ఏర్పడతాయి. అతి శీఘ్రగ్రహమైన చంద్రుని గమనం వల్ల కూడా జన్మసమయ భేదాన్ని అనుసరించి ఫలితాలలో ఎన్నో మార్పులువస్తాయి.

పై కారణాల రీత్యా ఒకే రోజున జన్మించినా, వివిధ సమయాలలో జన్మించిన వారి జాతకాలు ఒకే విధంగా ఉండవు. ఈ విషయంలో సందేహం లేదు.

179. ఇల్లుకట్టే నేలలోపల ఎముకలుంటే దోషమా?

ఇంటి ఆవరణలోని నేలలో ఎముకలుండడం దోషం. దాని వల్ల ఇప్పుడు చెప్పబోయే ఫలితాలు కలుగుతాయి. ఇంటి నేలలో తూర్పుదిక్కులో ఎముకలుంటే ఇంటి యజమానికి ఇతరులతో విరోధాలు కలుగుతాయి. నైఋతిలో ఎముకలుంటే పశువులకు కీడు. ఆగ్నేయంలో యజమానికి ఋణబాధ. పడమట ఎముకలుంటే ఆ గృహంలో హఠాన్మరణాలు. వాయవ్యంలో ఎముకలుంటే యజమాని దేశాంతరం వెళ్లడం కాని, ఊళ్లు పట్టుకుని తిరుగుతూ ఇంటి పట్టున ఉండకపోవడంకాని, కుటుంబంలో వాళ్లకు పరస్పరం కలహాలుగాని, ఇతరులతో విరోధాలు కాని – కలుగుతాయి.

ఉత్తరాన ఎముకలుంటే ధన హాని, కష్టాలు.

ఈశాన్యంలో ఎముకలుంటే ఇరుగుపొరుగు వాళ్లతో కలహాలు. ఇంటి మధ్యభాగంలో ఎముకలుంటే కుటుంబ కలహాలు.

ఆ ఇబ్బందులు కలిగినప్పుడు ఆ దోషానికి సంబంధమున్న దిక్కులో ఆరు అడుగుల లోతున తవ్వి ఎముకలు తీసివెయ్యాలి.

180. జ్యోతిశాస్త్రప్రాశస్త్యం ఏమిటి ?

ఆధునికులు అనేకులు భావించేటట్లు – జ్యోతిశ్శాస్త్రం అనేది ఒక మాయో, మోసమో కాదు. అది ఒక సంపూర్ణ ప్రతిపత్తి కలిగిన శాస్త్రం.

శాస్త్రంగా భావించబడడానికి తగిన అర్హతలన్నీ జ్యోతిశ్శాస్త్రానికి ఉన్నాయనడంలో సందేహం లేదు.

లోకంలోగల వివిధ శాస్త్రాలను అధ్యయనం చేసే వ్యక్తులందరూ – ఆయా శాస్త్రాలలో నిష్ణాతులు కాలేరు. ఈ విషయం ప్రతి శాస్త్రానికీ వర్తిస్తుంది. అంతమాత్రం చేత ఆ శాస్త్రమే అసత్యం – అనడం దుస్సాహసం. వివేకవంతులు, విజ్ఞులూ అంగీకరించే విషయం ఇది. ఒక విషయాన్ని స్వీకరించడానికైనా, నిరాకరించడానికైనా –దానిని సమగ్రంగా పరిశీలించడం అవసరం. ఆ విధమైన సర్వంకషమైన పరిశీలన లేకనే – దేన్నైనా తృణీకరించడం అనుచితం.

జ్యోతిశ్శాస్త్రంలో అనంతమైన విజ్ఞాన సంపదను నిక్షిప్తం చేశారు మన మహర్షులు. జీవులు తాము చేసిన పుణ్యపాపాల కారణంగా తాము పొందవలసిన సుఖదుఃఖాలకు అగుణమైన గ్రహస్థితిలో జన్మిస్తారు.

కాబట్టి సూక్ష్మంగా జాతకం అనేది జీవులు చేసిన పుణ్యపాపాల ఆధారంగా వారు పొందవలసిన సుఖదుఃఖాల విషయ సూచిక అని చెప్పవచ్చు. ఈ విషయాన్నే '' కర్మార్జితం పూర్వభవే దదాతి'' అని చెప్పారు.

జ్యోతిశాస్త్రంలో రత్న విజ్ఞానం, గణితశాస్త్రం,మనోవిజ్ఞానశాస్త్రం -ఇత్యాది ఎన్నోశాస్త్రాలు నిక్షిప్తమై వున్నాయి.

క్లినికల్ ఎస్ట్రాలజీ అని పిలవడానికి యోగ్యమైన శాస్త్రం జ్యోతిశ్శాస్త్రంలో ఉంది. గ్రహాలు వ్యక్తుల బాహ్య, అంతరవయవాలకు కారకత్వం వహిస్తాయి.

ఆ విధంగా - డాక్టర్లకుకూడా అంతుపట్టని అనేక రోగాలను జ్యోతిశ్శాస్త్ర రీత్యా ఎనలైజ్ చేసి చెప్పడానికి అవకాశం ఉంది. మణి, మంత్ర, ఔషధాల రూపంలో ఆయా రోగాలకు తగిన నివారణ మార్గాలను కూడా జ్యోతిశ్శాస్త్రం ద్వారా కనుక్కోవచ్చును.

181. జ్యోతిశ్శాస్త్రానికి మూలమైన గ్రహాలు- మనవారు, పాశ్చాత్యులు అనుసరించేవి వేరువేరుగా ఉటున్నాయికదా? మార్స్, జూపిటర్, శాటర్న్, వీనస్, మెర్క్యురీ - ఇత్యాది గ్రహాలను పాశ్చాత్యులు అనుసరిస్తున్నారు. మనవారు గురు, శుక్ర, శని, బృహస్పతి, కుజుడు - ఇత్యాదిగ్రహాలను అనుసరిస్తున్నారు. ఎలా సమన్వయం?

భారతీయులు,పాశ్చాత్యులు అనుసరించేగ్రహాలు వేరు వేరు కాదు. మనం అనుసరించే గ్రహాలకే అవి మరొక పేర్లు అని గ్రహించాలి. గురు గ్రహమన్నా, బృహస్పతి అన్నా ఒకటే. దానినే పాశ్చాత్యులు జూపిటర్ అంటున్నారు. మార్స్ అంటే కుజుడు. వీనస్ అంటే శుక్రుడు, శాటర్న్ అంటే శని. మెర్క్యురీ అంటే బుధుడు. ఇదే విధంగా గ్రహించాలి.

182. యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో గ్రహాలను పాశ్చాత్యులు గణిస్తున్నారుకదా? మనవారు గ్రహించడంలేదేమి? దానివల్ల ఫల నిర్ణయంలో తేడాలు రావా?

యురేనస్, నెప్ట్యూన్,ప్లూటో గ్రహాలను ఇంద్ర,వరుణ,యమ గ్రహాలుగామనవారూ గ్రహిస్తున్నారు. అదీ గాక - వాటిని

తీసుకునికాని, తీసుకోకుండాకానీ,ఫల నిర్ణయం చేయవచ్చును. ప్రాచీనులైన జ్యోతిశ్శాస్త్రవేత్తలు - రాహుకేతువులను సైతం తీసుకొనీ, తీసుకొనకుండానూ కూడాఫల నిర్ణయంచేసి ఉన్నారు. అది ఆయా విద్వాంసులు అనుసరించే విధానాలనుబట్టి వుంటుంది. శాస్త్రీయమైన ఫలితాలను వివిధ విధానాలతో సాధించవచ్చును.

వృద్ధపారాశర్యంలో నవ గ్రహాలనే తీసుకొన్నారు. గౌతమ మహర్షి మాంది,గుళికుడు, ధూమ్రకుడు - అనే మూడు గ్రహాలను అదనంగా తీసుకొని ఫల నిర్ణయాలువ్రాశారు. జైమిని మహర్షి,ఇత్యాదులు - ధూమ్రక గ్రహాన్ని విడిచిపెట్టి తక్కిన గ్రహాలనే తీసుకున్నారు. వరాహమిహిరాచార్యులవారు సత్యాచార్యుడు, శ్రీపతిభట్టు - రాహుకేతువులను వదిలి పెట్టి - మిగిలిన ఏడు గ్రహాలను గ్రహించారు. కాళిదాసు కూడా ధూమ్రక గ్రహాన్ని వదిలి - మాందీ గుళికులతో సహా11 గ్రహాలను గ్రహించాడు.

ఇంకా ఇంద్రధనుస్సు, ధూమము, ధూమకేతువు మొదలైన ఉపగ్రహాలున్నాయి. జ్యోతిశ్శాస్త్రవేత్తలు వాటిని తీసుకొనీ, తీసుకోకుండానూ కూడాఫల నిర్ణయం చేసినవారున్నారు.

183. ముహూర్తలగ్నానికి గ్రహస్థితులు బాగుంటే, పంచకరహితం కావలసిన అవసరం లేదా? గ్రహస్థితి బాగున్న ముహూర్తానికి - సవ్యంగా పంచకరహితం కాకపోయినా ఫర్వాలేదా? పంచక రహితమయిందో లేదో చూడడానికి తిథిని ఎప్పటి నుంచి తీసుకోవాలి? మాసాది నుంచియా, పక్షాది నుంచి లెక్కించాలా?

శుభకార్యాలకు ముహూర్త నిర్ణయం చేసే సందర్భంలో ఏయే దోషాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి? ఈ విషయంలో అనేక మంది తలోకవిధంగానూ ముహూర్త నిర్ణయం చేస్తున్నారు. దానివల్ల ప్రజానీకం, శాస్త్రాన్ని అర్థం చేసుకోలేక, ఎవరిని నమ్మాలో తెలియక, గందరగోళంలో పడుతున్నారు. అసలు ఈ ముహూర్త నిర్ణయం విషయంలో ముఖ్యమైన

అంశాలను మేము తెలుసుకోవాలనుకుంటున్నాము. శుభముహూర్తాల విషయంలో విడిచి పెట్టవలసినవీ, పనికిరానివీ అయిన అంశాలు ఎవి? ముహూర్తదోషాలు అంటే ఎటువంటివి?

ముహూర్తలగ్నానికి గ్రహస్థితులు ఎంత బాగున్నా - ముహూర్తం సవ్యంగా పంచకరహితం కావడం చాలా అవసరం. సవ్యంగా పంచకరహితంకాని ముహూర్తం వల్ల మృత్యుపీడ, అగ్ని భయం, రాజదండన, రాజభయం, చోరభయం, రోగపీడ - ఈ దోషాలలో అన్నీ కాని, కొన్నికాని కలుగుతాయి. కాబట్టి ముహూర్తం సక్రమంగా పంచకరహితం అయ్యేలా చూసుకోవాలి. ఆ విధంగా ముహూర్తం పంచకరహితం అయిందోలేదో చూడడానికి తిథిని మాసాదిగాకాక, పక్షాదిగా తీసుకొని లెక్కించాలి. తిథిని పక్షాదిగా తీసుకొని లెక్కించడమే కరెక్ట్ పద్ధతి.

అయితే, ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయాలు ఇంకా ఉన్నాయి. కేవలం ముహూర లగ్నం సక్రమంగా పంచకరహితం కావడమూ, ఆ లగ్నానికి గ్రహబలం ఉండడమూ మాత్రమే సరిపోదు.

ముహూర్త లగ్నం ఎన్ని శుభలక్షణాలతో కూడినదైనాపంచేష్టిక బలాలను కలిగినదైనా,శుభ గ్రహాలన్నిటితో కూడినదైనా, పుష్కరాంశకానీ, వర్గోత్తమాంశకానీ - ఇన్ని ఉన్నాసరే - ముహూర్త దోషాలలో ఏ ఒక్క దోషమూ ఉండనే కూడదు. అలా ఏ ఒక్కదోషం ఉన్నా - ఆ ముహూర్తం మృత్యుప్రదం కాగలదని మహాజ్యోతిశ్శాస్త్రద్రష్టలైన మహర్షులు స్పష్టంగా చెప్పారు.

శుభ ముహూర్తాల విషయంలో పాటించి తీరవలసిన అంశాలీ క్రిందివి:-

ముహూర్తం సక్రమంగా పంచకరహితం కావాలి. 21 మహాదోషాలు ఉండరాదు. అంటే - మహాదోషాలుగా చెప్పిన ఆ 21 ముహూర్త దోషాలలో ఏ ఒక్కటీ కూడా ఉండకూడదు, అని మహర్షులు ఘంటాపథంగా నొక్కి చెప్పారన్నది బాగా స్పష్టంగా గమనించాలి. ఇంకా-లగ్న త్యాజ్యాలనూ,

అంతేగాక- అంధకర్రాసులనూ, బధిరరాసులనూ, పంగురాసూ
సంవత్సర సంధులనూ, కాల సంధులనూ, నక్షత్ర సంధులనూ, గ్రహణ త్యాజ్యదినాలనూ, గురు, శుక్ర, చంద్ర మౌఢ్య సమయాలనూ తప్పనిసరిగా విడిచిపెట్టాలి గురు శుక్ర, చంద్రుల బాల్య, వార్ధక్య సమయాలను కూడా విడిచిపెట్టాలి. ముహూర్తలగ్నంలోచంద్రుడు ఉండకూడదు. ముహూర్త లగ్నానికి లగ్నశుద్ధి ఎంత ముఖ్యమో అష్టమశుద్ధి కూడా అంతే ముఖ్యం. పాపగ్రహ సంబంధం ముహూర్త లగ్నానికి ఎంతమాత్రం పనికి రాదు. క్రూరగ్రహ ఆక్రాంతాలూ, వేధలూ కూడా తప్పక పరిత్యజించాలి. అవి మహాదోషాలు. పంచశలాకవేధ, సప్తశలాకవేధాకూడా ఎంతమాత్రం పనికిరావు. సగ్రహ చంద్రుడు ఉండకూడదు. అంటే చంద్రుడు ఏగ్రహంతోనూ కలిసి ఉండకూడదు. అంతేకాక- చంద్రుడు ముహూర్తలగ్నానికి 7,8,6,12 స్థానాలలో ఉండకూడదు.

భరణి, కృత్తిక, ఆశ్రేష, జ్యేష్ఠ - ఈ నక్షత్రాలు ఏ ముహూర్తాలకూ పనికి రావు. ముహూర్తలగ్నానికి ఛాదక, వేధక, బంధక, ప్రతిబంధక గ్రహాలు లేకుండా జాగ్రత్తపడాలి. అంటే ఛాదక, వేదక, బంధక, ప్రతిబంధక దోషాలు లేకుండా ముహూర్తాన్ని నిర్ణయించుకోవాలి.

ఇంకా- శూన్యమాసాలను కూడా శుభకార్యాలను ప్రారంభించే విషయంలో విడిచిపెట్టాలి.

శుభ ముహూర్త నిర్ణయం విషయంలో ఇంకా ఎన్నో అంశాలను వివరించి చెప్పవలసి ఉంది. ఇంకా అనేక దోషాలను గురించి చెప్పాలి. పైన చెప్పిన హటిలో చాలా విషయాలను వివరించాలి. కానీ ఇప్పటికే సమాధానం పెద్దది కావడంచేత- అవన్నీ కాలక్రమంలో క్రమక్రమంగా వివరిస్తాను.

184. భారతీయులు జ్యోతిశ్శాస్త్రాన్ని, గణిత,ఖగోళ శాస్త్రాలనూ గ్రీకులవద్ద నేర్చుకున్నారని ఒకవాదం ఉంది. నిజమేనా?

ఇది పూర్తిగా అసత్యం. భారతీయులకు గణిత, ఖగోళ, జ్యోతిశ్శాస్త్రాదులను ఏ ఒక్కరూ నేర్పనవసరంలేదు. గ్రీకులే భారతీయుల పరిజ్ఞానాన్ని స్వీకరించారు. దీనికి ఎన్నో నిరూపణలు, నిదర్శనాలు చూపవచ్చును. ఉదాహరణకు కొన్ని చెబుతాను. భూమి బల్లపరుపుగా ఉన్నదని 'టాలమీ' వంటి పాశ్చాత్య శాస్త్రజ్ఞులతో సహా పాశ్చాత్య దేశాలన్నీ విశ్వసిస్తున్న సమయానికి అసంఖ్యాక సంవత్సరాల పూర్వమే- వేదంలో - భూమి ఒక గోళమని, అది కపిత్థాకారంలో - అనగా వెలగపండువలె గోళాకృతిలో ఉన్నదనీ పేర్కొనబడింది.

భూమికిపైకప్పు ఆకాశమనీ, అది ఎంతో బరువైన పదార్ధమనీ, దానిని గామా, హెర్క్యులీస్ అనే మహాబలా శాలులు తమ చేతులపైన మోస్తూ, ఆకాశం ప్రజలపై పడిపోకుండా కాపాడుతున్నారనీ - 'ఆకాశం బరువు'ను గురించి గ్రీకుపురాణ కథలున్నాయి. వాటికి ఎన్నో వేల సంవత్సరాల పూర్వికుడైన మన 'అమర సింహుడు' తన 'అమరకోశం' లో - ఆకాశమ్ గగనమ్ శూన్యమ్' అనేవి ఒకదానికొకటి పర్యాయపదాలుగా, అనగా ఆకాశమంటే వట్టి శూన్య ప్రదేశమని చెప్పివేశాడు. అసలు 'ఆకాశమ్' అనే సంస్కృత శబ్దానికి గల అర్థమే అది. ఆ శబ్ద ప్రాచీనతను బట్టి ఐనా ఈ విషయంపైనా భారతీయుల అవగాహనను అర్థం చేసుకోవచ్చును.

భూమి గుండ్రంగా ఉన్నదని తొలిగా చెప్పినది గెలీలియో, కోపర్నికస్ అని నేడు భావిస్తున్నారు. కానీ వారికి ఎన్నో వేల సంవత్సరాల పూర్వుడైన 'ఆర్యభట్టు' - భూమి గుండ్రంగా ఉన్నదని పేర్కొని ఉన్నాడు. ఖగోళ శాస్త్రంలో మహా విద్వాంసులైన వరాహమిహిరుడు, ఆర్యభట్టు - తమ గ్రంధాలలో ఖగోళశాస్త్ర సంబంధమైన అసంఖ్యాక విశేషాలను వివరించారు. అవి అన్నీ- ఆధునిక పరిశోధనలలో నిరూపణ అవుతున్నాయి.

మన వేదాలలో ఎంతో ఖగోళ పరిజ్ఞానం ఉన్నది. వానిలో చెప్పబడిన అనేక అంశాలు సహితం – ప్రస్తుతం ఒకటొకటిగా రుజువవుతున్నాయి.

పై అంశాలన్నిటినీఓర్పుతో పరిశీలిస్తే – భారతీయులకు గల ఖగోళ శాస్త్రానికి సంబంధించిన పరిజ్ఞానం, దానిప్రాచీనతతో సహా రుజువుకాగలదు.

ఖగోళ శాస్త్రం గురించి తెలియని అజ్ఞానంలో ఏర్పడినదే జ్యోతిశ్శాస్త్రం – అనే అభిప్రాయం తప్పు. సంపూర్ణమైన ఖగోళశాస్త్ర పరిజ్ఞానంతో నిర్మితమైనదే జ్యోతిశ్శాస్త్రం. అందుకు సందేహం లేదు.

ఋషి పుంగవులు చెప్పినవి మూఢ నమ్మకాలుగా, పాశ్చాత్యులు చెప్పిన శిరోధార్యాలుగా భావించడం మన వారికి అలవాటైంది. స్వీయ సంస్కృతినే నిరసించడం ఆధునిక భారతీయులకు ఒక ఫ్యాషన్‌గా మారింది.

185. శని దోషం అంటే ఏమిటి? అసలు శనిదోషంఅనేది ఒకటి ఉందా? ఈ దోషం ఎవరికి సంక్రమిస్తుంది? అనేక బాధలకు శనే కారణమా?

వ్యక్తుల జాతకాలలోకాని, సంస్థల జాతకాలోకానీ, ఇళ్ల జాతకాలలోకాని శని–దోషయుక్తుడై ఉండడమే శనిదోషం. ఈ శని దోషం అనేది అనేక విధాలుగా సంక్రమిస్తుంది. అంటే ఈదోషం స్వరూపం అనేక విధాలుగా ఉంటుంది. ఇది ఎవరికైనా ఏ వ్యక్తికిగాని, సంస్థకుగాని ఎంతటి ఉన్నతస్థితిలో ఉన్నవారికైనా కూడా సంక్రమించవచ్చు. చక్రవర్తులకు కూడా సంక్రమించవచ్చు. బాధలకు శనిగ్రహదోషం కూడా ఒక ప్రముఖమైన కారణం. శనేకాక – ఇతర గ్రహాలైన రవి, చంద్ర, కుజ, రాహు, గురు, బుధ, కేతు, శుక్ర గ్రహాలు దోష ప్రదులుగా ఉండడం కూడా బాధలకు కారణం అవుతుంది. అంటే మిగతా గ్రహాల దోషంవల్లకూడా బాధలు కలుగుతాయి. మిగతా గ్రహాలు కూడా – మొత్తం అన్ని గ్రహాలు కూడా మంచినీ చెడునూ కూడా ఇవ్వగలరు. ఏ గ్రహంవల్ల, లేదా ఏ దోషం వల్ల బాధలు కలిగాయి– అనేది– ఆయా వ్యక్తుల,సంస్థల, ఇళ్ల–జాతకాలను పరిశీలిస్తే తెలిసే విషయం.

శని దోషమేకాక, ఇతర దోషాలు అనేకం కూడా బాధలకు కారణాలు కావచ్చు. ఏది కారణం, అనేది జాతకంలో ఉంటుంది.

గ్రహదోషాలకు పరిహారాల గురించికూడా అడిగారు. జాతకాలలో ఏ దోషాలు ఉన్నాయో వాటికి మాత్రమే పరిహారం చేయవలసి ఉంటుంది. అది కూడా శాస్త్రంలో చెప్పినపరిహార క్రియలనే ఆచరించాలి. ఏ గ్రహానికి దోషం పట్టింది. అది ఎటువంటి దోషం - అనేదాన్ని పరిశీలించి తగిన ప్రతిక్రియలను మాత్రమే చెయ్యాలి. తెలిసీ తెలియక ఎవో చేస్తే పనికిరాదు. బలం పెంచవలసిన గ్రహాలకు పెంచే విధంగానూ, తగ్గించవలసిన గ్రహాలకు తగ్గించేవిధంగానూ ఈపరిహార క్రియలను చెయ్యాలి. దీనికి చాలా విస్తృతమైన శాస్త్రపరిజ్ఞానం అవసరం.

186. గత సంవత్సరం తిరుపతిలో తలనీలాలు మొక్కును తీర్చడం అలస్యం చేయడంవల్లనే ఇబ్బందులువస్తున్నాయా?

దేవతలకు మొక్కిన మొక్కుబడులు - ఎక్కువకాలం ఆలస్యం చేయడం సరికాదు. వెంటనే ఆ మొక్కు తీర్చండి. ఇక కష్టాలంటారా - అవి పూర్వజన్మ కర్మఫలం వల్ల కలుగుతాయి. ఆ కర్మఫలం యొక్క రాశిలో నుంచి- ప్రస్తుత జన్మలో మనిషి అనుభవించే శుభపాపాల ఇండెక్స్- జాతకం కనుక కష్టాలకు కారణాలు - జాతకంలో గ్రహదోషాల రూపంలో దర్శనమిస్తాయి. ఆయా గ్రహదోషాలను తెలుసుకొని- వాటికి తగిన పరిహారం చేసుకోవడమే కర్తవ్యం.

187. నాగదోషం అంటే ఏమిటి? అది వ్యక్తులకు ఉన్నట్లు ఎలా తెలుస్తుంది? దాని నివారణకు ఏమి చేయాలి?

జాతకరీత్యా వ్యక్తులకు ఉండే దోషాలలో నాగదోషం కూడా ఒకటి. వ్యక్తుల జాతకాలను పరిశీలిస్తే నాగదోషం ఉన్నదీ లేనిదీ తెలుస్తుంది. ఇటువంటి అనేకానేక జాతకదోషాలకు నివారణ మార్గాలు - శాస్త్రాలలో మహర్షులు నిగూఢంగా చెప్పి ఉన్నారు. శాస్త్రకోవిదులైన పండితుల ముఖంగా

వాటిని తెలుసుకొని తగిన పరిహార క్రియలను ఆచరించడమే దోషాల నివారణకు మార్గం.

అనేక మంది తమ ప్రశ్నలకు సమాధానం వెంటనే ఇవ్వడం లేదేమని వ్రాస్తున్నారు. అసంఖ్యాకంగా ప్రశ్నలు వస్తూఉండడం వల్ల – అన్ని ఉత్తరాలకూ ఒకేసారి సమాధానాలివ్వడం సాధ్యం కాదు. పత్రికలోఉండే స్పేస్‌ను అనుసరించి – ఒకదాని వెనకు ఒకటిగా క్రమంగా సమాధానాలివ్వడం జరుగుతుంది. పాఠకులు గమనించాలనిప్రార్థన.

188. వర్జ్యం, దుర్ముహూర్తం అంటే ఏమిటి? జనబాహుళ్యం ఎక్కువగా వర్జ్యాన్ని దుర్ముహూర్తాన్నీ పరిహరించి కార్యానికి పూనుకోవాలని చూస్తారు ఎందుకు?

ఏదైనా ఒక కార్యం తలపెట్టినప్పుడు అది మంచి ఫలాలను ఇవ్వడం కోసం, ఆ పనికి శుభసమయాన్ని ఎంచుకోవడం జరుగుతుంది. కార్యహాని,కార్యవిలంబనం,చోర,శస్త్ర, అగ్ని మృత్యు,రోగ,రాజభయాది దుష్ట ఫలితాలు కలుగకుండా ఉండే నిమిత్తమై అశుభ సమయాలను, పాపగ్రహస్థితి లగ్నాలను విడిచిపెట్టాలి. వర్జ్య, దుర్ముహూర్త, గులికకాల, యమఘంటికాది దుష్ట సమయాలను విడిచిపెట్టడం అవసరం. ఎవరైనా ఏ కార్యమైనా శుభ ఫలాలను కోరి మాత్రమే ఆచరిస్తారు. కనుక, ఇది వ్యక్తులకైనా, సంస్థలకైనా, ప్రభుత్వాలకైనా వర్తిస్తుంది.

వ్యక్తికి జాతకం ఎటువంటిదో, ఏ ప్రయత్నానికైనా దాని ప్రారంభ ముహూర్తం అటువంటిది. ఆ ప్రారంభ సమయానికి చెందిన గ్రహస్థితి, ఆ ముహూర్త శుభాశుభాలు ఆ కార్యఫలాన్ని నిర్ణయిస్తాయనడంలో సందేహం లేదు.

189. అన్నప్రాసన, ఉపనయనము అంటే ఏమిటి?

మానవునికి జన్మించడానికి ముందు నుంచీ మొదలుపెట్టి జరుపవలసిన సంస్కారాలున్నాయి. వాటికే షోడశసంస్కారాలని పేరు. ఆ సంస్కారాలలోనివే.

మీరడిగిన అన్నప్రాశనమూ, ఉపనయనమూను,శిశువు జన్మించిన ఏడాది లోపుగా ఒక శుభముహూర్తంలో ఆ శిశువుకు తొలిసారిగా అన్నాన్ని తినిపించడం ప్రారంభించవలసి ఉంది. అదే అన్నప్రాశనం. శిశువును ఆ బిడ్డను కన్న తల్లీ దండ్రీ పీటల మీద కూర్చోబెట్టుకుని, క్షీరాన్నాన్ని మొదటిసారిగా బిడ్డకు తినిపించాలి. ఈ కార్యక్రమం మంత్రయుక్తంగా, శుభముహూర్తంలో జరగాలి.

ఉపనయనమంటే -వేదవిహితమైన సర్వకర్మలకూ సమీపంగా తీసుకువెళ్లడం. దైవకార్యాలనూ,పితృ కార్యాలనూ,వేదచోదితమైన సకల కార్యాలనూ ఆచరించడానికి అర్హతనుకలిగించడం. దాని నిమిత్తం పంచాంగశుద్ధి కలిగిన, శుభలక్షణ సంపన్నమైన ముహూర్తంలో వేద మంత్రాలతో యజ్ఞోపవీతాన్ని ధరించపచేయడం, బ్రహ్మోపదేశమూ చేయవలసి ఉంది.

190. మూఢంలోనూ, శూన్యమాసాలలోనూ పెళ్ళిళ్ళు చెయ్యకూడ దంటారు కదా? ఈ దోషం పెద్దదా, ముహూర్త దోషం పెద్దదోషమా? ఈ రెండిటిలో ఏది పెద్దదోషం?

ముహూర్త దోషమే పెద్ద దోషం. ప్రత్యేక పరిస్థితులలో మౌఢ్యంలోనూ, శూన్యమాసాలలోనూ అయినా పెళ్ళిళ్ళు చేయవచ్చును కాని -ముహూర్త దోషాలు అసలే పనికిరావు. ముహూర్త దోషాలైన 21 మహాదోషాలలో ఏ ఒక్కటీ కూడా ఉండడానికి ఎంతమాత్రమూ వీలులేదు.

191. వాస్తు ప్రకారం ఇంటి ముఖద్వారం ఎటువైపుంటే మంచిది ?

సింహద్వారం ఎటు ఉండాలనేది ఆయా వ్యక్తుల జాతకాలను బట్టి నిర్ణయించాలి. అందరికీ ఒకే దిక్కు సరిపోదు. ఏ దిక్కుకు సింహద్వారం ఏర్పరచిన ఇల్లు అయినా - అది అందరికీ సరిపోదు. వ్యక్తుల జాతకాల రీత్యా ఎవరికి ఏ సింహద్వారం సరిపడుతుందో నిర్ణయించాలి.

192. పంచాంగంలో ప్రతి దినమూ వచ్చే వర్జ్యం, దుర్ముహూర్తాల గురించి వ్రాస్తుంటారు. వర్జ్యం, దుర్ముహూర్తాలున్న సమయంలో ఏ

ముఖ్యమైన పనికాని, ప్రయాణం గాని చేయరాదంటారు. ఒకవేళ అలా చేస్తే, వాటివల్ల వచ్చేదోషమేమిటి?

వర్జ్య, దుర్ముహూర్తాలున్న సమయాలే కాదు, వర్జ్య దుర్ముహూర్తాల స్పర్శ కలిగిన లగ్నాలు సహితమూ ఏ శుభకార్యాలకుగాని, ఏ ముఖ్యమైన పనులకుగాని పనికిరావు. దుర్ముహూర్తంకాని, వర్జ్యకాలంకాని ఒక్క విఘడియ సహితం లగ్నానికి స్పర్శ కలిగితే ఆసమయంలో చేసిన పనులు మృత్యుపును కలిగిస్తాయని జ్యోతి శాస్త్రంలో మహర్షుల చేత ఘంటాపధంగా చెప్పబడిది. వర్జ్య, దుర్ముహూర్తాల స్పర్శకలగడమేనది మహాదోషాలలోకి వస్తుంది. మహాదోషాలకు పరిహారం లేదు. స్వల్ప దోషాలకే పరిహారం ఉంటుంది

193. స్వంత ఇంట్లో చాలాకాలంగా ఉన్నవాళ్లకైనా, లేక అద్దె ఇంట్లో ఉన్న వాళ్లకు కూడా వాస్తు దోషాలుంటాయా? ఉంటే పరిష్కార మేమిటి?

స్వంత ఇంట్లో ఉన్నవాళ్లకైనా, అద్దెకున్న వాళ్లకైనా చాలా కాలంగా ఉన్నా, కొత్తగా ప్రవేశించినా కూడా వాస్తు దోషాల ప్రభావం ఉంటుంది. ఇతరుల గుర్రం మీద తాను ఎక్కినా కూడా, దాని మీద నుంచి పడితే ఎక్కిన వాడికే దెబ్బ తగలుతుంది కాని, గుర్రం యజమానికి కాదు కదా – అని వరాహమిహిరాచార్యుని ఉవాచ. ఆయా దోషాల స్వభావాన్ని (నేచర్) బట్టి కొన్ని దోషాలు ఆ ఇంట్లో అద్దెకున్న వాళ్లనూ, మరికొన్ని దోషాలు యజమానులనూ ఎక్కువగా బాధిస్తాయి. మొత్తానికి అద్దెకున్నవాళ్లకూ, యజమానులకూ కూడా వాస్తుదోషాల ప్రభావం తప్పదు. అయితే ఆ దోషం ఏ రకమైన దోషం – అనేదాన్ని బట్టి ఆలోచించాలి. ఇక పరిష్కారమంటారా – అన్నిటికీ ఒకే పరిష్కారాలుండవు.పరిశీలించి నిర్ణయించాలి.

194. గ్రహాలకు నీచపట్టడం అంటే ఏమిటి?

నవ గ్రహాలలో ప్రతి గ్రహానికీ ఒక్కొక్కరాశి నీచస్థానం..ఏ గ్రహమైనా తనకు నీచస్థానమైన గృహంలో ఉండడమే ఆ గ్రహానికినీచ పట్టడం.

సూర్యునికి నీచస్థానం తులారాశి. చంద్రునికి నీచస్థానం వృశ్చికరాశి. కుజునికి నీచస్థానం కర్కాటకరాశి. బృహస్పతికి నీచస్థానం మకరరాశి. శుక్రునికి నీచస్థానం కన్యారాశి.శనికి నీచస్థానం మేషరాశి. రాహువుకు నీచ స్థానాలు వృశ్చికం,కుంభం. కేతువుకు నీచస్థానాలు సింహం వృషభం.

195. 2000 సంవత్సరం శుభకార్యాలకు పనికిరాదా? 2000 సంవత్సరంలో పెళ్లిళ్లు చెయ్యకూడదా?

కొత్త సహస్రాబ్దానికీ, శతాబ్దానికీ ప్రారంభ సంవత్సరమంటున్న 2000వ సంవత్సరంలో మూడు సున్నాలున్నాయి. కనుక ఈ సంవత్సరంలో - వివాహాలు,ఉపనయనాలు, గృహప్రవేశాలు,శంకుస్థాపనలు మొదలైన శుభకార్యాలు చెయ్యకూడదటకదా - అనే వాదం ఒకటి విన్నాను.

సంవత్సరాలు పరిగణనానికి , ఇప్పుడు విధానం ప్రామాణికమే కాదాయె. అటువంటప్పుడిక సంవత్సరాల శుభత్వాశుభత్వాలను నిర్ణయించడానికి ఈ పద్ధతి ఎలా ఆధారం కాగలుగుతుంది ?

ఋషిప్రోక్తమైన మన భారతీయ పద్ధతిలో సంవత్సరగణనం వేరుగా ఉంది. చాంద్రమానం, సౌరమానం, నాక్షత్రమానం,బార్హస్పత్యమానం, గురూదయాబ్దమానం,సావనమానం - అనే విధానాలు మనకున్నాయి. భారతీయులైన ఈ విధానాలలో సంవత్సర పరిగణనం చేయడమే,సర్వ ఋషి సమ్మతమైన పద్ధతి. ఆయా సంవత్సరాల గణనం ఎలాగ,వాటిలో ఒక్కొక్కదాని ప్రయోజనమేమిటి - అనేవి ఈక్రింద చెబుతున్నాను.

చాంద్రమాన రీత్యా ఏర్పడే తిథుల ప్రకారం ఎర్పడేది చాంద్రమాన సంవత్సరం. ఇది చైత్రశుద్ధ పాడ్యమి మొదలు ఫాల్గున బహుళ అమావాస్యాంతం వరకు ఒక సంవత్సరం గా పరిగణించాలి. సర్వనిత్యకర్మలకూ, నైమిత్తిక కర్మలకూ, సకల దేవకార్యాలకూ పితృకార్యాలకూ చాంద్రమానాన్నే ఉపయోగించాలి. అంటే చైత్ర శుద్ధ పాడ్యమితో ప్రారంభమయ్యే సంవత్సరగణనాన్నే ఉపయోగించాలన్నది ఋషుల నిర్ణయం.

ఇక సౌరమానమంటే ఇది, సూర్యుడు అశ్వినీ నక్షత్రం ప్రథమ బిందువులో ప్రవేశించిన క్షణంతో ప్రారంభమయ్యేది సౌరమాన సంవత్సరం. దీనివల్ల ఋతువులో కార్తెలూ ఏర్పడతాయి. సూర్యుడు ఒక రాశి నుండి మరొకరాశిలోనికి ప్రవేశిచడానికి సంక్రమణమని పేరు. ఈ సంక్రమణాలు సంవత్సరానికి పన్నెండు. ఈ సూర్య సంక్రమణాలు మహత్తరమైన పుణ్యకాలాలు.

నాక్షత్రమానమంటే - చంద్రుడు మొదటినుంచి చివరివరకూగల నక్షత్ర చక్రాన్ని చుట్టిచ్చేదే నాక్షత్రమాన సంవత్సరం. అశ్వినీ నక్షత్రప్రథమ బిందువులో చంద్రుడు ప్రవేశించడంతో ఇది ప్రారంభం అవుతుంది. దిన నక్షత్రాన్ని తెలుసుకోవడానికి నాక్షత్రమానం ఉపకరిస్తుంది. చంద్రుడు ఏరోజున ఏ నక్షత్రంతో కూడి ఉండడం జరుగుతుందో అదే ఆనాటి దిన నక్షత్రం అవుతుంది. సూర్యుడు, చంద్రుడు అంగారకుడు, బుధుడు, బృహస్పతి, శుక్రుడు, శని, రాహువు, కేతువు, ఇంద్రుడు, వరుణుడు, యముడు, రుద్రుడు- ఈ గ్రహాలన్నీ నక్షత్ర చక్రంలో సంచరిస్తూ ఉంటారు. ధర్మశాస్త్ర నిర్ణయాల సందర్భంలోనూ, జ్యోతిష ముహూర్త నిర్ణయాలలోనూ నక్షత్ర నిర్ణయం, ఏ నక్షత్రంలో ఏ గ్రహం ఉన్నదీ తెలుసుకోవడం ప్రధానం. ఇంద్రధనుస్సు, ధూమము, ధూమకేతువు- ఇవి నక్షత్ర చక్రంలో సంచరించే ఉపగ్రహాలు.

బృహస్పతి - నక్షత్ర చక్రప్రారంభం నుంచి అంతం వరకూ సంచరించే కాలాన్ని బట్టి ఏర్పడేది బార్హస్పత్యమానం. అశ్వినీ నక్షత్ర ప్రథమ భాగంలో బృహస్పతి ప్రవేశిచడంతో బార్హస్పత్యమాన సంవత్సరం ప్రారంభం అవుతుంది. బార్హస్పత్యమానం పుష్కర నిర్ణయానికి ఉపకరిస్తుంది. బృహస్పతి ఒక్కొక్క రాశిలో ప్రవేశించడంతో ఒక్కొక్క నదికి పుష్కరం ఏర్పడుతుంది.

బృహస్పతి యొక్క ఉదయాస్తమయాల వల్ల ఏర్పడేది గురూదయాబ్దమానం. బృహస్పతి అస్తంగతుడై ఉన్న సమయం- ఎటువంటి శుభకార్యాలు చేయడానికీ ఎంత మాత్రం పనికిరాదు.

సావన మాన సంవత్సరం-360 రోజులు కలది. యజ్ఞయాగాది క్రతు విధుల నిర్వహణ సందర్భంలో సావనమానాన్ని ఉపయోగించాలని ధర్మశాస్త్ర నిర్ణయం. ఇది సర్వఋషి సమ్మతం. సూర్యోదయసూర్యాస్తమయాలవల్ల ఏర్పడే దినగణనం వల్ల ఏర్పడేది సావనమమానమని నిర్ణయం.

ఇక్కడ ప్రసక్త విషయం కాకపోయినా అనుప్రసక్తంగా ఒక విషయం చెప్పాలి. కాలగణనంలో దినం (రోజు) అనేది - సూర్యోదయం సూర్యాస్తమయాల వల్ల ఏర్పడుతుంది. సూర్యని ఉదయాస్తమయాలవల్లనే అహోరాత్రులు (పగలూ,రాత్రీ) ఏర్పడుతాయి. ఒక అహస్సు ప్రగలూ), ఒక రాత్రీ కలిసి ఒక దినం అవుతుంది. ఒక సూర్యోదయం నుండి మర్నాటి సూర్యోదయం వరకూ గల సమయానికి -ఒక దినం అని పేరు. విద్యతోనూ శిక్షణతోనో నిమిత్తం లేని,నిరక్షరాస్యులకు సహితం, చక్కగా, తేటతెల్లంగా తెలిసే లెక్క ఇది. తెలియడం ఒక్కటే కాదు. ఒక రోజు పూర్తి అయి,మరొక రోజు ప్రారంభం అయిందనడానికి చిహ్నంగా కాలంలో ప్రకృతిలో కనిపించే ప్రత్యక్షమైన గుర్తు సూర్యోదయం. పగలు గడిచి రాత్రి ప్రవేశించిందనడానికి గుర్తు సూర్యాస్తమయం. కంటికి కనిపించే ఈ ప్రత్యక్ష విషయాలను విడిచిపెట్టి - అర్ధరాత్రిలో రోజు ప్రారంభంకావడం అసంగతమైన అంశం. ఆ విధంగా ప్రామాణికమైన ఏ మార్పుతోనూ ఎ గుర్తుతోనూ మిమిత్తం లేకుండా అర్ధరాత్రి నుంచి రోజును లెక్కించడమే చాలా అసందర్భమన్నది - కామన్‌సెన్స్ ఉన్న ఎవరికైనా తోచకమానదు. కాబట్టి ఈ గణనం తప్పు - అన్నది స్పష్టం.

సారాంశంగా ఖగోళ పరిణామాలనంపునాదిగా తీసుకుని నిర్మించబడినవీ, ఋషి ప్రోక్తాలైనవీ అయిన మన భారతీయకాల గణన విధానాలే కర్రెక్ట్-అని తేలింది కదా? మన భారతీయ సంవత్సరగణన విధానాలకు గల శాస్త్రీయత - ఇంగ్లీష్ వాళ్ల సంవత్సరగణనానికి లేదు- అని స్పష్టమైంది.

వివాహాలు, ఉపనయనాలు మొదలైన శుభముహూర్తాలకూ ఈ ఇంగ్లీష్ సంవత్సరాలకు ఏ విధమైనా సంబంధమూ లేదు. శుభముహూర్తాలకు

చూడవలసిన శుద్ధులు ఇవి కావు. అవి వేరే వున్నాయి. కాబట్టి 2000వ సంవత్సరంలో శుభకార్యాలకు ఎటువంటి నిషేధమూ లేదు.

విస్పష్టంగా చెప్పాలంటే - 2000 సంవత్సరంలో శుభ ముహూర్త నిర్ణయానికి ఎలాంటి ప్రమేయమూ లేదు. ముహూర్తాలకు కావలసిన శుద్ధులివి. ముహూర్తం పంచక రహితం కావాలి.ముహూర్త లగ్నానికి 21 మహాదోషాలలో ఒక్కటి కూడా ఉండకూడదు. వాటిలో ఏ ఒక్కటి ఉన్నా అది మృత్యుముహూర్తం అవుతుందని గుర్తుంచుకోవాలి. స్వల్పదోషాలను కూడా వీలున్నంత వరకు లేకుండా చూసి ముహూర్తం నిర్ణయించుకోవాలి.

అంతేగాక - సూర్యోదయాది 4వ లగ్నం ముహూర్తానికి పనికి రాదు. శుభగ్రహాలకు మౌఢ్యం కలిగిన సమయాన్ని విడిచి పెట్టాలి. భద్రకరణాన్ని విడిచిపెట్టాలి. కొన్ని కొన్ని కార్యాలకు పనికిరాని తిథులనూ నక్షత్రాలనూ విడిచిపెట్టాలి. కొన్ని పరిస్థితులలో శూన్యమాసంలోనైనా శుభ కార్యాలు చెయ్యవచ్చును కాని, ఏకవింశతి మహాదోషాలు, దుర్ముహూర్తమూ, వర్జ్యమూ, భద్రకరణమూ, సూర్యోదయం నుంచి 4వ లగ్నమూ, ఇవి మాత్రం ముహూర్తానికి ఎంత మాత్రమూ పనికిరావు.

ఇంకా శుభముహూర్తాలకు విడిచిపెట్టవలసినవి ఇవి : క్షయమాసాలు, అధిక మాసాలూ శుభముహూర్తాలకు పనికిరావు. వ్యతీపాత, వైధృతి యోగాలు - వీటిని విడిచి పెట్టాలి. వృద్ధితిథి,క్షయతిథీ పనికిరావు. అర్ధయామమూ, కులిక ముహూర్తమూ పనికిరావు. తన తల్లిదండ్రులు మరణించిన దినం, ఆనాడు పితృకార్యం నెరవేర్చాలి కనుక ఆరోజున ఎలాంటి శుభకార్యాలకూ పనికిరాదు. విష్కంభయోగం, వజ్రయోగం వీటి ప్రారంభంలో 8 ఘడియలు విడవాలి. గండయోగం, అతిగండయోగం, వీటి ఆరంభంలో 6 ఘడియలు పనికిరావు. పరిఘాయోగంలో తొలి 30 ఘడియలు విడవాలి. శూలయోగంలో ఆరంభంలో 5 ఘడియలు విడవాలి.

ఇంకా గుళికకాలాన్నీ, యమఘంటికా కాలాన్నీ విడవాలి. వ్యాఘాత యోగంలో ప్రారంభపు 9 ఘడియలూ విడవాలి. అమావాస్యనూ, క్షీణచంద్ర దినాలనూ విడవాలి. జన్మమాసం, జన్మనక్షత్రం, జన్మ తిధి – వీటికి మాత్రం కొన్ని ప్రత్యేక సందర్భాలలో స్వీకరించే వీలు ఉంది. ముహూర్తానికి తారాబలం, చంద్రబలం, తప్పక ఉండాలి. ఈ చెప్పిన దోషాలన్నిటినీ విడిచిపెట్టి ఆయా శుభకార్యాలకు పనికివచ్చే తిధులలోనూ వారాలలోనూ నక్షత్రాలలోనూ, యోగాలలోనూ, కరణాలోలనూ శుభముహూర్తాలను నిర్ణయించుకోవాలి.

అంతే తప్ప – ఏ విధమైన ప్రామాణికతా, శాస్త్రీయమైన ఆధారమూలేని లెక్కల ఆధారంగా సంవత్సరాల శుభాశుభత్వాలను నిర్ణయించకూడదు.

196. గ్రామార్వణం ఎలా చూడాలి?

గ్రామార్వణం చూసే విధానాలు 3 ఉన్నాయి. అవి ఈక్రిందివి. **1.** షోడశ చక్ర పద్ధతి. షోడశచక్రాన్ని ముందుగా వేసుకోవాలి. అంటే – 5 నిలువుగీతలూ, 5 అడ్డగీతలూ గీయాలి. మధ్యలో ఉన్న 4 గళ్లు విడిచి పెట్టాలి. సవ్య చక్రప్రకారంగా మిగిలిన గళ్లలో రాసులను నోట్ చేయాలి. అప్పుడు ఒక వ్యక్తి తాను నివసించదలచిన గ్రామం ఏ రాశిలోకి వస్తుందో చూడాలి. నివసించదలచిన, లేదా ఇల్లు కట్టదలచిన గ్రామ రాశి – తన నామరాశికి (యజమాని నామరాశికి) 1, 5, 9 రాసులు కనక అయితే ప్రశస్తం. 3,7, 11రాసులైన కూడా పనికి వస్తుంది. 4, 8, 12 రాశులైతే మాత్రం పనికి రాదు.

2వ పద్ధతి :– తాను ఏ గ్రామంలో నివసించదలిచాడో, లేదా ఎ గ్రామంలో ఇల్లు కట్టదలిచాడో ఆ గ్రామం యొక్క నామనక్షత్రం – తన జన్మనక్షత్రం కాకూడదు. తన జన్మ నక్షత్రానికి 7వ నక్షత్రం కూడా కాకూడదు. తనజన్మ నక్షత్రానికి 3,4,6,8,12 – నక్షత్రాల పేర్లు కల గ్రామాలలో, లేదా నగరాలలో

- నివాసం చెయ్యడమూ, అటువంటి గ్రామం (నగరా) లలో ఇల్లు కట్టుకోవడమూ ఎంతమాత్రమూ పనికి రాదు. రోగమూ, హానీ కలుగుతాయి ఇది జన్మ నక్షత్రానికే కాక నామనక్షత్రానికీ వర్తిస్తుంది, జన్మ నక్షత్రానికి కాని, నామ నక్షత్రానికికాని 2,5,9,10,11 నక్షత్ర నామాలు కలిగిన గ్రామాలలో నివసించడం శుభం. మిగిలిన నామనక్షత్రాలుకల గ్రామాలలో నివసించడం సామాన్యం.

3వ పద్ధతి : - వర్ణక్రమంలో - అంటే 'అ' నుంచి తాను నివసించదల్చిన గ్రామనామం యొక్క మొదటి అక్షరం ఎన్నవది అవుతుందోలెక్కించాలి. దీన్ని ఏ అనుకోండి. అదేవిధంగా 'అ' నుంచి తన పేరులోని మొదటి అక్షరం ఎన్నవది అవుతుందో లెక్క పెట్టాలి. దీన్ని బి అనుకోండి. ఇప్పుడు ఏ సంఖ్య పక్కనే -దాని తర్వాత బి సంఖ్యను (అంటే ఎ తర్వాత బి అన్న క్రమంలో) వెయ్యండి. ఈ మొత్తాన్ని 8 చేత భాగించండి వచ్చిన శేషం 'ధనం' అవుతుంది.

అలాగే - పైన లెక్కించిన సంఖ్యలను అంటే ఏ,బి లను బి సంఖ్య తర్వాత ఏ సంఖ్య వచ్చేలా వెయ్యండి. ఆ మొత్తాన్ని 8 చేత భాగించగా వచ్చే శేషం 'ఋణం' అవుతుంది. ఇప్పుడు ధనం కంటే ఋణం తక్కువగా ఉంటే ఆ గ్రామంలో నివసించవచ్చు. ధనసంఖ్య కంటే ఋణసంఖ్య ఋణ సంఖ్య ఎక్కువగా ఉంటే ఆ ఊళ్లో నివసించకూడదు. దీని ఫలం కేవలం డబ్బుకు సంబంధించి మాత్రమే ఉండదు. ఆవ్యక్తికి ఆ గ్రామార్పణం కుదరలేదని తెలుసుకోవాలి.

పైన చెప్పిన పద్ధతులన్నీ వ్యక్తుల యొక్క నామ నక్షత్ర ప్రకారమూ, జన్మ నక్షత్ర ప్రకారమూ కూడా లెక్కించుకోవాలి.

197. శుభముహూర్తాలు నిర్ణయించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటో వివరంగా చెప్పకోరుతున్నాము.

ముహూర్త ఫలం యొక్క గుణం కాని, దోషంకాని ప్రబలంగా ఉంటాయి. దోషాలు లేకుండా ముహూర్తం పెట్టడం ఎంత ముఖ్యమో -తేడా

లేకుండా, పెట్టిన సమయానికి ఆ కార్యక్రమం ఆచరించడమూ అంత ముఖ్యం.

ముహూర్త విషయంలో చూడవలసిన ఒక ముఖ్య విషయం ఆ ముహూర్తం పంచక రహితంగా ఉండేటట్లు చూసుకోవాలి. ముహూర్త దోషాలేవీ-లేకుండా చూడాలి.

వుూడు శుభగ్రహాలతో కూడినదైనా, పంచేష్టిక బలాలతో కూడినదైనా - తృతీయ షష్ఠ ఏకాదశ స్థానాలలో పాపగ్రహాలు కలిగిన దైనా, పుష్కరాంశకాని, వర్గోత్తమాంశకాని- ఇన్ని ఉన్నాసరే - ముహూర్త దోషాలలో ఏ ఒక్క దోషంకాని కలిగి ఉన్నట్లయితే - ఆముహూర్తం మృత్యు ప్రదం కాగలదని - మహాజ్యోతిశ్శాస్త్రవేత్త అయిన కాళిదాసు - తన జ్యోతిశ్శాస్త్ర గ్రంథాలలో స్పష్టంగా తెలిపి ఉన్నాడు. కాబట్టి దోషాలుగల ముహూర్తం పనికిరాదు. ఏ ముహూర్తానికైనా దోషాలు లేకుండా చూసుకోవడమే ప్రధానం. శుభత్వం ఉండడంకంటే, పాపత్వం లేకుండా చూడడమే ముఖ్యం. దుర్ముహూర్తాలు, లగ్నత్యాజ్య ఘడియలు, నక్షత్ర త్యాజ్య ఘడియలూ ముహూర్తాన్ని స్పృశించకుండా చూడాలి. భద్రాకరణం పనికిరాదు. సూర్యోదయాది నాలుగవలగ్నం పనికిరాదు. ఏకవింశతి - అంటే 21 మహాదోషాలలో ఏ ఒక్కటీ ఉండడానికి వీల్లేదు.

ఏయే ఉద్దేశించబడిన శుభకార్యాలకు - ఆయా శుద్ధులు ఉండడం అవసరం. నిషేధించబడిన తిథి వారాలు, నక్షత్రాలు, యోగాలు, కరణాలు - పనికిరావు.

పైన చెప్పిన విషయాలనన్నింటినీ మినహాయించి - పనికి వచ్చేవైన తిథి, వార నక్షత్రయోగ, కరణాలలో ముహూర్తాలుంచాలి. వాటికి తారబలచంద్రబలాలు సరిపోవాలి. ముహూర్తం పంచక రహితంకావాలి. ముహూర్తానికి ఉండవలసిన శుద్ధులన్నీ ఉండాలి.

198. వారాశూలలకు మల్లేనే తిథి శూలలు, నక్షత్ర శూలలూ ఉన్నాయట. అవి ఏవి?

ప్రయాణాలకు వారశూలాలే కాక, తిథి శూలాలూ, నక్షత్ర శూలాలూ, లగ్నశూలాలూకూడా ఉన్నాయి. అవి ఇవి :

తిథి శూలాలు :

ప్రయాణాలకు – తూర్పుకు పాడ్యమీ, నవమీ తిథులు పనికిరావు.

ఆగ్నేయానికి తదియా, ఏకాదశీ తిథులు పనికిరావు. దక్షిణ దిక్కుకు పంచమీ, త్రయోదశీ తిథులు పనికిరావు. నైరుతికి చవితీ, ద్వాదశీ తిథులు పనికి రావు - పడమరకు షష్ఠీ, చతుర్దశీ తిథులుపనికిరావు - వాయువ్యానికి సప్తమీ, పూర్ణిమా, తిథులు పనికి రావు – ఉత్తర దిక్కుకు విదియా, దశమీ తిథులు పనికి రావు- ఈశాన్యానికి అష్టమీ, అమావాస్యా తిథులు పనికిరావు –

నక్షత్ర శూలాలు :-

ప్రయాణాలకు – తూర్పుకు జ్యేష్ఠా, దనిష్ఠా నక్షత్రాలు పనికిరావు-

పడమరకు రోహిణీ, పుష్యమీ నక్షత్రాలను వదిలిపెట్టాలి. ఉత్తర దిక్కుకు హస్తా, పూర్వఫల్గునీ నక్షత్రాలను విడిచిపెట్టాలి. దక్షిణ దిక్కుకు అశ్వినీ, పూర్వా భాద్రా, శ్రవణా నక్షత్రాలు పనికిరావు.

లగ్నశూలాలు

తులా, కుంభ లగ్నాలు తూర్పు దిక్కుగా ప్రయాణనికి పనికిరావు.

మకరలగ్నం ఆగ్నేయానికి పనికిరాదు. వృశ్చిక, మీనలగ్నాలు దక్షిణ దిక్కుకు పనికిరావు.

కర్కాటక లగ్నం నైఋతికి పనికిరాదు. సింహ ధనుర్లగ్నాలు పడమరకు పనికిరావు. మేషలగ్నం వాయువ్యానికి పనికిరాదు. వృషభకన్యా లగ్నాలు ఉత్తర దిక్కుకు పనికిరావు మిథునలగ్నం ఈశాన్యానికి పనికిరాదు.

ప్రయాణం చేయబోయేది ఏ దిక్కువైపో తెలుసుకోవాలి. ఆయా దిక్కులకు ప్రయాణం చేసే సందర్భంలో- ఏ దిక్కుకు ఏ వారమో, ఎ నక్షత్రాలూ, ఎ తిథులూ, ఏ లగ్నాలూ పనికిరావని మహర్షులు చెప్పారో - వాటిని విడిచిపెట్టాలి.

199. జ్యోతిశ్శాస్త్రాన్ని ఎవరు రచించారు, దాని మూలం దానిలోని భాగాలు ఇలాంటి విషయాలు చెప్పండి.

శ్లో. '' సిద్ధాంత సంహితహోరా రూపం స్కంధ త్రయాత్మకం!
వేదస్య నిర్మలం చక్షుః జ్యోతిశ్శాస్త్రమనుత్త మమ్!'' -

అనిచెప్పబడింది. జ్యోతిశ్శాస్త్రం వేదానికి నేత్రం. దీనిలో సిద్ధాంతభాగం, సంహితాభాగం హోరా భాగం- ఇవి మూడు విభాగాలు.

ఇక జ్యోతిశ్శాస్త్రానికి ప్రవర్తకులు 18 మంది.

శ్లో, బ్రహ్మాదిత్యోవశిష్ఠోత్రి మనుఃపౌలస్త్యలోమశా!
మరీ చిరంగిరా వ్యాసో నారద శ్శౌనకో భృగుః!
చ్యవనోయవనోగర్గః కశ్యపశ్చ పరాశరః
అష్టాదశైతే గంభీరాః జ్యోతిశాస్త్ర ప్రవర్తకాః

అని ఈ శ్లోకంలో చెప్పిన 18 మంది జ్యోతి శ్శాస్త్ర ప్రవర్తకులు అష్టాదశైతే గంభీరాః జ్యోతిశాస్త్ర ప్రవర్తకాః. అంటే వీరు లోకంలో జ్యోతిశాస్త్రాన్ని ప్రవర్తింపజేశారు. వారెవరంటే - బ్రహ్మ,, సూర్యుడు, వశిష్ఠుడు, అత్రి, మనువు, పౌలస్త్యుడు, లోమశుడు, మరీచి, అంగీరసుడు, వ్యాస మహర్షి, నారదమహర్షి, శౌనకుడు, భృగువు, చ్యవనుడు, యవనుడు, గర్గుడు, కశ్యపుడు, పరాశరుడు.

200. సింహద్వారాన్ని పెట్టే విషయంలో రాహువుకు సంబంధించిన నిషేధం. ఏదో ఉందని విన్నాము. అది ఏమిటో తెలుపగలరు.

రాశులు 12. వాటిలో వృశ్చికం మొదలుగా మూడు రాశులు తూర్పు దిక్కుకు, కుంభం మొదలుగా మూడు రాశులు దక్షిణ దిక్కుకు, వృషభాదిగా మూడు రాశులు పశ్చిమ దిక్కుకు, సింహాదిగా మూడురాశులు ఉత్తర దిక్కుకు నిర్ణయించబడ్డాయి. వాటిలో ఏ దిక్కుకు చెందిన రాశియందు రాహువు ఉండేటట్లయితే - అప్పుడు ఆ దిక్కుకు సింహద్వారాన్ని పెట్టడం పనికిరాదు. అలా పెట్టేట్టట్లయితే ఆ గృహ యజమానికి మరణం కలుగుతుందని శాస్త్రవచనం.

అంతేకాదు, పూర్ణిమ మొదలు బహుళ అష్టమి లోపున - తూర్పు సింహద్వారం కలిగిన ఇళ్ల నిర్మాణం చేయరాదు. బహుళ నవమి మొదలు బహుళ చతుర్దశి లోపున-ఉత్తర సింహద్వారంగల ఇళ్ళ నిర్మాణాన్ని అష్టమి లోపున పడమటి సింహద్వారంగల ఇళ్లకు శంకుస్థాపన చేయరాదు. శుద్ధనవమి నుంచి శుద్ధచతుర్దశి లోపుగా- దక్షిణ సింహద్వారంగల ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించకూడదు. మహర్షులు చెప్పిన ఈ నిషేధాలను పాటించక ఇళ్ల నిర్మాణం చేస్తే అది మృత్యుప్రదం అని శాస్త్ర వచనం.

201. జ్యోతిష్యశాస్త్రం గాలి కబుర్ల పుట్టయేనా? దాని ప్రమాణాలు, లెక్కలు (మిగిలిన శాస్త్రాలకున్నట్లుగా) ఉన్నాయా? అలా ఉన్నాయనడానికి - సాక్ష్యాలు చూపండి?

జ్యోతిష్యశాస్త్రం సప్రమాణికమైనదీ, సాధికారికమైనదీ. జ్యోతిష్య శాస్త్రానికి ఖగోళ, గణిత శాస్త్రాలు ఆధారాలు. ప్రాచీన భారతీయులు ఖగోళ, గణిత, తర్క, మీమాంసా, జ్యోతిషశాస్త్రాది అసంఖ్యాక శాస్త్రాలలో తమ ప్రజ్ఞాప్రాభవాలు నిరూపించుకున్న వారు. వారి గ్రహగణితం ఎంత నిర్దుష్టమైనదో చూపే ప్రత్యక్ష తార్కాణాలు వివరిస్తాను. కేవలం జ్యోతిష్య శాస్త్రం, గ్రహగణితం - ఆధారంగానే జ్యోతిర్వేత్తలు - గ్రహాల ఉదయాస్తమయాలను గ్రహణాలను చెప్పగలుగుతున్నారు. వారు చెప్పినవి ప్రత్యక్షంగా జరుగుతూనే ఉన్నాయి.

అత్యంత ఆధునిక పరికరాల సహాయంతో ఆధునిక శాస్త్రవేత్తలు - సూర్యచంద్ర గ్రహణ సమయాలను లెక్కించి సరిగ్గా చెప్పగలుగుతున్నారు. ఏ యంత్ర సహాయమూ లేని జ్యోతిష్యశాస్త్ర పండితుడు -కేవలమూ గ్రహగణితం ఆధారంగా- అదే గ్రహణాన్ని గురించి తన పంచాంగంలో కనీసం 1, 1/2 ఏళ్ల ముందుగా ప్రచురిస్తున్నది మనము చూస్తున్నాం కదా. సూర్యుడు కుజుడు, బుధుడు, శుక్రుడు గురుడు శని - ఇత్యాది గ్రహాలన్నీ ఉదయించే సమయాలు, అస్తమించే సమయాలు - పంచాంగాలలో ఘడియలు, విఘడియలు, లిప్తలతోసహా ఇస్తారు. వాటిని ఆకాశంలో చూసి కూడా మనం నిర్ధారణ చేసుకొనవచ్చు. పంచాంగంలో వ్రాసిన దినాలలో పూర్ణిమ, అమావాస్య , నూతన చంద్రదర్శనం - ఇవన్నీ సంభవిస్తున్నాయి చూస్తున్నాం.

ప్రతిదినమూ పంచాంగంలో ఇచ్చిన దిన నక్షత్రాన్ని మనం చంద్రునితో చూడవచ్చును.

202. జ్యోతిష్య శాస్త్ర మహాత్మ్యాన్ని నిరూపించే ప్రాచీన సంఘటనలూ పూర్వగాధలూ తెలియజేయండి.

కృష్ణరాయల పాలనాకాలంలో - గ్రహమండలంలో 'కుహూయోగం' అనే ఒక దుష్టయోగం ఏర్పడబోతూ వుందని ఆస్థాన జ్యోతిష్యులు చెప్పారు. రవి, శని, కుజ, చంద్ర, రాహుగ్రహాలు - అమావాస్య తిథిలో, విషయుత లగ్నంలో, మకర రాశిలో - కలవబోతున్నాయి ఆ సమయానికి రాహుకాలం, గుళిక కాలం,యమఘంటికా కాలం కూడా ఏర్పడబోతున్నాయి. పాప షడ్వర్గలో, పాప గ్రహనవాంశలో, దుర్ముహూర్తంలో, లగ్నత్యాజ్యం, నక్షత్ర త్యాజ్యం కలిగిన విషయుత లగ్నంలో - క్రూరయుగ్దిష్యమూ, అశుభవిద్ధభమూ, లగ్నాస్త దోషమూ గల సమయంలో, గండాంత దోషకాలంలో ఆ కలయిక జరగబోతున్నది. విక్రమ సంవత్సర పుష్యబహుళ అమావాస్యనాడు (ఇంగ్లీష్ తేదీ 1521 వ సంవత్సరం, జనవరి 30వ తేదీ అయింది) ఈ గ్రహాల కలయిక ఏర్పడబోతూ వుంది.

జ్యోతిష్య శాస్త్ర గ్రంధాలలో ఇటువంటి గ్రహసంయోగాన్ని 'కుహూయోగం' అంటారు. ఈ యోగం చాలా దుష్టయోగమని జోతిష్యశాస్త్రం చెబుతోంది. విజయనగర రాజ్యానికీ, పరిపాలకునికీ కూడా ఆ కుహూయోగంవల్ల మహోపద్రవం రానున్నదని జ్యోతిష్యులు తెలిపారు. ఆ దుర్యోగం తప్పే విధానాన్ని తెలుపమని కృష్ణరాయులు, తిమ్మరుసు జోతిర్విద్యా విదులను కోరారు.

జ్యోతిష్యశాస్త్రజ్ఞులు తీవ్రంగా ప్రాచీన గ్రంధాలను పరిశీలించి దీనికి ఒకటే ఉపాయం వుందని తేల్చారు. అది ఇది, భయంకరమైన కుహూయోగ సమయంలో సింహాసనంపైన కృష్ణరాయలు వుండడానికి వీలులేదనీ, అప్పుడు కుహూయోగం రాయలను బాధించదనీ చెప్పారు. సామ్రాజ్యానికి కుహూయోగం వల్ల కలిగే అపాయాన్ని తప్పించే నిమిత్తం – ఆ సమయానికి సింహాసనంపై ఒక మహా తపస్వి వుండాలని చెప్పారు – జ్యోతిష్య శాస్త్రజ్ఞులు. ఆగ్రహకూటమి వల్ల – విజయనగర సామ్రాజ్య జాతకంలోనూ, వ్యక్తిగతంగా రాయల జాతకంలోనూ కూడా దోషమేననీ, తపస్సిద్ధుడైన మహానుభావులే దీన్ని నివారించగలరనీ చెప్పారు. తపస్సిద్ధుడైన మహానుభావునితెచ్చి కుహూయోగ సమయంలో సింహాసనంపైన వుంచడం ఒక్కటే దీనికి మార్గమని జ్యోతిష్య శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు.

తిమ్మరుసు మంత్రి ఆలోచించి – దీనికి తగినవారు మహా తపస్వి, రాజగురువు అయిన వ్యాసతీర్థులవారు ఒక్కరేనని నిర్ణయించాడు. కృష్ణరాయలను వెంటపెట్టుకుని తిమ్మరుసు మంత్రి –వ్యాసతీర్థులవారినిచేరి ప్రార్థించగా వ్యాసతీర్థులవారు కాదనలేకపోయారు.

జ్యోతిష్యులు చెప్పిన ఆ పుష్యబహుళ అమావాస్యనాడు తిమ్మరుసు మంత్రీ, కృష్ణరాయలూ పరివారంతో వెళ్లి వ్యాసతీర్థులవారిని రాజోచిత లాంఛనాలతో రాజభవనానికి తీసుకొని వెళ్లారు.

కుహూయోగ ప్రభావం వల్ల దారిలో విజృంభించి జనం మీద పడిన పట్టపుటేనుగుపైన వ్యాసతీర్థులవారు మంత్రజలం చల్లి దాన్ని నివారించారు.

రాజభవనం చేరాక కృష్ణరాయలు - వ్యాసతీర్థులవారికి సింహాసనం అప్పగించాడు. వ్యాసతీర్థులవారు తన శాటీని తీసి సంహాసనం మీద పరచి - తన ఉపాసనా మంత్రాన్ని జపిస్తూ సింహాసనం పక్కన నిలబడ్డారు.

కూహూయోగ ప్రభావంవల్ల ఆకాషాయవస్త్రం ఆశ్చర్యకరంగా మంటలు లేచి - తగలబడింది. సింహాసనంపై అకారణంగామంటలు లేచి కాషాయ వస్త్రం తగలబడడం చూసి - జనమంతా ఆశ్చర్యచకితులయ్యారు. జ్యోతిష్కులు చెప్పిన కుహూయోగ ప్రభావమేమిటో అందరికి అప్పటికి బాగా తెలిసి వచ్చింది.

ఏమైనా - ఆ సంఘటన అందరికీమహదాశ్చర్యకరమైన ఒక అత్యద్భుత సంఘటనగా నిలిచిపోయింది. కుహూయోగ సమయం దాటే దాకా - ఏడు ఘడియలపాటు వ్యాసతీర్థులవారు విజయనగర సింహాసనంపైన వున్నారు. తపశ్శక్తివల్ల రాజ్యానికి రాజుకూ కూడా గండం గడిచింది.

203. భారతీయులు జ్యోతిశ్శాస్త్రాన్ని, వాస్తుశాస్త్రాన్నీ ముహూర్తశాస్త్రాన్నీ అనుసరించి ముహూర్తాలు నిర్ణయిస్తారు. అలాచేసిన అనేక పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలూ కూడా అదిలోనే తారుమారవుతాయి. ఇళ్లనిర్మాణాలు సగంలోనే ఆగిపోతున్నాయి. కారణం ఏమిటి ?

జ్యోతిశ్శాస్త్రాన్ని నమ్మేది భారతీయులు మాత్రమే కాదు. పాశ్చాత్యులు కూడా జ్యోతిశాస్త్రాన్ని నమ్ముతారు. వారికీ మనకూ కొన్ని భేదాలున్నాయి.

ఇక జ్యోతిశాస్త్రాన్ని అనుసరించి నిర్ణయించిన ముహూర్తాలు సైతం సత్ఫలితాల నివ్వడం లేదన్న విషయం. ముహూర్త నిర్ణయం జాగ్రత్తగా - జ్యోతిశాస్త్రంలో చెప్పిన విధంగా జరిగితే మీరన్నలాంటి దుష్ఫలితాలు రాకుండా జాగ్రత్తపడడానికి అవకాశం ఉంటుంది.

దానికిగాను ముహూర్త నిర్ణయం విషయంలో ఎంతో శ్రద్ధ వహించాలి. అందుకు అవసరమైన అంశాలు ఈక్రిందివి.

ముహూర్తం సక్రమంగా పంచకరహితం కావాలి.

జ్యోతిశ్శాస్త్రంలో చెప్పిన ఏకవింశతి (21) మహాదోషాలు ఆ ముహూర్తానికి ఎమాత్రము కూడా లేకుండా చూడాలి. స్వల్పదోషాలు కూడా లేకుండా వీలున్నంతవరకు చూడాలి. నక్షత్ర త్యాజ్యభాగాలు, లగ్నత్యాజ్య భాగాలు, తిథి త్యాజ్యభాగాలు, దుర్ముహూర్తాలు - ముహూర్తలగ్నానికి తగలకుండా ఉండేటట్లు చూడాలి. శుభగ్రహాలకు మౌఢ్య దోషం లేకుండా చూసి ముహూర్తం నిర్ణయించాలి. శూన్యమాసాలు పనికిరావు. పక్షచ్ఛిద్రాలు, గండాంతరాసులు, గండాంత నక్షత్రాలు- ఆయా భాగాలు పనికిరావు. లగ్నశుద్ధీ, అష్టమశుద్ధీ ఉండాలి. ఛాధక, వేధక, బంధక, ప్రతిబంధక గ్రహాలను దృష్టిలో ఉంచుకోవాలి. వ్యతీపాత, వైధృతి యోగాలున్న సమయం పనికిరాదు. భద్రవాకరణం పనికిరాదు. వృద్ధితిథి, క్షత తిథి పనికిరావు. అధిక క్షయ మాసాలు పనికిరావు జన్మ మాసం, జన్మ నక్షత్రం, జన్మతిథీ పనికిరావు. కులిక ముహూర్తం, అర్ధప్రహారం - ఇవి పనికి రావు. విష్కంభ, వజ్రయోగాల మొదటి 8 గడియలు, శూలయోగపు మొదటి 5 ఘడియలు, గండ, అతి గండ యోగాల మొదటి 6 ఘడియలు వ్యాఘాత యోగంలోని మొదటి 9 ఘడియలు విడిచిపెట్టాలి. గురు, శుక్రుల మౌఢ్య సమయాలను విడిచిపెట్టాలి. బృహస్పతి ఉదయించిన తర్వాత 5 రోజులు, అస్తమించక ముందు 5 రోజులూ కూడా విడిచిపెట్టాలి. శుక్రుడు తూర్పున ఉదయించినప్పుడు ఉదయించిన రోజు నుంచి 5 రోజులు, పశ్చిమాన ఉదయించినప్పుడు 7 రోజులూ పనికిరావు, శుక్రుడు తూర్పున అస్తమించినప్పుడు అస్తమయానికి ముందు 7 రోజులూ, పశ్చిమాన అస్తమించినప్పుడు అస్తమయదినానికి ముందు 5 రోజులూ పనికిరావు. ఎ గ్రహమైనా ఉదయించిన తర్వాత విడిచిపెట్టవలసిన రోజులకు బాల్యావస్థ అనీ, ఏ గ్రహమైనా అస్తమించే ముందు విడిచిపెట్టవలసిన రోజులకు

వార్ధక్యావస్థ అనీ పేర్లు. ఈ అవస్థలు కూడా మౌఢ్యంలాగే శుభకార్యాలకు పనికిరావు. తాను పితృశ్రద్ధాన్ని ఆచరించిన రోజులు కూడా శుభకార్యాలకు పనికిరావు.

ఈ దోషాలను విడిచిపెట్టి - జ్యోతిశ్శాస్త్రంలో చెప్పిన శుభలక్షణాలతో శుభకార్యలకు ముహూర్తాలు పెట్టవలసి ఉంది. ఈ నియమాలన్నీ సరిగ్గా పాటించకుండా దోషాలతో కూడిన ముహూర్తాలు పెట్టినట్లయితే సక్రమైన ఫలితాలు రావు.

దోషాలున్న ముహూర్తాల వల్ల దుష్ఫలితాలు రాకమానవు. జ్యోతిశ్శాస్త్రం చెప్పిన నియమాలను అలక్ష్యం చేసి, ఆ తర్వాత జ్యోతిశాస్త్రాన్ని నిందించడంలో అర్థం లేదు. అల్పదోషాలకు పరిహారాలున్నాయికాని, మహాదోషాలకు పరిహారాలు లేవు.

పైన చెప్పినవే కాక - సూర్యోదయం మొదలు 4వ లగ్నమూ, సూర్యాస్తమయం మొదలు 4వ లగ్నమూ, సూర్యోదయ లగ్నమూ, సూర్యాస్తమయలగ్నమూ శుభకార్యాలకు పనికిరావు. మీన మేషాలకూ, కర్కాటక సింహాలకూ, వృశ్చిక ధనుస్సులకూ మధ్య ఒక ఘడియ సంధికాలం. రేవతీ అశ్వినులకూ, ఆశ్రేషా మఖలకూ, జ్యేష్ఠా మూలలకూ మధ్య 4 ఘడియలు సంధికాలం. ఇతర లగ్నాల విషయంలో లగ్న ప్రారంభంలో పావు ఘడియ, లగ్నం చివరో పావుఘడియా సంధికాలం. ఈ సంధికాలాలను విడిచిపెట్టాలి. మాసంలో 2 పక్షాలలోనూ అష్టమీ, ద్వాదశీ, షష్ఠీ, చవితీ, చతుర్దశీ తిథులు పక్షచ్ఛిద్రాలు. ఇవి పనికిరావు. ముఖ్యంగా చవితిలో 8 ఘడియలు, చతుర్దశిలో 25 ఘడియలు, నవమిలో 14, షష్ఠిలో 6, అష్టమిలో 14, ద్వాదశిలో 10- ఆయా తిథుల ఆరంభంలో విడవాలి. అమావాస్య, శుద్ధపాడ్యమి - ఎప్పుడూ విడవాలి.

204. ఏ రత్నాలు ధరించాలి?

కేవలం వ్యక్తియొక్క రాశిని బట్టి, నక్షత్రాన్ని బట్టి, లేదా అప్పుడు జరుగుతున్న దశాంతర్దశలను బట్టి ఆ వ్యక్తి ధరించవలసిన రత్నాన్ని నిర్ణయించ

కూడదు. – కాబట్టి మీ పిచ్చిన జాతక వివరాలు చాలవు. పూర్తి ఛార్ట్ ఉండాలి. ఆ విధంగా పూర్తి చార్ట్ లేనిదే ఆ వ్యక్తి ధరించవలసిన రత్నాన్ని నిర్ణయించడం సమగ్రహమూకాదు. సముచితమూ కాదు. అసమగ్రమైన వివరాల ఆధారంగా రత్నాన్ని ధరింపజేస్తే – దానివల్ల ఒక్కొక్కప్పుడు ఆపదలు కూడా రావచ్చు. కనుక పూర్తి ఛార్ట్ చూసిన తర్వాతనే ఆ వ్యక్తి ధరించవలసిన రత్నాన్ని నిర్ణయించవలసి ఉంది.

205. శనిగ్రహదోష నివారణ చేసే విధానమేమి? శనిదోషం కలవారు ఏ రత్నం ఏ రంగు వస్త్రాలూ ధరించాలి? ఏ జాగ్రత్తలు పాటించాలి ?

ముందు ఆ దోషం యొక్క స్వరూపమేమిటో తెలియాలి. దానికి ఆ వ్యక్తుల పూర్తి ఛార్ట్ (జాతకం) ను పరిశీలించాలి. అది జరిగాకనే మీరడిగిన వివరాలన్నీ చెప్పడం సాధ్యమవుతుంది. కాబట్టి ఛార్ట్‌ను చూడాలి. పూర్తి గ్రహసంపుటిని పరిశీలించాలి.

206. దేవుని పటాలుకాని, విగ్రహాలుకాని, లేదా చిన్నఇల్లు కట్టి దానిలో దేవుళ్లను ఉంచి పూజించడం కాని చేస్తారు కదా? వీటిలో ఏ ఒక్క విధానంగా పూజించినా – అసలు ఇంట్లో దేవతా విగ్రహాలను ఏ దిక్కులో ఉంచి పూజించాలి? మనం మొక్కేటప్పుడు ముఖం తూర్పును చూచి మొక్కాలా, లేక పడమరను చూచి మొక్కాలా? ఉత్తర దక్షిణాలకు తిరిగి మొక్కాలా?

ఇంట్లో దేవతార్చన పీఠం – ఈశాన్యమూలలో ఉంచాలి. తూర్పు ఈశాన్యంలోకాని, ఉత్తర ఈశాన్యంలోకాని ఉంచాలి. ఇంటికి ఈశాన్యంలో ఉంచడం కుదరకపోతే, కనీసం ఆ పర్టిక్యులర్ గదిలో ఈశాన్యమైనా పనికివస్తుంది. పూర్తిగా ఈశాన్యం కుదరకపోతే తూర్పు దిక్కులోగాని ఉత్తర దిక్కులోగాని దేవత విగ్రహాలను ఉంచాలి. అంటే తూర్పుగోడలో ఉత్తరపు వైపు సగభాగంలోకాని, ఉత్తరపు గోడకు అన్ని ఆ గోడలో తుర్పువైపు సగభాగంలో ఇంట్లోకాని గదిలోకాని దేవతాపీఠాన్ని ఉంచవలసిన దిక్కులివే.

మన ముఖం తూర్పుకుకాని,ఉత్తరానికికాని ఎదురుగా ఉండేవిధంగా కూర్చొని పూజించాలి. దేవతాపీఠానికి విడిగా గది,లేదా చిన్న ఇల్లు కట్టదలచినప్పుడు దాన్ని ఇంటికి ఈశాన్యంలోనే కట్టాలి. లేదా తూర్పులోకాని ఉత్తరంలోకాని పైన చెప్పిన విధంగా కట్టాలి.

207. ముహూర్త దోషాలు అంటే ? శుభకార్యాలకు ముహూర్తాలను నిర్ణయించే సందర్భంలో ఏయే దోషాలు లేకుండా జాగ్రత్త వహించాలి?

ముహూర్త దోషాలలో ప్రధానమైనవి 21. వాటినే ఏకవింశతి మహా దోషాలని మహర్షులు పేర్కొన్నారు. ఈ 21 మహాదోషాలకూ ఏ విధమైన పరిహారాలు లేవు. ఇవికాక మరికొన్ని అల్పదోషాలను చెప్పారు. ఈ అల్పదోషాలకూ పరిహారాలున్నాయి. కానీ ఆ 21మహాదోషాలకు మాత్రం పరిహారాలు లేవని మహర్షులు ఘంటాపథంగా చెప్పారు.

ఎంత మంచి ముహూర్తమైనా, ఆ ముహూర్తానికి ఎంత బలమూ, ఎన్ని శుభ లక్షణాలు కలిగి వున్నా పంచేష్టిక బలం కలిగిన ముహూర్తమైనా, శుభగ్రహాలు, పాప గ్రహాలు అవి వుండవలసిన స్థానాలలో ఉన్నా కూడా మహాదోషాలైన 21 దోషాలలో ఏ ఒక్కటి ఆ ముహూర్తాన్ని స్పృశించినా కూడా ఆ ముహూర్తం పనికిరాదు. అటువంటి ముహూర్తం మృత్యుప్రదం కాగలదనిమహర్షులు నొక్కిచెప్పారు. ఆ 21 మహాదోషాలు ఈక్రిందివి.

1. పంచాంగ శుద్ధి లోపించడం : పంచాంగమంటే తిథి,వార, నక్షత్ర, యోగ, కరణాలు. ఈ 5 అంశాలలో దేనికి శుద్ధి లేకపోయినా ఆ ముహూర్తానికి పంచాంగ శుద్ధి లేనట్టే అంతేకాక ప్రతి శుభ కార్యానికి పనికి వచ్చేవి కొన్ని, పనికిరానివి కొన్ని - తిథి, వార నక్షత్రాదులున్నాయి. ఆ పర్టిక్యులర్ పనికి పనికిరానివిగా మహర్షులు చెప్పిన తిథి వార నక్షత్ర యోగ కరణాలను ఆ పనికి ఉపయోగించకూడదు.

2. పాపషడ్వర్గం : లగ్నాధిపతి,నవాంశాధిపతి, హోరాధిపతి, ద్రేక్కాణాధిపతి, ద్వాదశాంశాధిపతి, త్రింశాంశాధిపతి - ఈ అధిపతులు శుభ

గ్రహాలతో కలసికాని, శుభ గ్రహరాసులలోనైన ఉండాలి. లేని పక్షంలో పాప షడ్వర్గ దోషం కలుగుతుంది.

3. కుజాష్టమం : ముహూర్త లగ్నానికి అష్టమంలో కుజుడు ఉండకూడదు. అటువంటి లగ్నం ఏ విధమైన శుభ కార్యాలకూ పనికిరాదు.

4. కునవాంశదోషం : ముహూర్త సమయం – పాపగ్రహాల నవాంశాలలో, కర్కాటక నవాంశంలోనూ పడడం దోషం.

5. కర్తరీదోషం : సూర్యుడు భరణి 4వ పాదం, కృత్తిక 4 పాదాలు, రోహిణి 1వ పాదం – ఈ పాదాలలో సంచరించే సమయాన్ని కర్తరి అనిపేరు. ఇది గృహ నిర్మాణాలకూ, శంకుస్థాపనలకూ మాత్రమే దోషం. ఇతర శుభకార్యాలకు ఈ దోషంలేదు.

6. సంక్రాంతివర్జ్య దోషం : సూర్య సంక్రమణ సమయానికి ముందు 16 ఘడియలు, వెనుక 16 ఘడియలూ విడిచి పెట్టాలి. ఈసమయం శుభకార్యాలకు పనికిరాదు. అయితే మేష, కర్కాటక, తులా, మకర సంక్రమణాలకు ముందు 30 ఘడియలు, వెనుక 30 ఘడియలు విడిచిపెట్టాలి.

7. భృగుషట్క దోషం: ముహూర్త లగ్నానికి 6, 3, 7, 8, 12 స్థానాలలో శుక్రుడు ఉండకూడదు. అటువంటి లగ్నాలను విడిచిపెట్టాలి.

8. సగ్రహ చంద్రుడు : ముహూర్త సమయానికి చంద్రుడు ఏ ఇతర గ్రహంతోనూ కలసి ఒకే రాశిలో ఉండకూడదు. చంద్రుడుముహూర్త లగ్నానికి సప్తమంలోనూ, లగ్నంలోనూ కూడా ఉండకూడదు. ఇది మహా దోషం ముహూర్త లగ్నంలో ఉన్న చంద్రుడు యమకింకరుడై బాధిస్తాడని చెప్పబడింది.

9. దుర్ముహూర్త దోషం : ముహూర్త లగ్నాన్ని దుర్ముహూర్తం – ఒక్క విఘడియ స్పృశించినా అదిమహాదోషం. ఇంతేకాక ఎంత మాత్రమూ పనికిరాని మరొక విధమైన ముహూర్త దోషం కూడా వుంది. ప్రతి నిత్యమూ

పగలు 15ముహూర్తాలు, రాత్రి 15 ముహూర్తాలు వస్తూవుంటాయి. అంతేకాక ఆదివారంనాడు అర్యమం, సోమవారంనాడు బ్రహ్మమూ, దైత్యమూ, మంగళవారంనాడు పగటిపూట ప్రిత్యం రాత్రిపూట వహ్ని, బుధవారంనాడు అభిజిత్,గురువారంనాడు దైత్యము,వారమూ, శుక్రవారం నాడు బ్రహ్మమూ, ప్రిత్యమూ, శనివారంనాడు రుద్రమూ,ఉరగమూ, - ఇవి చాలా దుష్టమైనవి. వీటిని విడవాలి.

10. గ్రహణ దోషం : సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంలో గ్రహణానికి ముందు మూడురోజులు, ఆ రోజు, వెనుక 3 రోజలు (ద్వాదశి మొదలు తదియ వరకు) విడవాలి. సంపూర్ణ సూర్యగ్రహణం కలిగినప్పుడు ముందు నాలుగు రోజులు, ఆ రోజు తర్వాత 4 రోజలు విడవాలి. ఖండ గ్రహణమైతే ముందు 1 రోజు, ఆ రోజు, తర్వాత 1 రోజు విడవాలి. సంపూర్ణ గ్రహణమైతే గ్రహణ నక్షత్రాన్ని ఆ తర్వాత ఆరుమాసాల వరకూ విడిచి పెట్టాలి. ఖండ గ్రహణ సందర్భంలో మూడు మాసాలు, లేదా గ్రహణం ఎంత శాతమో అన్నదాన్ని బట్టి ఆ నక్షత్రాన్ని విడవాలి.

11. విషనాడీ దోషం : ముహూర్త లగ్నానికి వర్జ్యం స్పృశించకూడదు. ముహూర్త లగ్నానికి వర్జ్య స్పర్శ వుంటే దాన్ని విషయుత లగ్నమని పిలుస్తారు. ఇది దోషం.

12. లగ్నాస్తదోషం : ముహూర్త లగ్నానికి 7వ రాశిలోని 7వ నవాంశకు పాప గ్రహసంబంధం కలిగితే అది లగ్నాస్త దోషం. ఇది మహాదోషం.

13. పాప విద్ధభ దోషం : పాప గ్రహాలకు సంబంధించిన ఆక్రాంతమూ, వేధా - ఈ రెండు దోషాలను కూడా విడిచిపెట్టాలి.

14. వ్యతీపాత, వైధృతీ యోగాలు : ఈ రెండు యోగాలనూ విధిగా విడవాలి. అలాగే విష్కంభం, శూల, పరిఘ,గండం, అతిగండం, అశని, వ్యాఘాతం - ఈ యోగాలను కూడా విడివాలి.

15. ఉత్పాతాలు : భూకంపం, పిడుగుపాటు తోకచుక్క - ఇటువంటి ఉత్పాతాలు కలిగితే అది మహాదోషం. ఆ సమయంలో శుభకార్యాలు చేయకూడదు.

16. లగ్నాష్టమం : జన్మ లగ్నానికి 8వ లగ్నం ముహూర్తానికి పనికిరాదు.

17. చంద్రాష్టమం : జన్మ చంద్ర లగ్నానికి అష్టమంలో చంద్రుడు కలిగిన ముహూర్తం పనికి రాదు.

18. షష్ఠాష్టమ వ్యయదోషం: ముహూర్త లగ్నానికి చంద్రుడు 6,8,12 స్థానాలలో వుండే మూర్తాన్నిపెట్టకూడదు.

19. పాపయుగ్దిష్ట్య దోషం : పాపగ్రహాలున్న రాశికీ, నక్షత్రానికీ జ్వలిత రాశి, జ్వలిత నక్షత్రమనీ పేరు. దానికి కిందటి రాశికీ, నక్షత్రానికీ - భస్మిత రాశి, భస్మిత నక్షత్రమనీ పేర్లు. జ్వలిత రాశికీ,జ్వలిత నక్షత్రానికి తర్వాత రాశికీ నక్షాత్రానికి - ధూమితరాశి - ధూమిత నక్షత్రమనీ పేర్లు. ఈ రాశులు, నక్షత్రాలు - శుభ ముహూర్తాలకు పనికిరావు.

20. గండాంత దోషం : జ్యేష్ఠా మూలా నక్షత్రాలు, ఆశ్రేషా మఖ నక్షత్రాలు,రేవతీ అశ్వనీ నక్షత్రాలు, ఈ నక్షత్రాల సంధి సమయానికి గండాందతమని వ్యవహారం. ఈ సంధి సమయం 8 ఘడియలు వుంటుంది. ఆశ్రేషా నక్షత్రం చివరలో 4 ఘడియలు,మఖా నక్షత్రానికి మొదటి 4 ఘడియలు ఇదే -విధంగా పైన చెప్పిన మిగిలిన నక్షత్రాల జతలకు కూడా అటూ ఇటూ నాలుగేసి ఘడియలు చొప్పున మొత్తం ఎనిమిదేసి ఘడియలు సంధికాలం. ఇదే విధంగా పాడ్యమీ, షష్ఠీ, ఏకాదశీ తిథులకు మొదటి 2 ఘడియలూ, పంచమీ, దశమీ, పూర్ణిమాతిథులకు చివరి 2 ఘడియలు గండాంతకాలం. అలాగే మేష, సింహ, ధనూ రాసులకు మొదటి అర ఘడియ, మీన, కర్కాటక, వృశ్చిక రాసులకు చివరి అరఘడియ - గండాంత కాలం. ఈ చెప్పిన గండాంత సమయాలన్నీ మహాదోషాలు. శుభ ముహూర్తాలకు ఇవి పనికిరారవు.

21. ఖర్జూర చక్ర దోషం : ఖర్జూర చక్రాన్ని నిర్మించి దానిలో నక్షత్రాలనిటినీ వేయాలి. ఈ ఖర్జూర చక్రాన్ని ఎలా వేయాలంటే -13 అడ్డ గీతలోనూ, 5 నిలువు గీతలతోనూ ఈ చక్రాన్ని వేయాలి. మధ్య గడిని వదిలి 27 నక్షత్రాలన్నీ దీనిలో వేసినప్పుడు ఈ చక్రంలో రవి, చంద్రుడు ఒకటే వరుసలో 3 నక్షత్రాలలో ఉండి వారిలో ఒకరు 4వ పాదంలోనూ, ఇంకొకరు 1వ పాదం లోనూ కాని, ఒకరు 2వ పాదంలోనూ ఇంకొకరు 3వ పాదంలోనూ కాని వుంటే రవిచంద్రులకు పరస్పరము దృష్టి తగులుతుంది. అటువంటప్పుడు ఆ నక్షత్రాలను విడిచిపెట్టాలి.

ఈ పైన చెప్పిన 21 మహాదోషాలూ మృత్యు ప్రదమైనవి. వీటిలో ఏ ఒక్క దోషం కలిగిన ముహూర్తమైనా కూడా వివాహ, ఉపనయనం, గృహారంభం, గృహప్రవేశం, ప్రయాణం, తీర్థయాత్ర, క్రయ విక్రయాలు, అధికారుల దర్శనం, నూతనోద్యోగం, రాజకీయం, వ్రతం, యాగం ఇటువంటి ఏ కొత్త ప్రయత్నానికీ, ఏ శుభ కార్యానికీ పనికిరావు. ఈ 21 దోషాలకూ పరిహారాలు కూడా లేవు. ముహూర్త లగ్నంలో శుభ గ్రహాలన్నీ ఉన్నా కూడా ఈ 21 మహాదోషాలలో ఏ ఒక్కటి ఉన్నా ఆముహూర్తం పనికిరాదని మహర్షులు ఏకకంఠంతో ఘోషించారు.

208. ఇంటి శూలలు ఎన్ని రకాలు ?

ఇంటికి ఉండే శూలలు 5 రకాలు. వాటినే పంచ శూలలంటారు. ఈ క్రిందివి.

1. వీధిశూల : తన ఇంటికి ఎదురుగా వీధి (రోడ్) ఉండడానికి - వీధిశూలఅని పేరు. ఇంటికి సింహద్వారానికి ఎదురుగా వీధి ఉండకూడదు.

2. గృహశూల : మన ఇంటికి మరొకరి ఇంటి వెన్నుతగులతూండడాన్ని గృహశూల అటారు ఇంటికి కాని, సింహద్వారానికికాని, ఇంటికి సంబంధించిన ఏ ఇతర ద్వారాలకు కాని ఎదురుగామరొకరి ఇంటి వెన్ను నిలువుగా ఉండడం పనికి రాదు.

3. వృక్షశూల : (ఎ) ఇంటి సింహద్వారానికి ఎదురుగా చెట్లు ఉండడం (బి) ఇంటికి సంబంధించిన ఏ ఇతర ద్వారాలకైనా ఎదురుగా చెట్లు ఉండడం (సి) వాస్తు శాస్త్ర ప్రకారంగా ఇళ్లలో ఉండకూడదనిచెప్పిన చెట్లు ఇంటి ఆవరణలో ఉండడం - ఈ మూడూ వృక్షశూల కిందకి వస్తాయి. ఇవి మూడూ కూడా దోషాలే.

4. కూపశూల : ఇంటికి మధ్యభాగంలోనూ, ఇంటి సింహద్వారానికి ఎదురు గాను, ఇంటికి దక్షిణ దిక్కులోనూ నైఋతి మూలలోనూ నుయ్యి ఉండడమే కూపశాల. ఇంటికి సంబంధించిన ఏ ద్వారానికీ కూడా ఎదురుగా నుయ్యి ఉండకూడదు. ఒకే ప్రకారంలోపల ఉన్న 2 ఇళ్లగోడలు కాని పైభాగాలు కాని కలుస్తూ ఉంటే - ఆ రెండిళ్ల మధ్యలో కూడా నుయ్యి ఉండకూడదు. ఇంతేకాక - గృహ యజమాని జాతకాన్ని బట్టి కూడా నుయ్యి ఏ దిక్కులో ఉండాలన్నది నిర్ణయించవలసి వుంటుంది.

5. ప్రవాహశూల ; నదులు, కాలువలు మొదలైన ప్రవాహాలకు ఎదురుగా సింహద్వారం ఉండడాన్ని ప్రవాహాశూల అంటారు. ఇది దోషం.

పైన చెప్పినవే పంచశూలలు. ఇవి ఎంత మాత్రము పనికిరావనీ, ఈ శూలలు లేకుండా ఇల్లు కట్టుకోవాలనీ వశిష్ఠమహర్షి కంఠవాక్యంగా చెప్పారు.

ఇంతే కాక - సింహద్వారానికి ఎదురుగా దేవాలయంకాని, ధ్వజస్తంభం కాని ఉండకూడదు, ఇదికూడా శూలతో సమానమే.

ఇల్లు కట్టుకోవడానికి ముందే ఈ దోషాలేవీ లేకుండా చూచుకోవాలి.

209. పంచకరహితం, దాని ప్రాముఖ్యం, విధానం ఏమిటి?

శుభముహూర్త నిర్ణయ సందర్భంలో ఆ ముహూర్తం పంచకరహితం కావడం - అత్యవసరం. ఏ ముహూర్తమైనా కూడా పంచకరహితంకాని ముహూర్తం - చాలా దోషప్రదం. వివాహం, ఉపనయనం, శంకుస్థాపన, గృహప్రవేశాది శుభకార్యాలకు ఆ ముహూర్తం పనికి రాదు.

మరి పంచకరహితం అటే ఏమిటి? ఒక ముహూర్తం పంచక రహితమో కాదో ఎలా తెలుసుకోవాలీ అంటే ఎలా- అన్నది ఈ క్రింద చూడండి.

ఒక ముహూర్తం పంచకరహితం – అని నిర్ధారణ చేసుకొనే విధానం ఇది : ఏదైనా శుభ కార్యం చేయదలచిననాటి తిధి,వార, నక్షత్ర, లగ్న సంఖ్యలను కలిపి – వచ్చిన ఆ మొత్తాన్ని 9 చేత భాగించాలి. అలా వాటి మొత్తాన్ని 9చేత భాగించగా వచ్చిన శేషం- 1 మిగిలితే – మృత్యుపంచకం, 2 మిగిలితే – అగ్ని పంచకం, 4 మిగిలితే రాజపంచకం, 6 మిగిలితే – చోరపంచకం, 8 మిగిలితే – రోగపంచకం

ఈ 1, 2, 4, 6,8 – ఇవి తప్ప వేరే సంఖ్యలు శేషంగా వస్తే – ఆ ముహూర్తం పంచరహితమని అర్ధం. అలాకాని ముహూర్తాలు వివాహం, ఉపనయనం, శంకుస్థాపన, గృహప్రవేశం, ప్రయాణం, రాజసేవ, నూతనోద్యోగ ప్రవేశం – మొదలైన ఏ శుభకార్యాలకూ పనికి రాదు. పంచకరహితమైన ముహూర్తం – అన్ని శుభకార్యాలకూ పనికివస్తుంది.

210. మతాంతర రహితం అంటే ఏమిటి?

ముహూర్తం సవ్యంగా పంచకరహితం కానప్పుడు ఏదోవిధంగా దాన్ని సరిపెట్టే విధానమే మతాంతర రహితం. ఈ మతాంతర రహితం రెండు విధాలుగా ఉంది. 1. మాసాదిగా తిథిని తీసుకొని లెక్కించే విధానం. 2. ప్రస్తుత తిధి వారాలను కాకుండా గడిచిన తిథి వారాలను లెక్కలోకి తీసుకొని – నక్షత్రాన్నీ, లగ్నాన్నీ విడిచిపెట్టి పంచకరహితం చేయడం. ఈ రెండు పద్ధతులలోనూ మతాంతరరహితం చేయడం కొన్ని చోట్ల ఉంది. కానీ ఈ రెండు పద్ధతులూ కూడా సరైనవి కావు. తిథిని పక్షాదిగానే లెక్కించాలి. మాసాదిగా లెక్కించడం శాస్త్రీయం కాదు.నక్షత్రాన్నీ లగ్నాన్నీ విడిచి – గడచిన తిథివారాలను కలిపి పంచకరహితమని సరిపెట్టుకోవడమూ శాస్త్రీయం కాదు. సారాంశంగా, స్పష్టంగా చెప్పాలంటే- మతాంతరరహితమే అసలు శాస్త్రీయం కాదు.

మహర్షులు చెప్పిన పద్ధతిలో సవ్యంగా పంచకరహితం కావడమూ, 21 మహాదోషాలూ, మహాదోషాలుగా చెప్పిన మరికొన్ని దోషాలూ లేకపోవడమూ – ఇవి శుభముహూర్తాలకు తప్పనిసరి. ఆయా దోషాలలో ఏ ఒక్కటి కలిగిన ముహూర్తమైనా మృత్యుప్రదమవుతుందని మహర్షుల ఉవాచ. ఇతరత్రా ఎన్ని శుభలక్షణాలు కలిగిన ముహూర్తమైనా కూడా– మహాదోషాలలో ఒక్కటి ఉన్నా అది మృత్యుప్రదమే.ముహూర్తం సవ్యంగా పంచకరహితం కావడం అత్యవసరం.

211. వివాహ సందర్భంలో మూడు జ్యేష్ఠలు పనికిరావా?

వివాహ సందర్భంలో వధూవరులకు 3 జ్యేష్ఠలు పనికిరావు. అంటే వధువు, వరుడు ఇద్దరూ జ్యేష్ఠులై పుట్టి ఉండడమూ, వాళ్లలో ఒకరిది జ్యేష్ఠా నక్షత్రంలో జన్మించడమూ, వాళ్లలో ఒకరు జ్యేష్ఠులు కావడము కూడా త్రిజ్యేష్ఠయే. ఇదీ పనికిరాదు. వధూవరులు ఇద్దరిలో ఒకరు జ్యేష్ఠులై ఉండి, మరొకరు జ్యేష్ఠా నక్షత్రాన పుట్టి ఉంటే – వాళ్లకు జ్యేష్ఠ మాసంలో వివాహం పనికిరాదు. అలాగే జ్యేష్ఠులు, జ్యేష్ఠానక్షత్రం, జ్యేష్ఠమాస జననం – పనికిరాదు.

పైన చెప్పినవి త్రిజ్యేష్ఠలు. అంటే 3 జ్యేష్ఠలు. జ్యేష్ఠలు మూడే కాదు – నాలుగూ, ఐదూ కూడా పనికిరావు. అంటే వధూవరులిద్దరూ జ్యేష్ఠులు కావడమూ, ఇద్దరూ కూడా జ్యేష్ఠానక్షత్రాన పుట్టి ఉండడమూ,లేదా వీటిలో ఏదో ఒక అంశం తగ్గినా – వధూవరులు ఇద్దరిలో ఒకరుకాని,ఇద్దరూ కాని జ్యేష్ఠమాసంలో జన్మించడమూ, ఇలా 3 కాని, 4 కాని, 5 కాని జ్యేష్ఠలు పనికిరావు. జ్యేష్ఠా నక్షత్రంలోకాని, జ్యేష్ఠమాసంలోకాని వివాహం జరగడం వల్ల 3 లేదా 4లేదా 5 జ్యేష్ఠలు (అది కలుపుకొని) – అయినా పనికిరాదు. ఇక్కడ జ్యేష్ఠులంటే పుట్టినవాళ్లలో జ్యేష్ఠులనే లెక్కలోకి తీసుకోవాలి. ప్రస్తుతం బతికి ఉన్నవాళ్లలో జ్యేష్ఠులని కాదు.

212. పుష్కరాంశ నిర్ణయం ఎలా చేస్తారు ?

పుష్కరాంశ :- ప్రతి రాశి ప్రమాణాన్ని (స్పాన్) 30 భాగాలు చేయాలి. అనగా ఆ రాశికి చెందిన ఘడియలనూ, విఘడియలనూ 30 చేత భాగించాలి. మేష సింహ, ధనూరాసులకు - ఆ రాశి ఘడియలలో 21 వ భాగం పుష్కరాంశ అవుతుంది. మకర, కన్యా, వృషభరాసులకు - ఆ రాశి ఘడియలలో 14వ భాగం పుష్కరాంస. తులా, కుంభ, మిధున రాశులకు ఆయా రాశిఘడియలలో 24వ భాగం పుష్కరాంస. కర్కాటక, వృశ్చిక, మీనరాశులకు ఆయా రాశి ఘడియలలో 7వ భాగం పుష్కరాంశ. శుభకార్యాలకు ముహూర్తాన్ని నిర్ణయించే సమయంలో - విధిగా పుష్కరాంశను కాని, వర్గోత్తమాంశను కాని గ్రహించాలని మహార్షులు శాసించారు.

213. దగ్ధయోగాలు అంటే ?

నవమీ ఆదివారం, షష్టి గురువారం, పంచమీ మంగళవారం, అష్టమీ శుక్రవారం, తదియా బుధవారం ద్వాదశీ శనివారం, ఏకాదశీ సోమవారం - ఈ తిథివారాల కాంబినేషన్స్‌ను - దగ్ధయోగాలుగా మహర్షులు తెలియజేసారు.

అంతేకాదు, వారాలు, నక్షత్రాల కలయికల్లో రేవతీ శనివారం, ఉత్తరాషాఢా మంగళవారం, ధనిష్ఠా బుధవారం, ఉత్తర ఫల్గునీ గురువారం, చిత్రా సోమవారం జ్యేష్ఠా శుక్రవారం, భరణీ ఆదివారం - ఇవి దగ్ధయోగాలు.

ఈ రెండు విధాల దగ్ధయోగాలూ కూడా పని కిరానివి. గృహప్రవేశం, ప్రయాణం, తీర్థయాత్ర లాంటి విషయాలన్నింటిలో వీటిని విడిచిపెట్టాలి.

214. వార శూలల గురించి చెప్పండి.

తూర్పు దిక్కుకు సోమవారం, శనివారం. పడమరకు ఆదివారం, శుక్రవారం ఉత్తరానికి మంగళవారం, బుధవారం, దక్షిణానికి గురువారం - ఇవి వార శూలలు. ఇవి పనికిరావు. అంటే పైన చెప్పిన ఆయా వారాలలో

ఆయా దిక్కులకు ప్రయాణం చేయడం నిషిద్ధం. సూర్యోదయం నుంచి మరునటి సూర్యోదయం వరకూ అదే వారంగా పరిగణించాలి. అత్తవారింటికి ఆడపిల్లను పంపే సందర్భంలో సోమ, మంగళ, శుక్రవారాలు ఎంత మాత్రం పనికిరావు. అలాగే ఆగ్నేయానికి శని, గురువారాలూ, నై ఋతికి సోమ, శుక్రవారాలూ, వాయువ్యానికి ఆది, మంగళవారాలూ, ఈశాన్యానికి బుధవారమూ ప్రయాణం చేయకూడదు.

215. ముహూర్తబలం అంటే ఏమిటి ?

విజయనగర సామ్రాజ్య స్థాపన నిమిత్తం హరిహరరాయలు, బుక్కరాయలకు విద్యారణ్యస్వామి వారు మంచి ముహూర్తాన్ని నిర్ణయం చేసి చెప్పారు. ఆ సమయానికి విద్యారణ్యస్వామి వారు – తనకు సహాయకుడుగా కాశీ నుంచి ఒక పండితుని రప్పించారు. సామ్రాజ్య స్థాపన మూహూర్తం నాటి రాత్రి – విద్యారణ్యస్వామి ఇలా నిర్దేశించారు. ఏమంటే –ముహూర్త సమయానికి మూడు ఘడియల ముందుగా కాశీపండితుడు – సమీపంలో ఉన్న కొండపైకెక్కి – నక్షత్రాలను బట్టి పొద్దుకట్టి – అటే సమయాన్ని లెక్కించాలి. ముహూర్త సమయం కాగానే కాశీపండుతు శంఖాన్ని ఊదాలి. శంఖధ్వానం వినపడగానే విద్యారణ్యస్వామి యంత్రాన్ని అచ్చులో పోస్తారు. జరగవలసిన కార్యక్రమం ఇలా నిర్ణయం అయింది.

విద్యారణ్య స్వామివారు నిర్దేశించిన ప్రకారంగా ఆ రాత్రి, ముహూర్తానికి ముందుగా కాశీపండితుడు కొండపైకెక్కారు. నక్షత్రాలను పరిశీలించి సమయాన్ని లెక్కించి ముహూర్త సమయానికై వేచి ఉన్నారు. విద్యారణయ స్వామి –మంత్రోచ్చారణ చేస్తూ – కాశీ పండితుని శంఖ ధ్వానానికై వేచి ఉన్నారు. విద్యారణ్య స్వామి – మంత్రోచ్చారణ చేస్తూ – కాశీ పండితుని శంఖ ధ్వానానికై వేచి ఉన్నారు. ఇంతలో శంఖ ధ్వానం వినిపించిండి. విద్యారణ్యులు యంత్రాన్ని అచ్చులోపోశారు. కొద్ది సేపటిలోనే మరొక శంఖ ధ్వానం వినిపించింది. ఆ వెనుకే కాశీ పండితుడు కొండ దిగి వచ్చారు. రెండు శంఖ ధ్వానాలు వినిపించాయేమిటని విద్యారణ్య స్వామి, హరిహర బుక్కరాయాదులు – ఆత్రంతో కాశీ పండితుని ప్రశ్నించారు.

రెండవ శంఖధ్వానమే తాను చేసినదనీ, అదే సరైన ముహూర్తసమయమనీ - కాశీపండితుడు చెప్పారు. విద్యారణ్యస్వామి, హరిహర బుక్కరాయాదులు - నిర్విణ్ణులైపోయారు. విచారించగా మొదటి శంఖనాదం ఎవడో భిక్షుకుడు చేశాడని తెలియవచ్చింది.

విద్యారణ్యస్వామి యంత్రాన్ని తీసి చూశారు. అది రెండుంపావు భాగాలుగా బీటలు వారి ఉంది. ఆ సామ్రాజ్యం రెండు వందల పాతిక సంవత్సరాలు మాత్రమే నిలుస్తుందనీ, అనుక్షణమూ శత్రుభీతి తప్పదనీ విద్యారణ్యస్వామి వారికి వివరించారు. తాము తలపెట్టిన శాశ్వత హిందూ రాజ్యస్థాపన ప్రయత్నం ఆ విధంగా నిష్ఫలమైనందకు విద్యారణ్యులు, హరిహర రాయలు, బుక్కరాయలు - విచారించారు.

216. జనన తేదీ, జనన సమయం, జన్మ స్థలం - ఈ మూడు లేనిదే ఛార్ట్ తయారుచేయడానికి కుదరదా? జనన వివరాలు లేనివాళ్లకు - హస్తసాముద్రికం మినహాగా - నేటల్ ఛార్ట్ తయారుచేయడానికి మరేవిధమైన మార్గమూ లేదంటారా ? జనన వివరాలు సరిగా లేనివారికి నేటల్ ఛార్ట్ తయారుచేసేటప్పుడు జనన వివరాలు కరెక్టా, కాదా అని పరిశీలించి తయారుచేస్తారా, లేదా ? తెలుపవలెనని ప్రార్థన.

జన్మించిన తేదీ, సమయం, స్థలం- ఈ మూడూ లేని వాళ్లకు ఛార్ట్ తయారుచేయడానికీ, ఫలితాలు చెప్పడానికీ శాస్త్ర విహితమైన వేరే విధానాలున్నాయి. జనన వివరాలు కరెక్టా కాదా అని శోధన చేయడానికి కూడా విధానాలున్నాయి.

217. జన్మనక్షత్రం అంటే ఏమిటి? జన్మనక్షత్రం ఏది అన్నది తెలుసుకోవడమెలా? మనిషి ఏ నక్షత్రపాదంలో పుట్టిందీ నిర్ణయమెలా చేస్తారు?

ఒక వ్యక్తి పుట్టే సమయానికి వున్నదిన నక్షత్రమే ఆ వ్యక్తి జన్మనక్షత్రం అని తెలుసుకోవాలి. జన్మసమయానికి వున్న నక్షత్రపాదమే ఆ వ్యక్తిది అవుతుంది.

218. పునర్జన్మ రాకుండా ఉండేందుకు ఏదైనా మార్గం ఉన్నదా ?

భక్తియోగం, జ్ఞానయోగం, కర్మయోగం వంటి వాటిలో ఏదో ఒక మార్గాన్ని అవలంబించి పరమాత్మను చేరుకోవడమే దానికి మార్గం.

219. రోజు సూర్యనమస్కారాలు చేస్తే మంచిదా ?

'ఆరోగ్యం భాస్కరా దిచ్ఛేత్' అని చెప్పబడింది. సూర్యుడు ఆరోగ్య ప్రదాత. కాబట్టి రోజూ సూర్యనమస్కారాలు చేస్తే మంచిదే కానీ ఆయా వ్యక్తుల జాతకాలను పరిశీలించనిదే - ఏ వ్యక్తి ఏయే దేవతలను ఏయే గ్రహాలను అర్చించాలనే విషయాన్ని తొందరపడి నిర్ణయించకూడదు.

జాతకాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తగిన పరిజ్ఞానంతో పైన చెప్పిన విషయాలను నిర్ణయించాలి.

వ్యక్తుల జీవితాలలోని లోటుపాట్లు కష్టనష్టాలు - వారి జాతకాలలోని దోషాలవల్ల ఏర్పడుతాయి. జాతకదోషాలకు పరిహారాలు (రెమెడీస్) గా కాని లేదా ఆయా వ్యక్తులు తాము కోరిన ఆయా ఫలితాలను పొందడానికి గాని ఏ దేవతలను / గ్రహాలను అర్చించాలి అనేదాన్ని సూక్ష్మపరిశీలనతో, తగు పరిజ్ఞానంతో నిర్ణయించి ఆచరించినట్లయితే శ్రేష్ఠమైన ఫలితాలు లభించగలవన్నది నిస్సంశయం.

పైన చెప్పిన దానికి భిన్నంగా ఆచరించినట్లయితే - దుష్ఫలితాలు ఏర్పడడానకి అలవకాశమిచ్చినట్లవుతుంది.

220. ఇల్లు కట్టడం పూర్తయిన తదుపరి గృహప్రవేశం చేయాలనుకున్న సమయంలో ఎవరైనా అంటే రక్తసంబంధీకులు, దాయాదులు, దూరపుబంధువులు చనిపోతే, ఆ గృహ ప్రవేశం ఆపవలెనా? అలా ఎంతకాలం ఆపాలి? ఈ మధ్య కాలంలో ఆ కొత్త ఇంటికి ఏవయినా జాగ్రత్తలు, శాంతులు ఉంటాయా? ఇలాంటి అశుభసమయాలలో ఏవైనా మొక్కుబడులు ఉంటే అవి తీర్చుకోవాలంటే ఎలా? పురుడు

వచ్చిన కాలంలో ఏ పనులుచేయవచ్చు? పురుడు ఎన్నాళ్ళు? తదుపరి ఏం చేయాలి?

ఇంటి నిర్మాణం పూర్తయ్యాక గృహప్రవేశం చేయాలనుకున్న సమయంలో మీరడిగినట్లు దగ్గరి బంధువులు చనిపోతే ఆ అశుచి తీరేటంతవరకు గృహప్రవేశం చేయకూడదు. ఒకవేళ ఏటిసూతకం కలిగిన పక్షంలో మరొక దంపతులను ఎవరినైనా పీటలమీద కూర్చోబెట్టి గృహప్రవేశ కార్యక్రమం వాళ్ళచేత చేయించాలి. ఎందుకంటే నిర్మాణం పూర్తయిన ఇంటిని ఖాళీగా ఎక్కువ రోజులు ఉంచ కూడదు.తమకు అంగీకరామైన మరొక దంపతుల చేత గృహప్రవేశం చేయించి – తాము ఆ ఇంట్లో ప్రవేశించవచ్చును. అశుచి సమయం దాటిపోయాకనే మొక్కుబడులు తీర్చుకోవాలి.

జాతాశౌచం (పురుటి వల్ల కలిగిన అశుచి) పది రోజులు. ఈ పది రోజులు మృతాశౌచానికి వలెనే అశౌచం పాటించి, 11వ రోజున శుద్ధి చేసుకోవాలి. మృతాశౌచం (మైల) లో ఏ పనులు చేయరాదోఅవన్నీకూడా జాతాశౌచంలో కూడా చేయరాదు.

221. ఇంట్లో పిచ్చుకలు గూడు పెట్టవచ్చా? అలా గూడు పెట్టడానికి తగిన ఏర్పాటు చేయవచ్చా?

నిత్యమూ మానవుడు చేయవలసిన పంచయజ్ఞాలలో భూతయజ్ఞం ఒకటి. అంటే ప్రతిదినమూ జీవరాసులకు ఆహారాన్ని ఇవ్వడం. దీనిలో భాగంగానే పక్షులకు ఆహారాన్ని ఇవ్వడం కోసం ఇంటిచూరుకు వరివెన్నులను కట్టే అలవాటు ఆచరణలోనికి వచ్చింది. ఇంట్లో కాని, పెరట్లో కాని పిచ్చుకలు గూడు పెట్టవచ్చును.దానిలో తప్పేమీ లేదు. అది మంచిదే. పిచ్చుకలనువాటి అంతట వాటిని పెట్టుకోనీయవచ్చును. లేదా మీరడిగినట్టుగా వాటి గూడుకు తగిన ఏర్పాటు చేయవచ్చును.

222. వేపచెట్టు ఇంటి ముందు ఉండవచ్చునా? ఉండకూడదా?

ఇంటి సింహద్వారానికి ఎదురుగాకాని, ఇతరద్వారాలకు కాని ఎదుకరుగాఏ చెట్టూ ఉండకూడదు. అలా ఉండడం దోషం. ద్వారాలకు ఎదురుగా కాకుండా ఇంటి ఆవరణలో (ఉండవలసిన ప్రదేశంలోనూ దిశలోనూ) వేపచెట్టు ఉండవచ్చును. వాస్తుశాస్త్రరీత్యా- ఇంటి ఆవరణలో ఉండవలసిన చెట్లేవి, ఉండకూడని చెట్లేవి - అన్న విషయాన్ని మహర్షులు చెప్పి ఉన్నారు.

223. దేవాలయాలకు చెందిన ఇళ్లలో అద్దెకున్న వాళ్లకు కూడా వాస్తుదోషాలు వర్తిస్తాయా?

వర్తిస్తాయి. దేవాలయాలకు చెందిన ఇళ్లకు కూడా వాస్తుదోషాలు వర్తిస్తాయి. వాటిలో నివసించే వాళ్లమీద ఆయాదోషాల ప్రభావం ఉంటుంది. దేవాలయాలకు చెందిన ఇళ్లకే కాదు. దేవాలయాలకు, దేవతా విగ్రహాలకూ కూడా వాటిని నిర్మించవలసిన విధానాలు, కొలతలతో సహా మహర్షులు నిర్వచించి ఉన్నారు.

224. అదృష్టసంఖ్యలు, లక్కీనంబర్లను ఎలా తెలుసుకోవాలి? సూర్యనక్షత్రాలేవో తెలుపగలరు.

అదృష్ట సంఖ్యలు, లక్కీనంబర్లను తెలుసుకోవడానికి వ్యక్తి యొక్క జాతకమే ఆధారం. అంటే - ఆయావ్యక్తుల జాతకాలను బట్టే వాళ్ళకు లక్కీ నంబర్లను నిర్ణయించాలి.

కృత్తిక, ఉత్తర ఫల్గుని, ఉత్తరాషాఢ - ఇవి, సూర్యనక్షత్రాలు. ప్రతి నక్షత్రానికీ ఆ నక్షత్రాలకు అధిపతులైన గ్రహాలను మహర్షులు నిర్ణయించిన దాన్నిబట్టి - ఈ మూడూ సూర్య నక్షత్రాలు.

225. రాసులన్నిటికీ ఏయే గ్రహాలు అధిపతులో తెలపండి.

సింహారాశికి అధిపతి సూర్యుడు. కర్కాటక రాశికి అధిపతి చంద్రుడు. మేష వృశ్చిక రాసులకు అధిపతి కుజుడు. కన్యా, మిధున రాసులకు అధిపతి కుజుడు. కన్యా మిధున రాసులకు అధిపతి బుధుడు.

ధనుర్మీన రాసులకు అధిపతి గురుడు. తులా, వృషభ రాసులకు అధిపతి శుక్రుడు. మకర కుంభ రాసులకు అధిపతి శని. మతాంతరంలో వృశ్చికానికి కుజ కేతువులు, కుంభానికి శనిరాహువులూ అధిపతులు. మళ్లీదీనిలో ఒకసూక్ష్మ విభజన వుంది. అదేమిటంటే-

రవికి సింహరాశిలో ప్రారంభంలోని 20 భాగాలు మూల త్రికోణం. చివరి 10 భాగాలు స్వక్షేత్రం. చంద్రునికి వృషభరాశిలో మొదటి3 భాగాలు ఉచ్ఛ. మిగ్గిలిన 27 భాగాలు మూలత్రికోణం. కుజునికి మేషంలో మొదటి 12 భాగాలు స్వక్షేత్రం. మిగిలిన 18 భాగాలు మూల త్రికోణం. బుధునికి కన్యలో మొదటి 15 భాగాలు ఉచ్ఛ. ఆ వెనుక 5 భాగాలూ మూల త్రికోణం. ఆఖరి 10 భాగాలు స్వక్షేత్రం. గురునికి ధనుస్సులో ప్రారంభ భాగాలు 10 మూల త్రికోణం తర్వాతి 20 భాగాలూ స్వక్షేత్రం. శుక్రునికి తులలో ప్రారంభ భాగాలు 3 మూల త్రికోణం.తరువాతి 27 భాగాలు స్వక్షేత్రం. శనికి కుంభంలో మొదటి 20 భాగాలు మూలా త్రికోణం. తర్వాతి10 భాగాలు స్వక్షేత్రం.

226. గ్రహాలకు శత్రు మిత్రాది రాసులు, సమవిషమరాసులూ చెబుతారా ?

రవికి కర్కాటకం మీనం- మిత్ర క్షేత్రాలు. వృషభ తులా కుంభరాసులు శత్రు క్షేత్రాలు. మిధునం కన్య సమక్షేత్రాలు. వృశ్చికం, ధనుస్సు, మకరం విషమ రాసులు. చంద్రునికి మిధున, కన్యా, సింహరాసులు మిత్ర రాసులు. మిగిలినవన్నీ సమరాసులు. కుజునికి కర్కాటకం, సింహం, మీనం, ధనుస్సు మిత్రరాసులు. వృషభం, మిధునం, కన్య తుల మకరం, కుంభం - శత్రు రాసులు. విషమ, సమరాసులు లేవు. బుధునికి తులా వృషభ సింహాలు మిత్రరాసులు. కర్కాటకం శత్రు విషమరాశి. మిగిలినవన్నీ సమరాసులు. గురునికి మేష,కర్కాటక, సింహ, వృశ్చికాలు మిత్రరాసులు, వృషభ, మిధునాలు శత్రుక్షేత్రాలు. కుంభం సమ క్షేత్రం. విషమ క్షేత్రాలు లేవు. శుక్రునికి మిధున, మకర, కుంభాలు మిత్ర క్షేత్రాలు. మీ, కర్కాటక,

సింహాలు శుక్రునికి శత్రు క్షేత్రమైన మీనమే ఉచ్ఛ క్షేత్రం.సమ విషమరాసులు లేవు. శనికి తులా, వృషభ,మిధున,కన్యలు మిత్ర క్షేత్రాలు. మేష కర్కాటక,సింహ,వృశ్చికాలు శత్రు క్షేత్రాలు. ధనుర్మీనాలు సమక్షేత్రాలు.

227. గ్రహ యుద్ధం, అస్తంగతత్వం – వీటికి అర్థాలు తెలపండి.

సూర్యునితో చేరిన గ్రహాలకు అస్తం గతత్వం కలుగుతుంది. చంద్రునితో చేరిన గ్రహానికి సమాగమ యోగం కలుగుతుంది. అంటే ఆ గ్రహానికి గల శక్తి అభివృద్ధి అవుతుంది. కుజునితో చేరిన గ్రహాలకు గ్రహయుద్ధం ఏర్పడుతుంది. కుజునితో ఆ గ్రహానికి యుద్ధం అన్నమాట. అందులో ఏ గ్రహానికి భుక్తి ఎక్కువ అయితే ఆ గ్రహానికి జయం కలిగినట్లుగా భావించాలి.

228. పంచాంగంలో ఉన్న 12 రాసులనే కోటాను కోట్ల జనానికి అన్వయించడం తప్పుకాదా? ఒకేరాశిగల రైతుకు, సినీనటునికీ జీవన విధానంలో తేడా ఉండదా?

రాసులున్నది రాశి చక్రంలో. వాటినే పంచాంగంలోనికి తీసుకోవడం జరిగింది. రాశి ఒకటే అయినా వ్యక్తుల జాతకాలలోఉండే గ్రహస్థితుల్లో (ప్లానెటరీ పొజిషన్స్‌లో) వ్యత్యాసాలుంటాయి. దాన్ని బట్టి వాళ్ల యోగావయోగాలు మారుతాయి. రాశి వేరు,లగ్నం వేరు.

229. గ్రహాలకు కల వివిధ అవస్థలను గురించి తెలపండి.

గ్రహాలకు వివిధాలైన అవస్థలు చెప్పారు. ఏ గ్రహం అయినా ఉచ్ఛస్థుడై ఉన్నప్పుడు దీప్తావస్థలో ఉన్నట్లు. స్వక్షేత్రంలో ఉన్నగ్రహం స్వస్థావస్థలో ఉందని గ్రహించాలి. అధిమిత్ర స్థానంలో ఉన్న గ్రహానికి ముదితావస్థ. మిత్ర గృహంలో శాంతావస్థ. సమగృహంలో హీనావస్థ. శత్రు గృహంలో దుఃఖావస్థ. పాపులతో చేరినపుడు వికలావస్థ. యుద్ధ పరాజిత గ్రహానికి ఖలావస్థ. సూర్యునితోచేరినప్పుడు కోపావస్థ.

ఈ అవస్థలలో - దీప్తావస్థ, స్వస్థావస్థ,ముదితావస్థ,శాంతావస్థ - మంచివి. ఈ అవస్థలలో ఉన్న గ్రహాలు శుభాన్నివ్వ గలవు. మిగిలిన అవస్థలలో ఒక్కహీనావస్థతప్ప- అన్నీ పాపావస్థల. హీనావస్థ- పూర్తిగా చెడుకాదు. మధ్యస్థంగా ఉండే అవస్థ అని చెప్పుకోవచ్చు. గ్రహాలు ఇవ్వగల శుభాశుభాలను లెక్కకట్టేటప్పుడు గ్రహాల ఈ అవస్థలను పరిగణనలోకి తీసుకోవాలి.

230. నవగ్రహాలకూ ఉచ్చనీచలు, మూలత్రికోణాలు ఏవి?

రవికి - అంటే సూర్యునికి ఉచ్చస్థానం మేషం. నీచ స్థానం తుల. చంద్రునికి ఉచ్చస్థానం వృషభం.నీచ స్థానం వృశ్చికం. కుజునికి ఉచ్చస్థానం మకరం. నీచస్థానం కర్కాటకం. బుధునికి ఉచ్చస్థానంకన్య నీచస్థానం మీనం. శనికి ఉచ్చస్థానం తుల. నీచస్థానం మేషం. రాహువుకు వృషభం,సింహం - ఉచ్చస్థానాలు. వృశ్చిక, కుంభాలు నీచస్థానాలు. మిధున కర్కాటకాలు మూల త్రికోణాలు. కేతువుకు కుంభ, వృశ్చికాలు ఉచ్చస్థానాలు. సింహ, వృషభాలు నీచస్థానాలు ధనుర్మకరాలు మూలత్రికోణాలు. మతాంతరంలో రాహువుకు కర్కాటకం స్వక్షేత్రం, సింహం ఉచ్చ.

ఋషులు కొందరి ప్రకారం రాహుకేతువులు ఛాయా గ్రహాలు కావడం చేత వారికి స్వక్షేత్రాలు లేవు. పరాశర, వరాహమిహిర, కాళిదాసులు - రాహుకేతువుల స్వస్థానాల విషయంలో భిన్నమైన అభిప్రాయాలను ప్రకటించారు.

231. గ్రహాలకు మిత్రత్వం, శత్రుత్వం వగైరాలుంటాయా?

రవికి : చంద్ర, కుజ, గురులు, మిత్రులు,బుధుడు, సముడు. శని శుక్రులు శత్రువులు.

చంద్రునికి : రవి, బుధులు, మిత్రులు. మిగిలినవారంతా సములు. శత్రువులు లేరు. కుజునికి : రవి,గురు,చంద్రులు మిత్రులు. శుక్ర, శనులు సములు.

బుధుడు శత్రువు. బుధునికి రవి, శుక్రులు మిత్రులు. చంద్రుడు శత్రువు. కుజ, గురు, శనులుసములు. గురునికి రవి, కుజ, చంద్రులు మిత్రులు. బుధ శుక్రులు శత్రువులు. శనిసముడు. శుక్రునికిశని. బుధులు మిత్రులు కుజ, గురులు సములు. రవి చంద్రులు శత్రువులు, శనికి బుధ శుక్రులు మిత్రులు. కుజ, రవి, చంద్రులు శత్రువులు, గురుడు సముడు.

ఇంత వరకూ చెప్పినవి గ్రహాల మధ్యగల నైసర్గిక శత్రుమిత్ర సంబంధాలు. అదికాక - గ్రహాలు జాతకంలో ఉండే స్థితినిబట్టి ఏర్పడే సంబంధాలు ఇప్పుడు వివరిస్తాను - వినండి.

ఒక రాశిలో ఉండే గ్రహానికి ఆ రాశికి **2,3,4,10,11,12** - ఈ స్థానాలోల ఉండే గ్రహం - తాత్కాలిక మిత్రుడు. ఒక రాశిలో ఉండే గ్రహానికి - ఆ రాశికి **1,5,7,8,9** - ఈ స్థానాలలో ఉండే గ్రహం - తాత్కాలిక శత్రువు. ఇప్పుడు - పైన ఇంతకుముందు చెప్పిన నైసర్గిత మిత్ర, శత్రు, సమ-సంబంధాలను చూడండి. తర్వాత చెప్పిన తాత్కాలిక సంబంధాలను చూడండి. నైసర్గిక మిత్రగ్రహం - తాత్కాలిక మిత్రుడైతే అది మిత్ర గ్రహం అవుతుంది.

నైసర్గిక శత్రుగ్రహం -తాత్కాలిక శత్రువు కూడా అయితే - అదిశత్రువు అవుతుంది. నైసర్గిక శత్రుగ్రహం తాత్కాలిక మిత్రుడైతే సముడవుతాడు. నైసర్గిక మిత్రగ్రహం తాత్కాలిక శత్రువైనా సముడవుతాడు. నైసర్గిక సముడు తాత్కాలిక సముడైతే శత్రువవుతాడు.

అధిమిత్ర గ్రహాలు - ఉచ్ఛస్థిత గ్రహాలతో సమానమైన ఫలాన్ని, సర్వజనమైత్రిని, ధన లాభాన్నీ ఇస్తాయి. అధిశత్రుగ్రహాల దశలలో పాప ఫలాలు కలుగుతాయి. సమగ్రహ దశలలో సమఫలాలు కలుగుతాయి.

232. గ్రహ ప్రభావాలు ఒక్క మానవ జాతికేనా, ఇతర ప్రాణులకు కూడా ఉంటాయా? వాటి ఫలితాలను మిగిలా ప్రాణులు ఏ విధంగా అనుభవిస్తాయి?

మానవ జాతి మీదనే కాక - సర్వప్రాణుల మీద గ్రహాల ప్రభావం ఉంటుంది. వాటి జీవితాలు కూడా అన్నిటివీ ఒకేలా జరగవన్నది మనకు తెలిసిందే కదా? వాటి జీవిత గమనంలో కలిగే సుఖదుఃఖాల రూపంలో ఆయా గ్రహ గమనాల ఫలితాలను ఆయా జీవులు పొందుతాయి.

233. తారాబలం,చంద్రబలం అంటే ఏమిటి? హోరను గురించి వివరించండి.

వ్యక్తి తన జన్మ నక్షత్రాన్ని తెలుసుకోవాలి. తన జన్మ నక్షత్రం నుంచి నిత్య నక్షత్రం (అంటే కోరిన రోజున ఉన్న నక్షత్రం) వరకు లెక్కపెట్టి, ఆ వచ్చిన సంఖ్యను 9 చేత భాగించాలి. వచ్చిన శేషం ఎంత వచ్చిందో చూడాలి. శేషం 1 అయితే జన్మతార. 2 శేషమైతే సంపత్తార. 3 శేషమైతే విపత్తార. 4శేషమైతే క్షేమతార. 5 శేషం మిగిలితే ప్రత్యక్తార, 6 శేషంగా మిగిలితే సాధనతార, 7 శేషమైతే నైధనతార. 8 శేషమైతే మిత్రతార. 9 శేషమైతే పరమ మిత్రతార. ఈ విధంగా అనాటి తారాబలాన్ని తెలుసుకోవాలి.

ఈ తారాబలం యొక్క ఫలితాలు : జన్మతారకు ఫలితం దేహ నాశనం. సంపత్తార ఫలితం సంపద. విపత్తారకు ఫలితం దారిద్ర్యం. క్షేమతారక ఫలితం క్షేమం. ప్రత్యక్తారకు ఫలితంకార్యనాశనం. సాధన తారకు ఫలితం కార్యసాధనం. నైధనతారకు ఫలితం మరణం. మిత్ర తారకు ఫలితం మైత్రి. పరమ మిత్రతారకు ఫలితం పరమ మైత్రి. వీటిలో 2,4,6,8 తారలు మంచివి. 9 మధ్యమం. 1,3, 5, 7 తారలు చెడ్డవి. జన్మ నక్షత్రం నుంచి నిత్య నక్షత్రం వరకు లెక్కించినప్పుడు - ఆ వచ్చిన సంఖ్య 9 కంటే చిన్నదైతే దానిని భాగించకుండా ఉన్నది ఉన్నట్లే తీసుకోవాలి. లెక్కించాలి.

వ్యక్తి తన జాతకంలో చంద్రుడున్నరాశి మొదలు నిత్య నక్షత్రాన్ని బట్టి చంద్రుడున్న రాశి వరకు లెక్కించాలి. జన్మరాశి నుండి నిత్యరాశి 4,8,12 అయితే శుక్లపక్షంలోనే పనికి వస్తుంది. 1,2,3,6,7,10,11 అయితే శుక్ల, కృష్ణపక్షాలు రెండిటిలో పనికి వస్తుంది. ఇదే చంద్రబలం.

పగటి ప్రమాణాన్ని, లేదా రాత్రి ప్రమాణాన్ని 12 చేత భాగించగా వచ్చేదే హోర. పగలు12 హోరలు,రాత్రి 12 హోరలు ఉంటాయి.ప్రతి హోరకూ అధిపతులుంటారు. మంచి చెడులుంటాయి. ప్రతి హోరలోనూ ఆ హోర మంచి చెడులను బట్టి పనులు చేయాలి.

234. గృహ బలం గొప్పదా,గ్రహబలం గొప్పదా, కర్మఫలం గొప్పదా?

ఆయా వ్యక్తుల యొక్క కర్మఫలాన్ని అనుసరించి, దానికి అనుగుణంగానే వారికి ఏర్పడే గ్రహబలమూ,గృహమూ మొదలైనవి ఉంటాయి. మూడూ వేరు వేరు కాదు. పూర్వజన్మలలో వ్యక్తులు ఆర్జించుకున్న పుణ్యపాపాల స్టాక్‌లోనుంచిప్రస్తుత జన్మలో పొందవలసిన సుఖదుఃఖాల సూచికే జాతక చక్రం. వ్యక్తి యొక్క కర్మఫలాన్ని బట్టే దానికి తగిన గ్రహబలంతో వ్యక్తి జన్మించడం జరుగుతుంది. కర్మఫలానికి, గ్రహబలానికీ, గృహబలానికీ కూడా పరిష్కారం – జాతక దోషాలకు పరిహారం చేసుకోవడమే.

235. దగ్గర సంబంధాలు చేసుకునేటట్లయితే అలాంటి వివాహాలకు జాతకాలు చూడనవసరం లేదా?

దగ్గర సంబంధమైనా దూరపు సంబంధమైనా కూడా ఇద్దరి జాతకాలూ పరిశీలించి,అవి కలిసేటట్లయితేనే వివాహం చేయాలి. లేకపోతే అనేక దుష్ఫలితాలు కలుగుతాయి.

236. ఒక్కొక్క రాశిలోనూ గ్రహాలు ఎంతెంత కాలం పాటు సంచరిస్తాయి.?

మేషాది 12 రాసులలో గ్రహాలన్నీ సంచరిస్తూ ఉంటాయి. రవి ఒక్కొక్క రాశిలో ఒక నెలపాటు ఉంటాడు. చంద్రుడు ఒక రాశిలో రెండున్నర రోజులుంటాడు. కుజుడుఒక రాశిలో ఒకటిన్న నెలలుంటాడు. బుధ, శుక్రులు ఒక రాశిలో ఒక నెలలోపుగా ఉంటారు. గురుడు (బృహస్పతి) ఒక రాశిలో ఒక సంవత్సరం ఉంటాడు. శని ఒక రాశిలో రెండున్నర సంవత్సరాలుంటాడు. రాహూకేతువులు ఒక రాశిలో 18 నెలలు అంటే ఒకటిన్నర సంవత్సరాలుంటారు. గ్రహాల సాధారణ గమనానికి విరుద్ధంగా

ఒక్కొక్కప్పుడు గ్రహగమనం వేగంగానూ, మందంగానూ మారుతూ ఉంటుంది. వేగం పెరిగితే దాన్ని అతిచారమనీ, వేగం తగ్గితే (సాధారణ గమన వేగం కంటే) దాన్ని వక్రగతి అనీ అంటారు. ఇది గురు, శుక్ర, బుధ, కుజ, శనులకు ఏర్పడుతుంది. ఒక్కొక్కప్పుడు 'కుజ స్తంభన' కలుగుతూ ఉంటుంది. అంటే ఒక రాశిలో కుజుడు స్తంభించి ఉండిపోవడం. ఇటు వంటి కుజస్తంభన ఒక్కొక్కప్పుడు 8 నెలల పాటు కూడా ఏర్పడవచ్చు.

237. రాశి చక్రంలో రాసులెన్ని ? ఒక్కొక్క రాశులో ఉండే నక్షత్రాలెన్ని? వీటిక సంబంధించిన వివరాలు తెలపండి.

ఒక్కొక్క రాశికీ తొమ్మిది పాదాలు చొప్పున - 27 నక్షత్రాలూ 12 రాశులుగా విభజించబడ్డాయి. ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదాలు. 27 నక్షత్రాలకూ మొత్తం 108 పాదాలు.

అశ్విని 4 పాదాలు, భరిణి 4 పాదాలు, కృత్తిక 1 పాదమూ - ఇవి మేషరాశి. కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి 4 పాదాలూ, మృగశిర 1, 2 పాదాలూ కలిసి - వృషభరాశి. మృగశిర 3, 4 పాదాలు ఆర్ద్ర 4 పాదాలు, పునర్వసు 1,2,3పాదాలు కలిసి మిధునరాశి.

పునర్వసు 4వ పాదమూ, పుష్యమి 4 పాదాలూ, ఆశ్రేష 4 పాదాలూ - కర్కాటక రాశి. మఖ 4 పాదాలూ, పుబ్బ (పూర్వఫల్గుని) 4 పాదాలూ, ఉత్తర (ఉత్తర ఫల్గుని) 1వ పాదమూ - సింహరాశి. ఉత్తర 2,3,4 పాదాలు హస్త 4పాదాలు, చిత్ర (చిత్త) 1,2 పాదాలూ - కన్యారాశి. చిత్ర 3,4 పాదాలూ స్వాతి 4 పాదాలూ, విశాఖ 1,2,3 పాదాలూ - తులారాశి. విశాఖ 4వ పాదమూ, అనురాధ 4 పాదాలూ, జ్యేష్ఠ 4 పాదాలూ, వృశ్చిక రాశి. మూల4 పాదాలూ, పూర్వాషాడ 4 పాదాలూ, ఉత్తరషాఢ 1 పాదమూ ధనూరాశి. ఉత్తరాషాడ 2,3,4 పాదాలూ శ్రవణం4 పాదాలూ, ధనిష్ట 1,2 పాదాలూ మకరరాశి. ధనిష్ఠ 3,4 పాదాలూ, శతభిషం 4 పాదాలూ, పూర్వాభాద్ర 1,2,3 పాదాలూ కుంభరాశి. పూర్వాభాద్ర 4వ పాదమూ, ఉత్తరా భాద్ర 4 పాదాలూ, రేవతి 4 పాదాలూ - మీనరాశి.

మొత్తం ఈ రాశి చక్రం 360 డిగ్రీలు. భచక్రం అని కూడా చెప్పబడే 360 డిగ్రీల ఈ రాశి చక్రం – 27 నక్షత్ర సమూహాలతో కూడుకొని ఉంది. గ్రహాలు ఈ భచక్రం వెంబడి సంచరిస్తాయి. 12 రాసులు, 27 నక్షత్రాలు- ఈ రాశి చక్రం (భచక్రం) లోనివే. 30 డిగ్రీలు ఒక్కొక్కరాశి.

238. శనిదశలో శనిదోషం – తైలాభిషేకం తిలదానం చేయిస్తే పోతుందా? ఎలా పోతుందో శాస్త్ర ప్రమాణం ఉందా?

ఈ విషయాలకు స్పష్టమైన శాస్త్ర ప్రమాణాలున్నాయి. నవగ్రహాలకు – ఆయా గ్రహాలకారకత్వం గల ధాన్యవిశేషాలు, రత్న విశేషాలు శాస్త్రంలో చెప్పారు. ఏ గ్రహానుబంధమైన దోషం ఏర్పడినప్పుడు ఆ గ్రహ సంబంధమైన ధాన్యాది వస్తువులను దానమివ్వడం ద్వారా దోషనివారణ అవుతుందని శాస్త్ర ప్రమాణం. తిలలకు తైలాలకూ కారకత్వం శనైశ్చరునిది కావడం వలన – తైలాభిషేకమూ, తిలదానమూ శని ప్రీతికై మహర్షులు చెప్పి ఉన్నారు.

''తిలైర్య వైర్మాష గుడాన్నదానైర్లోహేన నీలాంబర దానతోవా!
ప్రీణాతి మంత్రైర్నిజ వాసరేచ తస్మై నమః శ్రీరవినందనాయ!''

– అని ప్రమాణం. నవగ్రహాలకూ ఇవ్వదగిన దానాలు:-

సూర్యునికి – గోధుమలు, చంద్రునికి – బియ్యం, కుజునికి – కందులు, బుధునికి పెసలు, గురునికి (బృహస్పతికి) – సెనగలు, శుక్రునికి – బొబ్బర్లు, శనికి – తిలలు, రాహూవుకు – మినుములు, కేతువుకు – ఉలవలు. ఈ విధంగా దానాదులు ఇవ్వదగిన విధానాలు శాస్త్ర రీత్యా చెప్పి ఉన్నారు.

రామాయణ ప్రశ్నల విభాగం

239. బమ్మెర పోతనకు ప్రత్యక్షమైన శ్రీరాముడు, రామాయణాన్ని కాకుండా, భాగవతాన్ని అనువదించమని అదేశించడమేమిటి ?

శ్రీమదాంధ్ర మహాభాగవత ప్రారంభంలోనే పోతన్నగారు - తన నెలవు - స్వయంభూ లింగేశ్వరుని నివాసమైన ఏకశిలానగరమనీ, తన తండ్రియైన కేసనమంత్రి 'శైవాచార సంపన్నుడనీ, తన తల్లియైన లక్కమాంబ 'సదాశివ పాదయు గార్చనాసక్తురాలనీ, తన అన్నగారైన తిప్పన్న గారు 'ఈశ్వరసేవాపరాయణు' డనీ, వివరించి ఉన్నారు. అంతేగాక, తాను సైతం 'పరమేశ్వర కరుణా కలిత కవితా విచిత్రుడ' నని కూడా వాక్రుచ్చి యున్నారు. అట్టి పరమ మహేశ్వర గృహంలో పుట్టువొందిన పోతన్న గారు శ్రీరామభక్తులు కావడమే ఒక విచిత్రం.

అంతేగాక, శ్రీరాముడు పోతనను భాగవత రచనకాదేశించిన సన్నివేశం మరింత వింత. శ్రీమన్నారాయణ కథాప్రపంచ విరచనా కుతూహలుడైన తాను-

'మహనీయ మంజుల పులిన తల మండపంబున మహేశ్వర ధ్యాన తత్పరుడై యుండగా మెరుగు చెంగట నున్న మేఘంబు కైవడి. ఉవిద చెంగట నుండ నొప్పుడువాడు'

ఆ సీతా సహితుడైన శ్రీరామభద్రుడు పోతన్నగారికి ప్రత్యక్షమైనాడట. పోతన్న గారు వ్రాయదలచుకొన్నది శ్రీమన్నారాయణ కథలను! ఆయన ధ్యానించినది మహేశ్వరుని! ఆయనకు దర్శనమిచ్చినది శ్రీ రామచంద్రుడు! అట్టి సీతారాముడు 'మన్నామాంకితంబుగా భాగవతంబు తెనుంగు సేయుమని' పోతన్న గారికి ఆనతిచ్చినాడు ఆ రాముడు. తనకు కృతినీయ మన్న భాగవత గ్రంథాన్ని షష్ఠ్యంతాలలో పోతన్నగారు -

'హారికి నందగోకుల విహారికి.. ఘనకుటీపయోఘ్నుతాహారికి..' 'గోపాలకృష్ణునికి' సమర్పితంబుగా శ్రీ మహాభాగవత పురాణంబును నేనాంధ్రంబున రచియింపంబూని' నట్లుగా తామే చెప్పుకొని యున్నారు.

ఎతత్ సారాంశమేనగా - పోతన్న గారు శ్రీమన్నారాయణునికి మహేశ్వరునికి, శ్రీరామునికి, శ్రీకృష్ణునికి ఈ మూర్తులెవ్వరికీ అభేదమనే పరమ అద్వైత సిద్ధాంతాన్ని స్థాపించదలచుకొన్నారు.

'శివాయ విష్ణురూపాయ' అనే ఆర్ష దృష్టి పోతన్న గారిది. 'విష్ణురూపాయ నమశ్శివాయ' యను వైదిక ధ్యాయితను భక్తజన హృదయాలలో పాందుపరచదలచుకొన్న భక్త కవి అతడు.

'చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడవడేని..'

అని అనడంలో కూడా ఆ శివకేశవాభేద భావమే పోతన్నగారు ధ్వనింపజేశారు. అది సహృదయ హృదయైక వేద్యం.

శివకేశవులకు అభేదమనే తన అభిప్రాయాన్ని ప్రత్యక్షంగా చెప్పకుండా, పాఠక జనులకు ధ్వనింపజేశారు పోతన్నగారు. పోతనగారికి పూర్వీకులైన నన్నయ తిక్కనాదులచే భాగవతం ఆంధ్రీకరింపబడక యుండి, పోతనగారి చేతబడడం ఆంధ్రుల పూర్వ సుకృత విశేషం.

240. శ్రీరాముడు దేవుడా, మానవుడా ?

'వేదవేద్యే పరే పుంసి జాతే దశరథా త్మజా !
వేదః ప్రాచేత సాదాసీత్సాక్షాత్ రామాయణాత్మనా!!

వేదవేద్యుడైన పరమ పురుషుడు దశరథాత్మజుడుగా అవతరించినాడు. వేదమే సాక్షాత్తుగా రామాయణంగా ఆవిర్భవించింది - అని భావం.

'సహి దేవై రుదీర్ణస్య రావణస్య వధార్థిభిః
అర్థితోమానుషేలోకే జజ్ఞే విష్ణుస్సనాతకః !!

రావణ వధార్థమై దేవతలుప్రార్థించగాభూమిపై అవతరించిన సనాతనుడైన విష్ణువే శ్రీరాముడు - అని అయోధ్యకాండలో చెప్పబడింది. ఈ విధంగా రాముడు సాక్షాత్ విష్ణ్వవతారమే అని నిస్సందేహంగా చెప్పబడినప్పటికీ తాను దైవమనే స్పృహ లేనివాడు రాముడు. ఆయన కావ్యమంతటిలోనూ మానవుడుగానే దర్శనమిస్తాడు. 'ఆత్మానంమానుషం మన్యే రామం దశరథాత్మజం' అని తనంత తానే చెప్పుకున్నాడు. రావణ సంహారానంతరం దేవతలంతా దిగివచ్చి, ఆయనను పరమ పురుషుడని ప్రశంసించగా ఆయన ఇచ్చిన సమాధానమది. దైవంగా కంటే, మానవుడుగా ప్రజాహృదయాలకు దగ్గరైనవాడు రాముడు.

అతడు ఉత్తమ పుత్రుడుగా తండ్రి మాట నిలబెట్టినవాడు. మంచి అన్నగా తమ్ములను ప్రేమించినవాడు. హృదయాన్ని ఇచ్చి పుచ్చుకొనే ప్రియభర్త. భార్యావిరహంలో ఆవేదనతో అల్లాడిపోయే విరహి. ఆదర్శ మిత్రుడు. ఆయా కఠిన సన్నివేశాలలో కృంగి పోతాడు. తిరిగి ధైర్యం వహించి పరిస్థితుల నెదుర్కొంటాడు. విజయాన్ని సాధిస్తాడు. 'పుటపాక ప్రతీకాశో రామస్య కరుణోరసః' అని భవభూతి మహాకవి రాముణ్ణి అభివర్ణిస్తాడు. దుఃఖాన్ని దిగమ్రింగుకొని తమ బాధను తామే అనుభవిస్తూ,పుటపాకమువలె, లోకానికి సుఖాన్నే పంచడం రాముని వంటి మహాత్ములకే సాధ్యం. సర్వధా మానవ లక్షణాలనే కలిగి వుంటూ, మానవ సహజమైన దౌర్బల్యాలను ప్రదర్శిస్తూ, తిరిగి వాటిని అతిక్రమిస్తూ, విజయం సాధించనవాడు రాముడు. ఉత్తమ మానవ లక్షణాలను జీవితం ద్వారా మానవులకు ఆచరించి చూపినాడు రాముడు. మానవజాతి కంతటికి ఆదర్శప్రాయుడైన మానవోత్తముడు రాముడు.

241. ఎవరైనా జరగరాని సంఘటనలు, ఆపదలు వగైరా చెబితే 'రామ రామ' అని చెవులు మూసుకుంటారు. ఆశ్చర్యకరమైన సంఘటనలు చెప్పినా, నిజం చెప్పమని అడిగినా – 'అయ్యో రామ' అని నోటిమీద వేలు వేసుకుంటారు. ఆకలి వేసినప్పుడు 'అన్నమో రామచంద్రా' అని కడుపు మీద చెయ్యి వేసుకుంటారు. దీనికి కారణమేమిటి? వివరంగా తెలుపగలరు.

శ్రీరామ కథ జనజీవనంలో అంతగా కలిసిపోయింది. అందుకే ప్రతి సందర్భంలోను మనవారంతా రాముడినే తలుచుకుంటారు. భగవంతుని అన్ని అవతారాలలోనూ శ్రీరామావతారానికున్న ప్రాచుర్యం అటువంటిది. అంతేకాక–

'యత్ర యత్ర రఘునాథ కీర్తనమ్
తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్
బాష్పవారి పరిపూర్ణ లోచనమ్
మారుతిం నమత రాక్షసాంతకమ్'

అని కదా ఆర్యోక్తి! శ్రీరామ కీర్తనం ఎక్కడైతే జరుగుతుందో – అట్టి ప్రదేశాలలో చేతులు తలమీద పెట్టుకొని నమస్కారం చేస్తూ, ఆనందాశ్రుపూరిత లోచనుడై అంజనేయుడు వుంటాడని చెప్పబడింది.

అందుకే – శ్రీరామ స్మరణం సదా చేస్తూ వుంటే – భూత ప్రేత బాధలు తమకు కలుకుండా – రాక్షసాంతకుడైన అంజనేయ స్వామి సర్వదా తమ సమీపంలో వుండి తమను రక్షించగలడనే విశ్వాసమే ప్రాతిపదికగా ఈ అలవాటు ఏర్పడింది. ఆంజనేయస్వామి భూతప్రేత నివారకుడు కదా!

242. రావణుడు సీతను అపహరించుకుపోతున్నప్పుడు సీతాదేవి తన నగలను మూటగట్టి దారిలో వానరుల దగ్గర పడవేసిందని రామాయణంలో ఉందని చెప్తున్నారు. చూపిస్తున్నారు. సీతారామ లక్ష్మణులు మునివేషాలతో, నారబట్టలతోనే కదా ఆడవికి వెళ్లారు? అటువంటప్పుడు అరణ్యంలో ఉన్న సీతాదేవికి సడెన్‌గా నగలు ఎలా వచ్చాయి?

వనవాస నియమం రామునికే కాని, సీతకూ లక్ష్మణునికీ లేదు. కైక కోరినదీ, దశరథుడు ఆమెకిచ్చినదీ అయిన వరం - రామవనవాసం మాత్రమే. ఆ నియమం సీతాలక్ష్మణుకు వర్తించదు. కానీ సీతాలక్ష్మణులు అన్ని విధాలా రాముని అనుసరించి ప్రవర్తించడంమనేది - వారి ఇష్టానుసారం మాత్రమే. మరొక ముఖ్య విషయం - స్త్రీలు ఒంటినిండా ఆభరణాలు ధరించడ అనేది భారతీయ సంప్రదాయం. అంతేకాక-సీతాదేవి రాముని వెంట అడవికి వెళ్లేటప్పుడు ఒక మహరాజ పుత్రికగా మరొక మహారాజు కోడలిగా, యువరాజు భార్యగా ధరించే విశేషాభరణాలను అయోధ్యలో వదిలిపెట్టింది. ఆ రోజుల్లో సామాన్య గృహిణులు కూడా ఎన్నో నగలను ధరించేవారు. ఒక సాధారణ గృహిణికి ఉండదగిన నగలతో సీతాదేవి అరణ్యానికి వెళ్లింది. వాటినే మూటగట్టి ఆనవాలుగా పడవేసింది. రావణుడు సీతాదేవిని ఎత్తుకుని పోతూ ఉండగా దారిలో ఒక పర్వతంమీద ఉన్న ఐదుగురు వానరులు సీత కంటపడ్డారు. వెంటనే తన చీర కొంగులోతన నగలన్నీ మూటకట్టి - ఆ వానరుల మధ్యపడేలా విసిరింది సీత. రాముడు తనను వెతుకుతూ అక్కడకు వస్తే తనను ఏ దిక్కుగా రావణుడు తీసుకుపోయినదీ తెలియడానికి ఉపయోగపడతాయని, ఆ వానరులు తనను గురించి రామునికి చెబుతారనీ సీతాదేవి ఉద్దేశం.

రామలక్ష్మణులు కిష్కింధకు వచ్చి హనుమత్సుగ్రీవాదులతో స్నేహం చేశాక ఉభయులూ ఒకరి చరిత్రలు మరొకరు పరస్పరం చెప్పుకున్నాక - ఆనాటి ఆ సంఘటనను గుర్తుచేసుకుని, ఆ నగలమూటను, తెచ్చి రాముని ముందుంచాడు సుగ్రీవుడు. సీతాదేవి స్మరణతో కళ్ల నీళ్లు నిండిన రాముడు - వాటిని గుర్తుపట్టమని లక్ష్మణునితో చెప్పినప్పుడు లక్ష్మణుడు.

''నాహం జానామికేయూరే నాహం జానామి కుండలే!
నూపురేత్వభిజానామి నిత్యం పాదాభివందనాత్!!''

అని అంటాడు. అంటే, ''అన్నా! వదినగారిభుజకీర్తులూ, చెవులకుండే ఆభరణాలూ నేను ఎరుగను. కానీ ఆమెకు నిత్యమూ పాదాభివందనం

వేస్తుండడంవల్ల కాలి అందెలను గుర్తించగలను'' అని అర్థం. లక్ష్మణుడు చెప్పిన దాన్ని బట్టి – సీతాదేవి వద్ద దండ వంకీలూ, చెవులకు పెట్టుకునే కుండలాలూ మొదలైనవి ఉన్నట్టే కదా! అసలీ ప్రస్తావన వాల్మీకి రామాయణంలో అయోధ్యా కాండలోనే వచ్చింది. వశిష్ఠ దశరధాదులెందరో ఆ విషయాన్ని రూఢీ చేశారు.

243. రావణాసురుని కి మండోదరి కాకుండా ఇంకా ఎవరైనా భార్యలున్నరా? రావణుని కుమారుల పేర్లు చెప్పగలరు.

మండోదరి రావణాసురిని పెద్ద భార్య. ఆ కారణంగా పట్టమహిషి. ఆమే కాకుండా రావణాసురునికి ధాన్యమాలిని మొదలైన ఎందరో భార్యలున్నారు. మహాతపస్వి, అజేయ పరాక్రముడు, అమిత బలసంపన్నుడూ అయిన రావణునికి ఎందరో తమ కూతుళ్లను ఇచ్చి పెళ్లి చేశారు. అనేక మంది కన్యలు తమంత తాముగా రావణుని వలచి వరించి అతడి భార్యలుగా వచ్చారు. కొందరు సౌందర్యవతులను రావణుడు తీసుకువచ్చాక – త్రిలోక విజేత అయిన రావణుని గొప్పతనం, ఐశ్వర్యం, వైభవమూ చూసి ఆ కన్యలు ఇష్టపడి రావణునికి భార్యలు కావడానికి అంగీకరించారు. నాగ, యక్ష, గంధర్వ, రాక్షస, మానవాది అనేక జాతుల స్త్రీలు లెక్కలేనంతమంది ఆ విధంగా రావణుని భార్యలయ్యారు.

ఇక రావణుని సంతానాన్ని గురించి. మేఘనాధుడు, దేవాంతకుడు, నరాంతకుడు, మహాపార్శ్వుడు, అక్షకుమారుడు – వీళ్లు మండోదరి యందు రావణాసురునికి కలిగిన సంతానం. అతికాయుడు – ధాన్యమాలిని యందు రావణాసురునికి కలిగిన సంతానం.

244. శ్రీ మహావిష్ణువు దశావతారాలలో శ్రీరాముడు, పరశురాముడు వేర్వేరు అవతారాలు కదా? మరి రామాయణంలో ఒక సందర్భంలో ఇద్దరూ ఎదురైనట్లు చెబుతారు. ఇది ఎలా సాధ్యం?

శ్రీరామావతారం పూర్ణావతారం. పరశురామావతారం అంశావతారం – తాను ఉద్భవించిన ప్రయోజనం తీరిన వెనుక – ఒక సాధారణ ప్రాణితో సమానమవుతుందని శాస్త్ర ప్రమాణం. అందువల్లనే శ్రీరాముని

ఎదుటపడిన పరశురాముడు భంగపడి వెనుదిరగడం జరిగింది. అంతేగాక పరశురామ శ్రీరామావతారాలు ఉద్భవించిన ఆయా కాలసందర్భాలూ, వాని పరిమితులూ, ప్రయోజనాలూ - విభిన్నమైనవి. అధికార దర్పితులై అహంకరించి మదించిన దురహంకారులైన ప్రభువులను శిక్షించి, భూత భవిష్యద్వర్తమా నాలలోని పాలకులకు గుణపాఠం నేర్పవచ్చినది పరశురామావతారం. లోకానికి ఒక ఆదర్శ మానవుని జీవితాన్ని సోదాహరణంగా చూపడానికి, భావితరాల మానవులకు పథనిర్దేశకమైన మహోన్నత మానవ జీవితాదర్శాలను ఆచరించి చూపడానికి ఏర్పడినది శ్రీరామావతారం. ఆదర్శపాలకునిగా, ప్రజాభిప్రాయాన్ని గౌరవించే ప్రభువుగా పృథివికి సుస్థితి నిచ్చినది రామావతారం. ఆధునికుల పరిభాషలో ఒకటి డిస్ట్రక్టివ్, మరొకటి కన్‌స్ట్రక్టివ్. ప్రపంచానికి రెండూ అవసరమే. పరశురాముడు చేసిన వినాశనంలో నుంచే శ్రీరాముడు ప్రభవించాడు. దుష్టపాలకులను రూపుమాపినవాడు పరశురాముడు. ఆదర్శపరిపాలకుడుగా రూపొందినవాడు శ్రీరాముడు.

పరశురాముడు చిరంజీవులలోని వాడు కావడం వల్ల అతని అవతార ప్రయోజనం నెరవేరిన తర్వాత కూడా అతడు జీవించి ఉన్నాడు. అంశావతారుడైన పరశురాముడు - అతని అవతార ప్రయోజనం నెరవేరిన వెనుక చిరంజీవిగా ఉండి - శ్రీరామునికి ఎదురైనాడు.

అంశావతారం - తాను ఉద్భవించిన ప్రయోజనం తీరిన వెనుక ఒకసాధారణ ప్రాణితో సమానమౌతుందనే శాస్త్ర ప్రమాణాన్ని అనుసరించి పరశురామావతార లక్ష్యం నెరవేరిన వెనుక - అతడు భృగువంశీయుడైన ఒక విప్రుడు. తపస్వి. ప్రభావ సంపన్నుడు. తేజశ్శాలి. ఆ సమయంలో విష్ణుమూర్తి యొక్క మరొక అవతారమైన శ్రీరామావతారం ఏర్పడడం అసంబద్ధం కాదు.

పరశురాముడుగా శ్రీ మహావిష్ణువు దుష్టనిర్మూలనం చేశాడు. దుష్ట వినాశనం తర్వాతజరగవలసినది ప్రపంచాన్ని సువ్యవస్థితం చేయడం. చెడును అంతం చేసిన తర్వాత మంచిని ప్రోదిచేయడం, ఉత్తమ వ్యవస్థలను

నెలకొల్పడం జరగాలి. శ్రీరామావతారంలో అదే జరిగింది. పరశురామావతార లక్ష్యం నెరవేరినాక జరగవలసిన కార్యాలు శ్రీరామావతారంలో నెరవేర్చబడ్డాయి.

పరశురాముని గాథ బ్రహ్మాండపురాణం లోను, బ్రహ్మపురాణం లోను, వ్యాసభారతంలోనూ, వాల్మీకరామాయణంలోనూ -చెప్పబడింది సూర్యసావర్ణిక మన్వంతరంలోని సప్తమహర్షులలోపరశురాముడు ఒకడు.

245. జనకమహారాజుకు శివధనుస్సు ఎక్కడ లభించింది ? వరునికి ఉండవలసిన అర్హతలను త్రోసిపుచ్చి, శివధనుస్సు విరిచిన భుజబలశాలికే సీతాదేవిని ఇస్తానని జనకుడు చాటించడంలో ఔచిత్యమేమిటి ?

శివధనుస్సును విరచినవారికి సీతనిస్తానని, అసలు ఆ ధనువును విరచి తీరాలని జనకుడు అనలేదు. శివధనువును ఎక్కుపెట్టిన పరాక్రమవంతునికి తన కన్యనిస్తానని ఆయన ప్రతిజ్ఞ చేశాడు.

అట్టి వీరత్వ పరీక్ష నిర్ణయించడానికి కారణాలు :-

1. శివధనువుయొక్క మహత్యం.2. సీతాదేవి అయోనిజకావడం. దక్షయజ్ఞ సమయంలో శివుడు ఆగ్రహంతో ఎత్తిన విల్లు అది. త్రిలోక ప్రళయంకరుడైన ఆ మహాదేవుని దేవతలుస్తోత్రం చేయగా ఆయన ప్రసన్నుడై, ఆ ధనువుని దేవతలకు ఇచ్చివేశారు. దేవతలు వాటిని దేవరాత మహారాజుకు న్యాసంగా ఇచ్చారు. ఈ దేవరాతుడు జనకమహారాజు పూర్వీకుడు. నిమిచక్రవర్తి తర్వాత ఆరవ తరంవాడు. ఆనాటి నుండీ ఆ విల్లు వారి యింటనే ఉంది. ఈ గాథను వాల్మీకంలో బాలకాండ 66వ సర్గయందు రామలక్ష్మణుల సమక్షంలో జనక మహారాజు స్వయంగా విశ్వామిత్రునికి చెప్పాడు. సాధారణంగా కారణ జన్ములైన మహనీయ వ్యక్తులు అయోనిజులుగా జన్మిస్తూ ఉంటారు. అగస్త్యు, వశిష్ఠుడు, ద్రౌపది వంటి అయోనిజులెందరో లోక కళ్యాణకారకులై విలసిల్లారు. సీతాదేవి జన్మక్రమం అట్టిదే. అట్టి అయోనిజయైన సీతాదేవికి తగిన వరుని నిర్ణయించే భారం తాను వహించలేనని

భావించాడు జనకరాజర్షి. అంతేగాక, లోకసాధారణ ప్రమాణాల ఆధారంగా ఆమెకు వరుని ఎన్నికచేయడం సబబు కాదనుకొన్నాడు.

కారణజన్మురాలైన సీతకు తగిన వరుడు కూడా ఈ పృధ్విపై జన్మించే ఉంటాడని ఆ రాజయోగి విశ్వసించాడు. పవిత్రమైన యాగభూమిని దున్నుతున్నప్పుడు లభించిన సీత – దైవాంశసంభూతురాలు. పృధ్వీశక్తి. శ్రీభూదేవి అంశ కలిగినది. మహిమాన్వితమైనదీ, సాక్షాత్తూ పరమేశ్వరుడు తన చేతధరించినదీ అయిన శివ ధనువు – ఆ కారణ జన్మురాలికి వరాన్వేషణలో ఉపకరించగలదని నమ్మిన జనకుని విశ్వాసం అక్షర సత్యమని రుజువైంది.

246. అహల్య ఎవరు? రామునికి అహల్యకు ఏమిటి సంబంధం ? రామాయణంలో అహల్య పాత్ర ఏమిటి?

అహల్య గౌతమమహర్షి భార్య. గౌతమ మహర్షి వల్ల శపించబడి – 'వాయుభక్షా నిరాహారా తప్యంతీ భస్మశాయి నీ అదృశ్యా సర్వభూతానాం...' ఆ స్థితిలో పడివున్న అహల్యకు రామ సందర్శనంతో శాపవిమోచనం అయింది.

విశ్వామిత్ర మహర్షి అహల్యా గౌతముల వృత్తాంతాన్ని రామ లక్ష్మణులకు వివరించి చెప్పాడు. అహల్య శాపగ్రస్తురాలై తపస్సు చేస్తూ ఉన్న ఆశ్రమపదానికి రాముని తీసుకొని వెళ్ళి అహల్యకు శ్రీరామ దర్శనం కలిగించి అహల్యకు శాపవిమోచనం కలిగింపజేశాడు. అప్పుడు అహల్య, గౌతమమహర్షి వాక్కులను గుర్తుకు తెచ్చుకుని రామలక్ష్మణులకు నమస్కరించి వారికి అర్ఘ్యపాద్యాలిచ్చింది. ''ఓ అహల్యా! చాలా కాలం తర్వాత దశరథ పుత్రుడైన రాముడు ఈ ప్రదేశానికి వస్తాడు. ఆనాటికి ఈ ప్రదేశం కారడవిగా ఉంటుంది. రాముడు వచ్చి నిన్ను చూడగలడు. ఆయనకు నీవు అతిథి పూజ చేయవలసి ఉంది. అంతటితో నీవు భయమోహవివర్జితవు కాగలవు. రామదర్శనంతో నీకు యథారూపం వస్తుంది. ఆనాటి నుండి నీవు

నాతో సుఖంగా ఉండగలవు''అని ఆనాడు గౌతమమహర్షి అహల్యకు చెప్పి వెళ్ళాడు.

గౌతమమహర్షి వచనాన్ని శిరసా వహించి కఠినతర నియమాలతో తపస్సు చేసింది అహల్య. అమితసౌందర్యవతి అయిన ఆమె రూపం - గౌతమమహర్షి శాపంతో ఛాయామాత్రంగా మారింది. అహల్య రూపం, విగ్రహం - పొగమంచులో మేఘాల చాటుకు వెళ్ళిన చంద్రుని వెన్నెల వలె, ధూమచ్ఛన్నం అయిన అగ్నిజ్వాల వలె ఛాయామాత్రంగా మిగిలిందని ఈ సందర్భంలో వాల్మీకి మహర్షి ఆమెను వర్ణించాడు.

రామదర్శనంతో అహల్యకు యథారూపం కలిగింది. ఆమె రాముని స్తుతించింది. దివ్యదృష్టితో జరిగిన విషయాన్ని గమనించిన గౌతమ మహర్షి ఆ సమయంలో ఆ ఆశ్రమానికి వచ్చాడు. తపోమూర్తి అయిన అహల్యను చూశాడు. ఆ దంపతులిద్దరూ రామ లక్ష్మణులకు, విశ్వామిత్రమహర్షికి, ఆయనతో వచ్చిన మిగిలిన మహర్షులకూ అతిథి సత్కారం చేశారు.

అహల్యాగౌతముల పెద్దకుమారుడు అయిన శతానందుడు - జనక మహారాజుకు పురోహితుడు. బహుకాలంగా తపస్సు చేస్తూ వున్న తన తల్లికి రామునివల్ల శాప విమోచనం అయిందనీ, తన తల్లిదండ్రులు తిరిగి కలుసుకొన్నారనీ, మిథిలలో విశ్వామిత్రుని వల్ల శతానందుడు విని ఆనందించాడు. తనతల్లికి శాపవిమోచనం చేయించినందుకు విశ్వామిత్రునికి కృతజ్ఞతలు చెప్పాడు.

247. శ్రీరాముడు లక్ష్మణుడు ఒకరిని విడిచి ఒకరు ఉండరు కదా? అలాగే రాముని విడిచి హనుమంతుడు కూడా ఉండడు కదా? మరి విష్ణుమూర్తి రామావతారాన్ని చాలించిన తర్వాత లక్ష్మణుడు ఎక్కడికి పోయాడు? హనుమంతుడు చిరంజీవి కదా? మరి హనుమంతుడు ఎక్కడికి వెళ్లాడు?

లక్ష్మణుడుగా జన్మించినది ఆదిశేషుడే కనుక ఆయన తిరిగి వైకుంఠానికి వెళ్లాడు. హనుమంతుడు చిరంజీవి కనుక ఆయన గంధమాదన పర్వతంపైన తపస్సు చేసుకుంటూ నేటికీ ఉన్నాడని పురాణాల్లో చెప్పబడింది.

248. శూర్పణఖ ముక్కు, చెవులు కోశాక శ్రీరాముడు బాధపడలేదా? ఒక స్త్రీ పైన ప్రతాపం చూపించడం అన్యాయం కాదా? అసలు అది తప్పు ని తెలిసి కూడా ఎందుకని లక్ష్మణునిచేత శూర్పణఖ ముక్కూ చెవులు కోయించాడు?

శూర్పణఖ రామలక్ష్మణులను చూసి మోహించిందనీ, తనను చేపట్టమని వారిని కోరిందనీ అందరికీ తెలిసిన, లోకప్రసిద్ధమైన విషయమే. అంతమాత్రానికే శూర్పణఖ ముక్కూ చెవులూ కోయుమని రాముడు ఆజ్ఞాపించడమూ, లక్ష్మణుడు ఆ పని చేయడమూ జరగలేదు. తమను కోరి వచ్చిన శూర్పణఖను మంచి మాటలతో పంపివెయ్యడానికే రామలక్ష్మణులిద్దరూ ప్రయత్నించాడు. కానీ శూర్పణఖ వినలేదు. అంతేకాక, రామలక్ష్మణులతో సీతాదేవి ఉండడం వల్లనే వారు తనను చూచి మోహించడం లేదనీ, సీతాదేవి ఉనికి తన మనోరథం నెరవేరడానికి అడ్డుగా ఉందనీశూర్పణఖ భావించింది. అందుకే సీతాదేవిని చంపడానికి శూర్పణఖ ప్రయత్నించింది.

అరణ్య మధ్యంలో తన భార్యను చంపడానికి ప్రయత్నించిన రాక్షసిని సహజంగా ఎవరైనాఏం చేస్తారో ఆలోచించండి. ఆ రాక్షసిని చంపి, తన భార్యను కాపాడుకుంటారు. ఆ చంప వచ్చినది పురుషుడైన రాక్షసుడైతే రాముడు వాడిని వధించి ఉండేవాడు. కానీ స్త్రీ అన్న కారణం చేత శూర్పణఖను చంపకుండా శిక్షగా - ముక్కూ చెవులూ మాత్రం కోసి విడిచి పెట్టమని లక్ష్మణుని ఆజ్ఞాపించాడు. లక్ష్మణుడు అన్నగారి ఆజ్ఞను పాటించాడు. సంహరించవలసినంత నేరం చేసిన శూర్పణఖకు రాముడు విధించిన శిక్ష చాలా తక్కువే.

249. రాముని అనంతరం లవకుశులు ఏమయ్యారు? లవకుశులు రాజ్యపాలన చేశారా? లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు సంతానం ఉందా? ఉంటేవారి పేర్లు ఏమిటి? వారు ఏ రాజ్యాలను పరిపాలించారు? సీతారాముల తర్వాతి చరిత్ర ఏమిటి?

రాముడు తన అవతార పరిసమాప్తికి ముందుగానే కూడా రాజ్యవిభాగం చేశాడు. శ్రీరాముని ఆధ్వర్యంలోనే లవకుశులకూ, లక్ష్మణ భరత, శత్రుఘ్నుల పుత్రులకూ కూడా రాజ్యాలను ఏర్పరచి ఇవ్వడం జరిగింది సీతారాముల సంతానంలో కుశునికి కుశావతి అనే పేరుతో దక్షిణ కోసలాన్నీ, లవునికి శ్రావస్తి అనే పేరుతో ఉత్తర కోసలాన్నీ, ఏలుకొమ్మని ఇచ్చి- ఆ రాజ్యాలకు వాళ్లను పట్టాభిషిక్తులను చేశాడు శ్రీరాముడు.

భరతునికి తక్షుడు, పుష్కలుడు అనేవాళ్లు ఇద్దరు కుమారులున్నారు. రాముడి ఆదేశంపైన సైన్యసహితంగా భరతుడు తనకుమారులతో వెళ్లి జయించిన ప్రదేశాన్ని రెండుగా విభజించి తక్షశిల, పుష్కలావతం – అనే పేర్లు పెట్టాడు భరతుడు. తక్షునికి తక్షశిలా రాజ్యాన్నీ, పుష్కలునకి పుష్కలావత రాజ్యాన్నీ ఇచ్చి వాళ్లను పట్టాభిషక్తులను చేశారు. లక్ష్మణుని కొడుకులు అంగదుడు, చంద్రకేతువు. వాళ్లలో అగదునికి అంగదీయము అనే నగరాన్నీ, చంద్రకేతువుకు చంద్రకాంతముఅనే నగరాన్నీ రాజధానులుగా చేసి రాజ్యాలనిచ్చాడు శ్రీరాముడు

శత్రుఘ్నుని కుమారులు సుబాహువు, శత్రుఘ్నుపి. సుబాహువుకు మధురా రాజ్యాన్నీ, శత్రుఘ్నుపికి విదిశా రాజ్యాన్నీ ఇవ్వడం జరిగింది.

250. సీతాదేవిని రావణుడు అపహరించి లంకకు తీసుకువెళ్లాక, శ్రీరాముడు, లక్ష్మణ సమేతంగా తిరుగుతూ సీతను వెతుకుతుండాగా, ఒక గుహలో 'రామ రామ' అనే స్మరణ విని లోపలకు వెళ్ళగా ఒక సన్యాసిని తపస్సు చేస్తూ శ్రీరాముని ధ్యానిస్తూ ఉంటుంది. ఆమె పేరు, ధ్యానానికి కారణమేమిటి?

మీరెక్కడ విన్నారో కాని మీరు విన్న వృత్తాంతం తప్పు. గుహలో ఉన్న తపస్వినిని చూచినవారు రామ లక్ష్మణులు కాదు, సీతాదేవిని వెదకడానికై సుగ్రీవుడు దక్షిణదిశకు పంపిన ఆంజనేయాది వానరులు. ఆంజనేయుడు, అంగదుడు, జాంబవంతుడు, సుషేణుడు, గజుడు, గవాక్షుడు, శరభుడు, గంధమాదనుడు, మైందుడు, ద్వివదుడు, నలుడు మొదలైన వానరులు సీతాన్వేషణ నిమిత్తంగా దక్షిణదిశకు పంపబడ్డారు. వారు దక్షిణ దిశనంతా గాలిస్తూ వింధ్యపర్వతాల నైరుతి దిగ్భాగానికి చేరుకున్నారు. అమితమైన ఆకలి దప్పికలతో ఆ వానరులు నీళ్లకోసం వెతుకుతూ ఉండగా అక్కడ వారికి ఒక బిలం కనిపించింది. అది రాక్షస శిల్పి అయిన మయుడు నివసించిన బిలం. దానికి ఋక్షబిలం అని పేరు. ఆ బిలంలో నుంచి తడిసిన రెక్కలతో పక్షులు బయటకు రావడాన్ని వానరులు చూశారు. పైగా ఆ బిలద్వారంలో ఉన్న వృక్షాలన్నీ పచ్చగా ఉన్నాయి. అందువల్ల ఆ బిలంలో తప్పక నీళ్ళు లభించగలవని బుద్ధిశాలి అయిన హనుమంతుడు చెప్పిన మీదట ఆ వానరులు అందరూ ప్రవేశించారు. లోపలకు పోయిన కొద్దీ అంధకారంగా ఉన్న ఆబిలంలో, దారితప్పి విడిపోకుండా ఒకరిచేతులు ఒకరుపట్టుకుని ఒక యోజనం దూరం నడిచారు. అప్పుడు వారి ఎదుట వెలుతురు, ఆ వెలుతురులో మనోహరమైన ప్రదేశమూ కనిపించాయి. అక్కడి వృక్షాలన్నీ బంగారు రంగుతో ప్రకాశిస్తున్నాయి. అక్కడి కొలనులలోని చేపలూ, తాబేళ్ళూ కూడా బంగారు రంగుతో తళతళలాడుతున్నాయి. అక్కడ స్వర్ణమయమైన గృహాలూ, ఉత్తమ వాహనాలూ ఉన్నాయి. ఆప్రదేశంలో వృద్ధురాలైన ఒక తపస్వినిని ఆ వానరులు చూశారు. ఆమె వల్కలాలు ధరించి కృష్ణాజినం కప్పుకుని దివ్యతేజంతో ప్రకాశిస్తూ ఉంది. నియమితాహారం వల్ల కృశించి ఉంది.

ఆ ప్రదేశంలో తపస్సు చేస్తూ ఉన్న ఆ స్త్రీని చూచి ''ఓ పూజ్యురాలా! నీవు ఎవరవు? ఈ బిలం ఎవరిది? ఇక్కడ ఉన్నరత్నాలు ఇత్యాదిగా కల ఉత్తమ ద్రవ్యాలు ఎవరివి?'' అని ప్రశ్నించి, తాము ఆ బిలంలో

ప్రవేశించిన కారణాన్నితెలిపాడు. ఆతపస్విని అప్పుడు తనుగురించీ ఆ బిలాన్ని గురించిన వివరాలన్నీ చెప్పింది. ఆ తపస్విని పేరు స్వయంప్రభ. ఆమె మేరుసావర్ణి యొక్క కుమార్తె. ఆ బిలంలో గల కాంచనవనాన్నీ, దివ్య భవనాలనూ రాక్షసశిల్పి అయిన మయుడు నిర్మించాడు. మయశిల్పి తన ప్రియురాలైన హేమ అనే అప్సరసతో కలిసి చాలాకాలంపాటు ఆబిలంలోని కాంచనవన మధ్యంలోని దివ్యభవనంలో సుఖంగా నివసించాడు. బ్రహ్మదేవుని గురించి తీవ్ర తపస్సు చేసి ఆ మయశిల్పి కోరినవన్నీ నిర్మించగల నైపుణ్యాన్ని వరంగా పొందాడు. చాలాకాలం తర్వాత ఆ బిలాన్ని కాపాడమని నృత్యగాన విశారద అయిన హేమ- స్వయంప్రభకు ఇచ్చి వెళ్లింది. అప్పటి నుంచీ స్వయం ప్రభ అక్కడి ఉండి ఆ కాంచనవనాన్నీ దివ్యభవనాన్ని కాపడుతూ ఉంది.

పైవివరాలన్నీ చెప్పి స్వయంప్రభ – వానరులు ఏ పనిమీద అరణ్యాలన్నీ వెతుకుతున్నారనీ, ఎవరికీ ప్రవేశించనలవికాని ఆ బిలాన్ని ఎలా కనుక్కోగలిగారనీ ప్రశ్నించింది. అక్కడ ఉన్న కందమూలాల ఫలాలను తిని, అక్కడి నిర్మలజలాన్ని తాగమని వానరులకు చెప్పింది. స్వయంప్రభ చెప్పిన మీదట వానరులంతా ఆ బిలంలోని కందమూలాలను, ఫలాలనూ తిన్నారు. కావలసినంత జలాన్ని తాగి తృప్తులయ్యారు. వారు అక్కడకు వచ్చిన కారణాన్ని గురించి స్వయంప్రభ వారిని ప్రశ్నించింది. రామవనవాసమూ, సీతాపహరణమూ మొదలైన వృత్తాంతాన్ని అంతనూ చెప్పి సుగ్రీవుని ఆజ్ఞపైన రాముని భార్య అయిన సీతాదేవిని వెదకడానికి, తాము ఆ ప్రదేశానికి వచ్చామని హనుమంతుడు చెప్పాడు. ఆకలిదప్పులతో తల్లడిల్లుతూ తాము ఆ బిలంలోనికి ప్రవేశించిన వైనాన్ని వివరించాడు అంజనేయుడు. తమ ఆకలిదప్పులను తీర్చిన స్వయంప్రభకు కృతజ్ఞతలు తెలిపి, తమను ఆబిలం నుంచి బయటకు పంపించమని కోరాడు. ఆ బిలంలోపలకు వచ్చిన వారు ప్రాణాలతో తిరిగి బయటుకు పోవడం అరుదనీ, తన తపశ్శక్తితో వారిని వెలుపలకు చేరుస్తాననీ స్వయంప్రభ చెప్పింది.

స్వయంప్రభ ఆదేశానుసారం వానరులంతా కళ్ళుమూసుకున్నారు. ఆమె వారినందరినీ తన తపశ్శక్తితో క్షణమాత్రంకాలంలో బిలం వెలుపలకు చేర్చింది. వారున్నది వింధ్యపర్వతదక్షిణదిగ్భాగమనీ, వారికెదురుగా ఉన్నది 'మహోదధి' అనే మహాసముద్రమనీ గుర్తులు చెప్పి స్వయంప్రభ ఆ బిలం లోపలకు వెళ్ళిపోయింది.

251. త్రిశంకుస్వర్గం అంటే ఏమిటి? త్రిశంకుడు ఎవరు? త్రిశంకుస్వర్గంఅనే మాట మేము విన్నాము కాని, దాని అర్థం, సందర్భ తెలియలేదు.

త్రిశంకుడు ఇక్ష్వాకు వంశీయుడు. త్రయ్యారుణుని కుమారుడు. త్రయ్యారుణునికే త్రిధన్వుడనే పేరు కూడా ఉంది. త్రిశంకుని అసలు పేరు సత్యవ్రతుడు.

సత్యవ్రతుడు యువరాజుగా ఉండగా ఒక వివాహిత యువతిని బలవంతంగా తీసుకొని వచ్చాడు. ఆ చర్యకు ఆగ్రహించి ఇతని తండ్రి సత్యవ్రతుడిని తన రాజ్యం నుంచి బహిష్కరించాడు. సత్యవ్రతుడు రాజ్యం విడిచి అడవికి పోయాడు. ఆ తర్వాత త్రయ్యారుణుని రాజ్యంలో పన్నెండు సంవత్సరాల పాటు వానలు కురవలేదు. దేశంలో క్షామబాధ మిక్కుటంగా ఉంది. ఆ స్థితిలో వశిష్ఠమహర్షి ఆ రాజ్యాన్ని రక్షిస్తూ ఉన్నారు.

ఆ కాటక సమయంలో విశ్వామిత్ర మహర్షి తపస్సు చేసుకోవడానికి వెళ్ళి ఉన్నాడు. ఆయన భార్యా బిడ్డలు అరణ్యంలో ఆకలితో అల్లాడుతున్నారు. ఆ బాధ పడలేక విశ్వామిత్రుని భార్య తన కుమారులలో ఒకని కంఠానికి తాడుకట్టి ''ఈ బాలుడిని తీసుకొని నూరు గోవులిస్తారా? లేదా మా కుటుంబాన్ని పోషిస్తారా?'' అని అరవసాగింది. అది విని సత్యవ్రతుడు ఆమెతో వాళ్ళను తాను పోషిస్తానని చెప్పాడు.

వశిష్ఠ మహర్షిపైన సత్యవ్రతునికి కోపం ఉంది. సత్యవ్రతుడిని అతడి తండ్రి రాజ్యం నుంచి బహిష్కరించినప్పుడు సత్యవ్రతుని సమర్థిస్తూ అతడి

పక్షాన ఒక్కమాటైనా చెప్పి తనను రాజ్యబహిష్కరణ చేయకుండా కాపాడలేదని వశిష్ఠ మహర్షిపైన కోపం. అందుచేత సత్యవ్రతుడు - విశ్వామిత్రుని కుటుంబాన్ని పోషించాడనికై వశిష్ఠుని హోమధేనువును వధించాడు. కానీ ఆకలి కావడం వల్ల ఆ మాంసాన్ని తానే తిన్నాడు. ఈ సంగతి అంతా వశిష్ఠమహర్షికి తెలిసింది. ''నీ తండ్రికి కష్టం కలిగించే పని చేయడం, గురువుయొక్క ధేనువును వధించడం, అప్రోక్షితమైన మాంసాన్ని తినడం అనే మూడు పాపకృత్యాలను చేశావు. తద్వారా మూడు విధాలైన హృదయ శంకువులను కల్పించుకొని త్రిశంకుడవయ్యావు'' అని వశిష్ఠమహర్షి అనడంతో ఆనాటినుంచి సత్యవ్రతునికి త్రిశంకుడనే పేరువచ్చింది.

త్రయ్యారుణుని అనంతరం మంత్రులు త్రిశంకుని తీసుకొని వచ్చి, రాజును చేశారు. ఆ తర్వాత కొన్నాళ్ళకు త్రిశంకునికి సశరీరంగా స్వర్గానికి పోవాలనే ఉద్దేశం కలిగింది. అందుకు అనువైన యాగాన్ని చేయించమని కులగురువైన వశిష్ఠమహర్షిని కోరాడు. సశరీరంగా స్వర్గానికి పోవడమనేది అసంభవమనీ, అశాశ్వతమైన ఈ శరీరంపైన అంత వ్యామోహం పెట్టుకోవద్దనీ, జీవుడు చేసిన పాప పుణ్యాలను బట్టి మరణానంతరం స్వర్గ నరకాలు ప్రాప్తిస్తాయనీ వశిష్ఠమహర్షి బోధించారు. అటువంటి యాగాన్ని చేయించడం అసాధ్యమని చెప్పారు. త్రిశంకునికి కోపం వచ్చి వశిష్ఠమహర్షిని నిందించాడు. అనంతరం వశిష్ఠమహర్షి యొక్క కుమారుల దగ్గరకు వెళ్ళి తాను సశరీరంగా స్వర్గానికి వెళ్ళగలిగేలా చేసే యాగాన్ని చేయించమని వారిని కోరాడు. తానీకోరిక వశిష్ఠమహర్షిని కోరాననీ, కానీ ఆయన తన మాట వినలేదనీ కూడా చెప్పాడు. వశిష్ఠ పుత్రులు కూడా అటువంటి యాగాన్ని చేయించడం సాధ్యం కాదని చెప్పారు. త్రిశంకుడు వాళ్ళను దుర్భాషలాడాడు దానితో వాళ్ళకు కోపం వచ్చి నీవు చండాలుడవు కమ్మని త్రిశంకువును శపించారు. అప్పుడు త్రిశంకుని రూపం వికృతంగా మారింది. ఆ రూపంతో త్రిశంకుడు వెళ్ళి విశ్వామిత్ర మహర్షిని ఆశ్రయించాడు. తాను కోరిన యాగాన్ని వశిష్ఠుడు చేయించననడమూ, వశిష్ఠ పుత్రుల వల్ల తనకు పట్టిన దుర్గతినీ చెప్పుకుని విలపించాడు.

వశిష్ఠునిపై గల వైరంతో విశ్వామిత్రుడు ఆ యాగాన్ని తాను చేయిస్తానన్నాడు. యాగానికి ఇతర తపస్వులకు ఆహ్వానాలు పంపించాడు విశ్వామిత్రుడు. కాని వారెవరూ రాలేదు.

అప్పుడు విశ్వామిత్రుడు తానొక్కడే త్రిశంకునిచేత యాగాన్ని చేయించి, తన తపస్సును ధారపోసి త్రిశంకుని స్వర్గానికి పంపించాడు. గురుశాపోపహతుడైన త్రిశంకుడు స్వర్గంలో ప్రవేశించరాదని ఇంద్రుడు త్రిశంకుని కిందకు గెంటివేశాడు. త్రిశంకుడు పడిపోతూ విశ్వామిత్రమహర్షిని ఉద్దేశించి కేకలు పెట్టాడు. త్రిశంకువును పడిపోకుండా తన తపోబలంతో అంతరిక్షంలోనే ఆపా డు విశ్వామిత్రుడు. త్రిశంకుడున్న చోటనే మరొక స్వర్గాన్ని సృష్టించడానికి సిద్ధపడ్డాడు విశ్వామిత్రుడు. అప్పటికప్పుడే కొన్ని నక్షత్ర సమూహాలను సృష్టించాడు కూడా. అప్పుడు ఇంద్రుడు వచ్చి మరొక స్వర్గాన్ని నిర్మించ వద్దని ప్రార్థించాడు. విశ్వామిత్రుడు ఆపిన చోటనే త్రిశంకుడు ఉండడానికి ఇంద్రుడు సమ్మతించాడు. ఆ విధంగా త్రిశంకుడు భూమికీ స్వర్గానికి మధ్య ఉండిపోయాడు.

252. జాబాలి, జంబుమాలి - వీరిద్దరూ ఎవరు? వీరికి గల సంబంధం ఏమిటి?

జాబాలి ఒక మహర్షి. ఆయన ప్రస్తావన రామాయణంలో అయోధ్యా కాండలో వస్తుంది. సీతారామలక్ష్మణులు చిత్రకూటం వద్ద ఉండగా భరతుడు సపరివారంగా అక్కడ వచ్చాడు. రాముని తిరిగి అయోధ్యకు రమ్మని వేడుకున్నాడు. ఆ సందర్భంగా జాబాలి మహర్షి - రాముడు అయోధ్యకు తప్పక మరలి రావాలని, నచ్చచెబుతూ అందుకు సమర్థింపుగా నాస్తిక వాదాన్ని వినిపిస్తాడు. ఇది జాబాలి మహర్షి పాత్ర. రామాయణంలో జాబాలి మహర్షి నాస్తికవాదం ఒక ముఖ్యాంశం.

జంబుమాలి - రావణుని మంత్రియైన ప్రహస్తుని కుమారుడు. సుందర కాండలో ఇతని ప్రస్తావన వస్తుంది. హనుమంతుడు అశోకవనాన్ని ధ్వంసం చేసిన సందర్భంలో ఈ జంబుమాలి అతనిని ఎదుర్కొని ఆ యుద్ధంలో మరణించాడు.

253. పురాణాలలో కురుసార్వభౌముడు కాక మరెవ్వ
దుర్యోధనుడనే పేరు కలవారున్నారా?

ఉన్నారు. హిరణ్యాక్షుని కుమారుడొకడు, మనువంశపు రాజు మరొకడు - ఇలా ధుర్యోధునుడనే పేరు కలవారింకా ఇతరులు ఉన్నారు. వారి చరిత్రలు వివిధ పురాణాలలో ఉన్నాయి. దుర్యోధనుడనే ఆ రాజును నర్మద వరించడమూ ఇత్యాదిగా అయు చరిత్రలున్నాయి. సర్పప్రముఖుడొకడు కూడా ఇదే పేరుతో ఉన్నాడు.

254. సీతాదేవి తల్లియైన జనక మహారాజు భార్య పేరేమిటి? సీతా దేవికి అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూ ఉన్నారా?

సీతాదేవి తల్లి పేరు రత్నమాల. జనక మహారాజు కుమార్తె ఊర్మిళ-సీతాదేవి చెల్లెలు ఊర్మిళనూ, జనక మహారాజు తమ్ముడి కూతుళ్లైన మాండవి, శ్రుతకీర్తి - వీరినీ -శ్రీరాముని తమ్ములైన లక్ష్మణ భరత శత్రుఘ్నులకు ఇచ్చి వివాహాలు చేశారు. సీతాదేవికి అన్నదమ్ములు లేరు.

255. రామాయణంలో కాకాసుర వృత్తాంతం అంటే ఏమిటి?

చిత్రకూట పర్వతం మీద ఈశాన్య ప్రదేశాన మందాకినీ తీరంలో సిద్ధాశ్రమ ప్రాంతంలో సీతారాములు విహరిస్తూ ఉండగా - కాకి రూపంలో వచ్చిన ఇంద్రపుత్రుడు సీతాదేవిని తన ముక్కుతో, గోళ్లతో గాయపరచాడు. సీతాదేవి ఒడిలో నిద్రిస్తున్న రాముడు మేల్కొని - ఆ కాకిపై బ్రహ్మాస్త్రాన్ని దర్భపై అభిమంత్రించి ప్రయోగించాడు.

మండుతూ పరమ భయంకరంగా తనను దహించవస్తున్న ఆ అస్త్రాన్ని తప్పించుకొనడానికి ఆకాకి ముల్లోకాలు తిరిగి - ఆశ్రయమూ, రక్షణా లభించకపోగా - చివరకు రామపాదాలనే ఆశ్రయించింది. కరుణా సముద్రుడైన రాముడు ఆ కాకిని అనుగ్రహించాడు. కాని, బ్రహ్మ దేవతాకమైన ఆ అస్త్రాన్ని వ్యర్థం చేయడంశక్యం కాదు - అని రాముడు చెప్పగా ఆ అస్త్రానికితన కుడి కంటిని ఇచ్చివేసి ఆ కాకి తన ప్రాణాలను కాపాడుకొని - రామ ప్రభువుకు వందనాలు చెప్పి వెళ్లింది. ఈకథ అరణ్యకాండలో జరిగినా,

అరణ్యకాండలో ప్రస్తావనకు రాదు. సుందరకాండలో సీతాదేవి - రామునికి తనను చూచి వచ్చిన గుర్తుగా చెప్పమని హనుమంతునికి చెప్పింది.

256. 'అగస్త్యభ్రాత' అనగా ఎవరు? ఆకాశ రామన్న అగస్త్య భ్రాత ఒకే రకానికి చెందినవారా? అగస్త్య భ్రాత' అని ఎవరిని అంటారు?

అరణ్యవాసంలో ఉన్న శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సహితుడై దండకారణ్యాన్ని చేరాడు. అక్కడ ఉన్న ఋష్యాశ్రమాలన్నిటినీ దర్శిస్తూ, తపోధనులైన ఆ మహాత్ముల ఆశీస్సులను అందుకొంటూ సాగుతున్నాడు. అట్టి సమయంలో సుతీక్ష్ణమహర్షి సూచన ననుసరించి - అగస్త్యాశ్రమానికి మార్గం అడిగి తెలుసుకొని - దారిలో అగస్త్యభ్రాత ఆశ్రమాన్ని దర్శించి, అక్కడి నుండి అగస్త్యాశ్రమాన్ని చేరుకొన్నాడు. అగస్త్యుడు మహాప్రభావశాలి. తపస్సంపన్నుడు. ఆయన వింధ్య పర్వతాన్ని నిగ్రహించినవాడు. రాక్షసులకు భయంకరుడుగా నిలిచిన ఆయన వలన, దండకారణ్యంలోని ఋషులు ప్రశాంతంగా బ్రతకగలుగుతున్నారని చెప్పబడింది. ఆయన ప్రభావం వల్ల రాక్షసులకు దక్షిణ దిక్కు అంటే భయం ఏర్పడింధి. ఆయన వల్లనే దక్షిణ దిక్కుకు అగస్త్య దిక్కు అనే పేరు వచ్చింది. ఈయన ఆశ్రమ సాన్నిధ్యంలో ఎందరో తపస్వులు వారి నియమిత తపోజీవనాన్ని కొనసాగిస్తున్నారు ఆయన ఆశ్రమంలో తపస్వులు, దేవతలు, గంధర్వులు, నాగులు మొదలైనవారే కాకుండా పక్షులు కూడా ధర్మాన్ని పాటిస్తూ నియమిత ఆహారంతో నివసిస్తూ ఉండాయి-

అని ఈ విధంగా అగస్త్యమహర్షి ప్రభావాన్ని గూర్చి వాల్మీకి రామాయణం అరణ్యకాండ పదవ సర్గలో ఎంతో విస్తృతంగా వర్ణించబడి ఉంది.

లోకంలో ప్రసిద్ధకర్ముడైన ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తులు - ఆ వ్యక్తి ద్వారానే వ్యవహరింపబడుతారు. ఆ వ్యక్తికి సోదరులు గానో, మరొక విధంగానో - ఆ వ్యక్తితో వారికి గల బాంధవ్యాన్ని అనుసరించి వారిని 'ఫలానా వారి తాలూకు' గా వ్యవహరించడం అందరికి పరిచితమైన విషయమే. ఇట్టి

విషయానికి మూలకందం వంటిది రామాయణంలోనిఅగస్త్యభ్రాత వృత్తాంతం.మహా ప్రసిద్ధతర్ముడైన అగస్త్యుని సోదరుడు ఈ అగస్త్యభ్రాత. ఆయన అగస్త్యుని ఆశ్రమానికి అనతి దూరంలోనే ఆశ్రమాన్ని నిర్మించుకొని,తపోనిష్ఠలో ఉన్నాడు. అగస్త్యుని సోదరుడే 'అగస్త్యభ్రాత' గా వాల్మీకి చేత నామకిరణం చేయబడి, ఈనాటికీ మనందరి చేతనూ తలచుకొనబడుతున్నాడు.

ఏ వ్యక్తులైనా తమంత తాముగా సుప్రసిద్ధులు కానప్పుడు, వారు ఒక ప్రసిద్ధునికి సంబంధించిన వారైనప్పుడు వారి పేరు మరుగున పడిపోయి, 'ఫలానావారికి' సంబంధీకులుగానే వ్యవహృతులు కావడానికి 'అగస్త్యభ్రాత' ప్రథమోదాహరణం. అనామకుల పట్ల రూఢమైంది – ఈ పదబంధం.

అకాశరామన్నకూ, అగస్త్యభ్రాతకూ భేదం ఉంది. తాను గుప్తంగా ఉంటూ, తన ఉనికిని బయటపెట్టకుండా రహస్య చర్యలు జరిపేవానిని ఆకాశరామన్నగా వ్యవహరిస్తారు. అగస్త్యభ్రాతవేరు. లోకప్రసిద్ధులైన వ్యక్తులకు సంబంధించిన వారు, వారు కూడా ప్రత్యేకతను కలిగి ఉంటే తప్ప,వారి పేరు మీదుగా వ్యవహరించడాన్ని ఆ విధంగా పేర్కొంటారు. ప్రస్తుత వ్యవహారంలో 'షేరాఫ్ ఎడ్రస్' అన్నట్లుగా.

257. శివపార్వతులు కొలువై ఉన్నకైలాస పర్వతాన్ని అవలీలగా ఎత్తగలిగిన రావణాసురుడు మిధిలా నగరంలో శివధనుస్సును ఎందుకు ఎత్తలేక పోయాడు?

రావణాసురుడు సీతా స్వయంవరానికి రాలేదు, శివధనువును ఎత్తడానికి ఎక్కుపెట్టడానికి ప్రయత్నమూ చెయ్యలేదు. వాల్మీకి రామాయణాన్ని అనుసరించి రావణుడు సీతా స్వయంవరానికి రాలేదు. అవాల్మీకాలైన ఎన్నో కథలు రామాయణానికి చేరాయి. వానిలో ఇదీ ఒకటి. ఇది వాల్మీకంలో లేనిది.

258. రామాయణంలో మంధర, రావణుల పాత్రలు లేకపోతే ఎలా ఉండేది?

రామాయణంలో అతి కీలకమైనవి మంధర, రావణుల పాత్రలు. రావణ ప్రముఖులైన రాక్షసుల బాధ భరించలేక, దేవతలు శరణువేడగా, వారి అభ్యర్థన మేరకు రాక్షస సంహారార్థం రామలక్ష్మ భరత శత్రుఘ్నులుగా నాలుగు రూపాలలో అవతరించాడు శ్రీమహావిష్ణువు. ఈ విషయం వాల్మీకి రామాయణంలో స్పష్టంగా చెప్పారు. రామావతారం రాక్షససంహార నిమిత్తమే అయినప్పుడు - రాక్షస ముఖ్యుడైన రావణుడే లేకపోతే శ్రీమహా విష్ణువుకు రామావతారం ఎత్తవలసిన పనేలేదు.

సృష్ట్యాది నుంచీ శ్రీ మహావిష్ణువు దేవతల పక్షాన రాక్షసులపై అనేకసార్లు యుద్ధం చేసిన వేర్వేరు సంఘటనలున్నాయి. ఆ సందర్భాలన్నీ చెప్పాలంటే చాలా చెప్పాలి. విష్ణువు ధాటికి తట్టుకోలేకనే మాల్యవంతాది ప్రముఖులైన రాక్షస నాయకులందరూ పాతాళానికి వెళ్లి దాగి ఉన్నారు. రావణుడు విజృంభించిన తర్వాతనే వారంతా భూమిపై యథేచ్ఛగా సంచరించడం ప్రారంభించారు. అట్టి రావణునికున్న బ్రహ్మ వరాల వల్లనే అతని సంహారానికి మహావిష్ణువు మానవరూపం ధరించవలసి వచ్చింది.

మరొక ముఖ్య విషయం - రావణుడు బ్రహ్మను కోరిన వరాలలో నరవానరులను ఉపేక్షించి, తక్కిన వారందరి వల్లనూ తనకు మరణం లేకుండా కోరాడు. ఆ కారణం వల్లనే శ్రీమహావిష్ణువు, దేవతలు - నరవానర రూపాలను ధరించారని రామాయణ కథనం. ఇక మంథర విషయానికొస్తే మంథరే గనుక లేకపోతే, రామ వనవాసం అనే అధ్యాయం ఉండేది కాదు. దశరథుడు ముందు వెనుకలాలోచించి, అతి జాగ్రత్తగా, అవ్యవధానంగా తలపెట్టిన శ్రీరామయువరాజ్య పట్టాభిషేకాన్ని, తన కుయుక్తితో భగ్నం చేసిన వ్యక్తి మంథర. ఇలా జరగకపోతే, మహారాజుగా ఏ రాజసూయ, అశ్వమేధయాగ సందర్భాలలోనో రావణాసురుని ఎదుర్కొనేవాడేమో శ్రీరాముడు! అది కేవలం ఊహించదగిన విషయం. అనాలోచితంగా చెప్పుడు మాటలకు మోసపోయే కైకమ్మను లొంగదీసుకొనే మంథరలు

ఆనాడే కాదు, ఈనాడూ ఉన్నారు. ఏనాడూ ఉంటారు. మంథర మాట విని అటు భర్తనూ కోల్పోయింది. ఇటు కొడుకు దృష్టిలో చులకన అయింది, సర్వుల చేతనూ ఛీ అనిపించుకున్నది కైకేగాని, ఇంత చేసినప్పటికీ మంథర నష్టపోయిందేమీ లేదు.

259. హనుమంతుడు, జాంబవంతుడు సరిసమానులే కదా? మరి హనుమంతునికి అడుగడుగునా ఆలయాలున్నాయి. జాంబవంతునికి ఒక్కటంటే ఒక్కగుడి కూడా లేదు. అతడిని పూజించే వాళ్ళు కూడా ఎవరూలేరు. జాంబవంతునికి గుడి లేకపోవడానికి కారణాలేమిటి?

ఆగమశాస్త్ర విధిననుసరించి దేవాలయ నిర్మాణం చేసి విధివిహితంగా పూజాదికాలు నిర్వహించవలసినవారిలో జాంబవంతుడు లేడు. హనుమంతుడు రుద్రావతారం. సాక్షాత్ శివాంశ సంభూతుడు. శివుడే ఆంజనేయుడు, అందువల్ల ఆయనకు ఆలయ నిర్మాణం చేసి అర్చనాది కైంకర్యాలు చెల్లించడంలో ఆక్షేపణ ఏమీలేదు. జాంబవంతుడు హనుమంతునికి సమానుడు కాదు.

అదీ గాక, కొత్తగా ఒక దేవాలయాన్ని నిర్మించడం కంటే-పూర్వమే నిర్మించబడిన జీర్ణదేవాలయాల్ని పునరుద్ధరించి, అటువంటి దేవాలయాలలో తిరిగి పూజాదికాలు జరిగేవిధంగా మాన్యాలవంటి ఏర్పాట్లు చేయడం వల్ల అధికమైన పుణ్యం కలుగుతుందని శాస్త్రవచనం.

మనదేశంలోను, రాష్ట్రంలోనూ ధూపదీప నైవేద్యాదులు లేని దేవాలయాలు అనేకం ఉన్నాయి. ఎన్నో మహాక్షేత్రాలలోని మహత్తర చరిత్ర కలిగిన ఆలయాలు సైతం ప్రస్తుతం కనీసపక్షం నిత్యపూజకు సైతం నోచుకోకుండా జీర్ణస్థితిలో వున్నాయి.

కంచిలోని కైలాసనాథేశ్వరాలయం, అలంపురంలోని బాలబ్రహ్మేశ్వర, తారక బ్రహ్మేశ్వరాది నవబ్రహ్మేశ్వరాలయాలు, అలంపురంలోనే జోగులాంబ ఆలయం ఇవన్నీ శిథిల స్థితిలో వున్నాయి.

అవన్నీ మహాక్షేత్రాలు. వాటిని పునరుద్ధరించండి. మన రాష్ట్రంలో, దేశంలో జీర్ణదశకు చేరుకున్న ఇటువంటి ఆలయాలు ఎన్నో వున్నాయి. మీరు ఖర్చు చేయదలచుకున్న డబ్బునూ శ్రమశక్తినీ ఉపయోగించి వాటిని నిలబెట్టండి. అటువంటి పనికి భగవంతుడు హర్షిస్తాడు. జీర్ణ దేవాలయోద్ధరణం వల్ల మహత్తరమైన ఫలితముందని మహర్షి వాక్యం. అలాగే ఎన్నో ఆలయాల నిర్వహణ నిమిత్తం పెద్ద లిచ్చిన ఆస్తులు పరహస్తగతాలయిపోతున్నాయి. దక్షతతో వాటిని చక్కదిద్దండి.

ఇక మీరడిగిన జాంబవంతుని చరిత్ర ఇది : చతుర్ముఖ బ్రహ్మ ఆవలింతలో నుంచి పుట్టినవాడు జాంబవంతుడు. భల్లూక (ఎలుగుబంటి) జాతికి నాయకుడయ్యాడు. మహాబలిష్ఠుడు . వివేకమూ, ప్రాజ్ఞతా కలిగినవాడు. కృతయుగంలో జన్మించినవాడు. జాంబవంతుడు పుట్టేనాటికి గరుత్మంతుడు జన్మించలేదు. పూర్వయుగాలలో జరిగిన దేవదానవ యుద్ధాలను ఎరిగినవాడు జాంబవంతుడు.

క్షీరసాగరమథన సమయంలో ప్రపంచమంతటా తిరిగి అనేక ప్రదేశాలోవున్న ఓషదులను తెచ్చి సముద్రంలో వేసేపనిని జాంబవంతునికి కేటాయించారు. ఆ పని మీద ఆ సమయంలో అనేకమార్లు భూమినంతటినీ చుట్టివచ్చాడు జాంబవంతుడు. ఆ పని చేసినందుకుగాను జాంబవంతునికి దేవతలు అమృతపానానికి అర్హతను కలిగించి, కొద్దిగా అమృతాన్ని తాగనిచ్చారు. ఆ కారణంగా చాలా యుగాల తరబడి జీవించాడు. అధికమైన దేహదారుఢ్యం కలిగి, యౌవనంలో ఉదయ పర్వతం నుంచి అస్తగిరికి, కైలాసానికీ తిరుగుతూ వుండేవాడనని తన సహచరులకు చెప్పాడు జాంబవంతుడు.

ఒకప్పుడు కైలాసంలో సాంబశివుని సన్నిధిలో యజ్ఞం చేస్తూ వున్న ఋషులను చేరి - వారిని సేవిస్తూ ధర్మాలను తెలుసుకొంటున్నాడు జాంబవంతుడు. ఆ సమయంలో రాక్షసరాజైన బలిచక్రవర్తి కుమారుడు ఒక పర్వతాన్ని ఎత్తి జాంబవంతుని మీదకు విసిరాడు. తనకు దెబ్బతగలకుండా వుండేందుకుగాను జాంబవంతుడు తన మోకాలిని ఆ

పర్వతానికి అడ్డం పెట్టాడు. జాంబవంతుని కాలు తగిలి పర్వతం ముక్కలయింది. కాని జాంబవంతునికి కూడా దానివల్ల దెబ్బతగిలింది. జాంబవంతునికి శక్తి, వేగమూ కొంతవరకు క్షీణించాయి. సుగ్రీవుడు (వానరరాజు) సీతాన్వేషణానికై పంపినప్పుడు దక్షిణ దిక్కులో సీతను వెతకడానికి వెళ్ళిన వానరసమూహంలో హనుమంతడు, అంగదుడు మొదలైన వాళ్ళతోపాటు జాంబవంతుడు కూడా వున్నాడు. దక్షిణ సముద్రతీరాన్ని చేరి వానరులంతా – ఈ మహాసాగరాన్ని దాటడం ఎలాగ, సీతను చూచి రావడం ఎలాగ – అని విచారించారు. ధైర్యాన్ని కోల్పోయి నిరాశతో కుంగిపోయారు. అప్పుడు జాంబవంతుడే వాళ్ళను ఉత్సాహపరిచి కర్తవ్యాన్ని బోధించాడు. నీరసించిన వానరులను ఉద్బోధించారు. తాను తొంభై అమడల దూరం దూకగలనని చెప్పి, మిగతా వాళ్ళను కూడ ప్రేరేపించి చెప్పించాడు.

మరణోన్ముఖుడైన అంగదుని నివారించాడు జాంబవంతుడు. సముద్రాన్ని దాటి సీతను చూచిరావడానికి హనుమంతుని పురిగొల్పి పంపించాడు. తన శక్తి తనకు తెలియని హనుమంతుని ఉత్సాహపరచడానికి ఆయన జన్మగాథనూ, ఆయన శక్తిసామర్థ్యాలనూ వివరించాడు. ఆ మహాకార్యానికి తగిన వాడు తన జట్టులో హనుమంతుడేనని గ్రహించగలగడం, ఆయనకే తెలియని ఆయన శక్తిని ప్రేరేపించి కార్యసాధనకు దారిచూపగలగడం జాంబవంతుని ప్రాజ్ఞతకు,ముందుచూపుకు నిదర్శనాలు.

కృతయుగంలో జన్మించిన జాంబవంతుడు – త్రేతాయుగంలోనూ ద్వాపరయుగంలోనూ కూడావున్నాడు. రావణ సంహారం అయ్యాక శ్రీరాముడు వానరులందరినీ కావలసిన వరాలు కోరుకొమ్మన్నాడు. తన బలోద్ధతికి అహంకరించిన జాంబవంతుడు – శ్రీరామునితో ముష్టియుద్ధం చేయాలని వుందని కోరాడు. యుగాంతరంలో జాంబవంతుని కోరిక నెరవేరుతుందని శ్రీరామభద్రుడు అనతిచ్చాడు.

మహారాజు సత్రాజిత్తు తమ్ముడిని చంపిన సింహాన్ని జాంబవంతుడు చూచాడు. ఆ సింహాన్ని చంపి, దాని దగ్గర వున్న శమంతకమణిని

తీసుకున్నాడు. జాంబవంతుని కుమార్తె జాంబవతి. కూతురితో కలసి అరణ్యంలో ఒక గుహలో వుండేవాడు జాంబవంతుడు. శ్రీరామభక్తుడైన అతడు - శ్రీరామభక్తితోనూ, ధ్యానంతోనూ కాలం గడిపేవాడు. తనకు దొరికిన శమంతకమణిని కూతురైన జాంబవతి పర్యంకానికి పైన వేలాడ గట్టాడు జాంబవంతుడు. ఆ మణి కోసం అన్వేషిస్తూ వచ్చిన శ్రీకృష్ణునితో ముష్టియుద్ధానికి దిగాడు జాంబవంతుడు. వారిద్దరి యుద్ధం 28 రోజులపాటు సాగింది. చివరకు శ్రీకృష్ణుడు తన శ్రీరాముడేనని తెలుసుకొనిఆయన పాదాల మీద పడ్డాడు జాంబవంతుడు. శ్రీకృష్ణుని స్పర్శతో జాంబవంతుని శరీరం స్వస్థత చెందింది. జాంబవతిని శ్రీకృష్ణునికిచ్చి పెళ్లిచేసి శమంతకమణిని కూడా ఆయనకిచ్చి పంపాడు జాంబవంతుడు.

260. అడవికి బయలుదేరి వెళ్ళే ముందు సీతారామలక్ష్మణులు నారచీరలు ధరించినారు.మరి 12సంవత్సరాలకు సరిపడా నారచీరలు తమతో తీసుకువెళ్లినారా? ఎన్నిచీరలు, ఎన్ని పంచెలు, ఎన్ని పైకండువాలు. ఇవన్నీ అవసరం కదా? అడవులలో దొరకవు కదా? ఇవన్నీ ఏదైనా ట్రంకుపెట్టెలో పెట్టి తీసుకువెళ్లినారా? లేక చాకలిమూటగా కట్టి తీసుకువెళ్లినారా? ఆ మూట లక్ష్మణుడు మోసినాడా,సీతమ్మ తలమీద మోసినదా?

దశరథ మహారాజు - సీతాదేవి సర్వాభరణాలతోనూ వస్త్రాలంకారాలతోనే వెళ్లాలని శాసించాడు. అందువల్ల ఆయన సీతాదేవికి 14 సంవత్సరాలకూ చాలినన్ని వస్త్రాభరణాలను తెప్పించి ఇచ్చాడు. రామలక్ష్మణులకు కావలసిన నారచీరలు, కవచాలు, అనేక ఆయుధాలు, అడవిలో దుంపలు తవ్వుకోవడానికి కావలసిన గంపలు, తవ్వుకోలలు - ఇవన్నీ ఇచ్చి పంపాడు దశరథ మహారాజు. వాటన్నిటినీ సీతారామలక్ష్మణులు తీసుకొనే అడివికి వెళ్లారు. ఈ విషయాలన్నీ వాల్మీకి రామాయణంలో స్పష్టంగా చెప్పబడ్డాయి. సందేహం లేదు. రామవనవాసానికి పరిమితి 12 సంవత్సరాలు కాదు. కైక కోరినది, సీతారామలక్ష్మణులు చేసినదీ 14 సంవత్సరాల వనవాసం.

261. రాముని అనంతరం లవకుశలు ఏమయ్యారు? లవకుశల సంతానం ఎవరైనా ఉన్నారా ? లవకుశులు కానీ, వారి సంతానం కాని రాజ్యపాలన చేశారా? లవకుశుల తర్వాత ఆ వంశంవారు ఎవరు పాలించారు? రాముని తర్వాతి చరిత్ర ఏమిటి?

రాముడు తన అవతారపరిసమాప్తికి ముందుగానే తన కొడుకులకూ, తన తమ్ముల కొడుకులకూ కూడా రాజ్య విభాగం చేశాడు. శ్రీరాముని ఆధ్వర్యంలోనే లవకుశులకూ, లక్ష్మణ భరత శత్రుఘ్నుల పుత్రులకూ కూడా రాజ్యాలను ఏర్పరచి ఇవ్వడం జరిగింది.

262. రావణునికి మండోదరి కాక ఇంక ఎవరైనా భార్యలున్నారా? రావణుని సంతానం, కుంభకర్ణుని భార్య, సంతానం, విభీషణుని భార్య, సంతానం ఎవరు?

మండోదరి రావణాసురుని పెద్ద భార్య. ఆ కారణంగా పట్టమహిషి. ఆమె కాకుండా రావణాసురునికి ధాన్యమాలిని మొదలైన ఎందరో భార్యలున్నారు. మహాతపస్వి, అజేయపరాక్రముడు, అమితబల సంపన్నుడు అయిన రావణునికి ఎందరో తమ కూతుళ్ళను ఇచ్చి పెళ్లిచేశారు. అనేక మంది కన్యలు తమంత తాముగా రావణుని వలచి వరించి అతడి భార్యలుగా వచ్చారు. కొందరు సౌందర్యవతులను రావణుడు తీసుకువచ్చాక త్రిలోక విజేత అయిన రావణుని గొప్ప తనం, ఐశ్వర్యం, వైభవము చూసి ఆ కన్యలు ఇష్టపడి రావణునికి భార్యలు కావడానికి అంగీకరించారు. నాగ,యక్ష, గంధర్వ, రాక్షస, మానవాది అనేక జాతులు స్త్రీలు లెక్కలేనంతమంది ఆ విధంగా రావణుని భార్యలయ్యారు. ఇక రావణుని సంతానాన్ని గురించి. మేఘనాధుడు, దేవాంతకుడు, నరాంతకుడు, మహాపార్శ్వుడు, అక్షకుమారుడు - వీళ్ళు మండోదరియందు రావణాసురునికి కలిగిన సంతానం. అతికాయుడు - ధాన్యమాలినయందు రావణునికి కలిగిన సంతానం. కుంభకర్ణుని భార్య పేరు వజ్రజ్వాల కుంభుడు, నికుంభుడు వారి సంతానం. వజ్రజ్వాల - బలి చక్రవర్తి మనుమరాలు. విభీషణుని భార్యపేరు సరమ.సరమ - శైలూషుడనే గంధర్వుని కుమార్తె. విభీషణుని కుమార్తె నల.

263. మండోదరికి ఆ పేరు ఎలా ఏవిధంగా వచ్చింది?

మండోదరి అంటే – కప్పపొట్ట వంటి పొట్ట కలిగినది – అని అర్థం. కప్పపొట్ట వంటి పొట్టను కలిగి ఉండడం – మహారాజ్ఞీ లక్షణమని సాముద్రిక శాస్త్రంలో చెప్పబడింది. తదనుగుణంగానే మండోదరి – త్రిలోక విజేత అయిన రావణాసురునకి పట్టమహిషి అయింది.

264. కుంభకర్ణునికి పెళ్లి అయిందా? అయితే ఎంతమంది పిల్లలు?

కుంభకర్ణునికి పెళ్లి అయింది. బలిచక్రవర్తిమనుమరాలూ, వైరోచనుడనే రాక్షసుని కుమార్తె అయిన వజ్రజ్వాల కుంభకర్ణుని భార్య. రావణాసురుడే స్వయంగా ఈ వివాహాన్ని జరిపించాడు. కుంభుడు, నికుంభుడు – కుంభకర్ణుని కుమారులు.

265. హనుమంతుడు మాత్రమే లంకకు పోయిరాగల సమర్థుడని సుందర కాండములో విన్నాను. మరి వాలి కుమారుడైన అంగదుడు ఎలా పోయి వచ్చాడు?

సముద్రాన్ని లంఘించి లంకా పట్టణానికి వెళ్లి వచ్చిన వాడి హనుమంతుడు ఒక్కడే. అంగదుడు సముద్రాన్ని లంఘించి లంకకు వెళ్లిరాలేదు. వారధిని నిర్మించడం పూర్తయ్యాక, శ్రీరామలక్ష్మణులు వానర సైన్య మంతటితోను సముద్రాన్ని వారధి మీదుగా దాటి లంకానగరపు సముద్రతీర ప్రదేశాన్ని చేరాక – యుద్ధారంభం చేయడానికి కొంచెం ముందుగా అగదుని రాయబారిగా రావణాసురుని వద్దకు పంపించాడు శ్రీరాముడు. సీతాదేవిని తనకు సమర్పించి సగౌరవమైన సంధి చేసుకోమని, రాక్షస వినాశనాన్ని కొనితెచ్చుకోవద్దని– అంగదుని ముఖంగా రావణునికి సందేశాన్ని పంపించాడు. శాంతి కోసం శ్రీరాముడు చివరి ప్రయత్నంగా పంపినదే అంగద రాయబారం. వానర వీరులందరితోపాటుగా అంగదుడు వారధి మీదుగానే లంకానగరానికి చేరాడు తప్ప అంజనేయునివలే గాలిలో ఎగిరి వెళ్లి సముద్రాన్ని లంఘించలేదని గమనించాలి.

266. శ్రీరామచంద్రుడు సాక్షాత్ శ్రీమన్నారాయణుడుకదా! ఆయన చివరకు సరయూనదిలో దిగి ప్రాణత్యాగం (ఆత్మహత్య) చేసుకొన్నాడని విన్నాము. ఆత్మహత్య మహాపాపం కదా? మరి సాక్షాత్తూ కాపాడే దేవుడే ఆవిధంగా చేసి ఇతరులకు అట్టి ఆదర్శమును చూపించవచ్చునా?

శ్రీరామచంద్రునిది ఆత్మహత్యకాదు. ఆయన అవతార లక్ష్యం పూర్తి అయింది కనుక - ఆయన శ్రీమహావిష్ణువుగా తనస్వస్థానమైన వైకుంఠాన్ని చేరుకొన్నారు. ఆయన భగవంతుడు. కనుక ఆయనకు తన దేహంపైన మమకారం ఉండదు. భగవంతుని ప్రతి అవతారానికీ నిర్దిష్టమైన ప్రయోజనాలుంటాయి. అవి నెరవేరిన వెంటనే తాను ధరించిన అవతారాన్ని ఉపసంహరిస్తారు.

267. సీతారాములు అరణ్యవాసంలో ఏకాంతంలో ఉన్నప్పుడు ఇంద్రపుత్రుడైన కాకాసురుడు సీతాదేవి బాధించాడు కదా? దేవరాజైన ఇంద్రునికి ఈ కాకాసురుడు (రాక్షసుడు) పుత్రుడు కావడమేమిటి?

దేవరాజైన ఇంద్రునికి రాక్షసుడు పుత్రుడు కావడం అంత అసంగతమైన విషయ మేమీ కాదు. దేవరాక్షసులు పరాయి వారు కారు. ఒకే తండ్రి బిడ్డలు. కశ్యప ప్రజాపతికి భార్యలైన అదితి యొక్క సంతానం దేవతలు; దితి యొక్క సంతానం దైత్యులు. కశ్యప ప్రజాపతి యొక్క భార్యయైన దనువు అనే ఆమె యొక్క సంతానం దానవులు. వీరిలో దనువు అనే కశ్యప పత్నికి జన్మించిన 'పులోముడు' అనే దానవుని పుత్రిక శచీ దేవి-ఇంద్రునికి భార్య అయింది. ఇంద్రుని సంతానం -జయంతి, జయంతుడు. ఈ జయంతి - రాక్షసగురువైన శుక్రాచార్యుని భార్య. జయంతీ శుక్రుల పుత్రికయే - దేవయాని. పులస్త్యుడనే బ్రహ్మమానస పుత్రునికి అనేక మంది రాక్షసులు సంతానంగా జన్మించారు.

కనుక - దేవ రాక్షసుల బాంధవ్యాన్ని గురించి సందేహించవలసిన పని లేదు. ఈ రెండు వర్గాల వారూ అతి సన్నిహిత సంబంధాలు కలిగినవారు.

వారి బంధుత్వాలను గురించిన విశేషాలు ఇంకా ఉన్నాయి కానీ గ్రంథ విస్తరభీతి చేత విడిచిపెట్టడమైంది. అంతేగాక, సీతాదేవిని బాధించిన కాకి ఇంద్రపుత్రుడని వాల్మీకంలో స్పష్టంగా చెప్పబడి ఉన్నది. ఆ అంశాన్ని కూడా శంకించవలసిన అవసరంలేదు.

268. సీతాదేవిని తీసుకుని రావణాసురుడు దక్షిణ దిక్కుకు వెళ్లినట్లు జటాయువు చెప్పనప్పుడు - హనుమంతునికి ఆనవాలుగా ఉంగరాన్ని ఇచ్చి పంపడం బాగుంది. కానీ మిగతా దిక్కులకి కూడా పరివారాన్ని పంపడం - అనవసరం కాదా ?

రావణుని నివాసం దక్షిణ దిక్కున ఉండడం నిజమే. జటాయువు చూస్తుండగా రావణుడు దక్షిణ దిక్కుగా వెళ్లినదీ నిజమే. కాని రావణుడు సకల దిక్పాలకులనూ జయించి దిక్కులన్నిటినీ స్వాధీనం చేసుకున్నవాడు: అందుచేత రావణుడు సీతను ఏ దిక్కులోనైనా, ఏ రహస్య ప్రదేశంలోనైనా దాచి ఉండవచ్చుననీ, కాబట్టి సీతాదేవి కోసం అన్ని దిక్కులలోను, అన్ని ప్రదేశలలోనూ వెతికిచూడాలనీ హనుమంతుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు, రామలక్ష్మణులూ ఆలోచించి నిశ్చయించు కున్నారు. మాయావియైన రావణుడు - సీతాదేవిని తన నివాసంలోనే ఉంచుతాడని నమ్మకం ఏముంది? కాబట్టి అన్ని దిక్కులకూ వానరులను పంపి వెతికించారు. ముఖ్యలను దక్షిణ దిక్కుకు పంపించారు.

269. జటాయువు ఒక జ్ఞానం లేని పక్షి కదా? మరి సీతాదేవిని రావణాసురుడు అపహరించుకొని పోతుంటే అడ్డుపడాలనేజ్ఞానం జటాయువుకు ఎలా కలిగింది?

పూర్వం ఒకప్పుడు బ్రహ్మదత్తుడనే రాజు యొక్క గృహంలో గౌతమమహర్షి భోజనం చేస్తూ ఉండగా - ఆయన భోజనంలోకి మాంసఖండం ఒకటి వచ్చింది. జప తప నియమ నిష్ఠాపరుడైన తనకు మాంసభోజనం పెట్టినందుకు గౌతమమహర్షికి తీవ్రమైన ఆగ్రహం కలిగింది. ''నీవుగ్రద్దవై జన్మించు'' మని బ్రహ్మదత్తుని శపించాడు

గౌతముడు. లదితనకు తెలియకుండా జరిగిన పొరపాటనీ, క్షమించమనీ బ్రహ్మదత్తుడు ప్రార్థించాడు. ''రాబోయే తన అవతారంలో శ్రీమహావిష్ణువు - గ్రద్దగా ఉన్న నిన్ను స్పృశించగలడు. అంతటితో నీకు శాపమోక్షణం కలుగగల'' దని గౌతముడు శాపావసానాన్ని అనుగ్రహించాడు.

బ్రహ్మదత్తుడు అనంతరం - గ్రద్దగా (జటాయువుగా) జన్మించాడు. ఇతని తల్లిపేరు శ్యేని. తండ్రి పేరు అనూరుడు. ఇతని సోదరుని పేరు సంపాతి. జటాయువుకు ఇద్దరు కుమారులు. వారి పేర్లు - కర్ణికారుడు, శతగామి. జటాయువుకు శ్రీరాముని తండ్రియైన దశరథ మహారాజు ప్రాణస్నేహితుడు.

కౌసల్యను వరించడానికని వెళ్లిన దశరథుసముద్ర ప్రవాహంలో కొట్టుకొనిపోగా- జటాయువే కౌసల్యా దశగథులను రక్షించి అయోధ్యకు చేర్చాడు. సీతారాలక్ష్మణులు అరణ్యవాసంలోఉన్నకాలంలో సీతాదేవిని రావణాసురుడు అపహరించుకొని పోతున్న సమయంలో సీతాదేవి - ''నేను దశరథమహారాజు కోడలిని. శ్రీరాముని భార్యను. నన్ను రక్షించగలవారు ఎవరూ లేరా?'' అని ఆక్రందనం చేసింది. సీతాదేవి ఆక్రోశించడం విని ఆ సమీపంలో ఉన్న జటాయువు వెళ్ళి రావణునికి చెప్పి సీతాదేవిని విడిపించాలని చూశాడు. కానీ జటాయువు చేసిన హితబోధలను రావణాసురుడు వినలేదు. అప్పుడు జటాయువు- రావణునితో యుద్ధం చేశాడు. తనవాడియైన గోళ్ళతోనూ, ముక్కుతోనూ, రావణాసురుని గాయపరచి తన శక్తి కొద్దీ యుద్ధం చేశాడు. కానీ రావణాసురుడు తన చంద్రహాసంతో. సీతను అన్వేషిస్తూ ఆ మార్గంలో వచ్చిన రామలక్ష్మణులు - కొనఊపిరితో ఉన్న జటాయును చూశారు. రాముని రాక కోసమే కొన ప్రాణంతో ఎదురు చూస్తున్న జటాయువు - తనను తాను శ్రీరామునికి ఎరుకపరచుకొని - సీతాదేవిని రావణాసురుడు అపహరించాడనీ, తాను నిరోధించడానికి ప్రయత్నించగా తనకీ గతి పట్టించాడనీ చెప్పి మరణించాడు. తన భార్యను రక్షించబోయిమరణించిన జటాయువు కోసంరాముడు దురిఖించి

జటాయువుకు తానే అగ్ని సంస్కారం చేసాడు. ఆ విధంగా శ్రీరాముని చేతిలో మరణించి శ్రీరామునిచేతనే అగ్ని సంస్కారాన్ని పొందిన జటాయువు ధన్యుడు. జటాయువు రెక్కలను తెగగొట్టగా జటాయువు కూలిపోయాడు.

270. శాంతాదేవి - శ్రీరాముని సోదరిగా చెప్పారు కదా! ఆమె దశరథుని ముగ్గురు భార్యలలో ఎవరి పుత్రిక? అలాగే జనక మహారాజుగారి భార్య పేరు కూడ తెలుపగలరు.

శాంత - దశరథుని కుమార్తె కాదు. అంగదేశాధిపతియైన రోమపాదుని కుమార్తె. రోమపాదుని రాజ్యంలో వానలు కురవక క్షామం ఏర్పడినప్పుడు విద్వాంసులను సంప్రదించగా, ఋష్య శృంగుని తీసుకువస్తే వానలు కురుస్తాయనీ, ఆ మహర్షి అడుగుపెట్టిన చోట కరువుకాటకాలుండవనీ పెద్దలు చెప్పారు. అప్పుడు రోమపాదుడు ఋష్యశృంగుని తపోవనం తీసుకొనిరాగా అంగదేశంలో వర్షాలు కురిశాయి. రోమపాదుడు తన కుమార్తె అయిన శాంతను ఋష్యశృంగునకిచ్చి వివాహం చేసి వారిని తన ఇంటనే నిలుపుకొన్నాడు. దశరథుడు తనకు సంతానం లేదని చింతిస్తూ ఉన్నప్పుడు దశరథుని ఆప్తసచివుడైన సుమంత్రుడు ఆయనకీ వృత్తాంతం చెప్పాడు. దశరథ మహారాజు చేత ఆ ఋష్యశృంగుడు ఒక యజ్ఞం చేయించితే దశరథునికి సంతానం కలుగుతుందని మహర్షుల సభలో సనత్కుమార మహర్షి వల్ల తాను విన్నానని సుమంత్రుడు దశరథునికి చెప్పాడు. అప్పుడు దశరథుడు తన మిత్రుడైన రోమపాదుని అంగీకారంతో అంగదేశం నుండి శాంతా ఋష్యశృంగులను తన అయోధ్యా నగరానికి తీసుకువచ్చి- వారిని తన అంతఃపురంలో ఉంచి అమితంగా గౌరవించాడు. ఋష్యశృంగుని ఆధ్వర్యంలో, ఆయన ఆజ్ఞ ప్రకారం దశరథుడు అశ్వమేధయాగమూ, పుత్రకామేష్టి ఈ రెండు యాగాలు చేసి, సంతానఫలాన్ని పొందాడు. ఇది వాల్మీక ప్రమాణం.

అయితే-మన జానపద సాహిత్యం లోనూ, స్త్రీల పాటలలోనూ -దశరథుండు శాంత అనే బాలికను పెంపకం తెచ్చుకొన్నట్లు ఆమెను పెంచుకొన్నందువల్ల దశరథునికి సంతానం కలిగినట్లుగా ఉంది. దీనికి వాల్మీకి రామాయణంలో ఆధారం లేదు. లక్ష్మణదేవర నవ్వు, ఊర్మిళాదేవి నిద్ర, లక్ష్మణరేఖ - ఇటువంటి అవాల్మీకములైన విషయాలెన్నో మన జానపద సాహిత్యంలో పాటలుగా, పదాలుగా ఉన్నాయి. కానీ ప్రామాణికత విషయంలో వాల్మీకమే శిరోధార్యం కాబట్టి - దానినే స్వీకరించవలసి ఉంది. విచిత్ర రామాయణం, ఆశ్చర్యరామాయణం- ఇత్యాది గ్రంథాలలో అనేక ఇతర విధాలుగా ఉన్నా-అవి ప్రామాణికాలు కావు. రామాయణగాథకు వాల్మీకి రామాయణమూ, భారతాగాధకు వ్యాసభారతమే పరమప్రమాణాలు. ఋష్యశృంగుని గాధ, హరివంశంలోనూ, వ్యాసభారతంలోనూ వాల్మీకి రామాయణంలోనూ కూడా చెప్పబడింది. జనకమహారాజు భార్యపేరు రత్నమాల.

271. కుంభకర్ణుని జీవిత చరిత్రను గురించి వివరించగలరని కోరుతున్నాము.

కుంభకర్ణుడు - విశ్రవోబ్రహ్మకు కైకసి అనే భార్య యందు జన్మించిన కుమారుడు. ఇతని తల్లిపేరు పుష్పోత్కట అని పాఠాంతరం. కుంభకర్ణుడు రావణాసురుని తమ్ముడు. కుంభకర్ణుడు జన్మించగానే జంతుజాలాన్ని మింగడానికి ప్రయత్నించాడు. అది చూచి ఇంద్రుడు వీనిని బాణాలతో కొట్టాడు. కుంభకర్ణునిది పెద్ద ఆకారం. దానికి తగిన ఆకలి. కుంభకర్ణునిముందు ప్రాణులు ఆగేవి కాదు. ఎన్ని జంతువులైనా అతడి ఆకలికి చాలేవి కాదు. కుంభ కర్ణునిచేష్టలకు భయపడి ఇంద్రుడు - బ్రహ్మతో చెప్పుకున్నాడు.

రావణాసురుడు తపస్సుకు వెళ్లినప్పుడు అతనితో కుంభకర్ణుడు కూడా వెళ్లాడు. రావణుని కంటే ఘోరమైన తపస్సు బ్రహ్మను గురించి కుంభకర్ణుడు చేశాడు. కుంభకర్ణుని తపస్సుకు దేవతలంతా

భయభ్రాంతులయ్యారు. దేవతాలంతా బ్రహ్మను దర్శించి - ''కుంభకర్ణునికి లోకాలను మట్టుపెట్టే శక్తి ఇంతకుముందే ఉంది. ఇక వాని భీకరత్వానికి తపోబలం కూడా తోడయితే వాని ముందు లోకాలు నిలవవు. ఆ దుష్టుణ్ని వంచించి స్వల్పవరాన్ని మాత్రం ఇమ్మని'' ప్రార్థించారు.

బ్రహ్మదేవుడు దేవతల ప్రార్థనకు అంగీకరించాడు. సరస్వతీదేవిని కుంభకర్ణుని నాలుకమీద ఉండి, ఆరునెలలు నిద్ర, ఆరునెలలకొకరోజు తిండి,వరంగా కోరేలా చేయమని చెప్పాడు బ్రహ్మ. సరస్వతీదేవి కుంభకర్ణుని నాలుకమీద ఉండి, కుంభకర్ణుడు ఆ విధంగా వరం కోరేలా చేసింది. కుంభకర్ణునికి బ్రహ్మ ఆ వరాలు ప్రసాదించాడు. అనంతరం కుంభకర్ణుడు,తాను కోరిన వరాలకు చింతించాడు.

కుంభకర్ణుని వరాల సంగతిని విశ్రవో బ్రహ్మ విన్నాడు. బ్రహ్మదేవుని దర్శించి కుంభకర్ణునికిచ్చిన వరాలను మార్చమని కోరాడు. కానీ అది అసాధ్యం అని బ్రహ్మ చెప్పాడు. సంవత్సరంలో ఆరు మాసాల పాటు నిద్రించి, ఆ తర్వాత ఒక రోజు మెలకువగా ఉంటాడనీ, మెలకువగా ఉన్న ఆరోజున మహాబలిష్ఠుడై ఉంటాడనీ, కుంభకర్ణుని నిద్రలో ఉండగా లేపితే మాత్రం అతడి శక్తి తగ్గిపోతుందనీ బ్రహ్మ చెప్పాడు.

కుంభకర్ణుని నిద్ర నిమిత్తం రావణాసురుడు లంకలో ఒక భవనాన్ని కట్టించి ఇచ్చాడు. బలి చక్రవర్తి మనుమరాలైన వజ్రజ్వాలను కుంభకర్ణునికిచ్చి వివాహం చేశాడు-రావణుడు. కుంభుడు, నికుంభుడు- కుంభకర్ణుని సంతానం. రాముడు వానరులతో లంకకు వచ్చి యుద్ధం చేసేనాటికి కుంభకర్ణుడు నిద్రపోతున్నాడు. ఎందరో రాక్షస వీరులు ఆ యుద్ధంలో మరణించడంతో రావణుడు కుంభకర్ణుని నిద్రలేపించాడు. కుంభకర్ణుడు ఒకసారి మేరు పర్వతం సమీపం నుంచి వస్తూ ఉంటే - విష్ణుమూర్తి అవతరించి రాక్షసులను సంహరిస్తాడని అక్కడి వారు చెప్పుకోవడం విన్నాడట కుంభకర్ణుడు ఆ విషయాన్ని రావణునికి చెప్పి, రాముడే నారాయణుడు కావచ్చుననీ, సీతను రామునికిచ్చివేసి రాక్షస నాశనాన్ని ఆపమనీ

రావణునికి హితవు చెప్పాడు. కానీ కుంభకర్ణుడు చెప్పిన హితవాక్యాలు రావణునికి రుచించలేదు. పౌరుషం ఉంటే యుద్ధం చేయమనీ, లేకపోతే వెళ్లి నిద్రించమన్నాడు రావణుడు. ఆమాటలతో కుంభకర్ణునికి పౌరుషం వచ్చింది. కుంభకర్ణుడు వెళ్లిరామాదులతో యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో అసంఖ్యాకమైన వానరసేనను కుంభకర్ణుడొక్కడే చంపాడు. ఒక సమయంలో కుంభకర్ణుని వల్ల రామునికి కూడా యుద్ధం బరువయింది. చివరకు రామలక్ష్మణుల చేతుల్లో కుంభకర్ణుడు మరణించాడు. విష్ణుమూర్తి ద్వారపాలకులైన జయవిజయులలో విజయుడే కుంభకర్ణుడుగా జన్మించాడు (సనకసనందనాదుల శాపం వల్ల)

272. మాలి, సుమాలి, మాల్యవంతుడు – వీరు ఎవరు? దేవతలా? రాక్షసులా, గంధర్వులా వీరిలో వీరికి గల సంబంధం ఏమిటి?

మాలి, సుమాలి, మాల్యవంతుడు- వీరు ముగ్గురూ అన్నదమ్ములు, రాక్షసులు

273. యమధర్మరాజుకు వివాహమయిందా? ఆయన భార్య, లేదా భార్యల పేర్లు ఏమిటి?

యమధర్మరాజు వివాహితుడే. ఆయన భార్యల పేర్లు ఇవి : శ్యామలాదేవి, విజయ, ధూమోర్ణ.

274. విష్ణుమూర్తి వామనావతారంలో బలిచక్రవర్తిని పాతాళానికి నెట్టివేస్తాడు. అసలు బలిచక్రవర్తి చేసిన అపరాధం ఏమిటి అన్నది తెలుపగలరు.

బలి చక్రవర్తి స్వర్గసంపదను అపహరించుకొనిపోయాడు. అతడిని దేవతలు తరమగా ఆ సంపద సముద్రంలో పడిపోయింది. దానిని తిరిగి పొందే నిమిత్తం క్షీరసాగర మధనం చేయవలసివచ్చింది. అంతేగాక – అనంతర కల్పంలో తాను పొందవలసి వున్న ఇంద్రపదవి కోసం బలిచక్రవర్తి అప్పుడే ప్రయత్నించాడు.

రామాయణ ప్రశ్నల విభాగం సమాప్తం.

మహాభారత ప్రశ్నల విభాగం

275. శ్రీకృష్ణుని అష్ట భార్యలెవరు? శ్రీకృష్ణుడు వారిలో ఒక్కొక్కరిని ఏవిధంగా వివాహం చేసుకున్నాడు? శ్రీకృష్ణుని అష్ట భార్యలు ఎవరి కుమార్తెలు?

రుక్మిణి సత్యభామ, జాంబవతి, మిత్రవింద, కాళింది, నాగ్నజితి, లక్షణ, భద్ర - వీరు శ్రీకృష్ణుని అష్టభార్యలు.

రుక్మిణి-కుండినపురం రాజధానిగా విదర్భ రాజ్యాన్ని ఏలిన భీష్మకుడనే రాజు కూతురు. రుక్మి, రుక్మధరుడు, రుక్మబాహువు, రుక్మకేశుడు, రుక్మనేత్రుడు అనేవారు ఐదుగురూ భీష్మకుని పుత్రులు, రుక్మిణికి అన్నలు.

రుక్మిణికి యుక్త వయస్సు వచ్చింది. రుక్మిణికి పెద్ద అన్నగారైన రుక్మికి చేది దేశానికి రాజైన శిశుపాలుడు, జరాసంధుడు మిత్రులు. రుక్మిణిని శిశుపాలుని కిచ్చి వివాహం చేయాలని రుక్మి అభిప్రాయం. రుక్మిణీ స్వయంవరానికై భీష్మకుడు రాజులను, రాజపుత్రులనూ ఆహ్వానించి రప్పించాడు. రుక్మి ఆహ్వానం పైన శిశుపాలుడు, జరాసంధుడు వచ్చి కుండనపురంలో విడిదిచేసి ఉన్నారు.

రుక్మిణి చిన్ననాటి నుండీ శ్రీకృష్ణుని గుణరూపాలను గురించి విని శ్రీకృష్ణుణ్నే వివాహమాడలని నిశ్చయించుకుంది. శ్రీకృష్ణునికితన స్వయంవరాహ్వానం అందిందో లేదో, అతడు వస్తాడో రాడోనని భయపడి - తనను రాక్షస వివాహ పద్ధతిలోనైనా తీసుకొని పొమ్మని ఒక బ్రాహ్మణుని ద్వారా శ్రీకృష్ణునికి వర్తమానం పంపించింది రుక్మిణి. ఆ వర్తమానం అందుకొని శ్రీకృష్ణుడు కుండిన పురానికి వచ్చి విరోధివర్గానికి చెందిన రాజులనోడించి - రాక్షస వివాహ విధానంలో రుక్మిణిని తీసుకొని వెళ్ళాడు.

రుక్మిణిఅన్నగారైన రుక్మి శ్రీకృష్ణుని నిరోధించాడు. రుక్మిని శ్రీకృష్ణుడు చంపబోయాడు. రుక్మిణి తన అన్నను కాపాడమని వేడుకొంది. శ్రీకృష్ణుడు వానికి మీసమూ, తలాసగం సగం గొరిగించి విడిచిపెట్టాడు.

జాంబవతి :- భల్లూకరాజైన జాంబవంతుని పుత్రిక. శ్యమంతక మణికై వెతుకుతూ వచ్చిన శ్రీకృష్ణుడు - ఆ మణిని జాంబవంతుని గుహలో చూచాడు. ఆ మణిని తీసుకొని పోబోగా శ్రీకృష్ణుని మీదకు జాంబవంతుడు యుద్ధానికి వచ్చాడు. శ్రీకృష్ణునితో కొన్ని దినాలు యుద్ధం చేసి చివరకు శ్రీకృష్ణుడే తన ఆరాధ్యదైవమైన శ్రీరాముడని జాంబవంతుడు తెలుసుకొన్నాడు. తన కుమార్తెయైన జాంబవతిని శ్రీకృష్ణునికి భార్యగా ఇచి శ్యమంతకమణిని కూడా ఇచ్చి పంపాడు జాంబవంతుడు.

సత్యభామ : సత్రాజిత్తు అనే రాజు పుత్రిక.సత్రాజిత్తు -సూర్యునారాధించి శ్యమంతకమణిని పొందాడు. ఆ మణి రోజుకు ఎనిమిది బారువుల బంగారాన్ని ఇచ్చేది.లోకహితార్థంగా ఆ మణిని తనకిమ్మని శ్రీకృష్ణుడు సత్రాజిత్తునడిగాడు. కాని సత్రాజిత్తు ఇవ్వలేదు. ఒకనాడు సత్రాజిత్తుకు తమ్ముడైన ప్రసేనుడు శ్యమంతకమణిని ధరించి వేటకు వెళ్ళాడు. అడవిలో సింహం ఒకటి ప్రసేనుడిని చంపింది. మాంసఖండమని భ్రమించి ఆ మణిని సింహం తీసుకుపోయింది. సింహాన్ని వధించి జాంబవంతుడు శ్యమంతక మణిని తన గుహకు తీసుకువెళ్లాడు. తన తమ్ముని చంపి శ్రీకృష్ణుడే శ్యమంతకమణిని అపహరించాడని సత్రాజిత్తు - శ్రీకృష్ణుని మీద నిందవేశాడు. ఆ నిందను పోగొట్టుకోవడానికై శ్రీకృష్ణుడు అరణ్యానికి వెళ్ళి సింహపుకాలి గుర్తులను బట్టి, జాంబవంతుని కాలిగుర్తులను బట్టి శ్రీకృష్ణుడు మణికై అన్వేషిస్తూ జాంబవంతుని గుహకు వెళ్లాడు.

శ్రీకృష్ణుడు మణిని తెచ్చి సత్రాజిత్తుకిచ్చి -జరిగిన వృత్తాంతాన్ని తెలియపరిచాడు. నిజం తెలుసుకొని సత్రాజిత్తు పశ్చాత్తాపం చెంది - తన కుమార్తె యైన సత్యభామను శ్రీకృష్ణునికిచ్చి వివాహం చేశాడు. శ్యమంకమణిని శ్రీకృష్ణునికివ్వగా అతడు ఆ మణిని తిరిగి సత్రాజిత్తుకే ఇచ్చాడు.

నాగ్నజితి :- కోసల దేశానికి రాజైన నగ్న జిత్తుకు పుత్రిక నాగ్నజితి కోసల దేశ రాజధానిలో ఏడు వృషభాలు విజృంభించి లోకులకు అపాయాన్ని కలిగిస్తూ ఎవ్వరికీ పట్టుబడక ఉండేవి. ఆ వృషభాలను ఎవరైతే లొంగదీసి బంధిస్తారో వానికి తనకుమార్తెయైన నాగ్నజితినిచ్చి వివాహం చేస్తానని కోసలరాజైన నగ్నజిత్తు ప్రకటించాడు. అప్పుడు శ్రీకృష్ణునికి తన కుమార్తెనిచ్చి వివాహం చేసి కానుకలిచ్చి పంపించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు వెళ్ళి పర్వతాకారం కలిగిన ఆ వృషబాలను లొంగదీసి బంధించాడు. నగ్నజిత్తు అప్పుడు శ్రీకృష్ణుడు నాగ్నజితితో ద్వారకకు వెడుతుండగా- అంతకుముందు ఆ వృషభాలను బంధించడానికి ప్రయత్నించి ఓడిన రాజులు కొందరు అసూయతో శ్రీకృష్ణుని దారిలోఎదిరించారు. శ్రీకృష్ణుడు అర్జునునితో కలిసి వాళ్లను ఓడించి తరిమివేశాడు.

లక్షణ : బృహత్సేనుడనే రాజు పుత్రిక లక్షణ. ఈమె కూడా శ్రీకృష్ణుని గుణ రూపాదులను గురించి విని - శ్రీకృష్ణునే వివాహం చేసుకోవాలనే అభిప్రాయంతో ఉండేది. లక్షణ ఉద్దేశాన్ని ఆమె తండ్రి గ్రహించాడు. లప్పుడు బృహత్సేనుడు ఒక మత్స్యయంత్రాన్ని నిర్మించాడు. బయటకు ఆ మత్స్యం కనిపించదు. కాని కింద ఉన్న నీటిలో కనిపిస్తుంది. ఆ మత్స్యాన్ని తాను అక్కడ ఉంచిన పెద్ద ధనుస్సుతో కొట్టినవానికి తన కుమార్తెనిచ్చి వివాహం చేస్తానని బృహత్సేనుడు ప్రకటించాడు. అనేకమంది రాజపుత్రులు వచ్చి ఆ మత్స్యయంత్రాన్ని కొట్టడానికి ప్రయత్నించి కృతకృత్యులు కాలేకపోయారు. శ్రీకృష్ణుడు వచ్చి ఆ మత్స్యయంత్రాన్ని కొట్టి లక్షణను తీసుకొని ద్వారకకు వచ్చాడు. అడ్డు వచ్చిన విరోధి రాజులను తరిమికొట్టాడు. అనంతరం బృహత్సేనుడు ద్వారకానగరానికి వచ్చి శ్రీకృష్ణునికి లక్షణనిచ్చి వివాహం చేశాడు.

కాళింది : - ఈమె సూర్యుని కుమార్తె. కాళింది విష్ణుమూర్తిని వివాహం చేసుకోగోరి తపస్సు చేసింది. కృష్ణుడు, అర్జునుడు యమునా నదీ తీరానికి వెళ్లినప్పుడు అక్కడ కాళింది కనిపించింది. ఆమె వివరాలు

తెలుసుకొని రమ్మని కృష్ణుడు అర్జునుని పంపించాడు. అర్జునుడు వెళ్లి ఆమె ఎవరో మొదలైన వివరాలు తెలుసుకొనగోరి ప్రశ్నించగా - కాళింది తాను సూర్యుని పుత్రికననీ, శ్రీమహావిష్ణువును పతిగా కోరి తపస్సు చేస్తున్నాననీ, శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణుడు వచ్చి తనను వరిస్తాడని తన తండ్రియైన సూర్యదేవుడు తనకు తెలిపాడనీ చెప్పింది. అది విని శ్రీకృష్ణుడు కాళిందిని తన రథంలో ఎక్కించుకొని ద్వారకకు తీసుకొనివెళ్లి ఆమెను వివాహం చేసుకొన్నాడు.

మిత్రవింద:- ఈమె శ్రీకృష్ణునికి మేనత్తయైన రాజాధిదేవి పుత్రిక. అవంతీ దేశాధీశులైన విందానువిందుల చెల్లెలు. మిత్రవిందకు అన్నలైన విందుడు, అనువిందుడు- దుర్యోధునికి మిత్రులు. వారు తమ చెల్లెలికి వివాహం చేయగోరి స్వయంవరం చాటించారు. ఆ స్వయంవరంలో మిత్రవింద శ్రీకృష్ణుని వరించింది.

భద్ర :- శ్రీకృష్ణుని మరొక మేనత్త, వసుదేవుని మరొక చెల్లెలు శ్రుతకీర్తి. ఈ శ్రుతకీర్తి భర్త -కేకయరాజైన ధృతకేతుడు. వీరి పుత్రికయే భద్ర. ఈ భద్రను శ్రీకృష్ణుడు వివాహం చేసుకొన్నాడు.

276. శ్రీమద్భాగవతంలో రాధ పాత్ర లేనే లేదని చెప్పగా విన్నాము. అలాంటప్పుడు 'రాధాకృష్ణ' అనేది ఇంత ప్రాచుర్యంలోనికెలా వచ్చింది? రాధాకృష్ణుల గురించి ఏ పురాణంలోనైనా వున్నదా? అష్టభార్యలను చేపట్టిన శ్రీకృష్ణుడు ముందుగా ఆరాధించి ప్రేమకే ప్రతి రూపంగా నిల్చిన రాధాదేవిని ఎందువల్ల పెళ్లి చేసుకోలేకపోయాడు? శ్రీకృష్ణుని అష్టభార్యల పేర్లు తెల్పగలరు.

శ్రీమద్భాగవతంలో రాధ పాత్ర అంతర్లీనంగానే కాని ప్రత్యక్ష ప్రస్తావన లేకపోవడానికి కారణం ఉంది. పరీక్షిన్మహారాజుకు భాగవతాన్ని బోధించిన శ్రీ శుక యోగీంద్రులవారు జీవన్ముక్తులు. రాధాదేవి ఆయనకు గురువు. తన గురువైన రాధాదేవిని స్మరించినట్లయితే శ్రీశుకమహర్షి

బాహ్యప్రపంచ స్ఫురణను విస్మరించి సమాధి గతులౌతారు. ఇది మహో రహస్యమైన విషయం.

శుక మహర్షి బాహ్య జగత్తును విస్మరిస్తే – ఏడు రోజుల్లో మరణించబోతున్న పరీక్షిన్మహారాజుకు ముక్తిని సిద్ధించే నిమిత్తం శుక యోగీంద్రులు బోధిస్తున్న భాగవత ప్రవచనం ఆగిపోతుంది. భాగవత శ్రవణానికి అటువంటి విఘాతం కలగకుండా ఉండే నిమిత్తమే – శుక మహర్షులవారు రాధాదేవిని ప్రత్యక్షంగా ప్రస్తావించలేదు. రాధాదేవిని శ్రీకృష్ణుడు వివాహంచేసుకోకపోవడానికి కారణం ఆమెకు గల శాపమే. భూలోకంలో జన్మించి, రాయణుడనే మూఢునికి భార్యవు కమ్మనీ, నూరు సంవత్సరాలపాటు శ్రీకృష్ణ విరహంతో తపించమనీ, శీలరహితురాలిగా నిందలు పొందమనీ ఆమె పొందిన శాపంవల్లనే రాధాదేవి శ్రీకృష్ణునికి భార్యకాలేకపోయింది. భాగవతంలో రాధాదేవి అంతర్లీనంగా ఉంది. అనేక ఇతర పురాణాలలో రాధాదేవి ప్రసక్తి వుంది. శ్రీకృష్ణుని అష్టభార్యల పేర్లు : రుక్మిణీదేవి, సత్యభామాదేవి, జాంబవతి, భద్ర, లక్షణ, నాగ్నజితి, మిత్రవింద, కాళింది.

277. కృష్ణుని మేనమామ కంసుడు కదా? ఆ వంశంలో కంసుని వంటి రాక్షసుడు ఎలా జన్మించాడు? అది విడ్డూరంగా లేదా?

కంసుడు ఉగ్రసేనుని క్షేత్రజ కుమారుడు. ఉగ్రసేనుని భార్య, కొందరు యాదవ స్త్రీలతో కలిసి యమునానదికి స్నానార్థం వెళ్ళింది. అక్కడ ఉగ్రసేనుని భార్య యొక్క మనస్సు ఆమె భర్తపైన లగ్నమయింది. ఆమె మనస్సు రాగాయత్తం కావడాన్ని ద్రవిళుడనే రాక్షసుడు గ్రహించాడు. కామరూప విద్యచేత ఉగ్రసేనుని రూపాన్ని ధరించి ద్రవిళుడు ఉగ్రసేనుని భార్యను సమీపించాడు. అనంతరం ఉగ్రసేనుని భార్య తాను వంచించబడినట్లు తెలుసుకొంది. ''నీవెవడ'' వని ప్రశ్నించింది. ''నేను ద్రవిళుడనే రాక్షస్సుడ'' నని ఆ దానవుడు తెలిపాడు. అంతేగాక తాను చేసిన

పనిని సమర్థించుకోవడంతో ఉగ్రసేనుని భార్యకు కోపం వచ్చింది. జన్మించబోయే బాలుడు (ద్రవిళుని కుమారుడు) హరివంశంలో పుట్టబోయే వాని చేతిలో మరణిస్తాడని శపించింది. అనంతరం కాలనేమి అనే రాక్షసుడే ఉగ్రసేనుని భార్యకు పుత్రుడై జన్మించాడు. అతడు ద్రవిళుని కుమారుడు కావడంవల్ల రాక్షసాంశతో జన్మించాడు. అతడే కంసుడు.

278. నరనారాయణులలో నారాయణుడు కృష్ణుడుగా జన్మించాడు. నారాయణుడు విష్ణుమూర్తి అని తెలుసు. మరి నరుడు అర్జునుడుగా జన్మించాడని అంటారు. నరుడు అంటే ఎవరు?

నరనారాయణులిద్దరూ ఆది ఋషులు. విష్ణంశసంభూతులు. బదరికాశ్రమంలో తపస్సు చేసుకొనే వారు. వారే కృష్ణార్జునులుగా జన్మించారు.

279. ద్యూతానంతరం ద్రౌపదిని తీసుకుని రమ్మని దుర్యోధనుడు ప్రాతికామిని పంపినప్పుడు ద్రౌపది "నన్నోడి తన్నోడెనా? తన్నోడి నన్నోడెనా? నేను ధర్మ విజితనా? అధర్మ విజితనా?" తెలుసుకుని రమ్మని తిప్పి పంపుతుంది. దీనిలోని సూక్ష్మమును వివరించండి.

ధర్మరాజు జూదంలో తమ్ములను, తనను ద్రౌపదిని పణంగా పెట్టి ఓడిపోయాడు. అప్పుడు విదురుని హితబోధలను లెక్కచేయక దుర్యోధనుడు ప్రాతికామిని అంతఃపురంలోకి వెళ్లి ద్రౌపదిని సభకు (తమ దాసిగా) తీసుకుని రమ్మని పంపించాడు.

ప్రాతికామి ద్రౌపది వద్దకు వెళ్లి దుర్యోధనునితో జూదమాడి ధర్మరాజు ఓడిపోయాడనీ, దుర్యోధనుడు ద్రౌపదిని సభకు రమ్మనాడనీ తెలిపాడు. అది విని నిశ్చేష్టురాలైన ద్రౌపదిప్రాతికామిని ప్రశ్నించి జరిగిన విషయమంతా తెలుసుకుంది. అప్పుడు ద్రౌపది ప్రాతికామినితో "ఓయీ! నీవు తిరిగి సభకు వెళ్లి ధర్మరాజు ముందుగా తనను తాను పణంగా పెట్టుకుని ఓడిపోయి, ఆ తర్వాత నన్ను పణంగాపెట్టి ఓడినాడా? లేక ముందుగా నన్ను ఒడ్డి ఓడిపోయి, ఆ తర్వాత తనను తాను ఒడ్డి ఓడి పోయినాడా? ఈ

విషయాన్ని నీవు సభకు వెళ్లి తెలుసుకునిరా!'' అని చెప్పింది ప్రాతకామిని సభకు వెళ్లి ద్రౌపది అడిగిన ప్రశ్నలకు బదులివ్వమని ధర్మరాజును అడిగాడు. ధర్మరాజు దుఃఖంతో ప్రతివచనం చెప్పలేక ఊరుకున్నాడు. దుర్యోధనుడు బలవంతాన ద్రౌపదిని సభకు రప్పించాడు. అప్పుడు ద్రౌపది అడిగిన ప్రశ్నలకు సభికులు ఎవరూ ప్రత్యుత్తరం ఇవ్వలేక ఊరుకున్నారు. భీష్ముడు మాత్రం పాండవులు ఐదుగురికీ ధర్మపత్ని అయిన ద్రౌపదిని జూదంలో ఒడ్డే అధికారం ధర్మరాజుకు లేదని చెప్పాడు. ఇతర సభికులెవరూ ద్రౌపదిప్రశ్నలకు ప్రతివచనం చెప్పకపోవడమూ, దుర్యోధన దుశ్శాసనుల ఔద్ధత్యమూ చూసి అదంతా అధర్మంగా భావించి వికర్ణుడు ఇలా చెప్పాడు.

''పరస్త్రీ వ్యసనం, వేట, జూదమూ, మద్య పానమూ'' అనే ఈ నాలుగూ వ్యసనాలలోను ఏ ఒక్క దానిలోనైనా నిమగ్నుడైన రాజు ధర్మాన్ని విడిచిపెడతాడు. అటువంటి స్థితిలో అతడు చేసే పనులను లోకం హర్షించదు. ద్యూతవ్యసనమగ్నుడైన ధర్మరాజు చేసిన ఈపని న్యాయం కాదు. తనను తాను ఓడిపోయిన తర్వాత ద్రౌపదిని పందెంగా పెట్టే అధికారం ధర్మరాజుకు లేదు. తనమీద తనకే హక్కులేని ధర్మరాజుకు ద్రౌపదిని పందెంగా పెట్టే అధికారం లేదు. అంతేగాక ఈ ద్రౌపది పాండవులు ఐదుగురికీ ధర్మపత్ని. కాబట్టి ఆమెను పణంగా పెట్టే అధికారం ధర్మరాజుకు లేదు. ఈ కారణాల చేత ద్రౌపది జూదంలో కౌరవుల చేత గెలువబడినది కానేరదు. మరొక విషయం - కుల స్త్రీ అయిన ద్రౌపదిని బలవంతంగా సభకు తీసుకునిరావడం అధర్మం'' అని స్పష్టంగా చెప్పాడు.

ఈపైన వికర్ణుడు చెప్పినవే దీనిలోని ధర్మ సూక్ష్మాలు. నిర్ద్వంద్వంగా ధర్మాన్ని చెప్పిన వికర్ణుని సభికులంతా ప్రశంసించారు. శకునిని తప్పు పట్టారు. ఈ వికర్ణుడు కర్ణుని పుత్రుడని చాలామంది భావించడం కద్దు. కానీ అది సరికాదు. వికర్ణుడు ధృతరాష్ట్రునికి గాంధారి యందు కలిగిన నూరుగురు పుత్రులలోని వాడు. దుర్యోధనుని సోదరులలోనివాడు.

280. మహాభారతంలో ధృతరాష్ట్రుని జ్యేష్ఠపుత్రుని పేరు సుయోధనునిగా పేర్కొనబడింది. నిజంగా అతడు గొప్పయోధుడు. కాని అతడిని దుర్యోధనునిగా ఎవరు ఎక్కడ మార్చారు? అసలు పేరు సుయోధనుడే అయినా దుర్మార్గుడు కావడం వల్ల దుర్యోధనుడనే పేరు వచ్చిందని విన్నాము. నిజమా – తెలుపగలరు.

దుర్యోధనుడనే పేరుకు చెడ్డ అర్థం ఏమీ లేదు. దుర్యోధనుడు, సుయోధనుడు – అనే రెండు పేర్లూ అతడి శౌర్యాన్నీ యుద్ధ కౌశల్యాన్నీ తెలియజేసేవే. ఆ రెండు పేర్లకూ మంచి అర్థమే ఉంది. ఆ రెండు పేర్లూ అతడికి ప్రారంభం నుంచీ ఉన్నవే. దుర్మార్గుడు అయ్యాడు కనుక దుర్యోధనుడే పేరు వచ్చిందనడం సరికాదు. ఆ పేరులో చెడ్డేమీలేదు.

281. బభ్రువాహనుడు ఎవరు? అతడి జన్మ వృత్తాంతం ఏమిటి? బభ్రువాహనుని చరిత్రను తెలియజేయండి.

పాండవ మధ్యముడైన అర్జునుడు తీర్థయాత్రకు వెళ్లినప్పుడు మణిపుర రాజైన చిత్రవాహనుని కుమార్తె అయిన చిత్రాంగదను వివాహం చేసుకున్నాడు. చిత్రాంగదయందు అర్జునునికి కలిగిన కుమారుడే బభ్రువాహనుడు. చిత్రవాహనునికి చిత్రాంగద ఏకైక పుత్రిక కావడంవల్ల మామగారి కోరికపైన అర్జునుడు చిత్రాంగదను, బభ్రువాహనుని ఆమె తండ్రి ఇంటనే విడిచివెళ్ళాడు. తర్వాత చిత్రవాహనుడు బభ్రువాహనునికి తన రాజ్యాన్నిచ్చాడు.

అనంతరకాలంలో కురుక్షేత్ర యుద్ధానంతరం ధర్మరాజు అశ్వమేధ యాగాన్ని నిర్వర్తించాడు. ఆ యాగాశ్వం వెంట అర్జునుడు సైన్యసమేతుడై తరలివెళ్లాడు. ఆ వార్త విని బభ్రువాహనుడు తన తండ్రిని చూడాలనే ఉత్సాహంతో అర్జునునికి ఎదురువెళ్లి స్వాగతసత్కారాలు చేసి తన పురానికి తండ్రిని ఆహ్వానించాడు. కానీ అర్జునుడు పుత్రుని ఆదరించలేదు. ''పౌరుషవంతుడైన రాజయితే యాగాశ్వాన్ని బంధించి యుద్ధం చేయాలికానీ

ఈ విధంగా ప్రాణభయంతో వచ్చి నమస్కరిస్తాడా? నీవు నావంశీయుడవైతే అశ్వాన్ని బంధించు. వీరునివలె ఎదిరించి పోరాడు'' అని బభ్రువాహనుని సవాలు చేసి రెచ్చగొట్టాడు. అదే సమయానికి నాగలోకం నుంచి ఉలూచి వచ్చి బభ్రువాహనునికి తాను కూడా తల్లినే అని తెలిపి అర్జునుని ఎదిరించి యుద్ధం చేయమని బోధించింది. ఉలూచి ప్రబోధంతో బభ్రువాహనుడు పౌరుషం తెచ్చుకుని అర్జునునితో పోరాడాడు.

అనంతరం జరిగిన యుద్ధంలో అర్జునుడు, బభ్రువాహనుడూ భీషణంగా పోరాడి ఇద్దరూ రణభూమిలో పడిపోయారు. ఆ వార్త తెలిసివచ్చిన చిత్రాంగద, ఉలూచి ఇద్దరూ దుఃఖించారు. యుద్ధం చేయమని బభ్రువాహనుని ప్రోత్సహించినందుకు చిత్రాంగద ఉలూచిని నిష్ఠుర వాక్యాలాడి – పతినీ పుత్రునీ బ్రతికించమని ప్రార్థించింది. అప్పుడు ఉలూచి నాగలోకం నుంచి సంజీవనీ మణిని తెప్పించి వారిద్దరినీ బ్రతికించింది. అర్జునుడు తన భార్యలనూ కుమారులనూ ఆదరించాడు.

పాఠాంతరం : బభ్రువాహనుని బాణఘాతం వల్ల అర్జునుడు విగతజీవుడై పడిపోయాడు. జరిగినదానికి ఉలూచి, చిత్రాంగద దుఃఖించారు. నాగలోకానికి వెళ్లి తన తండ్రినడిగి సంజీవనీ మణిని తీసుకురమ్మని ఉలూచి – బభ్రువాహనుని పంపించింది. ఉలూచి చెప్పిన ప్రకారంగా బభ్రువాహనుడు నాగలోకాని వెళ్ళి మణినివమ్మని అడిగాడు. కాని నాగులు అందుకు నిరాకరించారు. బభ్రువాహనుడు వచ్చి ఆ విషయాన్ని ఉలూచితో చెప్పాడు. ఉలూచికి చాలా ఆగ్రహం కలిగింది.

ఉలూచి, చిత్రాంగదల అనుమతితో బభ్రువాహనుడు నాగలోకం పైకి యుద్ధానికి వెళ్లాడు. ధృతరాష్ట్రుడనే నాగుడు – బభ్రువాహనునితో యుద్ధం చేసి పరాజితుడయ్యాడు. తన కుమారులు సంజీవినీ మణిని ఇచ్చేది లేదని బభ్రువాహనునికి చెప్పడమే ఈ యుద్ధానికి కారణమని ధృతరాష్ట్రునికి అప్పుడు తెలిసింది. ధృతరాష్ట్రుడు వెంటనేతన కుమారులను మందలించి, బభ్రువాహనునికి సంజీవినీ మణినిచ్చి పంపాడు.

జరిగిన దానికి ధృతరాష్ట్రుని కుమారులకు చాలా కోపం వచ్చింది. వారు బభ్రువాహనుని ప్రయోజనాన్ని పాడుచేయదలచి – అతడి కంటే త్వరగా వచ్చి అర్జునునిశిరస్సును అపహరించారు.

బభ్రువాహనుడు మణిని తీసుకుని వచ్చాడు. కానీ ఆ సమయానికి అర్జునుని శిరస్సుమాయం కావడంతో అందరూ విచారగ్రస్తులయ్యారు. అప్పుడు ఉలూచి ప్రభోదంతో బభ్రువాహనుడు, మిగిలినవారు శ్రీకృష్ణుని ప్రార్థించారు. అంతట అర్జునుని శిరస్సు కనబడింది. అప్పుడు బభ్రువాహుడు సంజీవనీమణి చేత అర్జునుని జీవింపచేశాడు. అర్జునుడు తన భార్యలైన ఉలూచి, చిత్రాంగదలను, వారి కుమారులను ఆదరించాడు.

282. శకుని ఎవరి కుమారుడు? ఏ రాజ్యానికి చెందినవాడు? శకుని సంతానం ఎవరు? శకునికి ద్వేషం పాండవుల మీదనా, కౌరవులమీదనా? శకుని ఉద్దేశ్యం దుర్యోధనునికి మేలు చేయాలనా, కౌరవులను నాశనం చేయాలనా? శకుని చేష్టలకు కారణం ఏమిటి?

పాండవులపైన శకునికి ప్రత్యేకమైన పగకు కారణం ఏదీలేదు. దుర్యోధునికి ముఖప్రీతి కలిగించడం కోసం దుర్యోధనుని పక్కన చేరి మెరమెచ్చు మాటలు పలకడమూ, దుష్టమైన సలహాలివ్వడమూ – ఇదే శకుని పాత్ర. దుర్యోధునికి పాండవులపైన పగ, ద్వేషమూ ఉన్నాయి. శకుని వాటిని పెంచిపోషించాడు. హస్తినాపురం రాజ్యంలో అధికారం కలిగి ఉన్న దుర్యోధనుని ప్రీతికోసం, అతడి ప్రాపకాన్ని సంపాదించడం కోసం, పాండవులను నాశనం చేసే ఉపాయాలు చెప్పేవాడు శకుని. ఆ విధంగా శకుని దుర్యోధనునికి దగ్గరయ్యాడు. ఇప్పటికీ అధికారంలో ఉన్నవారి ప్రాపకాన్ని సంపాదించడానికని వారి పక్కన చేరి మెరమెచ్చు మాటలు పలికేవారెందరో ఉంటూనే ఉంటారు. హితాన్ని కాకుండా ప్రియాన్ని పలికేవారినే ఎక్కువమంది మానవులు తమ దగ్గరకు చేర్చుకుంటూ ఉంటారు.

కటువైనా హితాన్ని కోరిచెప్పె భీష్మ విదురాదుల బోధలు దుర్యోధునినికి అప్రియమయ్యాయి. సర్వనాశనానికి దారి తీసే ప్రీతికరాలైన శకుని బోధలు దుర్యోధనునికి ప్రియమయ్యాయి. శకుని బోధలను తలకెక్కించుకున్న దుర్యోధునుని చేష్టలు చివరకు కురువంశ నాశనానికే కారణమయ్యాయి.

శకుని గాంధార రాజైన సుబలుని కుమారుడు. ధృతరాష్ట్రుని భార్యయైన గాంధారీ దేవికి స్వయంగా సోదరుడు. శకుని కుమారుడు ఉలూకుడు.

283. మహాభారతంలో పరీక్షిత్తుని తండ్రిపేరు, తల్లిపేరు తెలియజేయగలరు.

పరీక్షిత్తుని తండ్రిపేరు అభిమన్యుడు. తల్లి పేరు ఉత్తర. కురుక్షేత్ర యుద్ధంలో అభిమన్యుడు మరణించేనాటికి అతని భార్య ఉత్తర (విరాట రాజపుత్రి) గర్భవతి. గర్భస్థ శిశువులతోసహా పాండవ వంశ నిర్మూలనం కావాలని అశ్వత్థామ అభిమంత్రించి విడిచిన నారాయణాస్త్ర ప్రభావం వల్ల ఉత్తరకు మృతశిశువు జన్మించాడు. ఆ శిశువును సుభద్ర ప్రార్ధనపై శ్రీకృష్ణుడు జీవింపజేశాడు. శ్రీకృష్ణుని దయాప్రభావం వల్ల పునర్జీవితుడైన ఆ శిశువే పరీక్షిత్తు.

284. పరీక్షిన్మహారాజు శాపగ్రస్తుడై సర్పభయంతో ప్రాణరక్షణకై ఒక హర్మ్యాన్ని నిర్మించుకుని దానిలో ఉంటూ సర్పదష్టుడై మరణించాడా? లేక బాహాటంగా శుకమహర్షివల్ల భాగవత కథలు వింటూ సర్పదష్టుడై మరణించాడా?

మునిపుత్రుడు తనను శపించాడని విన్న వెంటనే పరీక్షిన్మహారాజు తన మంత్రులతో ఆలోచించి ఒక ఒంటి స్తంభపు మేడను నిర్మింపజేశాడు. మంత్రతంత్రవేత్తలను, విషవైద్యులను రప్పించి తన దగ్గర ఉంచుకున్నాడు.

మంత్రులతోను, పరివారం తోను కలిసి తాను నిర్మింపజేసుకున్న ఒంటి స్తంభపు మేడలో ని వాసాన్ని ఏర్పాటుచేసుకున్నాడు. ఆ మేడలో ఉంటూనే శుకమహర్షి వల్ల ఏడురోజులపాటు భాగవత పురాణాన్ని విన్నాడు పరీక్షిన్మహారాజు. ఏడవ నాటి సాయంకాలం తక్షకుని కాటు వల్ల మరణించాడు.

285. శ్రీకృష్ణునికి పదహారువేల మంది భార్యలుండేవారని అంటారు కదా? శ్రీకృష్ణుడు పదహారు వేలమందిని ఎందుకు వివాహమాడవలసి వచ్చింది?

మన పురాణాల ప్రకారం శ్రీకృష్ణునికి అష్టమహిషులు, పదహారు వేలమంది ఇతర భార్యలు ఉండేవారన్నమాట నిజమే. ప్రజాకంటకుడైన నరకాసురుని సంహరించడానికి సత్యభామతో సహా ప్రాగ్జ్యోతిషపురానికి వెళ్ళాడు. నరకాసుర సంహారం పూర్తికాగానే నరకాసురుని చెరలో బందీలుగా ఉన్న రాజులను, రాజపుత్రికలను విడిపించాడు శ్రీకృష్ణుడు. నరకాసురుని చెరలో ఉన్న రాజపుత్రికలందరూ శ్రీకృష్ణునే తమ భర్తగా వరించారు. ఆ కారణంగా శ్రీకృష్ణుడు వారినందరినీ వివాహం చేసుకోవలసి వచ్చింది. ఆ విధంగా ఏర్పడినవారే శ్రీకృష్ణుని పదహారువేలమంది భార్యలు. అంతేగాక దీనిలో మరొక ధర్మసూక్ష్మం కూడ ఉంది. నరకాసురుని వంటి రాక్షసుని చెరలో ఉండివచ్చిన ఆ రాజకన్యకలకు సాంఘికంగా ఎదురుకాబోయే అవమానకరమైన పరిస్థితి నుంచి శ్రీకృష్ణుడు ఆ విధంగా వారిని రక్షించాడు.

అంతేకాక – భగవంతుని దర్శనంకోసం, అనుగ్రహం కోసం – అనేక యుగాలుగా తపస్సు చేస్తున్న ఋషులు, శ్రీకృష్ణావతార సమయంలో స్త్రీలై జన్మించి భగవంతుని అనుగ్రహాన్ని పొందారు.

286. ద్రౌపదికి ఐదుగురు భర్తలు కావడానికి కారణమేమిటి? ఏదైనా వరమా, శాపమా? వివరంగా తెలుపగోరుతున్నాం.

పూర్వం మౌద్గల్యుడనే మహర్షి ఉండేవాడు. ఆయనకు కుష్ఠురోగం

కలిగింది. కానీ మౌద్గల్యుని భార్య అయిన ఇంద్రసేన (నాళాయని) ఆయనను ఎంతో ప్రీతితో సేవించేది. ఇంద్రసేన భక్తికీ, సేవలకూ మెచ్చిన మౌద్గల్యుడు ఒకప్పుడు ఆమెకు ఇష్టమైన వరాన్ని కోరుకోమన్నాడు. అప్పుడు ఇంద్రసేన ''ఆర్యపుత్రా! మీరు మీ తపోమహిమ చేత ఐదు గురు సుందర యువకుల రూపాలు ధరించి నన్ను ఆనందింపచేయండి. నా ముద్దు మురిపాలు తీర్చండి. ప్రారబ్ధవశాన వచ్చిన ఈ వ్యాధి పీడిత దేహాన్ని విడిచి ఐదు సుందర రూపాలను ధరించండి'' అని కోరింది.

మౌద్గల్య మహర్షి అప్పుడు ఇంద్రసేన కోరిన విధంగా ఐదుగురు యువకుల రూపాలను ధరించాడు. తన తపోబలం చేత దివ్య విమానాన్ని కల్పించి – దానిలో ఇంద్రసేనతో చాలాకాలం పాటు విహరించాడు. అనేక విధాలైన ఇష్టభోగాలతో ఆమెను సంతోషపెట్టాడు. ఇలా చాలా కాలం జరిగిన తర్వాత మౌద్గల్యుడు తాను సంసారాన్ని విడిచి తపస్సు చేసుకోవడానికి వెళ్ళదలచానని చెప్పాడు. కానీ ఇంద్రసేన మరికొంత కాలం తనతో సంసారంలో ఉండమని ఆయనను కోరింది. అంతట ఆ మౌద్గల్యుడు ఇంద్రసేనతో ''ఓ శుభాంగీ! ఇక ఈ అశాశ్వతమైన సంసారంలో ఉండజాలను. శాశ్వత పరమపదానికి వెళ్ళదలిచాను. సంసారం పట్ల నీకు అనురక్తి పోలేదు. కనుక భూలోకంలో పాంచాల రాజుకు నీవు పుత్రికవై పుట్టి దివ్య జన్మం కలిగిన పాండవులు ఐదుగురికి భార్యవై సర్వ భోగాలనూ పొందగలవు'' అని చెప్పి, మౌద్గల్యుడు తన తపశ్శక్తి చేత పరమపదాన్ని పొందాడు.

ఆ తర్వాత కొంతకాలానికి ఇంద్రసేన చనిపోయి, కాశీరాజుకు పుత్రికయై జన్మించింది. అమిత సౌందర్యరాశి అయిన ఆమెకు తగిన భర్త లభించలేదు. అందువల్ల ఆమె అరణ్యాలకు వెళ్ళి శివుని గురించి తీవ్ర తపస్సు చేసింది. శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా ఆకాశీరాజు పుత్రి – తనకు భర్తను ప్రసాదించమని ఐదు మార్లు అడిగింది. అంతట శివుడు ''ఓ శుభాంగీ! నీకు విశ్వ ప్రసిద్ధులైన ఐదుగురు భర్తలు లభిస్తారు. వారితో నీవు

సకల భోగాలననూ అనుభవిస్తావు. భూలోకంలో నీవల్ల దేవకార్యం నెరవేరగలదు'' అని చెప్పాడు. అప్పుడు కాశీరాజతనయ శివునితో ''ప్రభూ! ఒక స్త్రీకి ఐదుగురు భర్తలుండడం విపరీతం కాదా? ఈ ధర్మసంకటాన్ని నీవే తీర్చాలి'' అని ప్రార్థించింది. ''శుభాంగీ! భర్తను ప్రసాదించమని నీవు నన్ను ఐదుమార్లు కోరావు. ఆ కారణంగా నీకు ఐదుగురు భర్తలు ఉండడం తప్పదు. అది ధర్మవిరుద్ధం కాదు'' అని శివుడు తెలిపాడు.

శివుని ఆజ్ఞననుసరించి దేవకార్యార్థమై ఐదురూపాలతో పంచపాండవులుగా ఇంద్రుడు జన్మించాడు. అందువల్ల పై కారణాల చేత ద్రౌపది పాండవులైదుగురికీ భార్య అయింది.

287. పరాశరుడు ఎవరు ? ఆయన చరిత్ర ఏమిటి?

పరాశర మహర్షి – వశిష్ఠ మహర్షికి మనుమడు. వశిష్ఠుని పుత్రుడైన శక్తియొక్క కొడుకే పరాశరుడు. పరాశరుని తల్లిపేరు అదృశ్యంతి. అదృశ్యంతి గర్భిణీగా ఉండగా ఒక రాక్షసుడు శక్తిని మింగివేశాడు. పరాశరుడు బాలుడుగా ఉండగా ఒకనాడు తల్లిని తన తండ్రి ఎక్కడ అని అడిగాడు. ఆయన ఒక రాక్షసుని చేతిలో మరణించాడని అదృశ్యంతి చెప్పింది.

తాను తన తండ్రిని చూడకోరుతున్నానని పరాశరుడు తన తాతగారైన వశిష్ఠునితో చెప్పాడు. అలాగైతే శివుని గురించి తపస్సు చేయమనీ, ఆయనే పరాశరుని కోరికను తీర్చగలవాడనీ వశిష్ఠుడు పరాశరునికి బోధించాడు. వశిష్ఠుని ఆనతి ప్రకారం పరాశరుడు శివుని గురించి తపస్సు చేశాడు. శివుడు మెచ్చి ప్రత్యక్షంకాగా పరాశరుడు తన తండ్రిని చూపించమని కోరాడు. శివుడు అనుగ్రహించి స్వర్గంలో వున్న శక్తిని పరాశరునికి చూపించాడు.

పరాశరుడు ఇంటికి తిరిగి వచ్చి – తన తండ్రిని అన్యాయంగా రాక్షసుడు చంపాడు కనుక – రాక్షస వినాశనార్థంగా హోమం చేయడం ప్రారంభించాడు. దానివల్ల రాక్షసులు నశించసాగారు. అప్పుడు పులస్త్యుడు మొదలైన ప్రజాపతులు, మహర్షులు వచ్చి ఆ యాగాన్ని మానమని పరాశరుని

కోరారు. వారి కోరిక ప్రకారం పరాశరుడు ఆ యాగాన్ని ఆపి – ఆ యాగాగ్నిని హిమాలయాలకు ఉత్తరంగా విడిచిపెట్టాడు.

పరాశరుడు తీర్థయాత్రలకు వెడుతూ ఉండగా యమునానదీ తీరంలో నావను నడుపుతున్న సత్యవతిని చూచాడు. సత్యవతి దాశరాజు కూతురు. ఆ సమయంలో అక్కడ వ్యాసుని జననం జరగవలసి ఉంది. సత్యవతి కన్యాత్వం దూషితం కాకుండా పరాశరుడు వరమిచ్చి, ఆమెకు యోజన పర్యంతం వ్యాపించగల శరీర సుగంధాన్నిచ్చి ఆమెను అనుగ్రహించాడు. సత్యవతికి కృష్ణద్వైపాయనుడనే వ్యాసుడు జన్మించాడు. ఇదీ పరాశరుని చరిత్ర.

288. జూదంలో ధర్మరాజు తనను తాను ఓడిన తర్వాత ద్రౌపదిని పణంగా పెట్టడానికి అర్హత ఉందా?

ఈ ప్రశ్నను ఆనాడే ద్యూతసభలో ద్రౌపది అడిగింది. ఒక్క వికర్ణుడు మాత్రం ఆమె ప్రశ్నకు ధర్మయుక్తమైన సమాధాన మిచ్చాడు. మిగిలిన సభికులెవరూ ద్రౌపది ప్రశ్నకు సమాధానమివ్వలేదు.

తనను తాను ఓడిపోయిన అనంతరం ద్రౌపదిని పణంగా పెట్టే అధికారం కాని, హక్కు కాని ధర్మరాజుకు లేదని వికర్ణుడు చెప్పాడు. అంతేగాక ద్రౌపది ధర్మరాజుకొక్కనికే భార్య కాదు, పాండువులైదుగురుకీ ధర్మపత్ని కాబట్టి ఉమ్మడి సొత్తు. ఆవిధంగా ఐదుగురు అన్నదమ్ములకూ భార్య అయిన ద్రౌపదిని ధర్మరాజు పందెంలో ఒడ్డే అధికారం అతడికి లేదని వికర్ణుడు తేల్చి చెప్పాడు. వికర్ణుడు చెప్పినదే ధర్మమని సకల ధర్మవేత్త అయిన విదురుడు చెప్పాడు.

289. దుర్యోధనునితో పాటు అతడి తమ్ములు 99 మంది ఒకే రోజున ఒకే సమయాన పుట్టారు కదా? మరి దుర్యోధనుని జన్మ నక్షత్రమూ, అతడి తమ్ముల జన్మనక్షత్రమూ ఒకటే కావాలి కదా? ఎందుకు మారాయో వివరించగలరు.

దుర్యోధనునితో పాటు అతడి తమ్ములూ ఒకే రోజున జన్మించలేదు. ధర్మరాజు జన్మించిన వార్త వినగానే అప్పటికి గర్భవతిగా ఉన్న గాంధారి తనకంటే ముందుగా కుంతీదేవి సంతానవతి అయిందనీ, ఆ పిల్లవాడు భవిష్యత్తులో రాజార్హుడు కాబోతాడనే ఆక్రోశంతో గర్భాన్ని మోదుకున్నది. అప్పుడు ఆమెకు గర్భపతనం జరిగింది. ఆ సమయంలో వ్యాసమహర్షిని ప్రార్థించగా ఆ మహర్షి వేంచేసి, ఆ మాంస ఖండాన్ని నూటఒక్క ముక్కలుగా విభజించి, ఒక్కొక్క దానినీ ఒక్కొక్క నేతి కుండలో ఉంచారు. తనకు నూరుగురు కుమారులూ, ఒక్క కుమార్తె కావాలనే గాంధారి మనోభీష్టాన్ని అనుసరించి ఆయన ఆ విధంగా చేశారు.

అలా ఉంచబడిన కుండలనుంచి దుర్యోధనాదుల జననం జరిగిందనీ, రోజుకు ఒక్క పిల్లవాడు చొప్పున జన్మించారనీ వ్యాసభారతం చెబుతున్నది. కాబట్టి దుర్యోధనుడూ, అతడి తమ్ములూ ఒకేరోజున జన్మించలేదు.

290. అశ్వత్థామ పుట్టుక గురించి తెలపగలరు -

కృపాచార్యుని చెల్లెలైన కృపిని ద్రోణాచార్యునికిచ్చి, వివాహము చేయడం జరిగినది. ద్రోణాచార్యునికి తన భార్యయైన కృపి యందు కలిగిన కుమారుడే అశ్వత్థామ. అశ్వత్థామ జన్మించినప్పుడు గుర్రంవలె అరిచి ఏడ్చాడు. అందువల్ల ఆ బాలుడికి 'అశ్వత్థామ' అని ఆకాశవాణి పేరు పెట్టడం జరిగింది.

291. పాండవులు మహావీరులు కదా, మరి వారికి మరణం ఎలా సంభవించిందో తెలుపగలరు. పాండవుల తర్వాత వారి సామ్రాజ్యాన్ని ఎవరు పరిపాలించారు?

పాండవులు మహాప్రస్థానం ద్వారా తమ జీవితాలను చాలించారు. పాండవుల తర్వాత వారి సామ్రాజ్యాన్ని అర్జునుని మనుమడైన పరీక్షిత్తు పరిపాలించాడు.

292. ఒక రోజున హిమవత్ పర్వత భూములలో వేటకై వెళ్లినప్పుడు భీముడిని ఒక కొండచిలువ పట్టుకుంటుంది కదా! ఆ కొండచిలువ ఎవరు? దాని వృత్తాంతం ఏమిటి ? ఆ పాము ధర్మరాజుతో ఏమని చెప్పింది?

పాండవులు అరణ్యవాసం చేసేకాలంలో ఒకనాడు భీమసేనుడు హిమవత్పర్వత ప్రాంతానికి వేటకై వెళ్లాడు. అక్కడ ఒక కొండచిలువ భీముడిని పట్టుకొని అతని శరీరాన్నంతనూ చుటువేసింది. భీముడు దాని పట్టునుంచి విడిపించుకోలేక పోయాడు. 'మహాబలశాలినైన నేను ఈ సర్పం యొక్క పట్టునుంచి తప్పించుకోలేకుండా వున్నానంటే ఈ కొండచిలువ సామాన్యమైనది కాదు. ఇంతటి శక్తి కలిగిన ఈ సర్పం - ఏదో దివ్యప్రభావ సంపన్నమైనది అయి వుండవచ్చును' అని భావించుకొని ''ఓ సర్పరాజా! నన్ను భీముడని పిలుస్తారు. నేను పాండురాజు పుత్రుడను. ధర్మరాజుకు అనుజుడను, నాగాయుత బలుడనైన నన్ను బంధించగలిగిన నీవెవరవు?'' అని ఆ కొండచిలువను ప్రశ్నించాడు.

అందుకు ఆ పాము ఇలా చెప్పింది. ''ఓ పాండురాజ నందనా! నాకీ శక్తి మహర్షి ఇచ్చిన వరం చేత లభించింది. ఎంతటి శక్తి కలిగిన ప్రాణులనైనా నేను బంధించినట్లయితే వారి బలం నశిస్తుంది'' అని చెప్పింది. ఇంతలో ధర్మరాజుకు దుశ్శకునాలు కనిపించగా అడుగుజాలను అనుసరించి భీముని వెతుకుతూ భీముడున్నచోటుకు వచ్చాడు. మహాబలుడైన భీముడు ఒక కొండచిలువ చేత పట్టుబడినందుకు ఆశ్చర్యాన్నీ విషాదాన్నీ పొందాడు. సమీపానికి వెళ్లి ఆ పామును 'దేవతవా, రాక్షసుడవా, నీవెవరివని' ప్రశ్నించాడు ధర్మరాజు.

అందుకు ఆ కొండచిలువ ఇలా చెప్పింది. ''ధర్మరాజా! నేను నహుషుడనే రాజును. మీ పూర్వుడను. నూరు యజ్ఞాలు చేసి ఇంద్రపదవి పొందాను. కానీ గర్వం వల్ల బ్రహ్మరథాన్ని ఎక్కి విప్రోత్తములకు అవమానం చేశాను. దానిని అగస్త్య మహర్షి ఆగ్రహించి కొండచిలువై పడి వుండమని

నన్ను శపించాడు. 'మహర్షీ! నాకు పూర్వజన్మ జ్ఞానం వుండేటట్లు, ఎట్టి ప్రాణులనైనా నేను బంధించగానే ఆ ప్రాణుల శక్తి క్షీణించేటట్లుగాను నాకు వరం ఇవ్వండి. అనుగ్రహించి శాపమోక్షానికి మార్గాన్ని చెప్పండి.' అని కడు దీనుడనై అగస్త్య మహర్షిని వేడుకున్నాను. ఆ మహాత్ముడు నేను కోరిన వరాలు అనుగ్రహించాడు. నా ప్రశ్నలకు ఎవరైనా సమాధానాలు చెప్పగలిగినప్పుడు నాకు శాపవిమోచనం కలుగుతుందని తెలిపాడు. ఇది జరిగి చాలా కాలమయింది. అగస్త్య మహర్షి మాట ప్రకారం శాపవిముక్తికై ఎదురుచూస్తున్నాను. ఇప్పుడు నీవు నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పి నీ తమ్ముని విడిపించుకో."

అప్పుడు ఆ కొండచిలువ అడిగిన ప్రశ్నలకు ధర్మరాజు యుక్తమైన సమాధానాలు చెప్పగా ఆ సర్పం భీముని విడిచిపెట్టింది. అంతటితో నహుషునికి శాపవిమోచనమై, సర్పరూపాన్ని విడిచి దివ్యరూపాన్ని ధరించాడు.

293. పాండవులకు ద్రౌపది కాకుండా వేరుగా భార్యలున్నారా? వారికి సంతానముందా?

ఉన్నారు. ధర్మరాజుకు దేవిక అనే భార్యయందు యౌధేయుడనే కుమారుడూ, పౌరవతి అనే భార్యయందు దేవకుడనే కుమారుడూ ఉన్నారు.

భీమునికి జలంధర, కాళి- అనే భార్యలున్నారు. జలంధర యందు సర్వగుడు, కాళియందు సర్వగతుడు అనే కుమారులు భీమునికి కలిగారు.

భీమునికి హిడింబ అనే భార్యయందు ఘటోత్కచుడు అనే కుమారుడు కలిగాడు.

ద్రౌపది కాక అర్జునునికి సుభద్ర, ఉలూచి, చిత్రాంగద అనే భార్యలున్నారు. అర్జునునికి సుభద్రయందు అభిమన్యుడు, ఉలూచి యందు ఇరావంతుడు, చిత్రాంగదయందు బభ్రువాహనుడు - జన్మించారు. జైమిని భారతం ప్రకారం అర్జునునికి ప్రమీల అనే మరొక భార్య కూడా ఉంది.

నకులునికి కరేణుమతి (కరేణుక) అనే భార్యయందు నిరమిత్రుడనే కుమారుడు కలిగాడు. సహదేవునికి విజయ అనే భార్యయందు సుహోత్రుడనే కుమారుడున్నాడు.

294. 18 అక్షౌహిణుల బలం - అంటే ఎంత సైన్యం?

21870 రధాలు, అదే సంఖ్యగల ఏనుగులు, **65610** అశ్వబలం (గుర్రాలు), **109350** పదాతిదళం (కాల్బలం) కలిగిన సైన్య సమూహానికి అక్షౌహిణి అని పేరు. ఇటువంటివి 18అక్షౌహిణులు గల సైన్య సమూహం అన్నమాట.

295. శ్రీకృష్ణుని రధాశ్వాల (రధానికి కట్టే గుర్రాల) పేర్లేవి? శ్రీకృష్ణుని రథసారధి పేరేమిటి?

శ్రీకృష్ణుని రధాసారధి పేరు దారుకుడు. శ్రీకృష్ణుని రధాశ్వాల పేర్లు శైబ్యము. సుగ్రీవము, మేఘపుష్పము, వలాహకము.

296. కర్ణార్జునుల మధ్య సంగ్రామం మొదలైన తర్వాత - కర్ణుడు ప్రయోగించిన అస్త్రాలన్నిటినీ ప్రత్యస్త్రప్రయోగంతో నిర్వీర్యం చేయగలిగిన అర్జునుడు- చివర్లో నాగాస్త్రం మీదికి వస్తుంటే దానిని ఛేదించలేకపోతాడఎందుకు?

ఆ నాగాస్త్రరూపంలో ఉన్నది - అశ్వసేనుడనే సర్పం. గతంలో ఖాండవ దహనం జరిగినప్పుడు- అశ్వసేనుడు తన తల్లితో సహా ఖాండవ వనం నుంచి బయటపడబోయాడు. అది గమనించి అర్జునుడు బాణం విడిచాడు. ఆ బాణంతో అశ్వసేనుని తోక తెగింది. అతడి మూపున ఉన్న అతడి తల్లి ఆ మంటలలో పడిపోయింది. తోక తెగిన అశ్వసేనుడు ముందుకు వెళ్ళిపోయాడు. ఆ తర్వాత అశ్వసేనుడు కర్ణుని దగ్గరకు వెళ్ళి తన వృత్తాంతాన్ని, అర్జునుని పైన తన పగనూచెప్పాడు.

కర్ణుని అంగీకారంతో - నాగాస్త్ర రూపంతో కర్ణుని అమ్ములపొదిలో ఉన్నాడు- అశ్వసేనుడు.

బాణరూపంలో ఉన్న అశ్వసేనుని కర్ణుడు మొదటిసారి ప్రయోగించినప్పుడు కృష్ణుడు తన పాదంతో రథాన్ని భూమిలోకి క్రుంగేలా చేశాడు. దానితో కర్ణుడు ప్రయోగించిన నాగాస్త్రం గురితప్పింది.

పగపట్టిన అశ్వసేనుడు కర్ణుని వద్దకు వెళ్లి - తనను మళ్లీ ప్రయోగించడానికి కర్ణుడు అంగీకరించపోగా - తానే అర్జునుని మీదకు బాణరూపంలో వెళ్ళాడు. అప్పుడు కృష్ణుడు - అశ్వసేనుడు పగపట్టిన వృత్తాంతాన్ని అర్జునునికి చెప్పాడు. బాణరూపంలో వస్తున్న అశ్వసేనుని వెంటనే వధించమని, చెప్పాడు కృష్ణుడు. అర్జునుడు వెంటనే ఆ నాగాస్త్రాన్ని తన బాణాలతో దారిలోనే ఖండించి తునకలుగా చేశాడు.

297. భారతంలో చాలామంది వికర్ణులు ఉన్నారు. చాలా తికమకగా ఉంది.

భారతంలో వికర్ణుడు ఒక్కడే. ఆ వికర్ణుడు దుర్యోధనుడి సోదరుడు. అతడినే కర్ణుని పుత్రునిగా చాలామంది పొరబడుతూ ఉంటారు. ఆ విధమైన అభిప్రాయంవల్లనే ఈ ప్రశ్నవచ్చిందని భావిస్తున్నాను. కర్ణ - వికర్ణ శబ్దాల మధ్యనున్న సామ్యమే, సారూప్యమే అటువంటి అభిప్రాయానికి కారణం. కానీ వికర్ణుడు కర్ణుని పుత్రుడుకాదు. గాంధారి ధృతరాష్ట్రుల నూరుగురు సంతానంలోనివాడు. దుర్యోధనుని తమ్ములలో ఒకడు. ఆ నూరుగురి పేర్లూ భారతంలో ఇవ్వబడినాయి. ఆ నూరుగురిలో తప్ప మరెక్కడా భారతంలో వికర్ణుడనే వ్యక్తిలేడు.

వికర్ణుడు కర్ణ పుత్రుడనుకొనడానికి వారి పేర్లు ఒకేలా వుండడం మాత్రమే కాక మరొక కారణం కూడా వుంది. అదేమంటే ద్రౌపదీదేవిని దుశ్శాసనుడు సభలోనికి బలవంతంగా ఈడ్చుకుని వచ్చినప్పుడు ఆమె తాను ధర్మవిజితనా, లేదా అధర్మవిజితనా తేల్చి చెప్పమని సభాసదులను ప్రశ్నించింది.

ఆ సమయంలో ఎవ్వరూ నోరు విప్పకపోగా ఒక్క వికర్ణుడు మాత్రంలేచి ధర్మరాజు జూదంలో తన్ను తాను ఓడిపోయిన తర్వాతనే ఆమెను ఒడ్డినాడు కనుక తన్ను తాను ఓడినవానికి మరెవ్వరిపైనా తనపైనా కూడా అధికారం ఉండదు. కాబట్టి ద్రౌపదీ దేవి ధర్మవిజిత కాదని స్పష్టం చేసాడు. అప్పుడు కర్ణుడు 'బాలుడవైన నీకీ ధర్మచర్చ ఎందుకు? అదీ గాక ఈ బంధకి విషయంలో ధర్మ విచారణ అనవసరమని' దుర్యోధనుని మెప్పుకోసం పలికాడు. కర్ణుడు ఆ విధంగా వికర్ణుని మందలించడం అనేది దుర్యోధనాదులలో అతనికిగల చనువువల్లనేనని, ఆ పలుకులు దుర్యోధనునికి ప్రియం కలిగించడం కొరకేనని గ్రహించాలి. అంతేగాక వికర్ణుడు క్షత్రపుత్రుడు కావడంవల్ల మాత్రం కాదు.

298. ద్రౌపదికి పాండవులైదుగురు భర్తలు కదా? ఆమె కర్ణుని కూడా ఆరవ భర్తగా పొందాలనుకుంది అని విన్నాను. అసలు వృత్తాంతం తెలపండి. ద్రౌపది అలా ఊహించుకున్నట్లు ఒక సినిమాలో కూడా చూపారు. ఎందుకో మనసంగీకరించలేదు. మీరేమంటారు?

ఈ ప్రశ్న చాలా మంది అడుగుతున్నారు. కానీ ద్రౌపది కర్ణుని కూడా తన భర్తగా పొందాలనుకుంది – అని చెప్పడానికి ఆధారమైన ఒక్క శ్లోకం కూడా వ్యాసభారతంలో లేదని నిశ్చయంగాచెప్పగలను. ప్రసిద్ధ వ్యక్తులపైన బురద చల్లడమే పనిగా పెట్టుకున్న వాళ్ళు సమాజంలో అనేక మంది ఉంటారు. అలాంటి వాళ్లు పుట్టించినవే ఇటువంటి కింవదంతులు. వాటిని నమ్మకండి. ప్రసిద్ధులైన పురాణవ్యక్తుల నుంచి వర్తమాన వ్యక్తులవరకూ అందరికీ ఈ శాడిస్టుల వల్ల బాధ తప్పలేదు. మానవులు తాము చేసిన కాయిక,వాచిక, మానసిక పాపాలకు అన్నిటికీ కూడా యమలోకంలో కాని, భూలోకంలోకాని, దాని ఫలితాన్ని పొందుతారని మహర్షి వాక్కు.

299. ధర్మరాజు కృష్ణుడిని సంధి రాయబారాని కిపంపే సమయంలో ''మాకు ఐదూళ్లు ఇచ్చినా చాలు, యుద్ధం చేయం. లేదా యుద్ధం చేసి రాజ్యాన్ని పాలిస్తాం'' అని చెప్పి పంపడంలోని రాజనీతి ఆంతర్యం ఏమిటో సెలవిస్తారా?

పాండవులకు రావలసిన వారి పిత్ర్యమైన రాజ్యభాగన్ని ఇవ్వడానికి దుర్యోధనుడు ఏ విధంగానూ ఇష్టపడడని తెలిసే ధర్మరాజు అలా చెప్పాడు. రాజ్యంలో పాండవుల భాగాన్ని పంచి ఇవ్వకపోయినా, కనీసం పాండవులు ఐదుగురూ బతకడానికి ఆధారంగా ఐదూళ్లిచ్చినా చాలునని ధర్మరాజు చెప్పి పంపాడు. జ్ఞాతి వైరం పుట్టకూడదనీ, యుద్ధం, కోరదగినదిగాదనే అభిప్రాయంతో ధర్మరాజు ఆవిధంగా చెప్పాడు. తాము అయిదుగురూ బ్రతకడానికి రాజ్యంలో ఎక్కడో ఒకచోట కొంత ప్రదేశం ఇచ్చినా చాలుననీ, కుశస్థలం, వృకస్థలం మాకంది, వారణావతం – ఈ నాలుగూళ్లతోపాటు మరొక – ఏదో ఒక గ్రామాన్ని ఇమ్మని కోరాడు ధర్మరాజు. అలా అడగడానికి ధర్మరాజు శాంతి ప్రియత్వమే కారణం.

300. అశ్వత్థామ కురుక్షేత్ర యుద్ధంలో చివరి వరకు వున్నాడా, లేక చనిపోయాడా? అశ్వత్థామను చంపినది ఎవరు? ఆయనకు దివ్యాస్త్రాలు లేవా?

అశ్వత్థామ కురుక్షేత్ర యుద్ధంలో మరణించలేదు. అశ్వత్థామ చిరంజీవులలో ఒకడు. అయన నేటికీ సజీవుడే. ఆయనకు దివ్యాస్త్రాలు లేకపోవడం ఏమిటి? ఆయన తండ్రియైన ద్రోణాచార్యులవారు ఇచ్చిన దివ్యాస్త్రాలెన్నో అశ్వత్థామ దగ్గర వున్నాయి.

'అశ్వత్థామా బలిర్వ్యాసో హనుమాంశ్చ విభీషణః
కృపః పరశురామశ్చ సప్తైతే చిరజీవినః
... మార్కండేయ మథాష్టమమ్'

అని చెప్పబడింది. పైన చెప్పబడిన అశ్వత్థామ, బలి, వ్యాసమహర్షి, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యుడు, పరశురాముడు, మార్కండేయుడు – ఈ ఎనమండుగురూ చిరంజీవులు.

301. శివపార్వతులకు కుమారులు ఎందరు? కోడళ్ళు ఎందరు? భరత శత్రుఘ్నులకు కొడుకులు ఎందరు? లక్ష్మణ భరత శత్రఘ్నుల భార్యల పేర్లేమిటి? రాముడంటే ఆయన తమ్ముళ్ళు ఎందుకు భక్తిగా వున్నారు? కురుక్షేత్ర యుద్ధంలో పాండవులు నలుగురూ ఎందుకు పద్మవ్యూహం లోకి వెళ్ళలేకపోయారు?

శివ పార్వతులకు కుమారులిద్దరు. వారు, విఘ్నేశ్వరుడు కుమారుస్వామి. విఘ్నేశ్వరుని భార్యలు సిద్ధి, బుద్ధి, కుమారస్వామి భార్యలిద్దరు. వారు శ్రీవల్లి,దేవసేన. లక్ష్మణుని భార్యపేరు ఊర్మిళాదేవి. భరతుని భార్యపేరు మాండవి. శత్రఘ్నుని భార్యపేరు శ్రుతకీర్తి. భరతుని కుమారులు తక్షుడు, పుష్కలుడు. లక్ష్మణుని కుమారులు అంగదుడు, చంద్రకేతువు. శత్రఘ్నుని కుమారులు సుబాహువు, శత్రుఘ్నపి. అన్నగారి పట్ల భక్తి ప్రపత్తులతో ఉండడం తమ్ముల ధర్మం కనుక-రాముని తమ్ములు ఆయన పట్ల భక్తితో ఉన్నారు.

పాండవులు అరణ్యావాసం చేసే కాలంలో ఒకనాడు సైంధవుడు ద్రౌపదిని ఎత్తుకుపోవడానికి ప్రయత్నించి భీమార్జునుల చేతిలో అవమానాన్ని పొందాడు. భీముడు సైంధవుని రథానికి కట్టితెచ్చి తలగొరిగించి, పాండవ దాసుడనని చెప్పుకొని జీవించమని విడిచిపెట్టాడు. భీమార్జునులు సైంధవుని చంపబోగా - దుస్సల భర్త కాబట్టి చంపవద్దని ధర్మరాజు వారించాడు. ఆ పరాభవాన్ని మనసులో పెట్టుకుని సైంధవుడు శివుని గురించి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షం కాగా,పాండవులైదుగురిని యుద్ధంలోతాను ఓడించేలా వరమిమ్మని కోరాడు.కాని అర్జునుడు తప్ప మిగిలిన పాండవులను ఏదైనా ఒక్కరోజున నిలువరించి గెలిచేలా శివుడు వరమిచ్చాడు.

కురుక్షేత్ర యుద్ధంలో దుర్యోధనుని కోరిక మీద ధర్మరాజును బంధించడానికై ద్రోణాచార్యుడు పద్మవ్యూహాన్ని పన్నాడు. ఆ సమయానికి అర్జునుడు అక్కడ ఉండకుండా దుర్యోధనునికి ఆప్తులైన సంశప్తకులనే వాళ్ళు అర్జునుని యుద్ధానికి పిలిచి అతడిని దూరంగా తీసుకుపోయారు.

అక్కడున్న పాండవ సేనలో అర్జునునికి తప్ప మిగిలిన వాళ్ళెవరికీ ప్రవేశ నిష్క్రమణాలు తెలియవు. అభిమన్యునికి పద్మవ్యూహ ప్రవేశం మాత్రం తెలుసు. నిష్క్రమణం తెలియదు. ముందుగా అభిమన్యుడు వ్యూహంలో ప్రవేశిస్తే అతడి వెనకాల తామందరూ ప్రవేశించి అభిమన్యునికి అండగా నిలుస్తామని భీమాదులు ఉత్సాహపరిచారు. కానీ ఆ రోజు సైందవుడు వ్యూహముఖ ద్వారంలో నిలిచాడు. తనకు శివుడిచ్చిన వరంఆనాడు ఫలించాలని సైంధవుడు కోరుకున్నాడు. అందువల్లనే ఆరోజున భీమాదులను సైంధవుడు నిలువరించి అడ్డుకోగలిగాడు. సైంధవునికి శివుడిచ్చిన వరం వల్ల భీమాదులు ఆరోజున సైంధవుని దాటి పద్మవ్యూహంలో ప్రవేశించలేకపోయారు. ఒక్క అభిమన్యుడు మాత్రం పద్మవ్యూహంలో ప్రవేశించగలిగాడు. అతడికి భీమాదుల సహాయం అందకుండా సైంధవుడు అడ్డుపడ్డాడు.

302. శ్రీకృష్ణునికి సంతానం ఉందా? ఉంటే వారి పేర్లు కొన్ని అయినా చెప్పగలరు.

శ్రీకృష్ణునికి రుక్మిణియందు ప్రద్యుమ్నుడు, సుచారుడు, భద్రచారుడు, చారుధేష్ణుడు మొదలైన కుమారులు 10 మంది కలిగారు. సత్యభామ యందు తామ్రుడు, చక్రుడు ఇత్యాగా 10 మంది కుమారులు కలిగారు. మిత్రవింద యందు మిత్రవంతుడు మొదలైన వాళ్లు 10 మంది, నాగ్నజితి యందు మిత్రబాహువు, సునీధుడు మొదలైనవాళ్లు, జాంబవతి యందు సాంబుడు మొదలైనవాళ్లు... ఇలా శ్రీకృష్ణుని ప్రతి భార్యకూ కలిగిన సంతానం మొత్తం అందరి పేర్లూ ఇక్కడ ఒకేసారి ఇవ్వడంసాధ్యం కాదు.

303. శ్రీ మహావిష్ణువు దగ్గరుండే కత్తిని ఒక సినిమాలో చూపించారు. ఆయన దగ్గరుండే శంఖమూ, చక్రమూ... ఇలా ఆయుధాలు, మిగతా వాటి పేర్లు చెప్పండి.

శ్రీ మహావిష్ణువు ధరించే చక్రం పేరు సుదర్శనం. శంఖం పేరు పాంచజన్యం. గద పేరు కౌమోదకి. ధనుస్సు పేరు శార్ఙ్గం. ఖడ్గం పేరు నందకం. ఖడ్గమన్నా కత్తి అన్నా ఒకటే.

304. పాండవులు కౌరవులను కోరి జూదానికి ఆహ్వానించి దుర్యోధనునికి మయసభను విడిదిగా ఇచ్చి అవమానించడం సబబేనంటారా? మయసభలో ఉన్నవి లేనట్లుగా, లేనివి ఉన్నట్లుగా కనిపించడం వల్ల కొలనులో పాపం ఆయన పడిపోవడం, ద్రౌపది మొదలగువారు నవ్వడం, అది అవమానంగా భావించడం, ఇలా మొత్తానికి భారత యుద్ధానికే కీలకమైన కారణం అయింది. దీనికి మీ సమాధానం?

జూదానికి పాండవులు, కౌరవులను ఆహ్వానించలేదు. కౌరవులే పాండవులను అహ్వానించారు.

ధర్మరాజు చేసిన రాజసూయయాగానికి పాండవుల ఆహ్వానంపైన ఇంద్రప్రస్థానికి వచ్చాడు దుర్యోధనుడు. ధర్మరాజు చేత రాజసూయయాగం చేయించే నిమిత్తం భీమార్జున నకుల సహదేవులు నేల నాలుగు చెరగులనూ జయించి తెచ్చిన ధనరాశులను , పాండవుల వైభవాన్నీ చూసి దుర్యోధనునిలో ఈర్ష్యాసూయలు ప్రకోపించాయి. దానికి తోడు మయసభను సందర్శించడానికి వెళ్లినప్పుడు జరిగిన చిన్న నగుబాటు అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది.

పాండవుల ఉన్నతిని తాను సహించలేననీ, ఎలాగైనా వారిని నాశనం చెయ్యాలనీ శకునితోనూ, ధృతరాష్ట్రునితోనూ మొరపెట్టుకున్నాడు దుర్యోధనుడు. ధర్మరాజుకు జూదం అంటే ఆసక్తేకాని నేర్పులేదనీ, అతడిని జూదానికి ఆహ్వానిస్తే - జూదంలో ధర్మరాజును మోసం చేసి ఓడించి పాండవుల సంపదలన్నీ దుర్యోధనుని పరం చేస్తాననీ శకుని అభయమిచ్చాడు. దుర్యోధనుని మాటకాదనలేక, ధృతరాష్ట్రుడు విదురుని పాండవుల వద్దకు పంపించి, ధర్మరాజును సుహృద్ద్యూతానికి ఆహ్వానింపచేసి రప్పించాడు. ఇదీ జరిగినది.

305. శ్రీకృష్ణుడు గొల్లవాడా? క్షత్రియుడా? కుంతీదేవి శ్రీకృష్ణుని మేనత్త ఎలా అయింది?

యాదవులు కూడా క్షత్రియులే. యయాతి మహారాజు పుత్రుడైన యదువు నుండి ఏర్పడిన వారే యాదవులు. కాబట్టి యాదవులు క్షత్రియులే. యదు, వృష్ణి, అంధక, భోజ వంశాలనే నాలుగు వంశాలు యాదవులలో ఉన్నాయి. వారిలో కృష్ణుడు వృష్ణి వంశానికి చెందినవాడు.

శ్రీకృష్ణుని తండ్రియైన వసుదేవుడు, కుంతీదేవి - స్వంత సోదరీ సోదరులు. వారిద్దరూ శూరుడనే యాదవరాజు బిడ్డలు. కుంతీదేవి అసలు పేరు పృథ. ఆమెను శూరుని మేనత్తకొడుకైన కుంతిభోజుడు పెంచుకున్నాడు. ఆ కారణంగా పృథ పేరు కుంతిగా మారింది. ఆ విధంగా కుంతీదేవి శ్రీకృష్ణునికి స్వంత మేనత్త.

306. మహాభారతంలో చెప్పిన కురుక్షేత్ర సంగ్రామం జరిగిన ప్రదేశం ఏది? అది ఎక్కడ వుంది? భగవంతునికి ఎన్ని రూపాలున్నాయో తెలుపగలరు.

కురుక్షేత్ర యుద్ధం జరిగిన ప్రదేశం యొక్క పేరు శ్యమంతపంచకం. అది నేటి ఉత్తర భారతదేశంలో వుంది. భగవంతుని రూపాలు అనంతమైనవి.

307. దేవకీ వసుదేవులకు కలిగిన సంతానాన్ని వెంట వెంటనే కంసుడు హతమార్చాడు కదా! శ్రీకృష్ణుడు ఒక్కడే బతికాడు కదా! కావున బలరాముని తల్లిదండ్రులెవరు?

బలరాముని తల్లి రోహిణి. తండ్రి వసుదేవుడు. దేవకి గర్భంలో ఉన్న బలరాముని - యోగమాయ సంకర్షణం చేసి రోహిణీ గర్భంలోకి చేర్చింది. రోహిణి గోకులానికి వెళ్ళి నందగృహంలో బలరాముని ప్రసవించింది. దేవకికి గర్భస్రావమయిందని కంసుడు, అతడి సేవకులూ భావించారు. ఆవిధంగా దేవకీ దేవి యొక్క ఎడవ కుమారుడైన బలరాముడు రక్షించబడ్డాడు.

308. శ్రీకృష్ణుడు 16 వెల మంది గోపికలను పెళ్లాడాడట. నిజమేనా? 16 వేల మంది గోపికలు శ్రీకృష్ణునికి ప్రేమల్లో ప్రియులుగా వుండేవారని చెబుతారు. అక్కడ ఇప్పటికీ వున్నవారిని లెక్కిస్తే అంతమంది లేరంటారు. ఏది నిజం? ఆరువేలమంది గోపికలకు, కృష్ణపరమాత్మకూ పూర్వం ఎలాటి సంబంధం వలన కృష్ణావతారంలో గోపికలు శ్రీకృష్ణుని వలచారు?

శ్రీకృష్ణుడు పెళ్లాడిన ఆ 16 వేల మందీ గోపికలు కారు. నరకాసురుని చెరలో వున్న రాజకన్యలు. వారిని నరకాసురుడు బంధించి వుంచాడు. నరకాసురుని సంహరించిన తర్వాత శ్రీకృష్ణుడు ఆ రాజకన్యలను బంధవిముక్తలను చేశాడు. ఆ రాజకన్యలందరూ శ్రీకృష్ణుని పట్లనే అనురక్తితో వున్నామనీ, తమను పెళ్లాడవలసిందనీ వేడుకున్నారు. అందువల్ల శ్రీకృష్ణుడు వారిని పెళ్లాడాడు.

'వసుదేవ గృహే సాక్షాత్ భగవాన్ పురుషః పరః
జనిష్యతే తత్ప్రియార్థం సంభవంతు సురస్త్రియః

అని చెప్పబడింది. శ్రీకృష్ణుని అనుగ్రహం కోసం యుగయుగాల నుండి తపస్సు చేస్తున్న ఋషులు, శ్రీకృష్ణావతార కార్యక్రమంలో ఆయనకు సహాకరించవలసిన దేవకాంతలు - గోకులంలో గోపికలుగా జన్మించి శ్రీ కృష్ణుని సేవించారు. ఈ గోపికల సంఖ్య ఎక్కడా చెప్పబడలేదు. శ్రీకృష్ణుని వరించినవారు 6 వేల మంది కారు. 16 వేలమంది. శ్రీకృష్ణ పత్నులు రాజకన్యలే కాని గోపికలు కారన్నది గమనించాలి.

309. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడిగా, త్రేతాయుగంలో శ్రీరాముడిగా అవతారాలెత్తిన ఈ దేవుళ్ల యొక్క వంశం నేటికీ ఉన్నదా? ఉంటే ఎక్కడ?

సూర్యవంశానికి చెందిన మరుత్తు, చంద్రవంశానికి చెందిన దేవాపి- ఈ ఇద్దరూ కలియుగాంతం వరకూ శంబళ గ్రామంలో

ఉంటారనీ, కలియుగాంతంలో కల్కి వచ్చి ఆ ఇద్దరి చేతనూ రాజ్యాన్ని ఏలిస్తాడనీ పురాణ వచనం.

310. శ్రీకృష్ణుని తండ్రి ఎవరు? అతని జన్మవిశేషాలేమిటి ?

శ్రీకృష్ణుని తండ్రి వసుదేవుడు. ఆయన తల్లిపేరు మారిష. తండ్రి పేరు దేవమీఢుడు. వసుదేవుడు జన్మించినప్పుడు ఆకాశంలో దుందుభులు మ్రోగాయని పురాణ ప్రమాణం. అందువల్ల వసుదేవునికి 'ఆనక దుందుభి' అనే పేరు కూడా ఉంది.

311. విష్ణుమూర్తి పుత్రులు ఎవరెవరు?

బ్రహ్మదేవుడు (చతుర్ముఖ బ్రహ్మ), మన్మథుడు - వీరిద్దరూ విష్ణుమూర్తి కుమారులు.

312. భారత యుద్ధంలో సైంధవ వధానంతరం, సైంధవుని శిరస్సును అతడి తండ్రి వృద్ధక్షత్రుని చేతులలో పడేటట్లు చేయమని శ్రీకృష్ణుడు అర్జునికి చెబుతాడు. దీని వెనుక గల కారణమేమిటి?

సైంధవుని శిరస్సును నేలమీద పడవేసిన వ్యక్తి, తక్షణమే తలపగిలి మరణించాలని వృద్ధక్షత్రుడు గతంలో శపించి ఉన్నాడు. అందువల్ల సైంధవుని శిరస్సును నేలను పడనీయవద్దనీ, అతడి తండ్రియైన వృద్ధక్షత్రుని చేతులలోనే పడేలా చేయమనీ శ్రీకృష్ణుడు అర్జునునికి బోధించాడు. పాశుపతాస్త్ర సహాయంతో అర్జునుడు ఆ పనిని, నెరవేర్చాడు. ఆకస్మికంగా వచ్చిపడిన మానవ శిరస్సును కలవళపడి వృద్ధక్షత్రుడు తోసివేయడంతో అతడి శాపం తగిలి అతడే మరణించాడు. శ్రీకృష్ణుడు ఆ విధంగా అర్జునుని రక్షించాడు.

313. మహాభారతంలో పాండు పుత్రులు పాండవులు, ధృతరాష్ట్రుని పుత్రులు కౌరవులూ ఎలా అయ్యారు? ఒకే వంశానికి చెందిన అన్నదమ్ముల పిల్లలకు ఈ తేడా ఎలా వచ్చింది? గాంధారి కురు వంశానికి చెందిన స్త్రీ. తల్లిపేరుతో కౌరవులు చెలామణీ కావడానికి కారణం ఏమిటి?

ముందుగా చెప్పవలసిన విషయం - గాంధారి కురువంశీయురాలు కాదు. ఆమె గాంధార రాజపుత్రిక. సుబలుడనే పేరుగల గాంధారరాజు ఆమె తండ్రి. గాంధారి కురు వంశస్థురాలు కాదు. ఆమె కురువంశపు కోడలేకాని, ఆ వంశంలో జన్మించినది కాదు. కనుక, కౌరవులు తల్లి పేరుతో ఆ విధంగా వ్యవహరింపబడడం అనేది కేవలము సత్య దూరం.

ధృతరాష్ట్రుడు, పాండురాజు, వీరి పూర్వులైన భీష్ముడు, శంతనుడు ఇత్యాదులు జన్మించినదే కురువంశం. కురువు, పూరుడు, భరతుడు - వీరంతా వంశ ప్రసిద్ధులైన పుణ్యపురుషులు. వారి పేరు మీదుగా ఆ వంశానికి కురువంశం అనీ, పురు వంశమనీ, భారత వంశమనీ పేర్లు వచ్చాయి. ప్రసిద్ధ కర్ములైన వారిపేరిట వంశం ప్రసిద్ధికావడం లోకసహజం కదా! ఆ కురవంశీయులే ధృతరాష్ట్ర పాండు రాజులు. కనుక 'కౌరవ' నామం వారికి వారి సంతానాలకు కూడా వర్తిస్తుంది. వారంతా కూడా కౌరవ న్యాయం పేరిట పిలవబడదగినవారే. ధృతరాష్ట్ర సంతానము. పాండురాజు సంతానము కూడా. ధృతరాష్ట్ర సంతానం ధార్త రాష్ట్రులుగాను, పాండు రాజు సంతానం పాండవులు పాండవేయులుగాను వారి వారి తండ్రుల పేరు మీదుగా చెప్పబడుతారు. తల్లుల పేర్ల మీదుగా గాంధారేయులు, కౌంతేయులు, మాద్రేయులు అవుతున్నారు.

కౌరవ శబ్దం పాండవులకుకూడా వర్తిస్తుంది. కనుకనే, భగవద్గీతలో భగవానుడు అర్జునుని అనేక చోట్లలో ''కౌరవ'' అనీ, ''పాండవ'', ''కౌంతేయ'', ''పార్థ'', ''భారత'', అనీ ఇలా అనేక విధాలుగా సంబోధించడాన్ని మనం గమనించవచ్చును.

ఇందు 'కౌరవ' శబ్దం గోత్రార్థకము - అనగా వంశానికి, కుటుంబానికి సంబంధించిన పేరు. ''పాండవ'' శబ్దం అపత్యార్థకము. అపత్యమనగా సంతానం. కౌరవ వంశానికి చెందిన వారిలో పాండురాజు సంతానంగా ప్రత్యేకంగా పేర్కొనబడిన వారు పాండువులు.

మరొక్క అంశం ఏమంటే - ధార్త రాష్ట్ర పాండవేయులిరువురూ కౌరవ శబ్ద శాచ్యులే అయినప్పుడు - కేవలమూ ధార్తరాష్ట్రులనే 'కౌరవ' అభిధానంతో పేర్కొని, పాండవులను వేరుచేసి పేర్కొనడం ఏలా? అనేది. దానికి సమాధానం. ధార్త రాష్ట్ర,పాండవులు - ఇరువురూ నిస్సంశయంగా కురువంశీయులే. కౌరవాభిధేయులే. అయితే, పాండువులు అరణ్యంలో పుట్టి,కొన్నేళ్ల వరకు అక్కడే పెరిగినవారు. వారికి జాతకర్మ, నామకరణ, ఉపనయనాది యథోచిత సంస్కారాలన్నీ శత శృంగ పర్వత ప్రాంతారణ్యంలోనే జరిగాయి. తానున్న శతశృంగ పర్వత ప్రాంతనివాసులైన మహర్షుల వద్దనే పాండు రాజు తన కుమారులకు వేదాధ్యయన, విద్యాభ్యాసాలను చేయింపజేశాడు. శర్యాతి పుత్రుడైన శుకమహారాజు ఈ శతశృంగ పర్వత ప్రాంతంలోనే వానప్రస్థుడై తపోజీవనాన్ని గడుపుతూ వుండగా- ఆయన వద్ద పాండు కుమారులందరూ ఆయుధ విద్యలు నేర్చి, అస్త్ర శస్త్ర ప్రావీణ్యం సంపాదించారు. ఈ విధంగా వేరొక చోటున పెరిగి, బాల్యంలో చాలా సంవత్సరాలు హస్తినాపురంలో కాకుండా మరొక ప్రదేశంలో ఉండిన కారణంగా పాండవులు వేరుగా గుర్తించబడ్డారు లోకంచేత. పాండురాజు మరణానంతరం మాత్రమే పాండవులతో హస్తినాపురం చేరింది కుంతి. ఆ విధంగా పెరిగి పెద్దవారైన తర్వాత రాజధానికి చేరిన పాండుపుత్రులు - అందరి చేతనూ పాండువులుగా పిలువబడ్డారు. స్వస్థానమైన హస్తినలో పుట్టి పెరిగిన ధార్తరాష్ట్రులు తొలినుండి అక్కడే వుంది కౌరవులుగా స్థిరపడ్డారు.

మరొక కారణం - ధృతరాష్ట్రునికి ఏ విధంగానూ ప్రత్యేకమైన ఉనికి, గుర్తింపులేవు. అతడు ఒక కురవంశీయుడు మాత్రమే. పాండు రాజుకు దైవికంగా సంభవించిన ఆపద వల్ల విరక్తుడై రాజ్య త్యాగం చేయగా, ధృతరాష్ట్రుడు గద్దెనెక్కి, ప్రభువనిపించుకున్నాడే తప్ప, అతడు మూర్ధాభిషిక్తుడైన పరిపాలకుడు కాదు. జాత్యంధుడు కావడం వల్ల రాజ్యార్హత కోల్పోయినవాడు. కాని పాండురాజు అలాకాదు. సింహాసనాధిష్ఠితుడై, దిగ్విజయయాత్ర చేసి,దశార్ణ, మగధ, పుండ్ర, విదేహాది దేశాలను జయించి రాజ్య విస్తరణ

చేసి సామ్రాజ్య స్థాపకుడనిపించుకున్నాడు. తన అమేయ బలపరాక్రమాలతో అశేష సంపదను ఆర్జించి తెచ్చి- తన వంశ పూర్వ చక్రవర్తులను తలపించిన ఘనుడని పలువురి ప్రశంసలకు పాత్రుడై, ఒక ప్రత్యేకమైన గుర్తింపును పొందాడు. ఆ కారణం వల్లనే - ధృతరాష్ట్ర సంతానం కేవలం కౌరవులనే మూలనామాన్ని(వంశనామాన్ని) మాత్రమే కలిగి ఉండగా, పాండురాజు సంతానం పాండవులుగా ప్రత్యేకమైన గుర్తింపును పొందారు.

314. ఋష్యశృంగుని తండ్రి స్త్రీని కన్నెత్తి చూడనివాడని అంటారు. మరి అతనికి ఋష్యశృంగుడెలా కుమారుడయ్యాడు ?

స్త్రీని కన్నెత్తి చూడని పరమబ్రహ్మచారిగా ఋష్యశృంగుడే పేరొందాడు. కాని, అతని తండ్రి కాదు. ఆయన తండ్రియైన విభాండక మహర్షి కూడా తీవ్ర నియమ నిష్ఠాయుత తపోగరిష్ఠుడే గాని ఆయనకు అయోనిజుడుగా ఋష్యశృంగుడు జన్మించినట్లుగా మహర్షి వాక్యం. ఇది వ్యాస ప్రోక్తమైన భారతంలో ఉంది.

315. కర్ణుని జననం రహస్యంగా జరిగింది కదా! మరి కర్ణునికి నామకరణం ఎవరు చేశారు ? కర్ణునికి మొదట పెట్టిన పేరేది?

కర్ణుని తల్లి కుంతీదేవి అతడిని ఒక పెట్టెలో అమూల్యమైన ఎన్నో బంగారు అభరణాలతో పాటుగా పెట్టి ఆ పెట్టెను గంగానదికి ఉపనది అయిన అశ్వనదిలోకి వదిలింది. ఆ బాలుడు పెట్టెతోపాటుగా గంగానదిలోకి కొట్టుకొని వచ్చి - సూతదంపతులకు దొరికాడు. కర్ణునికి నామకరణం కుంతీదేవి చెయ్యలేదు. కర్ణుని పెంచిన తల్లిపేరు రాధ. రాధ కొడుకు కనుక ఆ బాలుడు రాధేయుడనీ, అనర్ఘ స్వర్ణరాశితోపాటు లభించినందువల్ల వసుషేణుడనీ పేర్లు ఏర్పడ్డాయి. సహజ కర్ణ కుండలాలతో జన్మించినందువల్లనూ, దేవేంద్రునికి వాటిని దానమిచ్చి నందుల్లనూ కర్ణుడని లోకులు పిలిచారు. సూతదంపతులే కర్ణునికి నామకరణం చేశారు. వారు పెట్టిన పేరు వసుషేణుడని. రాధేయుడనే పేరూ, కర్ణుడనే పేరు లోకవ్య

వహారంలో ఏర్పడ్డాయి. దుర్యోధనుడు రాధేయుని అంగదేశానికి రాజుగా చేయడంవల్ల కర్ణునికి అంగరాజు అనే పేరు కూడా స్థిరపడింది.

316. కర్ణుని తండ్రి పేరు సూతుడు కదా! సూతుడు శౌనకాదులకు పురాణాలు చెప్పినట్లు ఉన్నది. కదా! ఏమిటి?

కర్ణుడి తండ్రియైన సూతుడూ, శౌనకాదులకు పురాణ కథలు వినిపించిన సూతుడూ ఒకరు కాదు. వారిరువురూ వేరు వేరు వ్యక్తులు.

కర్ణుడి తండ్రి పేరు అధిరధుడు.'సూతుడు' అనేది అతని పేరు కాదు – అతని వృత్తి. ఆ కాలంలో రథం తోలే వారిని 'సూతులు' అనేవారు. నదిలో దొరికిన బాలుని (కుంతీ పుత్రుడు) – ఈ అధిరధుడు, అతని భార్య అయిన రాధ పుత్రునిగా స్వీకరించి కర్ణుడనే పేరు పెట్టి పెంచారు. శౌనకాది మహర్షులకు పురాణాదులను వినిపించిన సూతుని పేరు ఉగ్రశ్రవసుడు. ఈయనరోమహర్షణుడనే మహర్షి కుమారుడు.

ఈ ఉగ్రశ్రవసుడు – వ్యాస శిష్యుడైన వైశంపాయనుని నుంచి పురాణాదులను, పుణ్యగాధలను అభ్యసించాడు. శౌనకాదులు కోరగా అనేక పుణ్యగాధలను వారికి వినిపించిన వాడు – ఈ ఉగ్రశ్రవసుడనే పేరుగల సూత పౌరాణికుడే..

317. దశావతారాల్లో ఆరవది పరశురామావతారం. రామావతారంలో పరశురామ గర్వభంగం ఉంది. ద్వాపర యుగంలో భీష్మ కర్ణులకు విలువిద్యలు నేర్పిన గురువు పరశురాముడే. ఈ ఇద్దరూ ఒకరేనా? ఇద్దరా? ఆంజనేయ స్వామి త్రేతాయుగం, రామాయణానికి చెందిన వాడు. మరి ద్వాపరంలో భారతంలో కూడ ఆయన ఉనికి ఎలా సాధ్యం.?

''అశ్వత్థామాబలిర్వ్యాసో హనుమాంశ్చ విభీషణః
కృపః పరశురామశ్చ సప్తైతే చిరజీవినః ''
సప్తైతాన్ సంస్మరేన్నిత్యం మార్కండేయ మధాష్టమమ్...''

అని చెప్పబడిన దానిని బట్టి, పై చిరంజీవులని విశదమవుతున్నది కదా! అందువల్ల ఈ చిరంజీవులైన అశ్వత్థామ, బలి, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యుడు,మార్కండేయుడు, పరశురాముడు - వీరు వివిధ యుగాలకు చెందిన ఇతిహాసాలలో, గాధలలో దర్శనమివ్వడంలో విపరీతం ఏమీ లేదు.

318. శకుని ఎవరి కుమారుడు? శకుని సంతానం ఎవరు ?

శకుని - గాంధార రాజైన సుబలుని కుమారుడు. గాంధారి సోదరుడు. సుబలుడు తన కుమార్తెలైన గాంధారి, సత్యసేన, సత్యవ్రత మొదలైన వాళ్లను ధృతరాష్ట్రునికిచ్చి వివాహం చేశాడు. శకుని కుమారుడు ఉలూకుడు.

319. నకుల సహదేవులు ఏ విద్యల్లో ప్రవీణులు ?

నకులుడు అశ్వశిక్షణలోనూ, అశ్వవైద్యంలోనూ ప్రవీణుడు. సహదేవుడు పశుపాలనలోనూ, పశువైద్యంలోనూ ఆరితేరినవాడు.

320. హస్తినాపుర రాజ్యాధికారం భీష్మునిదే, అతడి శపధం వల్ల ఆ అధికారం ధృతరాష్ట్రునికి చెందుతుంది. ధృతరాష్ట్రుని తరువాత సుయోధునికే అధికారం సంక్రమించాలి. పాండురాజు పుత్రులకు రాజ్యాన్ని ఇవ్వాల్సిన అవసరం ఏమిటి?

భీష్ముడు తన ప్రతిజ్ఞ ద్వారా వదులుకున్న రాజ్యాధికారం సత్యవతీ దేవి సంతానానికి లభించింది. జ్యేష్ఠపుత్రునిదే ధర్మానుసారంగా రాజ్యాధికారమైనా, ధృతరాష్ట్రుడు నేత్రహీనుడుగా జన్మించాడు. అంగవైకల్యం కలవానికి రాజ్యార్హత లేదు. అందువలన పాండురాజుకే రాజ్యార్హత ఉన్నదని నిర్ణయించడం జరిగింది. వ్యాసభారతాన్ని అనుసరించి పాండురాజుకే పట్టాభిషేకం జరిగింది.

పట్టాభిషేకానంతరం పాండురాజు దిగ్విజయ యాత్రచేసి, రాజ్యాన్ని విస్తరింపజేశాడు. రాజ్యానికి వచ్చిన కొద్దికాలనానికే పాండురాజు తన భార్యలిరువురుతో వన విహారానికివెళ్లడమూ, అక్కడ మృగభ్రాంతితో కిందమ ముని దంపతులపై బాణప్రయోగం చేసి, కిందమ ముని శాపానికి గురికావడమూ జరిగాయి.

శాపోహతుడైన పాండురాజు ఇక తిరిగి నగరానికి వెళ్లలేదు. అక్కడనే తపోవృత్తిలో ఉండిపోయాడు. అతడి పత్నులు అతనితోనే ఉన్నారు. పాండురాజే రాజ్యాధికారి కావడం చేత, అతని అనంతరం పాండురాజు జ్యేష్ఠపుత్రునిదే రాజ్యాధికారం అవుతుంది. పాండురాజు - ధర్మరాజుల మధ్య కాలంలో ధృతరాష్ట్రుడు తాత్కాలికంగా అధికారాన్ని నిర్వహించాడే తప్ప, అతడు శాస్త్ర సమ్మత ప్రభువు కాడు. అతనికే లేని రాజ్యార్హత అతని సంతానానికి సంక్రమించే ప్రసక్తిలేదు. ఈ రీత్యా ధర్మశాస్త్ర రీత్యా రాజ్యాధికారియైన పాండురాజు జ్యేష్ఠ సంతానానిదే రాజ్యాధికారమని స్పష్టం.

321. మహాభారతంలో ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడైనందువల్ల అగ్రజుడైనప్పటికీ, పాండురాజు అభిషిక్తుడయ్యాడు. మరి అగ్రజుని కుమారుడుగా దుర్యోధనునికి రాజ్యార్హత, హక్కు, ఉన్నాయి. కదా? మరెందుకు యుద్ధం సంభవించింది? ఆ యుద్ధానికి బాధ్యులెవరు?

నేత్ర హీనత కారణంగా ధృతరాష్ట్రునికి రాజ్యాధికారం లేదు. ఆరీత్యా - పట్టాభిషిక్తుడైన పాండురాజు అకాలమరణం చెందడం వల్ల తాత్కాలికంగా ఒక ధర్మకర్త వంటి పాత్రను ధృతరాష్ట్రుడు నిర్వహించవలసి వచ్చింది. ఈ తాత్కాలికాధికారాని వదులుకోదలుచుకోలేదు ధృతరాష్ట్రుడు. తనకూ, తన పుత్రులకూ రాజ్యాధికారం శాశ్వతంగా వంశానుగత వారసత్వంగా నిలిచిపోవాలనుకొన్నాడు. భీష్మ విదురాదుల మాట కాదనలేక, ధర్మరాజుకు యువరాజ్యాభిషేకం చేసినా, ధృతరాష్ట్రుడు తన మనస్సులో ధర్మరాజును రాజ్యానికి ఉత్తరాధికారిని చేయడంపట్ల సుముఖత్వం వహించలేదు.

పాండవులను కుంతీదేవితో సహా కొన్నాళ్ళు వారణావతంలో నివసించి రమ్మని ధృతరాష్ట్రుడు దుర్యోధునిని ప్రేరేపణతో ధర్మరాజును ఆదేశించాడు. దీని వెనుకనున్న దుర్యోధనుని ఆలోచన (లాక్షాగృహ నిర్మాణం – దాని దహనం) ధృతరాష్ట్రునికి తెలియకపోలేదని వ్యాస భారతం చదివిన వారికి అవగతమవుతుంది.

లక్క ఇంట్లో కాలిపోయారనుకున్న పాండవులు – ద్రౌపదిని వివాహం చేసుకోవడం ద్వారా ద్రుపద మహారాజు అండ పొందగలిగారు. లక్క ఇంటి నుంచి తప్పించుకున్న తర్వాత అన్నాళ్లూ ఏక చక్రపురంలో అజ్ఞాతంగా జీవించిన పాండవుల ఉనికి – ద్రౌపదీ వివాహంతో వెల్లడి అయింది. పాండవులు జీవించి ఉండడమే కాకుండా, బలవంతుడైన ద్రుపదుని బాంధవ్యాన్ని కూడా సంపాదించారని తెలిసిన ధృతరాష్ట్రుడు – వారిని పిలిపించి ఖాండవప్రస్థాన్ని ఏలుకొమ్మని ఇచ్చి పంపాడు.

లక్క ఇంటి సంఘటనతో తన పట్ల ఏర్పడిన ప్రజావైముఖ్యాన్నీ, భీష్మ విదురాదుల ఎదుట తనకు కలిగిన సంకట స్థితినీ తొలగించుకోవడానికి పూర్తి రాజ్యం కాకపోయినా, కొంత ప్రదేశమైనా పాండవులకు ఇవ్వక తప్పని పరిస్థితి ధృతరాష్ట్రునికి ఏర్పడింది. ఇంకా తాను ఉదాసీనత వహిస్తే సర్వులూ తనను ఛీ అంటారనే భయంతో పాండవులకు ఖాండవప్రస్థాన్ని ఇచ్చాడు ధృతరాష్ట్రుడు. అంతేగాక, లక్కా గృహ నిర్మాణం- దహనం ఎంతో పటిష్ఠమైన వ్యూహంగా జరగడంతో, ధార్త రాష్ట్రులకూ పాండవులకూ మధ్యనున్న వైమనస్యాలు లోకానికి వెల్లడి అయ్యాయి. అటువంటి పరిస్థితిలో ఇరువంకల వారూ కలసి, ఒకే చోట కాలం గడిపే అవకాశం పూర్తిగా అంతరించింది.

రాజ్యానికి నిజమైన అధికారి అయిన పాండురాజు మరణిస్తే తండ్రిలేని పిల్లలను నిరాదరణకు గురిచేసి, తండ్రి రాజ్యం ఇవ్వకుండా అన్యాయం చేసి, కడకు అంతం చేయడానికి కూడా ప్రయత్నించాడనే అప

ప్రథను తప్పించుకోవసి ఉంది. ధృతరాష్ట్రునికి. అదీగాక, తక్షణమే తాను రాజ్య త్యాగం చేసి, సర్వరాజ్యాన్నీ ధర్మరాజుకు ఒప్పగించవవసరం లేకుండానూ, పూర్తి రాజ్యంపై వారి హక్కును అంగీకరించి తన హక్కును సమూలంగా వదులుకోనవసరం లేకుండానూ – మధ్యేమార్గంగా ఈ విధమైన ఏర్పాటు పనికి వస్తుందనే ఖాండవ ప్రస్థాన్ని ధృతరాష్ట్రుడు పాండవులకీయడంలోని ఆలోచన. తమకిచ్చిన ప్రదేశమేదో మారు మాట్లాడకుండా స్వీకరించి, తల్లితో, భార్యతో తరలివెళ్లి ఖాండవప్రస్థంలో రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు పాండువులు.

ఈ విధంగా హస్తినాపురంలో ధృతరాష్ట్రుని అధికారం, రాజత్వం చెక్కు చెదరకుండా ఉండగా, పాండవులు వేరొకచోట రాజ్యం ఏర్పరచుకొన్న సందర్భంలో దుర్యోధనుడు తృప్తిపడి ఉండవలసింది. కానీ, పాండవులను ఆ మాత్రంగా కూడా ఉండనీయరాదన్న అసూయతో, ద్యూతమూ, ద్రౌపదీ వస్త్రాపహరణమూ, అరణ్య అజ్ఞాత వాసాలూ, ఘోషయాత్రా వంటి దుశ్చేష్టలన్నీ తలపెట్టి పాండవులను పూర్తిగా నాశనం చేయ సమకట్టాడు. ధృతరాష్ట్రుని అంగీకారం ఉండనే ఉన్నది దుర్యోధనుని ప్రతి దుశ్చర్యకూ. కాబట్టి యుద్ధానికి పూర్తి బాధ్యులు ధృతరాష్ట్ర దుర్యోధనులే.

323. ద్రౌపదికి సంతానం కలిగిందా ?

కలిగింది. ధర్మరాజు పుత్రుడైన ప్రతివింధ్యుడు, భీమసేన పుత్రుడైన శ్రుత సోముడు, అర్జున పుతుడైన శ్రుతకీర్తి, నకుల పుత్రుడైన శతానీకుడు, సహదేవ పుత్రుడైన శ్రుతసేనుడు – వీరు ద్రౌపదికి కలిగిన సంతానమే.

324. ధృతరాష్ట్రునిసంతానంలో ఒకరైనా కురుక్షేత్రయుద్ధం తర్వాత మిగిలారా?

ధృతరాష్ట్రుని మరొక భార్యకు జన్మించిన యుయుత్సుడు – కురుక్షేత్ర యుద్ధంలో మరణించలేదు.

325. ద్వాదశ రుద్రులంటే ఎవరు? వారి పేర్లేమిటి?

ద్వాదస రుద్రులు కాదు. ఏకాదశ రుద్రులు. అంటే పదకొండు మంది రుద్రులు. వీరు - అజపాదుడు, అహిర్బుధ్నుడు, త్ర్యంబకుడు, వృషాకపి, శంభుడు, జపాలి, రైవతుడు, హరుడు, బహురూపుడు, ఉగ్రుడు, విశ్వరూపుడు. మరొక కల్పంలో ఏకాదశ రుద్రులు-మహత్తుడు, మహాత్మ, మతిమంతుడు, భీషణుడు, భయంకరుడు, ఋత ధ్వజుడు, ఊర్ధ్వకేశుడు, పింగళాక్షుడు, రుచి, శుచి, కాలాగ్ని, రుద్రుడు.

326. వసుదేవునికి దేవకి కాకుండా ఇంకా భార్యలున్నారా? వాళ్లకు సంతానముందా? ఉంటే ఎవరు?

వసుదేవునికి దేవకి కాకుండా ఇంకా-శాంతిసేన, ధృతదేవ, రోహిణి, కౌసల్య, పౌరవి, దేవరక్షిత -మదిర - మొదలైన అనేక భార్యలున్నారు. వాళ్లకు సంతానం కూడా ఉంది.

వసుదేవుని సంతానం :-

దేవుకీపుత్రులు : కీర్తిమంతుడు, సుషేణుడు, భద్రసేనుడు, ఋజువు, సమదనుడు, భద్రుడు, సంకర్షణుడు, శ్రీకృష్ణుడు.

రోహిణీ పుత్రులు : బలరాముడు, గదుడు సారణుడు, దుర్మదుడు, విపులుడు, ధ్రువుడు, సుభద్ర కూడా ఈమె కూతురే. దేవరక్షితకు అంగదుడు మొదలైన వాళ్లు కలిగారు. పౌరవికి సుభద్రుడు మొదలైన పుత్రులు జన్మించారు. మదిర అనే భార్య యందు నందుడు, ఉపనందుడు మొదలైన పుత్రులు కలిగారు.

327. భాగవతం అనే పేరు ఎలా వచ్చింది?

భగవంతుని కథలను గురించి తెలిపేది. భగవదవతారాలను వివరించేదీ, భాగవతం. భాగవతులంటే భగవద్భక్తులు. భగవద్భక్తుల చరిత్రలను వర్ణించేదీ, వివిధ విధాలైన భక్తిమార్గాలను గురించి తెలిపేది

భాగవతం. భగవద్భక్తులైన మహానుభావుల గురించీ, నవవిధ భక్తి మార్గాల గురించీ, ఆయా భక్తిమార్గాల ననుసరించి భక్తులైనవారు తరించిన రీతుల గురించీ తెలిపేది భాగవతం.

328. కృష్ణుడు భారతంలో అనేక కుటిల తంత్రాల ద్వారా శత్రువులను కూల్చాడు. అలాంటివాడు దేవుడెలా అవుతాడు?

పరిశుభ్రమైన తెల్లని వస్త్రంపై ఒక చిన్న మరకపడినా, అది అందరికీ స్పష్టంగా కనిపిస్తుంది. నల్లటి వస్త్రంపై ఎన్ని మరకలున్నా ఎవరికీ కనిపించదు. ఎవరు దానిని ప్రత్యేకంగా పట్టించుకోరు కూడా. తెల్లని వస్త్రంపై ఉన్న మరకనే ప్రత్యేకించి పట్టించుకుంటారు. వెంటనే గుర్తించి వ్యాఖ్యానిస్తారు. ఆ విధంగానే, దుర్మార్గుల యొక్క అసంఖ్యాకాలైన దుశ్చేష్టితాలను ఎవరూ పట్టించుకోరు. సహజంగా సజ్జనులైన వ్యక్తులు - పొరపాటు వల్లనో గత్యంతరం లేని పరిస్థితుల్లోనో చేసిన ఏ ఒక్క చర్యనో పదే పదే ఎత్తిచూపుతుంటారు. అది మినహా వారి యొక్క వ్యక్తిత్వం ఎటువంటిదని పరిశీలించరు. అంతేకాదు, అది నిజంగా తప్పిదమూ, తప్పిదంలాగా పైకి కనిపించే - ధర్మబద్ధమైన చర్యేనా - అని కూడా యోచించరు లోతుగా పరిశీలించకనే వ్యాఖ్యానిస్తారు.

కైక దురాలోచనతో అడిగిన వరాలవల్ల, దశరథుడు చనిపోయాడు. అది అన్యాయం కాదా? దశరథరాజు సంతానమైన రామలక్ష్మణులేకాక, జనకచక్రవర్తి కూతురైన సీత కూడా అడవుల పాలైంది. వారి జీవితాలలో ముఖ్యమైన యౌవన దశ అంతా అరణ్యాలలోనే గడిచింది. వారికి జరిగిన ఆ నష్టానికి పరిహారం ఏమిటని ఎవరూ ప్రశ్నించరు. భోగభాగ్యాలతో తుల తూగవలసిన వారు అడవులలో క్రూరమృగాల మధ్య గడిపారు. అడవిలో అరక్షితగా ఉండడం వల్లనే సీత రావణుడి చేత పడడం, ఆ సంఘటన ఆమె జీవితంపైన చెరగని ముద్ర వేయడం, అగ్ని ప్రవేశం చేసి కూడా ఆమె ఆ కళంకం నుంచి విముక్తురాలు కాలేకపోవడం, ఆ కారణంగానే, సీత మరొకసారి కూడా అడవిపాలు కావడం - అందునా పుట్టెడు నింద నెత్తినవేసుకుని ..

ఇలా ఇవన్నీ కేవలం కైక కోరిక మూలంగానే జరిగాయి. ఈ విధంగా నష్టం జరిగిన వారికి ఎవరు పరిహారం చెల్లిస్తారు?

ఇక భారతంలో పాండువులు నిజమైన రాజ్యాధికారం కలిగి ఉన్నప్పటికీ ధార్తరాష్ట్రులవల్ల ఎన్నో కష్టాలు అనుభవించారు. దుర్యోధనుని అసూయ కారణంగా వారు పడరాని పాట్లు పడ్డారు. నష్టపోయిన కాలాన్ని వారికి ఎవరూ భర్తీ చేస్తారు అని ఎవరూ అడగరు. ఎవరికీ అపకారం చెయ్యని సీతరాములు. ఊర్మిళా లక్ష్మణులు, పాండవులు, ద్రౌపది - వీరు తాము చేయని తప్పులకు బలై, వారి జీవితాలు బహుకాలం కష్టమయం కావడం అన్యాయంకాదా - అని ఎవరూ ప్రశ్నించరు. (ఇక్కడ అవతార ప్రయోజనం, దివ్యత్వం - మొదలైన అంశాలను విడిచిపెట్టే ఇటువంటి చర్చలోకి దిగడం జరుగుతుంది. కనుక, వాటి ప్రసక్తి అనవసరం)

దీనికి కారణం ఈనాటి సినిమాలు దొంగలను, హంతకులను, సంఘవ్యతిరేక శక్తులను గ్లోరిఫై చేయడమే. అటువంటి భావాలు మనసులో హత్తుకుపోయిన జనులకు - దుశ్శాసన దుర్యోధనాదులు ఆరాధ్యులుగా కనిపించడంలో ఆశ్చర్యంలేదు. జీవితమంతా దుష్టభావాలతో దుష్టచింతనతో, పరపీడన పరాయణులై గడిపిన వారిని ఉత్తములుగా కీర్తించడం, సహజంగా సజ్జనులై ఉండి, సత్ప్రవర్తన కలిగి ఉండిన ఉత్తమ జీవితాలలోని ఏ ఒక విషయాన్నో పట్టుకొని తూర్పారపట్టడం ఈనాటి నాగరికతగా మారింది. దీనినే రంధ్రాన్వేషణం అంటారు.

329. ధృతరాష్ట్రుని నూరుగురు కొడుకుల పేర్లు ఏవి? దయవుంచి తెలియజేయండి.

ధృతరాష్ట్రునికి గాంధారి యందు జన్మించిన నూరుగురు పుత్రుల పేర్లు ఈ క్రిందివి.

1. దుర్యోధనుడు 2. దుశ్శాసనుడు, 3. దుస్సహుడు, 4. దుశ్శలుడు, 5. జలసంధుడు, 6. సముడు, 7. సహుడు, 8. విందుడు,

9. అనువిందుడు, 10. దుర్ధర్షుడు, 11. సుబాహుడు, 12. దుష్ప్రధర్షణుడు
13. దుర్మర్షణుడు, 14. దుర్ముఖుడు, 15. దుష్కర్ణుడు 16. కర్ణుడు,
17. వివింశతి, 18. వికర్ణుడు, 19. శలుడు, 20. సత్వుడు,
21. సులోచనుడు, 22. చిత్రుడు, 23. ఉపచిత్రుడు, 24. చిత్రాక్షుడు,
25. చారుచిత్రుడు, 26. శరాసనుడు, 27. దుర్మదుడు, 28. దుర్విగాహుడు,
29. వివత్సుడు, 30. వికటాననుడు, 31. ఊర్ణనాభుడు, 32. సునాభుడు,
33. నందుడు, 34. ఉపనందకుడు, 35. చిత్రబాణుడు, 36. చిత్రవర్మ
37. సువర్మ, 38. దుర్విమోచనుడు, 39. అయోబాహుడు,
40. మహాబాహుడు, 41. చిత్రాంగుడు, 42. చిత్రకుండలుడు,
43. భీమవేగుడు, 44. భీమబలుడు, 45. బలాకి, 46. బలవర్ధనుడు,
47. ఉగ్రాయుధుడు, 48. సుషేణుడు, 49. కుండధారుడు,
50. మహోదరుడు, 51. చిత్రాయుధుడు, 52. నిషంగి, 53. పాశి,
54. బృందారకుడు, 55. దృఢవర్మడు, 56. దృఢసంధుడు, 57. సోమకీర్తి,
58. అనూదరుడు, 59. ధృఢసంధుడు, 60. జరాసంధుడు,
61. సదసువాగుడు, 62. ఉగ్రశ్రవుడు, 63. ఉగ్రసేనుడు, 64. సేనాని,
65. దుష్పరాజయుడు, 66. అపరాజితుడు, 67. కుండశాయి.
68. విశాలాక్షుడు, 69. దురాధరుడు, 70. దృఢహస్తుడు, 71. సుహస్తుడు
72. వాతవేగుడు, 73. సువర్చుడు, 74. ఆదిత్యకేతుడు, 75. బహ్వాశి,
76. నాగదత్తుడు, 77. అగ్రయాయి, 78, కవచి, 79. క్రథనుడు,
80. కుండుడు, 81. ధనుర్ధరుడు, 82. ఉగ్రరథుడు, 83. భీమరథుడు,
84. వీరబాహుడు, 85. అలోలుపుడు, 86. అభయుడు, 87. రౌద్రకర్మడు,
88. దృఢరథుడు, 89. అశ్రయుడు, 90. అనాధృష్యుడు, 91. కుండభేది,
92. విరావి, 93. ప్రమథుడు, 94. ప్రమాది, 95. దీర్ఘరోముడు,
96. దీర్ఘబాహుడు, 97. వ్యూఢోరుడు, 98. కనకధ్వజుడు, 99. కుండాశి,
100. విరజసుడు.

పై నూరుగురు పుత్రులూ, దుశ్శల అనే ఒక కుమార్తె - గాంధారికి జన్మించారు. ధృతరాష్ట్రుని వైశ్య భార్యయందు యుయుత్సుడు జన్మించాడు. ఈయుయుత్సుడు - కురుక్షేత్ర యుద్ధ ప్రారంభంలో కౌరవపక్షాన్ని విడిచి పాండవపక్షాన్ని చేరాడు.

కురుక్షేత్ర యుద్ధ ప్రారంభానికి ముందు రెండు పక్షాల సేనలూ యుద్ధరంగంలో మోహరించి ఉన్న సమయంలో -వారి వారి ఇష్టాన్ని అనుసరించి ఏ పక్షంలోనివారు ఏ పక్షంలోనికైనా మారవచ్చునని ధర్మరాజు ప్రకటించాడు. ఆ ప్రకటననుసరించి యుయుత్సుడు పాండవపక్షాన్ని చేరాడు. పాండవ పక్షాన కౌరవులతో యుద్ధం చేశాడు. ధృతరాష్ట్రుని పుత్రులలో కురుక్షేత్ర యుద్ధానంతరం జీవించి ఉన్నది యుయుత్సుడొక్కడే.

శ్రీ శివ మహాపురాణము

శైవసిద్ధాంత ప్రతిపాదితమైన ఈ శివమహాపురాణము విద్వేశ్వర సంహిత, రుద్రసంహిత, శతరుద్రసంహిత కోటిరుద్రసంహిత, ఉమాసంహిత, కైలాస సంహిత, వాయవీయ సంహిత అను సప్త సంహితలతో కూడిన గ్రంథము. ఇందు శివభక్తి ప్రబోధాత్మకమగు లెక్కలేనన్ని కథలు కలవు వానితో బాటు శివుని 88 అవతారములను వివరముగా వర్ణించిన విశేషములు గలవు. ద్వాదశ జ్యోతిర్లింగములను గూర్చియు వాని మహిమలను గూర్చియు ఈ పురాణములో విస్తరింపబడి యున్నది. ఈ విషయములే కాక సృష్టిస్థితిలయముల స్వరూపము (కాస్మాలజీ) దేహోత్పత్తి, స్థితివినాశములు ఇత్యాది ప్రకృతి సంబంధమయిన శాస్త్ర రహస్యములు వివరించబడినవి. గురు లింగ జంగమ మాహాత్మ్యము శాంభవీ దీక్షావివరములు శివ పంచాక్షరీ ప్రాశస్త్యము ఇత్యాది విషయములు విపులీకరించబడియున్నవి వీనితో పాటు అసంఖ్యాక తాత్విక విషయములు శాస్త్ర విషయములు ఆయా సందర్భముల ననుసరించి విస్తరింపబడి యున్నాయి

శివశ్రీ నిర్మల శంకర శాస్త్రిగారిచే రచించబడినటువంటి ఈ గ్రంథమును రెండు భాగములుగా జేసి నూతనంగా ముద్రించడమైనది.

(Part - 1) Rs 310/ - (Part - 2) Rs 300/- సుమారు 1100 పేజీలు

శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ మహాత్మ్యము

భారతావని యందు గల ద్వాదశ జ్యోతిర్లింగముల ఆవిర్భావం అవి ఏపి ప్రదేశములయందు తమ తమ విశిష్టతను పొందిన తీరును తెలియపరిచే విధంగా కూర్చబడినది ఈ పుస్తకము. ఈ పుస్తకము మీ చెంతయున్న మీరు ఈ ద్వాదశ జ్యోతిర్లింగములను దర్శించినటువంటి అనుభూతిని పొందగలరు. ఎన్నో విశేషములతో భక్తజనులకు ఉపకరించే విధంగా రూపొందించబడినది.

పేజీలు : 100 వెల : 16-00

శ్రీ వాసర జ్ఞానసరస్వతీ మహోత్స్యము

బాసరక్షేత్రంలోని చుట్టు ప్రక్కల నున్నటువంటి మహాలక్ష్మీ దేవాలయం, మహాసరస్వతీ దేవాలయంతో పాటుగా మరెన్నో ఇతర దేవాలయములు కలవు ఈ క్షేత్రం తపోభూమిగా ప్రసిద్ధిగాంచినది. ఇచ్చట దేవాలయంలో మండలము లేదా అర్థమండలము రోజుల పాటు ఉండి మాధుకరమును స్వీకరిస్తూ (భిక్షను గ్రైకొనడం) సరస్వతీ ఉపాసనను చేస్తే ఎటువంటి కఠినతరమైన కోరికలైనా సరే, ధనము గానీ, విద్యగానీ లేదా తదితర సంసారపరమైనటువంటి కోరికలు తీరునని పెద్దల వాక్కు ఈ దేవాలయములో ఎందరో భక్తులు ఇట్టి దీక్షను గావిస్తూ నిత్యం కనబనడుతూ ఉంటారు

ప్రతిరోజూ ప్రొద్దున నదిలో స్నానం జేసి దేవాలయ ప్రాంగణమునందు కూర్చొని జప ధ్యానాదులు గావించిన అనంతరము మాధూకర సమయానికి ప్రక్కనే ఉన్న గ్రామానికి వెళ్ళి మాధుకరాన్ని స్వీకరించి మళ్ళీ సాయంత్ర సమయానికి దేవాలయ ప్రాంగణములో జప ధ్యానాదులు చేయడం వల్ల సకల కోఠికలు తీరునని అనుభవజ్ఞుల మాట.

ప్రతి సంవత్సరము అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు ఎంతో వైభవోపేతంగా శరన్నవరాత్రులను ఇక్కడ నిర్వహిస్తూ ఉండటం ఓ విశేషం అలాగే మాఘమాసమందు వసంత పంచమినాడున సరస్వతీదేవి యొక్క జన్మదిన వేడుకను పురస్కరించి విశేషపూజలు జరుపుతూ ఉంటారు.

ఉత్తర భారతదేశంలోని కాశ్మీర మందలి శారదా పీఠములా దక్షిణ భారతదేశంలోని ముధోల్ మండలమందలి బాసరక్షేత్రం ఎంతో ప్రసిద్ధిని పొంది దివ్యక్షేత్రమై లౌకిక, పారమార్థిక విద్యలకు అనుగ్రహాన్ని అందిస్తూ ఎందరినో భక్తులను అక్కునకు చేర్చుకుంటున్నది. అక్షరజ్ఞానం లేని వాణ్ణి అపారమైనటువంటి అర్షవిద్యాధరిని గావించగల శక్తిని ప్రసాదించగలదు. అట్టి చదువుల తల్లిని అక్షరాభ్యాసానికి శ్రీకారం చుట్టేబాలుణ్ణి మొదలుకొని ఉన్నత విద్య అభిలషించే విద్యార్థి వరకు ప్రతినిత్యం ఈ క్రింది శ్లోకం ఓ ఊతమై నిలుస్తుంది. ఇది వేదోక్తం.

"శరదిందు సమాకారే, పరబ్రహ్మ స్వరూపిణీ
వాసరా పీఠ నిలయే, సరస్వతీ నమోస్తుతే "

జ్ఞాన సరస్వతీదేవి యొక్క సంస్పర్శ సోకినంతనే మూగవాడు సహితం మధురంగా మాట్లాడగల శక్తిని పొందగలదు. ఈ పుస్తకమును చదివి జ్ఞాన సముపార్జనను పొందగలరు

పేజీలు : 192 వెల : 30-00

శంకర భాష్య
శ్రీవిష్ణు సహస్రనామము

శ్రీవిష్ణు సహస్రనామము ఆంధ్ర అనువాదంతో చదువరులకు చాలా తేలికగా అర్థమును తెలియపరిచే విధముగా ముద్రించబడినది. ఈ నామాల్లో శబ్దం అర్థం, ఇమిడి యుంటాయి గావున ప్రతి మంత్ర నిర్మాణము మన యొక్క షట్చక్రాలపై మరియు సూక్ష్మ గ్రంథులపై ఎంతగానో ఉంటుంది అనారోగ్యం నుండి కాపాడుతుంది. ధైర్యాన్నీ స్థైర్యాన్నీ అందిస్తుంది. శ్రీ కృష్ణాష్టకము శ్రీమహాలక్ష్మ్యష్టకము మరియు శ్రీమధురాష్టకముతో ముద్రించబడినది.

పేజీలు 256 వెల : 72=00

శ్రీ దేవీ నవరాత్ర పూజాకల్పము

ప్రాంతములను బట్టి, అభిరుచులను బట్టి గురు పరంపరల ననుసరించి దేవతా ప్రాధాన్యమును బట్టి పూజా విధానములలో ఎంతో వైవిధ్యము ఏర్పడుతుంది. తెలంగాణా ప్రాంతానికి సంబంధించినటువంటి శ్రీశ్రీశ్రీ చుంచనకోట భువనేశ్వరీమాతను పూజించే పద్ధతిని వివరిస్తూ విపులంగా రచించబడినది. భక్తులు ఆరాధనా సమయమునగానీ, నవరాత్రోత్సవ సమయమునగానీ నిత్యపారాయణ చేసిన శ్రీ భువనేశ్వరీ మాత యొక్క కరుణాకటాక్షములకు కృపాపాత్రులై సుఖమయమైన జీవితాన్ని కొనసాగించి కృతార్థులు కాగలరు. **పేజీలు 232 వెల : 90=00**

కుజదోషశాంతి

బ్రహ్మశ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతిగారిచే రచించబడినటువంటి ఈ చిన్ని పుస్తకము ఎంతో శక్తిని ఇముడ్చుకున్నది. వివాహాలకి ఆటంకాలు కలిగిస్తూ కన్నెలకు మనస్థాపానికి గురిచేసేటువంటి కుజదోషానికి పరిష్కృతిని చూపుతూ వివరంగా, శాస్త్రపరంగా అట్టి దోషము నుండి రక్షిస్తుంది పెళ్ళికాని స్త్రీలు దీనిని నిత్యపారాయణ గావించిన త్వరలోనే వివాహితులు కాగలరు. అనారోగ్యం నుండి రక్షింపబడెదరు. **పేజీలు 32 వెల : 16=00**

కుబేరపూజా విధానము

కుబేర పూజను నిత్యపారాయణ మొనర్చిన ధనలక్ష్మి మీ యింట ప్రవేశించును ఆ తల్లి యొక్క చల్లని చూపులు మీ యింటిని నిత్యమూ వెలుగులతో నింపును. అష్టకష్టములు అనుభవింపక అష్టైశ్వర్యములతో ఆనందంగా జీవించగలరు **పేజీలు 32 వెల : 16=00**

ఛాందోగ్య కథా మంజూష

శంకర భగవత్పాదుల వారిచే రచించబడినటువంటి 108 ఉపనిషత్తులోనుంచి పది ఉపనిషత్తులను ముఖ్యముగా తీసుకొని ఈ ఛాందోగ్య కథా మంజూష ద్వారా, వెలుగులోకి తీసుకొనిరావాలని దీనిని ముద్రించడమైనది. ఇది సామవేదమునకు చెందిన ఉపనిషత్తు. యజ్ఞయాగముల నిర్వహణకై అవసరమైన సామవేదమును ఎక్కువగా గోదావరీ తీర బ్రాహ్మణులు అధ్యయనము చేస్తూ వుంటారు. ఈ వేదంలోని పూర్వభాగం ఇంద్రసూర్య వరుణకు బేరాది దేవతల స్థితి రూపముగా ఉంటుంది. ఉత్తరభాగము, ఋగ్వేద, యజుర్వేదుల వలెనె పరబ్రహ్మ స్వరూపమును బోధిస్తుంది. ఉద్దాలకుడు కుమారుడైన శ్వేతకేతునకు అనేక దృష్టాన్తములతో బోధించెను అనేక కష్టనష్టముల కోర్చి గురు శుశ్రూష చేసి పరిపక్వస్థితి తెల్సుకొన్నవాడై తానుగా బ్రహ్మస్వరూపుడని తెల్సుకొన్నాడు. అదియే ఆత్మసాక్షాత్కారం. ముముక్షువులు దీనినుపాసించి ముక్తిమార్గాన్ని అనుసరించి మోక్షాన్ని పొందగలరు. ఈ ఉపనిషత్తునందు గల విశేషమేమనగా బ్రహ్మసాక్షాత్కారమునకు ఉపకరించు మంత్రము కూడా గ్రంథాంతమున వ్రాయబడినది. వెల : 36=00 పేజీలు 80

శ్రీ శివస్తోత్ర రత్నాకరము

కూర్పరి. బ్రహ్మ శ్రీ పాలావర్తుల శ్రీరామశర్మగారు

శ్రీ శివ, గణేశ, సుబ్రహ్మణ్య, వీరభద్ర మొదలగు దేవతలకు సంబంధించిన ఉపాసనా విధానములతో కూడిన స్తోత్ర రత్నములు అనేకములు ఇందు పొందుపరచినాము. అనేక సహస్ర నామములు అష్టోత్తర శతనామములు మొదలగు వానిని కూడా ఇందు పొందు పరచినాము. అనేక ధన, వ్యయ ప్రయాసల కోర్చి ధార్మికాధ్యాత్మిక సాహిత్య సేవాతత్ప రతతో ఫలము కోరక లాభము నార్జింపవలెనను ఆశతోకాక కేవలము సేవా భావముతో ఈ శివస్తోత్ర రత్నాకమును ప్రచురించినాము. మొత్తము ఈ స్తోత్ర రత్నాకరమున 146 స్తోత్రములు కాక శివపరమైన యితర స్తోత్రములననేకములనిందు పొందు పరచియున్నాము. ఇప్పుడిప్పుడే ఈ గ్రంథము సర్వాంగ సుందరంగా వెల్వడినది. ప్రతి స్తోత్ర పారాయణ ఫలితము కూడ ఇవ్వబడినది. క్యాలికో బైండు పేజీలు 475



శ్రీ రామా బుక్‌షాప్

A-6, మయూర్ కుషాల్ కాంప్లెక్స్, గన్‌ఫౌండ్రి, అబిడ్స్, హైదారాబాద్-1. ☎: 6667786.

వెల : రూ ॥ 60-00